

'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16 సంచిక: 94


మంగళవారం 19-12-2023

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



ఎవరికి అందలం!

నేడు ఐపీఎల్ మినీ వేలం.. బరిలో 333 మంది క్రికెటర్లు - స్పోర్ట్స్‌లో



విద్యుత్‌పై అంబుజా పెట్టుబడి

పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులపై దృష్టి పెట్టిన అంబుజా సిమెంట్స్ - బిజినెస్‌లో



కేజ్రీవాల్‌కు మళ్లీ ఈడీ సమన్లు

మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు ఈడీ మళ్లీ నోటీసులు జారీ చేసింది.

వివరాలు 6లో ▸



క్రిస్మస్ వేడుకల్లో కాల్పులు

మెక్సికోలో క్రిస్మస్ వేడుకలు రక్తసిక్తంగా మారాయి. గ్వానజువాటో రాష్ట్రంలో కాల్పుల ఘటనలో 12 మంది ప్రాణాలు కోల్పోయారు.


వివరాలు 6లో ▸



ఉగ్ర కుట్ర భగ్నం

పేలుళ్లకు పథక రచన చేసిన అనుమానిత ఉగ్రవాదులను ఎన్ఐఏ అరెస్ట్ చేసింది. 19 ప్రాంతాల్లో దాడులు నిర్వహించింది.

వివరాలు 6లో ▸



కోర్టుకు 'జ్ఞానవాపి' నివేదిక

వారణాసిలోని జ్ఞానవాపి మసీదులో చేపట్టిన శాస్త్రీయ సర్వే నివేదికను ఏఎస్ఐ సీల్డు కవర్‌లో వారణాసి జిల్లా కోర్టుకు సమర్పించింది.

వివరాలు 6లో ▸


ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డులను అందుకున్న లబ్ధిదారులతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

పేదలకు ఆరోగ్యమస్తు

ఆరోగ్యశ్రీ చికిత్స పరిమితి రూ.25 లక్షలకు పెంపు: సీఎం జగన్

- వైద్యం కోసం అప్పుల పాలు కాకుండా అండగా ప్రభుత్వం
- రూ.5 లక్షల వార్షికాదాయం ఉన్న వారంతా పథకం పరిధిలోకి
- నాడు అరకొరగా 1,059 ప్రొసీజర్లు.. నేడు ఏకంగా 3,257 ప్రొసీజర్లు
- విస్తరించిన ప్రయోజనాలతో ఆరోగ్యశ్రీ కొత్త కార్డుల పంపిణీ

2లో

- ఆరోగ్యశ్రీతో ఉచిత వైద్య సేవలు ఎలా పొందాలో ప్రతి ఒక్కరికి తెలియాలి
- ప్రతి ఇంటికి వెళ్లి ఆరోగ్యశ్రీ కార్డు చేతిలో పెట్టి సేవల గురించి వివరించండి
- ఫోన్‌లో ఆరోగ్యశ్రీ, దిశ యాప్ డౌన్‌లోడ్ చేయించి అవగాహన కల్పించండి
- జనవరి 1వ తేదీ నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్–2
- ప్రతి మండలంలో వారానికి ఒక గ్రామంలో శిబిరం నిర్వహణ
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో సిబ్బంది కొరత మాటే లేకుండా నియామకాలు
- వైద్య శాఖలోనే 53,126 మంది డాక్టర్లు, నర్సులు, పారామెడిక్స్ నియామకాలు
- జాతీయ స్థాయిలో స్పెషలిస్టు డాక్టర్ల కొరత 61 శాతం.. ఏపీలో 3.96% మాత్రమే
- ఏపీలో నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్ల కొరత సున్నా... నూరు శాతం పోస్టుల భర్తీ

సస్పెన్షన్ల పర్వం.. 78 మందిపై వేటు

భద్రతా వైఫల్యంపై పార్లమెంట్ ఉభయ సభల్లో విపక్షాల ఆందోళన

లోక్‌సభ, రాజ్యసభలో నినాదాలు, నిరసనల హోరు

- హోం మంత్రి అమిత్ షా వివరణకు, రాజీనామాకు డిమాండ్
- లోక్‌సభ నుంచి 33 మంది, రాజ్యసభ నుంచి 45 మంది సస్పెండ్
- వారిలో 14 మందిపై సభా హక్కుల కమిటీ విచారణకు ఆదేశాలు
- అప్పటిదాకా పార్లమెంటు నుంచి బహిష్కరణ
- మిగతా వారిపై సెషన్ ముగిసే దాకా వేటు.. ఈ సెషన్లో మొత్తం 92 మంది సస్పెన్షన్


ఆందోళన చేస్తున్న సస్పెండైన పార్లమెంట్ సభ్యులు

పార్లమెంట్‌లో సోమవారం అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. పార్లమెంటు భద్రతా వైఫల్యంపై నినాదాలు, నిరసనలతో హోరెత్తించిన క్రమంలో ఏకంగా 78 మంది విపక్ష సభ్యులపై సస్పెన్షన్ వేటు పడింది. వీరిలో 33 మంది లోక్‌సభ సభ్యులు కాగా 45 మంది రాజ్యసభ సభ్యులున్నారు. ఒకే రోజు ఇంతమందిని బహిష్కరించడం పార్లమెంటు చరిత్రలోనే ఇదే తొలిసారి. గత వారమే 13 మంది లోక్‌సభ, ఒక రాజ్యసభ సభ్యునిపై సస్పెన్షన్ వేటు పడటం తెలిసిందే. దీంతో ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో సస్పెండైన విపక్ష సభ్యుల సంఖ్య 92కు చేరింది. భద్రతా వైఫల్యంపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా వివరణ, రాజీనామాకు డిమాండ్ చేయడమే వీరి సస్పెన్షన్‌కు కారణం. సస్పెన్షన్లపై సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బిల్లులపై చర్చ జరగకుండా మోదీ సర్కారు కుట్ర పన్నిందని, అందులో భాగంగానే తమను సస్పెండ్ చేసిందని మండిపడ్డారు.

6లో

ఫ్యాక్ట్‌చెక్



గండి కాదు.. అక్కసు గండం!

- అమ్మ ఒడిపై ఈనాడు విష కథనాలు
- చదువులు చక్కబడుతుంటే భరించలేకపోతున్న పెత్తందారులు
- కోవిడ్ కష్టకాలంలోనూ అమ్మలకు అందిన అమ్మ ఒడి సాయం

3లో

మీ 'బాబు'దే నయవంచన

- రాష్ట్ర రైతులను నిట్ట నిలువునా ముంచిందే చంద్రబాబు
- ఉచిత విద్యుత్ ఇస్తే తీగలపై బట్టలారేసుకోవాలన్న అహంకారి
- వ్యవసాయానికి పగటిపూట విద్యుత్తే ఇవ్వలేదు.. రాత్రి పూటా 4 గంటలు ఇవ్వలేదు
- రాత్రి వేళ పొలాలకు నీరు పెట్టడానికి వెళ్లి పాము కాట్లకు, విద్యుదాఘాతాలకు చనిపోయిన రైతులెందరో
- వైఎస్ జగన్ వచ్చాక తిరిగి రైతులకు 9 గంటలు నిరంతరాయంగా విద్యుత్తు

10లో

పొగాకుపైనా వితండవాదమేనా?

- పొగాకు పంటకు దేశంలో ఎక్కడా బీమా లేని సంగతి తెలియదా రామోజీ?
- పీఎం ఫసల్ బీమా యోజన జాబితాలోనూ చోటులేని విషయం తెలియదా?
- అయినప్పటికీ రాష్ట్ర రైతులను ఆదుకునేందుకు ఈ–క్రాప్‌లో నమోదు చేస్తోంది కనిపించదా?
- ఏటా పంట నష్టపరిహారం ఇస్తున్నా ఎందుకీ రాతలు?
- 29,228 మంది నుంచి రూ.128.65 కోట్ల పొగాకు కొనుగోలు చేసినా పట్టదా?

10లో



ఏలూరులో కదంతొక్కిన విద్యార్థులు

- ఉత్సాహంగా విద్యార్థి సాధికారత ర్యాలీ
- వేలాది మంది పాల్గొని 'వన్స్ మోర్ సీఎం జగన్' అంటూ నినాదాలు
- హాజరైన మాజీ క్రికెటర్ అంబటి రాయుడు, ఎంపీ కోటగిరి శ్రీధర్

2లో

ఏలూరులో విద్యార్థులతో కలిసి ర్యాలీలో పాల్గొన్న మాజీ క్రికెటర్ అంబటి రాయుడు, ఎంపీ కోటగిరి శ్రీధర్ తదితరులు

సరోగసీ ద్వారా పుంగనూరు కోడెదూడ

గతేడాది ఇదే రీతిలో సాహివాల్ దూడ జననం

- ఇప్పుడు పిండ మార్పిడి ద్వారా నాటు ఆవుకు పుంగనూరు దూడ
- మేలు జాతి దేశీ ఆవుల పునరుత్పత్తికి ప్రభుత్వం కృషి
- ఐవీఎఫ్‌ఈటీ విధానంలో పుంగనూరు కోడెదూడ జన్మించడం దేశంలో ఇదే తొలిసారి


నాటు ఆవుకు జన్మించిన పుంగనూరు దూడ

సాక్షి, అమరావతి/రైల్వేకోడూరు: దేశంలోనే తొలిసారి ఓ నాటు ఆవుకు పుంగనూరు జాతి కోడెదూడ జన్మించింది. చింతలదీవి పశు క్షేత్రంలో అభివృద్ధి చేసిన ఏడు రోజుల వయస్సున్న ఘనీకృత పుంగనూరు జాతి పిండాన్ని అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు మండలం శెట్టిగుంట గ్రామానికి చెందిన

మిగతా 3వ పేజీలో ▶



ఆస్పత్రిలో దావూద్!

- కరాచీలో 3 రోజులుగా చికిత్స
- విషప్రయోగం జరిగి ఆస్పత్రిలో మరణించినట్టు వార్తలు
- రెండూ అవాస్తవాలేనని తేల్చిన నిఘా వర్గాలు

6లో

8 వేల టన్నుల కందిపప్పు సిద్ధం

పండుగ సీజన్ దృష్ట్యా పౌరసరఫరాలశాఖ ప్రత్యేక చర్యలు

- 23లోగా ఎంఎల్ఎస్ పాయింట్లకు చేర్చేలా ప్రణాళిక.. సబ్సిడీపై కిలో రూ.67కు కార్డుదారులకు పంపిణీ
- స్థానిక రైతుల నుంచి మద్దతు ధరకు కందుల కొనుగోలుకు ఏర్పాట్లు
- ప్రకాశం, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో 35 వేల టన్నుల సేకరణకు కసరత్తు
- మరింత తక్కువ రేటుకు గోధుమ పిండి సరఫరాకు ప్రతిపాదన



- చౌకదుకాణాల్లో అందుబాటులోకి పంచదార, చిరుధాన్యాల నిల్వలు
- జీసీసీ స్టోర్లలోను సబ్సిడీపై కందిపప్పు విక్రయాలకు ప్రోత్సాహం

5లో

బానిస మనస్తత్వం నుంచి

భారత్ విముక్తి

- ఎర్రకోటపై నుంచి విముక్తిని ప్రకటించుకుంది
- శరవేగంగా రామ్ సర్క్యూట్ అభివృద్ధి పనులు
- ప్రధాని మోదీ స్పష్టీకరణ
- వారణాసిలో స్వర్‌వేద్ మహామందిర్ ప్రారంభం

6లో


ప్రపంచంలోనే అతిపెద్ద ధ్యాన కేంద్రం స్వర్‌వేద్ మహామందిర్‌ను ప్రారంభించిన ప్రధాని మోదీ. చిత్రంలో యూపీ సీఎం యోగి తదితరులు



దేశంలో కోవిడ్ కేసులు పైపైకి

దేశవ్యాప్తంగా కోవిడ్ కేసులు నెమ్మదిగా పెరుగుతున్నాయి. మరోవైపు కేరళలో కరోనా కొత్త సబ్‌వేరియంట్ జేఎన్1 వెలుగులోకి వచ్చింది. దీంతో కేంద్రం ముందస్తు చర్యలకు దిగింది. పెరుగుతున్న కోవిడ్ కేసులను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రాలన్నీ అప్రమత్తంగా ఉండాలని.. కరోనా నిర్ధారణ పరీక్షల సంఖ్యను పెంచాలని.. అనుమానిత శాంపిల్లను ఇన్సాకాగ్ ల్యాబ్‌లకు పంపాలని కేంద్ర ఆరోగ్య శాఖ సూచించింది.

- వివరాలు 6లో

క్షణికావేశం కాటేస్తోంది!

- 2022లో దేశంలో 1.70 లక్షల ఆత్మహత్యలు
- మొదటి స్థానంలో మహారాష్ట్ర
- దక్షిణాది రాష్ట్రాల్లో ఏపీలోనే ఆత్మహత్యలు తక్కువ

సాక్షి, అమరావతి: దేశంలో ఆత్మహత్యల సంఖ్య ఏటా పెరుగుతోంది. 2022లో దేశంలో 1,70,924 మంది ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఇటీవల నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో(ఎన్‌సీఆర్‌బీ) 2022 నివేదికలో ఈ అంశం వెల్లడైంది. ఆ నివేదిక ప్రకారం 2021లో 1.64 లక్షల మంది ఆత్మహత్యకు పాల్పడ్డారు. రాష్ట్రాల వారీగా పరిశీలించినట్లయితే.. గతేడాది ఏపీలో ఆత్మహత్యలు తక్కువగానే నమోదయ్యాయి. దేశ వ్యాప్తంగా 1.70 లక్షల ఆత్మహత్యలు నమోదు కాగా, వీటిలో 13.3 శాతంతో మహారాష్ట్ర మొదటి స్థానంలో ఉంది. అనంతరం తమిళనాడు(11.6 శాతం), మధ్య ప్రదేశ్ (9 శాతం), కర్ణాటక(8 శాతం)లు వరుసగా నిలిచాయి. కేరళ(5.9 శాతం), తెలంగాణ(5.8 శాతం) ఆరు, ఏడు స్థానాల్లో నిలిచాయి. 5.2 శాతంతో ఏపీ తొమ్మిదో స్థానంలో ఉంది. దక్షిణాది రాష్ట్రాలన్నింటిలో ఏపీలోనే తక్కువ ఆత్మహత్యలు చోటు చేసుకుంటున్నాయని స్పష్టమవుతోంది.

కుటుంబ సమస్యలతో అధికం

ఆత్మహత్యలకు ప్రధాన కారణం కుటుంబ కలహాలు, సమస్యలే. గతేడాది దేశంలో నమోదైన ఆత్మహత్యలకు అత్యధికంగా 31.7 శాతం కుటుంబ సమస్యలే కారణంగా నిలిచాయి. అనంతరం 18.4 శాతం మరణాలకు అనారోగ్యం, 6.8 శాతం మద్యం /మత్తు పదార్థాలకు బానిసలవ్వడం, 4.8 శాతం పెళ్లి సంబంధిత సమస్యలు కారణాలుగా ఉన్నాయి. ఇక వివిధ సమస్యలతో మనో నిబ్బరం కోల్పోయి ఆత్మహత్యకు పాల్పడుతున్న వారిలో పురుషులే అధికంగా ఉంటున్నారు. దేశంలో 1.70 లక్షల ఆత్మహత్యలు గతేడాది చోటు చేసుకోగా.. వీటిలో 1.22 లక్షల మంది పురుషులు, 48 వేల మంది మహిళలు, 28 మంది ట్రాన్స్‌జెండర్స్ ఉన్నారు. అన్ని రాష్ట్రాల్లో ఇదే పరిస్థితి. ఏపీలో 8,908 ఆత్మహత్యలు నమోదవ్వగా.. వీటిలో 6,765 మంది పురుషులు, 2,141 మంది మహిళలున్నారు.

ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి..



క్షణికావేశంలో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. సమస్యలు ప్రతి ఒక్కరికీ ఉంటాయి. ముందుగా ఈ విషయాన్ని అందరూ గుర్తించాలి. తమ బాధలు, సమస్యలను స్నేహితులు, కుటుంబ సభ్యులతో పంచుకుని వాటికి పరిష్కార మార్గాలు అన్వేషించాలి. ఆత్మస్థైర్యంతో సమస్యలను ఎదుర్కోవాలి.

– డాక్టర్ రాధికారెడ్డి, మానసిక వైద్యురాలు, డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్

ఇదండీ సంగతి





ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

సర్కారు సాయంతో సాఫీగా జీవనం

నేను రజక వృత్తి చేసుకుంటూ భార్య, పిల్లలను పోషించుకుంటూ జీవనం సాగిస్తున్నాను. నాకు భార్య భవాని, కుమారుడు నాగవెంకటేష్, కుమార్తె త్రివేణిదుర్గ ఉన్నారు. మాది కాకినాడ జిల్లా కరప మండలం యండమూరు. గతంలో కొన్ని కుటుంబాల వారి దుస్తులు ఉతుకుతూ తద్వారా వచ్చిన ఆదాయంతోనే జీవనం సాగించేవాళ్లం. కాలంతో పాటు వచ్చిన మార్పులతో ఉన్నత, మధ్య తరహా కుటుంబాల వారు వాషింగ్ మెషిన్లు కొనుగోలు చేసి, వారి దుస్తులు వారే ఉతుక్కుని, ఇస్త్రీ కూడా చేసుకుంటున్నారు. దీంతో రజకులకు పని తగ్గిపోవడంతో ఆదాయం పూర్తిగా సన్నగిల్లింది. ఫలితంగా కుటుంబాన్ని పోషించుకోవడం కష్టంగా మారింది. మా ఇబ్బందులను గతంలో ఏ ప్రభుత్వం కూడా పట్టించుకోలేదు. ముఖ్యమంత్రి జగన్ అధికారంలోకి వచ్చాక నవరత్న పథకాలు తీసుకొచ్చి మాలాంటి పేద వర్గాల కుటుంబాలలో వెలుగులు నింపారు. జగనన్న చేదోడు పథకం ద్వారా ఏటా రూ. 10 వేలు వంతున నాలుగు విడతలుగా రూ. 40 వేలు లబ్ధి చేకూరింది. ఈ సొమ్ము లాండ్రీ షాపు నిర్వహణకు అవసరమయ్యే బొగ్గులు, ఇస్త్రీ పెట్టె, కరెంటు బిల్లులు కట్టుకోవడానికి ఉపయోగపడుతోంది. నా దగ్గ



రకు వచ్చిన దుస్తులు గతంలో భద్రపరుచుకోవాలంటే ఎలుకల భయం ఉండేది. ఇప్పుడు ఆ దుస్తుల కోసం అలమారా లాంటిది సమకూర్చుకున్నాను. పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదివిస్తున్నాను. ఇందులో మా పెద్ద బ్బాయికి అమ్మఒడి పథకం ద్వారా ఏటా రూ.15 వేలు చొప్పున ఇప్పటి వరకూ రూ.60 వేలు అందుకున్నాం. వీటితోపాటు పిల్లలకు అన్ని సౌకర్యాలు కల్పించడంతో చదువు సమస్య తీరింది. కరప సెంట్రల్ లే అవుట్‌లో జగనన్న కాలనీలో రూ.6 లక్షల విలువైన ఇంటి స్థలం వచ్చింది. ఇప్పుడు మా కష్టాలన్నీ తీరిపోయాయి.

– శీలం వీరవెంకట సత్యనారాయణ, యండమూరు

(చోడిశెట్టి సత్యనారాయణ, విలేకరి, కరప)

వ్యాపారం గాడిన పడింది

ఒకప్పుడు కూలి పనుల కోసం పొట్ట చేత పట్టుకుని నెల్లూరు జిల్లా అంతటా తిరిగేవాళ్లం. రెండెకరాల పొలం ఉన్నా, వర్షం వస్తే తప్ప పంటలు పండేవి కావు. దీనివల్ల కూలి పనులపైనే ఆధారపడి బతికేవాళ్లం. మా ఆర్థిక పరిస్థితి చాలా దారుణంగా ఉండేది. నా భర్త శ్రీనివాసులు, ఇద్దరు కుమారులతో నెల్లూరు జిల్లా చేజర్లలో నివసించేవాళ్లం. ఈ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వైఎస్సార్ ఆసరా పథకం మా కుటుంబ స్వరూపాన్ని మార్చింది. ఎన్నికల నాటికి బ్యాంకులకు బకాయిపడిన రుణాన్ని నాలుగు విడతలుగా మాఫీ చేస్తామన్న హామీ మేరకు మేము బ్యాంకుకు చెల్లించిన మొత్తంలో ఇప్పటి వరకు మూడు విడతల్లో రూ.36 వేలు నా బ్యాంకు ఖాతాలో ప్రభుత్వం జమ చేసింది. మొదటి విడత వచ్చిన మొత్తంతో చేజర్లలో చిన్నగా ఫ్యాన్సీ షాపు పెట్టాను. మొదట్లో అంతంత మాత్రంగానే అమ్మకాలు అయ్యేవి. తర్వాత రెండు విడతల్లో జమ అయిన మొత్తంతో మరిన్ని సరుకులు తెచ్చి విక్రయించడం ప్రారంభించాం. చుట్టుపక్కల అందరూ మా దగ్గరే



వస్తువులు కొనేలా వారిని ప్రోత్సహించాం. ప్రస్తుతం వ్యాపారం బాగుంది. వైఎస్సార్ తోడు పథకం ద్వారా మరో రూ.10 వేలు మంజూరైంది. వాటితో మహిళలకు కావాల్సిన దుస్తులు అందుబాటులో ఉంచడంతో వ్యాపారం మెరుగైంది. ఇప్పుడు వ్యవసాయం కంటే దుకాణం ద్వారానే ఆదాయం బాగుంది. గతంలో మా పిల్లలను చదివించుకొనేందుకు అష్ట కష్టాలు పడేవాళ్లం. ఇప్పుడు అమ్మ ఒడి పథకం ఆ కష్టాలు తీర్చింది.

– శ్రీలత, నెల్లూరు జిల్లా

(తోట రవీంద్రబాబు, విలేకరి, చేజర్ల మండలం)

పెట్టుబడి భారం తగ్గింది

గతంలో వ్యవసాయం చేయాలంటే అప్పులు చేయాల్సి వచ్చేది. వచ్చిన ఆదాయం వడ్డీలకే సరిపోయేది. దాంతో కుటుంబ పోషణ కష్టంగా ఉండేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక వ్యవసాయానికి ఎంతో ప్రోత్సాహం లభిస్తోంది. ఇప్పుడు అప్పుల బాధ తప్పింది. మా స్వగ్రామం అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలం రాయపుర అగ్రహారంలో మాకు 1.80 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఎకరా భూమిలో సీజనల్‌గా వరి, మిగిలిన భూమిలో కూరగాయలు సాగు చేస్తున్నాం. మొత్తం మేము ఏడుగురు కుటుంబ సభ్యులం. వ్యవసాయంతో పాటు పశుపోషణ, మేకల పెంపకం కూడా చేపట్టాం. నా భార్య పార్వతితో పాటు అమ్మానాన్నలు సహాయం చేస్తుంటారు. ఈ ప్రభుత్వం వచ్చాక వైఎస్సార్ రైతు భరోసా కింద ఏటా రూ.13,500 చొప్పున అందుతోంది. రైతు భరోసా కేంద్రాల ద్వారా అవసరమైన విత్తనాలు, ఎరువులు రాయితీపై అందిస్తూ రైతులను ప్రోత్సహించడంతో మాకు పెట్టుబడి భారం బాగా తగ్గింది. నాకు ముగ్గురు పిల్లలు కాగా, బాబు జగదీష్ (16)



కొంత వైకల్యంతో బాధ పడుతున్నాడు. అతనికి నాలుగేళ్లుగా దివ్యాంగ పింఛన్ నెలకు రూ.3 వేలు వస్తోంది. మా నాన్న పేర్నినాయుడుకు ఈ ప్రభుత్వం వచ్చాకే వృద్ధాప్య పింఛన్ వస్తోంది. మా ఇద్దరు అమ్మాయిలు గుణశ్రీ, విజయ సబ్బవరం కేజీబీవీలో 10, 9వ తరగతి చదువుతున్నారు. అమ్మఒడి డబ్బులు ఏటా అందుతున్నాయి. ఇలా మా కుటుంబానికి ఈ ప్రభుత్వం ఆర్థికంగా ఎంతో భరోసా ఇచ్చింది.

– పిల్లల స్వామినాయుడు, రాయపుర అగ్రహారం

(సుర్ల నాగేశ్వరరావు, విలేకరి, సబ్బవరం)

అంగన్‌వాడీలను అందంగా తీర్చిదిద్దాలి

- 'మన అంగన్‌వాడీ నాడు–నేడు' రెండో దశలో పెద్ద ఎత్తున పనులు
- రూ.214.22కోట్లతో 20,534 కేంద్రాల్లో మౌలిక వసతులు
- సాంకేతిక మార్గదర్శకాలు జారీచేసిన పాఠశాల విద్యాశాఖ

సాక్షి, అమరావతి: 'మన అంగన్‌వాడీ నాడు–నేడు' రెండో దశలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. ఈ మేరకు రెండో దశలో అంగన్‌వాడీ కేంద్రాల్లో చేపట్టాల్సిన పనులకు సంబంధించి పాఠశాల విద్యాశాఖ కమిషనర్(మౌలిక సదుపాయాలు) కె.భాస్కర్ సాంకేతిక మార్గదర్శకాలను సోమవారం జారీచేశారు. 'మన అంగన్‌వాడీ నాడు–నేడు' రెండో దశలో రూ.214.22 కోట్లతో 20,534 కేంద్రాల రూపురేఖలు మార్చనున్నట్లు మార్గదర్శకాల్లో స్పష్టంచేశారు. ఈ పనులకు సంబంధించి తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారులు, అదనపు ప్రాజెక్టు కో–ఆర్డినేటర్లను ఆదేశించారు. మొత్తం 20,534 అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పనతోపాటు ప్రధాన, చిన్న మరమ్మతు పనులను ఈ నెలాఖరులోపు గుర్తించాలని పేర్కొన్నారు. ఇప్పటికే ఉన్న టాయిలెట్‌లో రన్నింగ్ వాటర్ సమస్యలు, రక్షిత మంచినీటి పైపులు, సంప్‌లు, ఎలక్ట్రికల్ వైరింగ్, ట్యూబ్‌లైట్లు, సీలింగ్ ఫ్యాన్లు, పెయింటింగ్, శ్లాబ్, ఫ్లోరింగ్, గోడలకు మరమ్మతులు వంటివి ఈ నెలాఖరులోగా గుర్తించాలని ఉత్తర్వుల్లో స్పష్టంచేశారు.

ఈ నెల మూడో వారంలో కమిటీల సమావేశాలు

ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల తల్లులతో కమిటీలు నియమించాలని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. ఒక్కో కమిటీలో ముగ్గురు తల్లులు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్, వార్డు కార్యదర్శి, అంగన్‌వాడీ వర్కర్, మహిళా శిశు సంక్షేమశాఖ సూపర్‌వైజర్, మహిళా పోలీసు, సమీపంలోని స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఉండాలని తెలిపారు. ఆ కమిటీల పేరుతో జాతీయ బ్యాంకుల్లో ఖాతాలను తెరవాలని సూచించారు. ఈ నెల మూడో వారంలో తల్లుల కమిటీల సమావేశాలను ఏర్పాటుచేసి అంగన్‌వాడీ కేంద్రాల్లో చేపట్టాల్సిన మరమ్మతు పనులను గుర్తించడంతోపాటు వాటికి అంచనాలను రూపొందించి తీర్మానం చేసి అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌కు సమర్పించాలని ఆదేశించారు. ఈ నెల చివరి వారంలో మరమ్మతు పనుల అంచనాలను సమగ్ర శిక్ష పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. అంచనాలకు జిల్లా కలెక్టర్లు పరిపాలన అనుమతులను మంజూరు చేస్తారని తెలిపారు. మరమ్మతులకు అవసరమైన మెటీరియల్‌ను స్థానికంగా కొనుగోలు చేసి పనులు చేపట్టాలని పేర్కొన్నారు. తలుపులు, కిటికీలు, వాటర్ ట్యాంకులు, పైపులైన్లు, సంప్‌లతోపాటు ఏమైనా పరికరాలకు మరమ్మతులు చేయడం సాధ్యం కాకపోతే కొత్తవి ఏర్పాటుచేయాలని ఆదేశించారు. మెటీరియల్ కొనుగోలు, పనుల వివరాలను ఎప్పటికప్పుడు 'ఎం బుక్'లో నమోదు చేయాలని సచివాలయాల ఇంజినీరింగ్ అసిస్టెంట్, వార్డు కార్యదర్శులకు సూచించారు.

ఏలూరులో కదంతొక్కిన విద్యార్థులు

- ఉత్సాహంగా విద్యార్థి సాధికారత ర్యాలీ
- వేలాది మంది పాల్గొని 'వన్స్ మోర్ సీఎం జగన్' అంటూ నినాదాలు
- హాజరైన మాజీ క్రికెటర్ అంబటి రాయుడు, ఎంపీ కోటగిరి శ్రీధర్

ఏలూరు టౌన్: 'వన్స్ మోర్ సీఎం వైఎస్ జగన్... జయహో జగన్..' నినాదాలతో ఏలూరు నగరం మార్మోగింది. 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో భాగంగా సోమవారం ఏలూరులో విద్యార్థి సాధికారత ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నిర్వహించిన ఈ ర్యాలీలో నగరంలోని పలు కళాశాలలకు చెందిన వేలాది మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కందుల దినేష్‌రెడ్డి నేతృత్వంలో ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని సహకారంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ముఖ్య అతిథులుగా భారత మాజీ క్రికెటర్ అంబటి రాయుడు, ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ హాజరయ్యారు. తొలుత ఏలూరు జెడ్పీ కార్యాలయ



ఏలూరులో విద్యార్థుల ర్యాలీలో పాల్గొన్న భారత మాజీ క్రికెటర్ అంబటి రాయుడు, ఎంపీ కోటగిరి శ్రీధర్, వైఎస్సార్‌సీపీ విద్యార్థి సంఘ నాయకులు

ప్రాంతం నుంచి ఫైర్‌స్టేషన్ సెంటర్ వద్దకు ర్యాలీగా వచ్చారు. అక్కడ దివంగత సీఎం వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. అనంతరం ఫైర్‌స్టేషన్ సెంటర్, కోర్టు సెంటర్, ఏలూరు జీజీహెచ్ మీదుగా రామచంద్రరావుపేట వరకు ర్యాలీ నిర్వహించారు.

విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాట వేస్తున్న సీఎం జగన్: రాయుడు

అంబటి రాయుడు మాట్లాడుతూ విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాటలు వేస్తూ విద్యారంగాన్ని అభివృద్ధి



మాట్లాడుతున్న అంబటి రాయుడు

చేస్తున్నారని చెప్పారు. 'ఆడుదాం–ఆంధ్ర'లో ప్రతి విద్యార్థి, యువత పాల్గొని తమ ప్రతిభను చాటాలని సూచించారు. ఎంపీ కోటగిరి శ్రీధర్ మాట్లాడుతూ పేద, మధ్య తరగతి వర్గాల పిల్లలకు అత్యుత్తమ విద్యను అందించేందుకు సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టారని చెప్పారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యాదీవెన, వసతి దీవెన వంటి పథకాలతో విద్యార్థులకు అండగా నిలుస్తున్నారని తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ఎంఆర్ పెద్దబాబు, విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి భరత్‌రెడ్డి, ఏలూరు అధ్యక్షుడు ఏలూరు అంజి, జేసీఎస్ జిల్లా కో–ఆర్డినేటర్ వైఎస్‌పీ శివరావు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఆరోగ్యమస్తు

ఆరోగ్యశ్రీ చికిత్స పరిమితి రూ.25 లక్షలకు పెంపు: సీఎం వైఎస్ జగన్

వైద్యం కోసం అప్పుల పాలు కాకుండా అండగా ప్రభుత్వం

సాక్షి, అమరావతి: వైద్యం కోసం పేదలు ఏ ఒక్కరూ అప్పుల పాలు కాకూడదనే తాపత్రయంతో డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రజలకు మరింత చేరువ చేశామని, ఇది ప్రాణం విలువ తెలిసిన ప్రభుత్వమని, గతంలో ఎన్నడూ చూడని విధంగా ప్రభుత్వ వైద్య రంగం స్వరూపాన్ని మార్చామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఆరోగ్యశ్రీ పథకం కింద చికిత్స వ్యయం పరిమితిని ఏకంగా రూ.25 లక్షలకు పెంచుతూ చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నామని గుర్తు చేశారు. ప్రభుత్వ ఆస్పత్రులంటే సిబ్బంది ఉండరనే దుస్థితిని మన ప్రభుత్వం పూర్తిగా మార్చేసిందన్నారు. ఒక్క వైద్య ఆరోగ్య శాఖలోనే 53,126 మంది డాక్టర్లు, నర్సులు, పారామెడిక్స్ లాంటి వైద్య సిబ్బందిని నియమించి మానవ వనరుల కొరత లేకుండా చర్యలు తీసుకున్నామని చెప్పారు. జాతీయ స్థాయిలో ప్రభుత్వాసుపత్రుల్లో స్పెషలిస్టు డాక్టర్ల కొరత 61 శాతం ఉంటే మన రాష్ట్రంలో కేవలం 3.96 శాతం మాత్రమే ఉందని, ఈ కొరతను కూడా అధిగమించేలా చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. ఇక జాతీయ స్థాయిలో నర్సుల కొరత 27 శాతం అయితే మన రాష్ట్రంలో సున్నా అని తెలిపారు. జాతీయ స్థాయిలో ల్యాబ్ టెక్నీషియన్ల కొరత 33 శాతం అయితే మన రాష్ట్రంలో సున్నా స్థాయికి తెచ్చామని, నూటికి నూరు శాతం పోస్టులను భర్తీ చేశామని పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్య సేవలు పొందడానికి ఏం చేయాలి? ఎవరిని అడగాలి? ఎక్కడికి వెళ్లాలి? చికిత్స వ్యయం ఎంతవరకు వర్తిస్తుంది? తదితర సందేహాలను సంపూర్ణంగా నివృత్తి చేస్తూ సరికొత్త ఫీచర్లతో రూపొందించిన ఆరోగ్యశ్రీ కొత్త కార్డులను లబ్ధిదారులకు అందజేసి విస్తృత అవగాహన కల్పించాలని అధికార యంత్రాంగాన్ని సీఎం జగన్ ఆదేశించారు. ఆరోగ్యశ్రీ పరిమితి రూ.25 లక్షలకు పెంపు, స్మార్ట్ కార్డుల పంపిణీ, లబ్ధిదారులకు దిక్సూచిలా పనిచేసే ఆరోగ్యశ్రీ యాప్ డౌన్‌లోడ్ కార్యక్రమాలను సోమవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో సీఎం జగన్ లాంఛనంగా ప్రారంభించి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఆ వివరాలివీ..

4.25 కోట్ల మందికి ఆరోగ్య భరోసా

మన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మరింత మందికి ఆరోగ్యశ్రీ అందించాలనే ఉద్దేశంతో రూ.5 లక్షల వార్షికాదాయం ఉన్న ప్రతి కుటుంబాన్ని పథకం పరిధిలోకి తెచ్చాం. దీంతో 1.48 కోట్ల కుటుంబాలు పథకం పరిధిలోకి వచ్చాయి. తద్వారా 4.25 కోట్ల మందికి ఆరోగ్య భరోసా కల్పించాం. 2019 నాటికి ఆరోగ్యశ్రీలో కేవలం 1,059 ప్రొసీజర్లు మాత్రమే ఉండగా మనం అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే 2,300 వరకు కొత్తగా పథకం పరిధిలోకి తెచ్చాం. అనంతరం మరికొన్ని చేర్చి ఇవాళ 3,257 ప్రొసీజర్లతో ఉచిత ఆరోగ్య సేవలను అందిస్తున్నాం. చికిత్స ఖర్చు రూ.వెయ్యి దాటిన సందర్భాల్లో ఏ ఒక్కరూ ఆర్థికంగా ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకున్నాం. గత సర్కారు హయాంలో అరకొర సేవలతో కేవలం 820 ఆస్పత్రులకు మాత్రమే ఆరోగ్యశ్రీ పరిమితమైంది. ఇప్పుడు మనం ఇతర రాష్ట్రాలతో కలిపి 2,513 ఆస్పత్రులకు సేవలను విస్తరించాం. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై లాంటి నగరాల్లోనూ 204 కార్పొరేట్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల్లో 716 ప్రొసీజర్లకు ఆరోగ్యశ్రీని వర్తింప చేస్తున్నాం.

ఆరోగ్య సంరక్షణకు రూ.14,439 కోట్లు

గత సర్కారు ఐదేళ్లలో ఆరోగ్యశ్రీ కోసం కేవలం రూ.5,171 కోట్లు ఖర్చు చేసింది. అంటే ఏడాదికి రూ.1,034 కోట్లు మాత్రమే వెచ్చించిన దుస్థితి. 2014–19 మధ్య 108, 104 సేవల కోసం రూ.729 కోట్లు ఖర్చు చేశారు. మన ప్రభుత్వంలో ఆరోగ్యశ్రీ, ఆరోగ్య ఆసరా కోసం ఏడాదికి సగటున రూ.4,100 కోట్లు వ్యయం చేస్తున్నాం. దీనికి అదనంగా ఏటా మరో రూ.300 కోట్లు 104, 108 సేవల కోసం ఖర్చు పెడుతున్నాం. ఆరోగ్యశ్రీ, 104, 108 కోసం గత సర్కారు రూ.5,900 కోట్లు మాత్రమే ఖర్చు చేయగా మనం ఏటా ఆరోగ్యశ్రీ సేవలను మెరుగుపరుస్తూ ఇప్పటికే రూ.14,439 కోట్లు వెచ్చించాం. గత సర్కారు హయాంలో 22.32 లక్షల చికిత్సలు అందించగా మన ప్రభుత్వం తీసుకున్న చర్యల ఫలితంగా 2019 నుంచి ఇప్పటి వరకూ ఆరోగ్యశ్రీతో 53 లక్షల చికిత్సలు అందించగలిగాం. ప్రభుత్వ వైద్య రంగాన్ని బలోపేతం చేస్తూ నాడు – నేడు ద్వారా పీహెచ్‌సీల నుంచి బోధనాస్పత్రి వరకూ అన్ని స్థాయిల్లో సదుపాయాలు కల్పించాం. 2019కు ముందు రాష్ట్రంలో 11 ప్రభుత్వ వైద్య కళాశాలలు మాత్రమే ఉండగా ఇవాళ కొత్తగా మరో 17 వైద్య కళాశాలలు ప్రభుత్వ రంగంలో నెలకొల్పుతున్నాం. గతంలో 104, 108 వాహనాలు ఎక్కడున్నాయో కూడా తెలియని దుస్థితి. నాడు 108 వాహనాలు కేవలం 336 మాత్రమే ఉండేవి. ఇప్పుడు ఎక్కడ ఏ అవసరం వచ్చినా ఆదుకునేందుకు మొత్తం 2,204 వాహనాలను అందుబాటులో ఉంచాం.

చికిత్సానంతరం ఆసరా..

ఆరోగ్యశ్రీ కింద పేదవాడికి ఉచిత వైద్యం అందించడమే కాకుండా చికిత్స అనంతరం వైద్యులు సూచించిన మేరకు విశ్రాంతి సమయంలో నెలకు రూ.5 వేలు చొప్పున, రెండు నెలలు అయితే రూ.10 వేలు పేదవాడి చేతిలో పెట్టి మరీ ఇంటికి పంపుతున్నాం. ఆరోగ్య ఆసరా కింద 25,27,870 మందికి రూ.1,309 కోట్లు అందించాం.

లక్షలు ఖర్చయ్యే ప్రాణాంతక వ్యాధులకూ..

గతంలో ఆరోగ్యశ్రీ కింద క్యాన్సర్ లాంటి రోగాలకు చికిత్స ఖర్చు రూ.5 లక్షలు దాటితే ఇచ్చేవారు కాదు. కీమోథెరపీ లాంటివి ప్రారంభిస్తే కేవలం రెండు మూడు డోసులకే రూ.5 లక్షలు ఖర్చు అయిపోతాయి. దీంతో ఇక ఆరోగ్యశ్రీ కింద వైద్యం చేయలేమని వెనక్కు పంపడం లేదంటే నామమాత్రంగా చికిత్స చేసేవారు. 6 నెలలు తర్వాత ఆ పేషెంట్‌కు మళ్లీ క్యాన్సర్ తిరగబెట్టడంతో వైద్యం అందక చనిపోయిన దుస్థితి ఉండేది. ఇప్పుడు చికిత్స వ్యయంతో పని లేకుండా పూర్తిస్థాయిలో క్యాన్సర్ చికిత్స అందిస్తున్నాం. రూ.12 లక్షల ఖరీదైన కాక్లియర్ ఇంప్లాంట్ ఆపరేషన్లు రెండు చెవులకూ చేయిస్తున్నాం. ప్రాణాంతక వ్యాధుల్లో రూ.11 లక్షలు ఖర్చయ్యే బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్, స్టెమ్‌సెల్ ట్రాన్స్‌ప్లాంటేషన్లు చేయిస్తున్నాం. రూ.11 లక్షలయ్యే గుండె మార్పిడి చికిత్సలు నిర్వహిస్తున్నాం. ప్రాణాంతక వ్యాధుల బారినపడ్డ 1,82,732 మందికి ఆరోగ్యశ్రీతో ఉచితంగా చికిత్స అందించి తోడుగా నిలబడ్డాం. ఒక్క క్యాన్సర్ చికిత్సకే ఏకంగా రూ.1,900 కోట్లు ఖర్చు చేశాం.

60.27 లక్షల మందికి ఫేజ్ 1లో వైద్య సేవలు

ఫేజ్ 1 ఆరోగ్య సురక్షను 50 రోజుల పాటు నిర్వహించాం. 60,27,843 మంది వైద్య సేవలు అందుకున్నారు. ప్రభుత్వాసుపత్రుల్లో పంపిణీ చేసే ప్రతి ఔషధం డబ్ల్యూహెచ్‌ఓ, జీఎంపీ ప్రమాణాలు ప్రకారం ఉండేలా చర్యలు తీసుకున్నాం. 562 రకాల మందులను అందుబాటులోకి తెచ్చాం. ప్రివెంటివ్ కేర్‌తో ప్రాథమిక దశలోనే వ్యాధిని గుర్తించి వైద్యం అందిస్తూ అడుగులు వేసిన ఏకైక రాష్ట్రం మనదే. దేశంలో తొలిసారిగా ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని కూడా తెచ్చాం. మండలానికి రెండు పీహెచ్‌సీలు.. ప్రతి పీహెచ్‌సీలోనూ ఇద్దరు డాక్టర్లు చొప్పున నలుగురు వైద్యులను అందుబాటులోకి తెచ్చాం.

పాల్గొన్న ఉన్నతాధికారులు..

కార్యక్రమంలో సీఎస్ డాక్టర్ జవహర్‌రెడ్డి, డీజీపీ కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కమిషనర్ నివాస్, సెకండరీ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, ఆరోగ్యశ్రీ సీఈవో బాలాజీ, ఎంఎయూడీ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఆరోగ్యశ్రీ సేవల విస్తరణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

నేటి నుంచి ప్రచార కార్యక్రమాలు

ఆరోగ్యశ్రీ కింద ఉచిత సేవలు పొందటాన్ని ప్రతి ఒక్కరికి వివరంగా తెలియచేసే కార్యక్రమాన్ని ఇవాళ ప్రారంభిస్తున్నాం. మంగళవారం నుంచి ప్రతి నియోజకవర్గంలోని ఐదు గ్రామాల్లో ఆరోగ్యశ్రీ ప్రచార కార్యక్రమాలు ప్రారంభం అవుతాయి. ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు ఆయా గ్రామాల్లో వీటిని ప్రారంభిస్తారు. ఇలా ప్రతి వారం మండలానికి నాలుగు గ్రామాల చొప్పున కార్యక్రమాలు చేపట్టాలి. ఇందులో ఏఎన్ఎంలు, సీహెచ్‌వోలు ఒక బృందంగా, మరో బృందంలో ఆశా వర్కర్లు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వానికి మద్దతు తెలిపేవారు, ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆసక్తి చూపేవారు పాలు పంచుకుంటారు. ప్రతి ఇంటికి వెళ్లి ఆయా కుటుంబాలకు కొత్త ఆరోగ్యశ్రీ కార్డును ఇవ్వడమే కాకుండా ఉచితంగా వైద్య సేవలు ఎలా పొందాలో వివరించాలి. ఇంట్లో కనీసం ఒకరి మొబైల్ ఫోన్‌లోనైనా ఆరోగ్యశ్రీ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించి రిజిస్ట్రేషన్ చేయించాలి. మహిళా పోలీసులు కూడా ఇందులో పాల్గొని దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేయాలి. ఆరోగ్యశ్రీ సేవలపై వైద్య ఆరోగ్యశాఖ రూపొందించిన 6 నిమిషాల వీడియో సందేశాన్ని ఆయా కుటుంబాలకు చూపించాలి. వారి ఫోన్లలో కూడా ఈ వీడియోను ఉంచండి.

సరికొత్త ఫీచర్లతో స్మార్ట్ కార్డులు

ప్రభుత్వం పంపిణీ చేస్తున్న ఆరోగ్యశ్రీ కార్డుల్లో సరికొత్త ఫీచర్లున్నాయి. ఇవి స్మార్ట్ కార్డులు. ఇందులో క్యూఆర్ కోడ్ కూడా ఉంటుంది. పేషెంట్లకు సంబంధించిన అన్ని వివరాలూ నిక్షిప్తం అవుతాయి. దీంతో వైద్యులు సులభంగా వైద్యం అందించడానికి వీలవుతుంది. ఇది ఈ కార్డులో విశిష్టత. వీటిని ప్రతి ఇంట్లో చక్కగా వివరించాలి.



ఆరోగ్యశ్రీ స్మార్ట్‌కార్డును లబ్ధిదారుకు అందజేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

జనవరి 1 నుంచి 'సురక్ష' ఫేజ్–2

జనవరి 1వతేదీ నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష ఫేజ్–2 ప్రారంభం అవుతుంది. ప్రతి మండలంలోనూ ప్రతి వారం ఒక గ్రామంలో సురక్ష శిబిరం నిర్వహిస్తారు. మండలాన్ని రెండుగా విభజించి ఒక డివిజన్‌లో మంగళవారం, మరో డివిజన్‌లో శుక్రవారం శిబిరాలు నిర్వహిస్తారు. పట్టణ ప్రాంతాల్లో ప్రతి బుధవారం శిబిరాల నిర్వహణ ఉంటుంది. ఉచితంగా మందులు కూడా డోర్ డెలివరీ చేస్తున్నాం. ఇప్పటికే ట్రైల్ రన్ ప్రారంభించాం. జనవరి ఒకటో తేదీ నుంచి మందులు ఉచితంగా డోర్ డెలివరీ ద్వారా అందుతాయి. రిఫరెల్ కేసుల వివరాలు తెలుసుకుని డాక్టర్ వద్దకు పంపించే కార్యక్రమం విలేజ్ క్లినిక్స్ ద్వారా జరుగుతుంది. రోగులకు ప్రయాణ ఖర్చుల కింద రూ.300 ప్రభుత్వమే అందిస్తుంది. వీటిని జగనన్న ఆరోగ్య సురక్ష–2లో భాగంగా చేపడతారు.

వైద్య రంగంలో అద్భుతాలు

ప్రజలంతా మంచి ఆరోగ్యంతో ఉండాలన్న గొప్ప ఆలోచనతో అత్యున్నత స్థాయి వైద్యం ఉచితంగా అందిస్తూ సీఎం జగన్ వినూత్న సంస్కరణలు చేపట్టారు. ఆరోగ్యశ్రీ చరిత్రలో సువర్ణ అధ్యాయాన్ని లిఖించారు. నాడు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకానికి ప్రాణం పోస్తే నేడు సీఎం జగన్ మరింత విస్తరించారు. దేశ చరిత్రలోనే మొదటిసారిగా జగనన్న ప్రభుత్వం వైద్య శాఖలో 53 వేలకుపైగా నియామకాలు చేపట్టిన ఘనత దక్కించుకుంది. జిల్లాకు ఒక వైద్య కళాశాల, ప్రతి ఇంటికి ఆరోగ్యశ్రీ భరోసా, గుమ్మం వద్దకే ఫ్యామిలీ డాక్టర్, పల్లెకు జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజారోగ్యానికి భరోసాగా నిలుస్తున్నారు. వైద్యులు రోగిని కాపాడి మిరాకిల్స్ చేస్తారు. సీఎం జగన్ వైద్య ఆరోగ్య రంగంలో అద్భుతాలు చేస్తున్నారు.

– విడదల రజని, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి

ఉద్యోగం ఎర వేస్తారు... క్లిక్ చేస్తే ఊడ్చేస్తారు

సాక్షి, హైదరాబాద్ : ఆర్థిక అవసరాలను బలహీనతగా చేసుకుని కొంతమంది సైబర్‌నేరాలకు పాల్పడుతున్నారు. వాటిల్లో ఆకర్షణీయమైన వేతనం, తక్కువ శ్రమ అంటూ ఇంటర్నెట్‌లో ఆన్‌లైన్ జాబ్స్ పేరిట ఇచ్చే ఉద్యోగ నోటిఫికేషన్లు ఒకటి. ఆన్‌లైన్

జాబ్ ఫ్రాడ్స్‌తో జాగ్రత్త సుమీ!

జాబ్స్ పేరిట ఇచ్చే ఉద్యోగ ప్రకటనలతో ఎంతోమందిని ఆకర్షించి వారి నుంచి తెలివిగా డబ్బులు గుంజడం, ఆపై కనిపించకుండా తప్పుకోవడం ఇటీవల సాధారణమైపోయింది. అటువంటి ఊదరగొట్టే ఉద్యోగ ప్రకటనల వెనుక మోసం దాగి ఉన్నట్లు గ్రహించాలని సైబర్ భద్రత నిపుణులు సూచిస్తున్నారు. భారీగా ఆదాయం అంటూ ప్రకటనలు ఇస్తున్నారంటే దాని వెనుక సైబర్ నేరగాళ్లు మన వ్యక్తిగత, బ్యాంకు సమాచారం కోసం మాటు వేసి ఉన్నారని పసిగట్టాలని సైబర్ భద్రత నిపుణులు చెబుతున్నారు. ఎక్కువగా ఉద్యోగావకాశాలకోసం, ఆన్‌లైన్ జాబ్స్ కోసం ఇంటర్నెట్‌లో వెతికేవారిని సైబర్ నేరగాళ్లు లక్ష్యంగా చేసుకుంటున్నట్లు హెచ్చరిస్తున్నారు. ఉద్యోగం పేరిట వచ్చే మెయిల్స్ లేదా మొబైల్స్‌కు లింక్స్ క్లిక్ చేస్తే మన సమాచారం తెలుసుకుని అకౌంట్లలోని డబ్బుల్ని ఊడ్చేస్తారని చెబుతున్నారు.

సరోగసీ ద్వారా పుంగనూరు కోడెదూడ



జన్మనిచ్చిన నాటు ఆవు, పుంగనూరు దూడతో డాక్టర్ ప్రతాప్

▶ మొదటి పేజీ తరువాయి

పమిడిగంటం హరిరావుకు చెందిన నాటు ఆవు గర్భంలో స్థానిక పశువైద్యుడు డాక్టర్ ప్రతాప్ మార్చి 4న ప్రవేశపెట్టగా, మే 25న ఈ నాటు ఆవు చూలు కట్టినట్లుగా అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ అబ్దుల్ ఆరీఫ్ నిర్ధారించారు. చూలుకాలంలో పశువు ఆరోగ్య పరిరక్షణ కోసం రూ.2,500 విలువైన దాణా, ఖనిజ లవణాలతో కూడిన మేతను ఆర్బీకే ద్వారా ఉచితంగా అందించారు. ఈ నాటు ఆవు ఈనెల 17వ తేదీ రాత్రి 9.30 గంటల సమయంలో మేలుజాతి పుంగనూరు జాతి కోడె దూడెకు జన్మనిచ్చింది. అత్యుత్తమ లక్షణాలతో జన్మించిన ఈ కోడెదూడ చాలా ఆరోగ్యంగా ఉందని పశువైద్యులు ధృవీకరించారు. దేశంలోనే ఇన్‌విట్రో ఫెర్టిలైజేషన్ అండ్ ఎంబ్రియో ట్రాన్స్‌ఫర్ (ఐవీఎఫ్ఈటీ) విధానంలో పుంగనూరు కోడెదూడ జన్మించడం దేశంలోనే ఇది తొలిసారి.

తొలిసారిగా సాహీవాల్ దూడకు..

గతేడాది ఇదే విధానంలో ఒంగోలు ఆవుకు సాహీవాల్ దూడ జన్మించింది. తిరుపతి ఎస్వీ గో సంరక్షణ శాలలో మేలు జాతి ఆవుల అండాలు సేకరించి, ఎస్వీ పశువైద్య విశ్వవిద్యాలయంలోని ఐవీఎఫ్ ల్యాబ్‌లో కృత్రిమంగా పిండాలను అభివృద్ధి చేసి టీటీడీ గోసాలలోని ఆవులలో ప్రవేశపెట్టి దేశంలోనే తొలిసారిగా సాహీవాల్ దూడకు జన్మనిచ్చేలా చేశారు. ఈసారి ఓ రైతు ఇంట ఓ నాటు ఆవు గర్భంలో సరోగసి విధానంలో పిండమార్పిడి చేసి మేలుజాతి పుంగనూరు దూడకు జన్మనివ్వడం గమనార్హం. సమీప భవిష్యత్‌లో మేలుజాతి దేశీ ఆవుల సంతతిని పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వ సహకారంతో కృషిచేస్తామని చింతలదీవి పశు క్షేత్రానికి చెందిన శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

చాలా ఆనందంగా ఉంది..

పశుపోషణే మాకు జీవనాధారం. పైసా ఖర్చులేకుండా ఉచితంగా పుంగనూరు జాతి పిండాన్ని మా నాటు ఆవు గర్భంలో ప్రవేశపెట్టారు. పైగా 2,500 విలువైన దాణా, ఇతర మేతను అందించారు. క్రమం తప్పకుండా స్థానిక పశువైద్యులు ప్రతాప్ తమ సిబ్బంది వచ్చి ఎప్పటికప్పుడు ఆవు ఆరోగ్య స్థితిగతులను తెలుసుకుంటూ అవసరమైన సలహాలు సూచనలు చేసేవారు. ఆదివారం రాత్రి పుంగనూరు కోడె దూడ చాలా ఆరోగ్యంగా జన్మించింది. మా ఇంట చెంగుచెంగున గంతులేస్తుంటే చాలా ఆనందంగా ఉంది. వైద్యులకు, సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు.

– పమిడిగంటం హరిరావు, శెట్టిగుంట, అన్నమయ్య జిల్లా

అంతరించిపోతున్న జాతుల వృద్ధి..

దేశంలోనే ప్రప్రథమంగా ఘనీకృత పిండ మార్పిడి ద్వారా పుంగనూరు జాతి దూడ జననం మన రాష్ట్రానికే సాధ్యమైంది. అత్యుత్తమ జాతి లక్షణాలు కలిగిన.. అంతరించిపోతున్న స్వదేశీ జాతుల వృద్ధికి ఈ విధానం ఎంతో దోహదపడుతుంది. ఇలా ఒకేసారి 100కు పైగా ఆవులకు గర్భోత్పత్తి చెయ్యొచ్చు. పిండోత్పత్తిలో ప్రధాన భూమిక పోషించిన డాక్టర్ శ్రీమన్నారాయణ, డాక్టర్ గీతా, పిండ మార్పిడి సజావుగా సాగేందుకు కృషిచేసిన డాక్టర్ ప్రతాప్, సహాయపడిన డాక్టర్ సాంబశివరావుకు అభినందనలు.

– డాక్టర్ శ్రీనివాసరావు, సీఈఓ, ఏపీఎల్‌డీఏ

గండి కాదు.. అక్కసు గండం!

అమ్మ ఒడిపై ఈనాడు విష కథనాలు

- చదువులు చక్కబడుతుంటే భరించలేకపోతున్న పెత్తందారులు
- కోవిడ్ కష్టకాలంలోనూ అమ్మలకు అందిన అమ్మ ఒడి సాయం



సాక్షి, అమరావతి: విద్యా సంస్కరణల ఫలితంగా పేద విద్యార్థులకు పెద్ద చదువులతో ప్రభుత్వ పాఠశాలలు కళకళలాడుతుంటే పెత్తందారులు సహించలేకపోతున్నారు. అందినకాడికి రాళ్లు వేయడమే ధ్యేయంగా ఎల్లో మీడియాలో బురద కథనాలను అచ్చేసి కళ్లమంటను చల్లార్చుకుంటున్నారు. ఇంగ్లీషు మీడియం చదువులు, నాడు–నేడుతో కార్పొరేట్ విద్యా సంస్థలను తలదన్నేలా తయారైన ప్రభుత్వ విద్యాసంస్థలపై నిత్యం అక్కసు వెళ్లగక్కుతూ పెత్తందారీ పోకడలను రుజువు చేసుకుంటున్నారు. ట్యాబ్‌లు, సీబీఎస్సీఈ సిలబస్, టోఫెల్ శిక్షణ, ఐబీ.. ఇలా ఏది చూసినా ప్రభుత్వ విద్యారంగం దీటుగా ఉండటాన్ని చూసి భరించలేక చదువులకు గండి కొట్టే యత్నాలకు తెగబడ్డారు!

కత్తిరింపులంటూ తప్పుడు లెక్కలు

ప్రభుత్వం అమ్మ ఒడి సాయాన్ని పలు కారణాలతో తగ్గిస్తోందని, మూడేళ్లల్లో 1.86 లక్షల మంది తగ్గిపోయారంటూ ఈనాడు అబద్ధాలు అల్లేసింది. అమ్మ ఒడి మార్గదర్శకాల ప్రకారం ఆరు దశల ధ్రువీకరణ తప్పనిసరి. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న ప్రతి ఒక్కరికీ అమ్మ ఒడి నేరుగా ఖాతాలోనే జమ అవుతుంది. ఆర్థిక పరిస్థితి మెరుగుపడిన వారికి మాత్రమే నిబంధనల ప్రకారం పథకం వర్తించదు. 2019–20, 2020–21లో కోవిడ్ కారణంగా విద్యార్థులకు 75 శాతం హాజరు నుంచి మినహాయింపునిచ్చారు. 2021–22, 2022–23లో తొలుత నిర్దేశించిన ప్రమాణాలనే అమ్మ ఒడికి పాటిస్తున్నారు. కోవిడ్ రెండో దశలో చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చడం తెలిసిందే.

రోత రాతలు కాదా?

నిర్వహణ పేరుతో రివర్స్ చెల్లింపులు అంటూ ఈనాడు మరో ఆరోపణ చేసింది. మనబడి నాడు–నేడు ద్వారా కల్పించిన సదుపాయాలను సక్రమంగా వినియోగించుకునేందుకు 2021లో పాఠశాల నిర్వహణ నిధిని, 2022లో టాయిలెట్ మెయింటెనెన్స్ ఫండ్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అమ్మ ఒడి లబ్ధిదారుల నుంచి మినహాయించిన రూ.2 వేలు స్కూల్/ కాలేజీ కమిటీల ఖాతాలకే జమ అవుతుంది. ఆ మొత్తాన్ని పాఠశాలల్లో తక్షణ మరమ్మతుల కోసం ఖర్చు చేస్తున్నారు. నాడు–నేడుతో ప్రతి ప్రభుత్వ పాఠశాలలో పరిశుభ్రమైన టాయిలెట్లను సమకూర్చడంతో బాలికల డ్రాప్ అవుట్లు తగ్గిపోయాయి. 'టాయిలెట్ మెయింటెనెన్స్ ఫండ్' ద్వారా రూ.987.20 కోట్ల నిధి జమ అయింది. నిర్వహణ కోసం 46,661 మంది ఆయాలను నియమించి నెలకు రూ.6 వేలు చొప్పున గౌరవ వేతనం చెల్లిస్తున్నారు. గత మూడేళ్లలో ఆయాలకు రూ.882 కోట్లు వేతనాలుగా చెల్లించారు. మరి రివర్స్ చెల్లింపులు అంటూ రామోజీ రాతల్లో ఏమైనా అర్థం ఉందా?

- ➤ కుటుంబ ఆదాయం గ్రామాల్లో రూ.10 వేలు, పట్టణాల్లో రూ.12 వేలు ఉన్నవారికి అమ్మ ఒడి వర్తించదు. పారిశుధ్య కార్మికులకు మాత్రం మినహాయింపునిచ్చారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ప్రస్తుతం రూ.18 వేల చొప్పున వేతనం పొందుతున్నందున నిబంధనల ప్రకారం వ్యవహరిస్తున్నారు.
- ➤ కోవిడ్ సమయంలో ప్రైవేట్ విద్యాసంస్థలు తరగతులు నిర్వహించకున్నా ఫీజులు మాత్రం వసూలు చేశాయి. ప్రభుత్వం పిల్లల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని రెండు పర్యాయాలు అమ్మ ఒడి నిధులను తల్లుల ఖాతాల్లో జమ చేసింది.
- ➤ నాడు–నేడు తొలిదశ కింద 15,715 పాఠశాలల్లో రూ.3,669 కోట్లతో పనులు చేపట్టి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. రెండో విడతలో రూ.8 వేల కోట్లతో 22,344 పాఠశాలల్లో పనులు చేపట్టగా రూ.3,287 కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయి.
- ➤ మధ్యాహ్న భోజనానికి చంద్రబాబు హయాంలో ఏటా రూ.450 కోట్లు వ్యయం చేయగా ఇప్పుడు గోరుముద్ద ద్వారా పౌష్టికాహారాన్ని అందిస్తూ ప్రభుత్వం రూ.1,800 కోట్లు వెచ్చిస్తోంది.

అమ్మ ఒడి ఇలా

సంవత్సరం	లబ్ధిదారులు	సాయం రూ.కోట్లలో
2019-20	42,33,098	6,349.6
2020-21	44,48,865	6,673.4
2021-22	42,62,419	6,393.6
2022-23	42,61,965	6,392.9



హజ్ యాత్రకు దరఖాస్తు చేసుకోండి

ఏపీ హజ్ కమిటీ చైర్మన్ గౌస్ లాజమ్ వెల్లడి



సాక్షి, అమరావతి: హజ్ యాత్ర–2024కు వెళ్లేవారు వెంటనే దరఖాస్తు చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ హజ్ కమిటీ చైర్మన్ బద్వేల్ షేక్ గౌస్ లాజమ్ సూచించారు. హజ్‌యాత్ర కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 20వ తేదీతో గడువు ముగుస్తుందని ఆయన చెప్పారు. ఏపీ హజ్ కమిటీ సమావేశం సోమవారం విజయవాడలోని రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించారు. అనంతరం గౌస్ లాజమ్ మీడియాతో మాట్లాడుతూ ఈసారి రాష్ట్రం నుంచి హజ్ యాత్రకు వెళ్లేందుకు 2,930 మందికి అవకాశం ఉందని చెప్పారు. ఇప్పటివరకు ఆన్‌లైన్‌లో 900 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. మిగిలిన వారు కూడా త్వరగా దరఖాస్తు చేసుకోవాలని, అవసరమైతే గడువు పొడిగించాలని కోరుతామన్నారు. రూ.3లక్షలలోపు వార్షిక ఆదాయం కలిగిన వారికి రూ.60వేలు, రూ.3 లక్షలకుపైగా ఆదాయం ఉన్నవారికి రూ.30వేలు చొప్పున ప్రభుత్వం సాయం అందిస్తుందని వివరించారు. గతేడాది విమాన చార్జీల అదనపు భారాన్ని హజ్ యాత్రీకులపై పడకుండా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తరఫున విడుదల చేశారని గుర్తుచేశారు. ఈసారి హైదరాబాద్, బెంగళూరు కంటే ఎక్కువ చార్జీలు లేకుండా చూడాలని సీఎం వైఎస్ జగన్ కేంద్ర ప్రభుత్వానికి ఇప్పటికే లేఖ రాశారన్నారు. కేంద్ర మంత్రి స్మృతి ఇరానీని వైఎస్సార్‌సీపీ ఎంపీలు వి.విజయసాయిరెడ్డి, వైఎస్ అవినాష్‌రెడ్డి కలిసి విమాన చార్జీల అదనపు భారం లేకుండా చూడాలని సీఎం జగన్ ఇచ్చిన లేఖను అందించారని వివరించారు. వాస్తవానికి హజ్ యాత్ర–2024కు సంబంధించి చార్జీలను ఇంకా ఖరారు చేయలేదని, అయినా విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్‌పై దుష్ప్రచారం తగదన్నారు.

ఎంఈవో–1 అసోసియేషన్ నూతన రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక



సింహాచలం



భూక్య రవి నాయక్

సాక్షి, అమరావతి: మండల విద్యాశాఖ అధికారులు–1 (ఎంఈవో)అసోసియేషన్ రాష్ట్ర నూతన కార్యవర్గం ఎన్నికైంది. ఈ మేరకు అసోసియేషన్ రాష్ట్ర నూతన అధ్యక్షుడు సామల సింహాచలం (బలిజిపేట, పార్వతీపురం మన్యం జిల్లా) సోమవారం ఓ ప్రకటనలో వివరాలు వెల్లడించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా భూక్య రవి నాయక్(గుత్తి, అనంతపురం), గౌరవాధ్యక్షుడిగా పుల్లయ్య(కడప), వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సీహెచ్ రవీంద్రబాబు(విశాఖపట్నం), కోశాధికారిగా ఓబులేసు, ఉపాధ్యక్షులుగా రవిశంకర్ (వైఎస్సార్), బి.నరసింగరావు(విజయనగరం) ధనుంజయ మజ్జి (శ్రీకాకుళం), రామచంద్రరావు (అల్లూరి సీతారామరాజు), జె.నారాయణ స్వామి (పార్వతీపురం) రామకృష్ణుడు (అన్నమయ్య), తిరుమల ప్రసాద్ (విజయనగరం), కార్యదర్శులుగా ఎన్.రమేష్(పశ్చిమగోదావరి), నరేష్ (అనకాపల్లి), ఎస్.వి.రమణ(తూర్పు గోదావరి), రామ్ బాలనాయక్ (కృష్ణా), శివరాణి, పద్మావతి (విశాఖపట్నం)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన వివరించారు. నూతన కమిటీకి పలువురు ఎంఈవోలు అభినందనలు తెలిపారు.

ఇక సులభంగా ఎంఎస్‌ఎంఈ వివాదాల పరిష్కారం

- కొత్తగా నాలుగు ప్రాంతీయ ఎంఎస్ఎంఈ ఫెసిలిటేషన్ కౌన్సిల్స్
- విశాఖ, విజయవాడ, తిరుపతి, కర్నూలులో ఏర్పాటు
- ప్రతి కౌన్సిల్‌లో నలుగురు సభ్యులు
- బకాయిల కన్సిలేషన్స్ కేసులు ప్రాంతీయ స్థాయిలోనే పరిష్కారం
- ఆర్బిట్రేషన్ కేసులు రాష్ట్రస్థాయి కమిటీ వద్దకు
- ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్న ఎంఎస్ఎంఈ అసోసియేషన్స్



సాక్షి, అమరావతి: ప్రభుత్వ సంస్థలు, ఇతర సంస్థల నుంచి బకాయిలు వసూలు కాక ఇబ్బందులు పడుతున్న సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు (ఎంఎస్ఎంఈలకు) అండగా నిలిచేలా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఎంఎస్ఎంఈల వివాదాల పరిష్కారానికి కొత్తగా నాలుగు చోట్ల ఏపీ ఎంఎస్ఎంఈ ఫెసిలిటేషన్ కౌన్సిల్స్ ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇంతవరకు విజయవాడలో రాష్ట్ర స్థాయి ఫెసిలిటేషన్ కౌన్సిల్ మాత్రమే ఉండటంతో వివాదాల పరిష్కారానికి ఇంత దూరం రావడానికి ఎంఎస్ఎంఈలు ఇబ్బందులు ఎదుర్కొనేవి. ఈ విషయాన్ని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, కర్నూలులో ప్రాంతీయ కౌన్సిల్స్‌ను ఏర్పాటు చేసింది. కన్సిలేషన్స్ (ఇరు పార్టీలను కూర్చొపెట్టి మాట్లాడి పరిష్కరించడం) స్థాయి వివాదాలను ప్రాంతీయ స్థాయిలో పరిష్కరించేలా, ఆర్బిట్రేషన్ స్థాయి వివాదాలను రాష్ట్రస్థాయి కౌన్సిల్‌లో పరిష్కరించేలా చట్టంలో మార్పులు తెస్తూ రాష్ట్ర పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. ఇందుకోసం నలుగురు సభ్యులతో కూడిన ప్రాంతీయ ఫెసిలిటేషన్ కౌన్సిళ్లని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ కౌన్సిల్ ఎక్స్ అఫిషియో చైర్మన్‌గా జిల్లా స్థాయి పరిశ్రమల శాఖ ఉన్నతాధికారి, ఫెడరేషన్ ఆఫ్ ఏపీ స్మాల్ ఇండస్ట్రీస్ అసోసియేషన్ (ఫ్యాప్సియా) సూచించిన ప్రతినిధి, ఏపీ ఎస్ఎఫ్‌సీ జిల్లా బ్రాంచ్ మేనేజర్, ఏపీఐఐసీ సూచించిన వ్యక్తులు సభ్యులుగా ఉంటారు. బకాయిల కోసం కోర్టులకు వెళ్లి సుదీర్ఘ సమయం వృథా చేసుకునే అవసరం లేకుండా వేగంగా పరిష్కరించే చట్టపరమైన హక్కులు ఈ కౌన్సిల్‌కు ఉంటాయి.

ప్రభుత్వ అండతో వేగంగా పరిష్కారం

వైఎస్ జగన్ ప్రభుత్వం ఎంఎస్ఎంఈలకు అన్ని విధాలుగా అండగా నిలుస్తోంది. మరోపక్క ఏపీ మైక్రో అండ్ స్మాల్ ఎంటర్‌ప్రైజెస్ ఫెసిలిటేషన్ కౌన్సిల్‌కు కూడా ప్రాధాన్యత ఇస్తోంది. దీంతో సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల బకాయిలు త్వరితగతిన పరిష్కారమవుతున్నాయి. బకాయిల కోసం కౌన్సిల్‌ను సంప్రదించే పరిశ్రమల సంఖ్య కూడా పెరుగుతోంది. ఇప్పటివరకు ఈ కౌన్సిల్‌కు రూ.654 కోట్ల బకాయిలకు సంబంధించిన 534 ఫిర్యాదులు రాగా వాటిలో 149 ఫిర్యాదులను పరిష్కరించింది. తద్వారా రూ.97 కోట్ల బకాయిలకు పరిష్కారం చూపింది. ఈ సంఖ్య పెరుగుతుండటంతో వివాదాలను మరింత వేగంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం ప్రాంతీయ కౌన్సిల్స్ ఏర్పాటు చేసింది. వాటికి స్పష్టమైన పరిధి, విధివిధానాలను నిర్దేశించింది. దీంతో చిన్న పారిశ్రామికవేత్తల ఆర్థిక ఇబ్బందులు తీరనున్నాయి. ప్రభుత్వ నిర్ణయంపై ఎంఎస్ఎంఈ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. సుదీర్ఘకాల డిమాండ్‌ను నెరవేరుస్తూ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంపై ఫెడరేషన్ ఆఫ్ ఏపీ స్మాల్ ఇండస్ట్రీస్ అసోసియేషన్ (ఫాప్సియా) అధ్యక్షుడు మురళీకృష్ణ ప్రభుత్వానికి, పరిశ్రమల శాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రాంతీయ కౌన్సిళ్ల పరిధిలోకి వచ్చే జిల్లాలివీ..

విశాఖపట్నం ప్రాంతీయ కౌన్సిల్: విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, తూర్పుగోదావరి, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, అనకాపల్లి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జిల్లాలు

విజయవాడ కౌన్సిల్: కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాలు

తిరుపతి కౌన్సిల్ : ప్రకాశం, ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు, చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాలు

కర్నూలు కౌన్సిల్: కర్నూలు, నంద్యాల, అనంతపురం, సత్యసాయి, వైఎస్ఆర్ కడప జిల్లాలు

రేపు విజయవాడలో సీఎం వైఎస్ జగన్ పర్యటన

సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొననున్న ముఖ్యమంత్రి



సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం విజయవాడలో పర్యటించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించనున్న సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొంటారు. సీఎం వైఎస్ జగన్ బుధవారం సాయంత్రం 5.20 గంటలకు తాడేపల్లిలోని నివాసం నుంచి బయలుదేరి విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియానికి చేరుకుంటారు. అక్కడ సెమీ క్రిస్మస్ వేడుకలు, హై–టీలో పాల్గొంటారు. అనంతరం మళ్లీ తాడేపల్లిలోని తన నివాసానికి బయలుదేరి వెళతారు.

'జ్యుడిషియల్ ప్రివ్యూకు టెండర్ డాక్యుమెంట్లు'

సాక్షి, అమరావతి: ఉత్తరాంధ్రలోని పార్వతీపురంలో చేపడుతున్న ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణ టెండర్ డాక్యుమెంట్‌లను జ్యుడిషియల్ ప్రివ్యూలో ఉంచినట్లు ఏపీఎంఎస్ఐడీసీ ఎండీ మురళీధర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో 17 కొత్త వైద్య కళాశాలలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని పేర్కొన్నారు. ఈ క్రమంలో పార్వతీపురంలో రూ.600 కోట్లతో కొత్త వైద్య కళాశాల, బోధనాస్పత్రి నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. ఈ విద్యా సంవత్సరం నుంచి విజయనగరం, ఏలూరు, రాజమండ్రి, మచిలీపట్నం, నంద్యాల వైద్య కళాశాలలు ప్రారంభమయ్యాయి. వచ్చే విద్యా సంవత్సరంలో ఆదోని, మార్కాపురం, మదనపల్లె, పాడేరు, పులివెందులలో కళాశాలలను ప్రారంభించనున్నారు. ఇక మిగిలిన ఏడు కళాశాలలను 2025–26లో ప్రారంభించేలా ప్రణాళికలు రచించారు.

దేశానికి కీలక ఆస్తి.. మానవ వనరులే: రఘురాం రాజన్



రాయదుర్గం(హైదరాబాద్): మానవ వనరులపై సకాలంలో దృష్టి పెట్టడం భారతదేశ ఆర్థిక వృద్ధికి కీలకమని ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రఘురాం రాజన్ అన్నారు. రఘురాం రాజన్, ఆర్థికవేత్త రోహిత్ లాంబాతో కలిసి రచించిన 'బ్రేకింగ్ ది మౌల్డ్' పుస్తకంపై ఐఎస్‌బీ ప్రొఫెసర్ భగవాన్ చౌదరితో ప్రత్యేక చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం రాత్రి గచ్చిబౌలిలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లోని ఖేమ్కా ఆడిటోరియంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాబోయే దశాబ్దాలలో దేశాభివృద్ధికి ఊతమిచ్చే చర్యలు అవసరమన్నారు. భారత్ అత్యంత ముఖ్యమైన ఆస్తిగా మానవ వనరులని చెప్పవచ్చని, పెద్ద సంఖ్యలో వారికి సరైన శిక్షణ ఇవ్వగలిగితే దేశానికి ఎంతో మేలు చేకూరుతుందన్నారు. దేశంలో అభివృద్ధికి అనేక ప్రణాళికలు ఉన్నాయని, అయితే వాటిని అమలు చేయడంలోనే లోపం ఉందని తెలిపారు.

బహుళ పంటలు.. రోజూ డబ్బులు

ప్రభుత్వ ప్రోత్సాహం వెన్నుదన్నుగా ప్రకృతి వ్యవసాయం వైపు సాగుతున్న అన్నదాతలు



ఏటీఎం మోడల్ సాగును పరిశీలిస్తున్న అధికారులు

ప్రకృతి వ్యవసాయంలో ఏటీఎం నమూనా

- పల్నాడు జిల్లాలో 122 మంది రైతుల సాగు
- వివిధరకాల పంటలతో ఏడాది పొడవునా ఆదాయం
- చేనుకు చేవ.. రైతుకు రొక్కం

యడ్లపాడు: ఏదో ఒక పంట సాగుచేసి.. వచ్చే అరకొర ఆదాయంతో.. ప్రకృతి కన్నెర్ర చేస్తే అదీరాక.. ఏదోలా బతికేస్తున్న అన్నదాతలు సాగులో నూతన పద్ధతులతో తమ దుస్థితిని మార్చుకుంటున్నారు. పొలం ఎంత తక్కువైనా.. బహుళపంటల సాగుతో నిరంతరం ఆదాయం పొందేదిశగా అడుగులేస్తున్నారు. ప్రస్తుత వ్యవసాయ విధానాలకు సరైన లాభసాటి ప్రత్యామ్నాయ విధానంగా ప్రకృతి వ్యవసాయం వైపు సాగుతున్నారు. సాగులో సుస్థిర ఆదాయమే లక్ష్యంగా.. రసాయనిక ఎరువులు, పురుగు మందుల వినియోగాన్ని వీడి సంప్రదాయ జీవ ఎరువులతో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహం వీరికి వెన్నుదన్నుగా ఉంది. ప్రకృతి వ్యవసాయ విధానాలను పెంపొందించడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు ప్రపంచ దేశాలను కూడా ఆకర్షిస్తున్నాయి. ఈ విధానం తమ రాష్ట్రాల్లో అమలు చేసేందుకు ఆసక్తి చూపుతూ కొన్ని రాష్ట్రాలు ఇప్పటికే మార్గదర్శకం కోసం ఒప్పందాలు చేసుకున్నాయి. ప్రపంచ ఆహారవ్యవస్థలో పరివర్తనకు కృషిచేస్తున్న గ్లోబల్ అలయన్స్ ఫర్ ది ఫ్యూచర్ ఆఫ్ ఫుడ్, జీస్ట్ ఇంపాక్ట్ సంస్థలు 2020–22లో రాష్ట్రంలో చేసిన సర్వే ఫలితాలే ఈ విధానంతో విస్తృత ప్రయోజనాలు ఉన్నాయనడానికి నిదర్శనం. ప్రకృతి వ్యవసాయంలో ఈ ఏడాది ఆగస్టులో 'ఏటీఎం మోడల్' సాగు విధానాన్ని ప్రారంభించారు. రాష్ట్ర ప్రకృతి వ్యవసాయ విభాగం అమల్లోకి తెచ్చిన ఈ విధానంలో సాగుచేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు.



ఏటీఎం మోడల్ సాగు విధానం అంటే..

పల్నాడు జిల్లాలోని ప్రకృతి వ్యవసాయ డివిజన్లైన నరసరావుపేట, పిడుగురాళ్ల, మాచర్ల, సత్తెనపల్లి, క్రోసూరు, వినుకొండ పరిధిలో 122 మంది రైతులు ఈ ఏడాది సుమారు 2,500 ఎకరాల్లో ఈ విధానంలో సాగుచేస్తున్నారు. కొద్దిపాటి పొలంలోను బహుళ పంటల్ని సాగుచేయడం ద్వారా ఒక పంట తర్వాత మరోపంట దిగుబడి పొందటం, వాటినుంచి నిరంతరాయంగా.. 365 రోజులు ఆదాయం సాధించడమే ఏటీఎం (ఏనీ టైం మనీ) మోడల్ విధానం. 20 సెంట్ల నుంచి ఆపైన ఎంత విస్తీర్ణంలోనైనా ఈ పద్ధతిలో సాగుచేసుకోవచ్చు. కేవలం 20 సెంట్లలో నాలుగడుగులవి 15 బెడ్లు, వాటి చుట్టూ, పొలం చుట్టూ సన్నని బోదెలు ఏర్పాటు చేస్తారు. అందులో ప్రధాన పంటతో పాటు కాయగూరలు, ఆకుకూరలు, దుంప, తీగజాతుల మొక్కల్ని సాగుచేస్తారు. బోరు, బావి వంటి నీటి సదుపాయం కలిగిన భూములున్న రైతులకు ఈ విధానం ఎక్కువ ప్రయోజనకరం. ఈ సాగులో పొలం అంతా వివిధ పంటలు ఉండటంతో సూక్ష్మపోషకాలు పెరిగి నేల సారవంతమవుతుంది. పెద్దగా నీటి అవసరం ఉండదు. ఘన, జీవామృతాల వినియోగంతో పంట ఉత్పత్తుల్లో నాణ్యత ఉంటుంది. తద్వారా మంచి ధర లభిస్తుంది.

ప్రకృతి వైపరీత్యాల భయం ఉండదు



వర్షాభావ పరిస్థితుల్లో కూడా పొలాలు ఖాళీలేకుండా చేసుకోవచ్చు. తన పొలంలో రెండుసెంట్లలో ఈ విధానంలో సాగుచేసినా ఆదాయం పొందవచ్చు. ప్రతి రైతు ఈ విధానం అవలంబిస్తే ప్రకృతి వైపరీత్యాలు సంభవించినా ఎలాంటి భయం, నష్టం ఉండదు.

– కె.అమలకుమారి, ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్, పల్నాడు

నిరంతరం ఆదాయం వస్తుంది



అనంతపురం జిల్లాలో ఏటీఎం విధానంపై శిక్షణ పొందాను. దొండపాడులో ఒకటిన్నర ఎకరా కౌలు భూమిలో ప్రకృతి సాగు చేశా. అందులో ముప్పాతిక ఎకరంలో ఏటీఎం విధానంలో మిరప, టమోటా, ఉల్లి, వంగ, బంతి పంటలు వేశా. పెట్టుబడి సుమారు రూ.45 వేలు అయింది. ఖర్చులు పోను రూ.లక్ష ఆదాయం వస్తుంది. ప్రకృతి సాగులో మోడల్ మేకర్స్‌గా చేస్తున్నా.

– గల్లా మల్లేశ్వరి, దొండపాడు

20 సెంట్లలో సాగుచేస్తున్నా..



ప్రకాశం జిల్లా పొదిలిలో ఆర్గానిక్ ఫామ్ డిప్లొమా, వేలూరులో డీఎస్సీ అగ్రికల్చర్ కోర్సు పూర్తిచేశాను. ఈ ఏడాది సెప్టెంబర్‌లో గుత్తికొండలో 20 సెంట్ల స్థలంలో ఏటీఎం పద్ధతిలో సాగుచేశాను. 15 బెడ్లలో ముల్లంగి, బీట్‌రూట్, క్యారెట్ మూడు వరసలుగా వేసుకుని వాటి మధ్యలో ఆకుకూరలు గోంగూర, కొయ్యతోటకూర, మెంతికూర, పాలకూర, చుక్కకూర, బచ్చలికూర, మధ్యలో స్వీట్‌కార్న్, వాటి అంచుల్లో టమాటా, వంగ, గోరుచిక్కుడు, బొర్డర్ క్రాప్‌గా తీగజాతి పంటలైన సొర, బీర, కాకర, పొట్ల వేసి పందిళ్లు వేశాను. ఒక్కో బెడ్‌పై కోత పూర్తికాగానే ఆ పంటస్థానంలో మరోపంటను వేస్తాను. ఇలాచేస్తే పెట్టుబడి తగ్గి ఆదాయం పెరుగుతుంది.

– షేక్ హసీనా, గుత్తికొండ

నాగబాబూ.. నోరు అదుపులో పెట్టుకో

యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్‌కుమార్ యాదవ్



అనంతపురం కార్పొరేషన్: సీఎం వైఎస్ జగన్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించబోమని.. నోరు అదుపులో పెట్టుకోవాలని జనసేన నేత నాగబాబును యాదవ కార్పొరేషన్ చైర్మన్ హరీష్‌కుమార్‌యాదవ్ హెచ్చరించారు. సోమవారం ఆయన అనంతపురంలో మీడియాతో మాట్లాడారు. ప్యాకేజీ రాజకీయాల్లో పవన్, నాగబాబు సిద్ధహస్తులని చెప్పారు. నిజజీవితంలో ఏవిధంగా సినిమాలు చేసి డబ్బులు తీసుకుంటున్నారో.. అదే తరహాలో ప్యాకేజీ తీసుకుని రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. ప్రజలకు మేలు చేద్దామన్న ఆలోచనతో పవన్‌కళ్యాణ్ జనసేన పార్టీని స్థాపించలేదన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు కోసం మాత్రమే ఆయన పని చేస్తున్నారని విమర్శించారు. హైదరాబాద్‌లో నివాసముండే పవన్‌కళ్యాణ్, నాగబాబు ఏనాడూ రాష్ట్ర ప్రజల బాగోగులు పట్టించుకోలేదన్నారు. సరిగ్గా ఎన్నికల ముందు వచ్చి.. ఆ తర్వాత హైదరాబాద్ వెళ్లిపోయి సినిమాలు చేసుకుంటూ ప్రజలను నిర్లక్ష్యం చేస్తున్నది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి సీఎం జగన్ అనేక పథకాలు అమలు చేశారని వివరించారు. రానున్న ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీ విజయం ఖాయమన్నారు. దీన్ని జీర్ణించుకోలేకే నాగబాబు చౌకబారు విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు.



నువ్వు చనిపోయావని భావించు. నీ జీవితం నువ్వు జీవించావు.
ఇప్పుడు, మిగిలివున్నదేమిటో తీసుకుని సరిగ్గా జీవించు.
– మార్కస్ అరేలియస్

సాక్షి

మంగళవారం, 19 డిసెంబర్ 2023

ఈ జనహననం ఇంకెన్నాళ్లు?

ఇంటి దీపమని ముద్దాడితే మూతి కాలినట్టు గాజాలో ఇజ్రాయెల్ సాగిస్తున్న జనహననాన్ని సమర్థిస్తున్న అమెరికాకూ, దాని పాశ్చాత్య మిత్రులకూ ఇప్పుడిప్పుడే తత్వం బోధపడుతున్నట్టుంది. కాల్పుల విరమణకు సిద్ధపడి సాధారణ పరిస్థితులు ఏర్పడటానికి తోడ్పడాలని, పౌరులకు ఎలాంటి హానీ కలగకుండా చూడాలని ఆ దేశాలు తాజాగా ఇజ్రాయెల్‌ను కోరుతున్నాయి. అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌లోకి చొరబడి హమాస్ విచక్షణారహితంగా 1,200 మందిని కాల్చిచంపి 240 మందిని అపహరించుకుపోయినప్పుడు ఆ దేశాలన్నీ ఇజ్రాయెల్ ప్రతీకార చర్యలను ముక్తకంఠంతో సమర్థించాయి. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ హుటాహుటీన ఇజ్రాయెల్ వెళ్లి ఆ దేశ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూకు సంఘీభావం ప్రకటించారు. ఆయనకు అండదండలందిస్తామని హామీ ఇచ్చారు. హమాస్‌పై యుద్ధం పేరుతో గాజాలో ఇజ్రాయెల్ సైన్యం పౌరుల ప్రాణాలు తీస్తున్నప్పుడూ... జనావాసాలను బాంబులతో నేలమట్టం చేస్తున్నప్పుడూ అమెరికా, బ్రిటన్, జర్మనీ తదితర దేశాలు నోరు మెదపలేదు. ఉత్తర గాజాపై బాంబుల మోత మోగించబోతున్నామని, దాన్ని ఖాళీ చేయాలని ఇజ్రాయెల్ హుకుం జారీచేసినప్పుడు 20 లక్షలమంది పౌరులు ప్రాణభయంతో అప్పటికే కిక్కిరిసివున్న దక్షిణ ప్రాంతానికి వలసపోయారు. సహాయ శిబిరాలన్నీ కిక్కిరిసిపోగా ఎండకు ఎండి వానకు తడిసి అర్ధాకలితో జీవనం సాగిస్తున్నారు. అంత దారుణ పరిస్థితుల్లోనూ పాశ్చాత్య ప్రపంచం మౌనాన్నే ఆశ్రయించింది. పైగా ఈ దశలో పోరు విరమిస్తే అది హమాస్‌ను మరింత బలోపేతం చేస్తుందని అమెరికా వ్యాఖ్యానించింది. రెండు నెలలు గడిచి, 20,000 మందికి పైగా పౌరులు హతమయ్యాక ఇప్పుడు ఆ దేశం నోట 'కాల్పుల విరమణ' ప్రతిపాదన వినిపిస్తోంది. కారణమేమిటో తెలుస్తూనే వుంది. హమాస్ స్థావరాలను గుర్తించి కేవలం వాటిపైన మాత్రమే దాడులు చేయాలన్న సలహానూ, సాధ్యమైనంత త్వరగా పాలస్తీనా ఆవిర్భావానికి సహకరించాలన్న సూచననూ నెతన్యాహూ బుట్టదాఖలా చేశారు. దాంతోపాటు శనివారం హమాస్ చెరనుంచి తప్పించుకునో, వాళ్ల అనుమతితోనో బయటకు వచ్చిన ముగ్గురు ఇజ్రాయెల్ పౌరులను సైన్యం వెనకా ముందూ చూడకుండా కాల్చిచంపిన ఉదంతం ఈ దాడుల ఉద్దేశాన్ని ప్రశ్నార్థకం చేసింది. ఇజ్రాయెల్ సైన్యం సైతం అది ఘోరతప్పిదమని అంగీకరించింది. ఆ తర్వాతే యుద్ధం 'గతి తప్పిందని' అమెరికా రక్షణ మంత్రి లాయిడ్ ఆస్టిన్ నిర్ధారణకొచ్చారు. బ్రిటన్, జర్మనీ, ఫ్రాన్స్ ఆయనతో స్వరం కలిపాయి.

ఉక్రెయిన్‌లో రష్యా దురాక్రమణ యుద్ధంవల్ల అమాయక పౌరుల ప్రాణాలు పోతున్నాయని అమెరికా, ఇతర పాశ్చాత్య దేశాలూ ఏడాదిన్నరగా అంతర్జాతీయ వేదికలపైనా, బయటా ఆరోపిస్తున్నాయి. కానీ గాజా విషయంలో మాత్రం వేరే ప్రమాణాలు పాటించాయి. కాల్పుల విరమణ ప్రకటించాలని ఇజ్రాయెల్‌ను కోరే తీర్మానాన్ని భద్రతామండలిలో అమెరికా మూడుసార్లు వీటో చేసింది. బైడెన్ తన 'అత్యవసర అధికారాలను' వినియోగించి ఆ దేశానికి ఆయుధాలు కూడా సరఫరా చేశారు. చేసేవన్నీ చేశాక ఇపుడు సాధారణ పౌరుల ప్రాణాలకు హాని కలగకూడదని, కేవలం హమాస్ స్థావరాలనే లక్ష్యంగా చేసుకోవాలని సుద్దులు చెప్పటంలోని ఆంతర్యమేమిటి? ఇజ్రాయెల్ చర్యల పర్యవసానంగా చోటుచేసుకుంటున్న ఉత్పాతాల గురించి 'న్యూయార్క్ టైమ్స్' వంటి పత్రికల్లో వస్తున్న కథనాలు దిగ్భ్రాంతికరంగా వుంటున్నాయి. నసర్ అల్ అస్తాద్ అనే వ్యక్తి మినహా ఆ కుటుంబం, వారి బంధువర్గం మొత్తం 100 మంది ఇజ్రాయెల్ దాడుల్లో మరణించారని, మొత్తం ఆ వంశమే తుడిచిపెట్టుకుపోయిందని ఆ కథనం సారాంశం. ఈ రెండున్నర నెలల్లో ఐక్యరాజ్యసమితి సహాయ బృందాలకు సంబంధించిన కార్యకర్తలు 135 మంది దాడుల్లో చనిపోయారు. సమితి 78 యేళ్ల చరిత్రలో ఏ ఘర్షణలోనూ ఇంతమంది ప్రాణాలు కోల్పోయిన సందర్భాలు లేవు. ఈనెల 10న జరిగిన వైమానిక దాడిలో తమ కార్యకర్త, అతని భార్య, నలుగురు పిల్లలు, అతని బంధువర్గంలోని అనేకులు మరణించారని అమెరికా అంతర్జాతీయ అభివృద్ధి సంస్థ ప్రకటించింది. అయిదేళ్ల క్రితం సూడాన్, అల్జీరియా, యూఏఈ తదితర దేశాల్లోని వివిధ నిర్మాణ సంస్థల్లో హమాస్ 50 కోట్ల డాలర్లు పెట్టుబడులు పెట్టిందనటానికి స్పష్టమైన ఆధారాలు లభించినా నెతన్యాహూ ప్రభుత్వం మౌనంగా వుండిపోయింది. ఆయుధాల కొనుగోలుకూ, ఇతర మౌలిక సదుపాయాల కోసం ఈ డబ్బంతా వినియోగిస్తుంటే కళ్లుమూసుకున్న ప్రభుత్వం హమాస్ అక్టోబర్ దాడి తర్వాత హమాస్‌తో ఏమాత్రం సంబంధంలేని ప్రజానీకంపై విరుచుకుపడుతున్న తీరు తీవ్ర అభ్యంతరకరం.

నెతన్యాహూ ధోరణికి ఆయన కేబినెట్‌లో వున్న తీవ్ర మితవాద పక్ష నేతలే కారణమని అమెరికా చేస్తున్న వాదన పాక్షిక సత్యమే. న్యాయస్థానాలు తన జోలికి రాకుండా అడ్డుకోవటానికి చట్టం తీసుకొచ్చి ఇజ్రాయెల్ పౌర సమాజం అసంతృప్తిని మూటగట్టుకున్న నెతన్యాహూ, హమాస్ దాడి తర్వాత మరింత అప్రదిష్టపాలయ్యారు. ఈ దాడులు ఆగాక నెతన్యాహూ నిర్వాకంపై ఎటూ ఆరా వుంటుంది, ఆయన రాజీనామా కోసం జనం ఉద్యమిస్తారు. కాస్త ముందో, వెనకో పార్లమెంటు ఎన్నికలు కూడా తప్పకపోవచ్చు. ఇది తెలిసే నెతన్యాహూ దాడుల విరమణకు ససేమిరా అంటున్నారు. పాలస్తీనా ఏర్పాటుకు నిరాకరిస్తున్నారు. ఇజ్రాయెల్‌కు హమాస్ చేసిన నష్టం కంటే తానే గాజాకు ఎక్కువ నష్టం చేశానని చెప్పటమే ఆయన ఉద్దేశం. ఈ జనహననాన్ని సాగనీయొద్దు. మొదట్లో ఇజ్రాయెల్‌కు మద్దతు పలికిన పాశ్చాత్య ప్రపంచమే ఈ బాధ్యత తీసుకుని పాపప్రక్షాళన చేసుకోవాలి. లేనట్టయితే మానవాళి క్షమించదు.

ఉత్తర దక్షిణాదుల ఓటింగ్ వైఖరి

అభిప్రాయం



అశుతోష్ వార్ష్‌ణాయ్

భారతదేశంలో రెండు భిన్నమైన దేశాలున్నాయని చాలాకాలంగా ఒక ఆలోచన ఉంది. ఉత్తర, దక్షిణ భారతదేశాలన్నమాట! అందుకే వాటి ఓటింగ్ ధోరణి కూడా భిన్నంగా ఉంటోంది. ముఖ్యంగా బీజేపీ తలకెత్తుకున్న హిందూ జాతీయవాదం విషయంలో. ఇది, ముస్లిం వ్యతిరేక భావజాలం నుంచి విడదీయలేనిది. అయితే, కొంతమంది చరిత్రకారుల అంచనాల ప్రకారం ఔరంగజేబు, టిప్పూ సుల్తాన్ ఇద్దరినీ ఒక గాటన కట్టలేము. అలాగే హైదరాబాద్ ఏడవ నిజాం వారసత్వ పాలనకే మొగ్గు చూపాడు కానీ ముస్లింల పాలనకు కాదు. ఇక, ఉత్తర భారతదేశంతో పోలిస్తే సంక్షేమ రాజకీయాలు దక్షిణాదిలో చాలాకాలంగా నడుస్తున్నాయి. దీనివల్ల ఉత్తరాదిలోలా 'రహదారులు, వంటగ్యాస్' కథనాలు కూడా చెల్లవు. అందుకే భిన్న రాజకీయాలు అవసరం.

ఎన్నికలైన ప్రతిసారీ ఫలితాలను సులువుగా విశ్లేషించడం ఎలా అన్న ప్రశ్న ఉదయిస్తూంటుంది. కొన్నిసార్లు తేలికగా ఫలితాలను విశ్లేషించవచ్చు కూడా. ఉదాహరణకు 2019లో భారతీయ జనతా పార్టీ జాతీయ స్థాయి విజయం! కానీ పలు అంశాలు మిళితమైన ఎన్నికలను పరిశీలించే సందర్భంలో పరిస్థితి భిన్నంగా ఉంటుంది. హిందీ బెల్ట్‌లో మోదీ ప్రాచుర్యాన్ని కాసేపు పక్కన బెడితే తెలుసుకోవాల్సిన అంశం ఏదైనా ఉందా? విజేతలు, పరాజితుల మధ్య ఓట్ల అంతరాలను పరిశీలిస్తే ఒక్క విషయం స్పష్టమవుతుంది. బీజేపీ, కాంగ్రెస్ మధ్య ఓట్లలో ఎనిమిది శాతం భారీ అంతరమున్న మధ్యప్రదేశ్‌ను మినహాయిస్తే మిగిలిన రాష్ట్రాల్లో పోలైన ఓట్లకూ, సాధించిన సీట్లకూ మధ్య సారూప్యత దగ్గరగానే ఉంది. ఓట్లకూ, సాధించే సీట్లకూ మధ్య సంబంధం ఉండదన్నది భారతదేశంలో అమల్లో ఉన్న ఎన్నికల వ్యవస్థ ప్రత్యేకత. అయితే ఈ తేడా ఎన్నికలపై చూపే ప్రభావం మాత్రం కచ్చితంగా అర్థం చేసుకోవాల్సి ఉంటుంది.

ఇటీవలి ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలను పరిశీలిస్తే, కాంగ్రెస్ పార్టీకి వచ్చిన ఓట్ల శాతం తగ్గలేదన్నది స్పష్టంగా తెలుస్తుంది. మరీ ముఖ్యంగా ఉత్తర భారత రాష్ట్రాల విషయంలో. కానీ బీజేపీ సాధించిన ఓట్లు మాత్రం కచ్చితంగా పెరిగాయి. ఛత్తీస్‌గఢ్‌లో ఇరు పార్టీల మధ్య అంతరం నాలుగు శాతం వరకూ ఉంటే, రాజస్థాన్‌లో ఇది కేవలం రెండు శాతమే. కాంగ్రెస్ తన వ్యూహంలో కొన్ని మార్పులు చేసుకుని ఉండగలిగితే పరాజయం ఎదుర్కోవాల్సిన పరిస్థితి వచ్చి ఉండేది కాదు. తెలంగాణలో కూడా కాంగ్రెస్ కేవలం రెండు శాతం అదనపు ఓట్లతో అధికారం దక్కించుకున్న విషయం ఇక్కడ చెప్పుకోవాలి.

ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు మోదీ చరిష్మాను మరింత పెంచుతాయని ఒప్పుకొన్నా... బీజేపీ తరచూ చేసే నినాదం 'మోదీ హై తో ముమ్‌కిన్ హై'కు అందుబాటులో ఉన్న డేటా మాత్రం మద్దతివ్వడం లేదు. తెలంగాణలో మోదీ మాయ పనిచేయలేదు. ప్రధాన పార్టీలకు బాగా వెనుకబడి మూడో స్థానంలో నిలిచింది. అయితే వచ్చే సాధారణ ఎన్నికల్లో ఉత్తర భారతంపై ఎక్కువ దృష్టి పెట్టి తెలంగాణను తక్కువ అంచనా వేస్తే బీజేపీకి ఇబ్బందులు తప్పవు. దక్షిణాదిలోని ఐదు రాష్ట్రాల్లో బీజేపీ ప్రభుత్వం లేదు. దేశ జనాభాలో దాదాపు నాలుగో వంతు ఈ ఐదు రాష్ట్రాల్లో ఉంది. ఉత్తర భారతంలో పరిస్థితి భిన్నం. 43 శాతం జనాభా ఉండగా చాలా రాష్ట్రాలు బీజేపీ పాలనలో ఉన్నాయి. గుజరాత్‌ను కూడా ఉత్తర భారతానికి జోడిస్తే బీజేపీ బలంగా ఉన్న ప్రాంతమేదో స్పష్టమవుతుంది.

ఈ ఏడాది మొదట్లోనూ బీజేపీ ప్రభావ అంశం ఒకసారి వెలుగులోకి వచ్చింది. బీజేపీ కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి చవి చూసినప్పుడు వచ్చిందీ చర్చ. బీజేపీ భవిష్యత్తు ఎలా ఉండబోతుందన్న అంచనాలు వేసే ముందు... బీజేపీని ఉత్తర భారతం నెత్తిన



పెట్టుకునేందుకు, దక్షిణాన తిరస్కారం ఎదురవుతున్నందుకు ఉన్న కారణాలేమిటన్నది చూద్దాం.

దక్షిణాది పూర్తిగా బీజేపీ ముక్తం కాలేదు. రెండో అతిపెద్ద రాష్ట్రమైన కర్ణాటకలో ఓడిపోయింది. కానీ అక్కడ బీజేపీకి 36 శాతం ఓట్లున్నాయి. తెలంగాణలో ఎన్నికల్లోనూ తన మునుపటి ఓట్లను రెట్టింపు చేసుకుని 14 శాతానికి చేరింది. అయితే ఈ అంకెలు దక్షిణాదిలో బీజేపీ ఉనికిని సూచించేవి మాత్రమే. రాజకీయ రంగంలో ఉనికిలో ఉండటాన్ని మాత్రమే బీజేపీ కోరుకోవడం లేదు. మరిన్ని ఎక్కువ రాష్ట్రాల్లో అధికార పగ్గాలు చేపట్టాలని అనుకుంటోంది.

భారతదేశంలో రెండు భిన్నమైన దేశాలున్నాయని చాలాకాలంగా ఒక ఆలోచన ఉంది. ఉత్తర, దక్షిణ భారతదేశాలన్నమాట! ద్రావిడ ఉద్యమంలో మొదటిసారి ఈ భావన ఏర్పడిందని చెప్పవచ్చు. అయితే దశాబ్దాల కాంగ్రెస్ ఆధిపత్యం సాగిన సమయంలో ఈ తేడా అంత స్పష్టంగా ఉండేది కాదు. కనీసం రాజకీయాలు, ఎన్నికల విషయంలో ఇది వాస్తవం. 1970ల మధ్యలో వచ్చిన అత్యయిక స్థితి (ఎమర్జెన్సీ) తరువాత పరిస్థితి మారిపోయింది. 1977 ఎన్నికల్లో అనూహ్య ఫలితాలు వెలువడ్డాయి. ఈ ఎన్నికల ఫలితాలు ఇరు ప్రాంతాల మధ్య వైరుధ్యాన్ని మరింత స్పష్టం చేశాయి. ఇందిరాగాంధీ ఉత్తరాన ఓటమి పాలైతే దక్షిణాన విజయం సాధించారు. ఈ ఎన్నికల్లోనే కాంగ్రెస్ జాతీయ స్థాయి ఎన్నికల్లో ఓటమి చవిచూసిన విషయం కూడా తెలిసిందే.

బీజేపీ దక్షిణాది రాష్ట్రాల్లో పెద్దగా రాణించకపోయేందుకు కారణాలేమిటి? కొన్ని చారిత్రాత్మకమైనవి, మరికొన్ని సైద్ధాంతికమైనవి. బీజేపీ తలకెత్తుకున్న హిందూ జాతీయవాదం... ముస్లిం వ్యతిరేక భావజాలం నుంచి విడదీయలేనిది. అభివృద్ధి, పరిపాలన మాత్రమే రాజకీయ లాభాలు తెచ్చిపెట్టవు. ముస్లిం పాలకుల 'చారిత్రక తప్పిదాల' పేరిట ముస్లిం వర్గాల పట్ల వ్యతిరేకత లేకపోతే బీజేపీ ఇప్పుడున్న పరిస్థితిలో ఉండేది కాదు.

అయితే ఈ రకమైన హిందూ జాతీయవాదానికి దక్షిణాదిలో ముస్లింలు రాజ్యాలేలిన ప్రాంతాల్లోనే కొద్దిపాటి మన్నన లభిస్తుంది. వారి పాలనలో అన్యాయం జరిగిందని చూపించడం లేదా ప్రచారం చేయడం ద్వారా ఈ పార్టీ లాభపడే అవకాశం ఉంటుంది. మైసూరు రాజు టిప్పూ సుల్తాన్‌పై కర్ణాటకలో తరచూ వివాదాలు నెలకొనడం ఇందుకే. టిప్పూ సుల్తాన్ 18వ శతాబ్దానికి చెందిన వారైతే, హైదరాబాద్‌లో 1911–48 మధ్య రాజ్యమేలిన నిజాములున్నారు. కొంతమంది చరిత్రకారుల అంచనాల ప్రకారం ఔరంగజేబు, టిప్పూ సుల్తాన్ ఇద్దరినీ ఒక గాటన కట్టలేము. అలాగే హైదరాబాద్ ఏడవ నిజాం వారసత్వ పాలనకే మొగ్గు చూపాడు కానీ ముస్లింల పాలనకు కాదు. అయితే రజాకార్లనే హిందూ వ్యతిరేక వర్గం నిజాం పాలన చివరి దశాబ్దంలో (1938– 48) నిజాం తరఫున పనిచేసింది.

హిందూ జాతీయవాదాన్ని చర్చలో ఉంచేందుకు బీజేపీకి తెలంగాణ, కర్ణాటకల్లో కొన్ని చారిత్రక ఆధారాలు అందుబాటులో ఉన్నాయి. అయితే తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, కేరళల్లో అలాంటివి లేవు. ఇక్కడ హిందూ జాతీయవాదం పెద్దగా పనిచేయదు. ఉత్తర భారతదేశంతో పోలిస్తే దక్షిణాదిన అభివృద్ధి ఎక్కువ కావడం, సంక్షేమ రాజకీయాలు దక్షిణాదిలో చాలాకాలంగా నడుస్తూండటం వల్ల ఉత్తర భారతదేశంలో బీజేపీ వినిపించే 'రహదారులు, వంటగ్యాస్' కథనాలు కూడా చెల్లవిక్కడ.

హిందూ జాతీయ వాదంలో ఇంకో అంశమూ ఉంది. హిందీ! దక్షిణాదిలో ఈ భాషాధిపత్య ధోరణీ చెల్లుబాటు కాదు. హిందీని రాజభాషగా చేయాలన్న డిమాండును 1980లల్లోనే ఆర్‌ఎస్‌ఎస్ వదిలేసుకుందని చరిత్రకారులు చెబుతూండటం ప్రస్తావనార్హం. ఆర్‌ఎస్‌ఎస్‌కు చెందిన పాఠశాలల్లో ప్రాంతీయ భాషల్లోనూ బోధన జరుగుతూండటం తెలిసిందే. అయినప్పటికీ హిందీ జాతీయవాదం పేరుతో జరిగే పెత్తనాన్ని దక్షిణాదిలోని మేధోవర్గం సులువుగా గుర్తించగలుగుతోంది. రాజకీయ పార్టీలూ ఈ విషయాన్ని విస్పష్టంగా బహిరంగ పరిచాయి కూడా. దక్షిణాది వారికి తమ భాష, వారసత్వాలపై గౌరవం మెండు. తప్పు కాదు కూడా. తమ భారతీయతను ఇష్టపడుతూనే... హిందీ, హిందూ జాతీయతా భావజాలాలు తమ సాంస్కృతిక ఏకతను దెబ్బతీస్తున్నాయన్న భావన వారిలో ఉంది. దక్షిణాది మద్దతు లేకుండానే బీజేపీ మరోసారి ఢిల్లీ గద్దెను ఎక్కవచ్చు. సంఖ్యల్లోని తర్కంలో ఇదంతా ఇమిడివుంది. నియోజకవర్గాల పునఃవ్యవస్థీకరణ దీన్ని మరింత సులభతరం చేయొచ్చు. కానీ దక్షిణాది నుంచి వచ్చే ఉచితమైన ఫిర్యాదులను బీజేపీ విస్మరిస్తుందా? ఇది వెంటాడే గుణం ఉన్న ప్రశ్న.

వ్యాసకర్త బ్రౌన్ యూనివర్సిటీలో ఇంటర్నేషనల్ స్టడీస్, సోషల్ సైన్సెస్ అధ్యాపకులు

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

భయపెడుతున్న అజ్ఞాతులు



గత కొన్ని నెలలుగా భయంకర తీవ్రవాదులు, డ్రగ్ లార్డ్స్, నేర సిండికేట్ నాయకులను పాకిస్తాన్‌లోని 'అజ్ఞాత వ్యక్తులు' వరుసగా హత్య చేస్తున్నారు. ఈ అజ్ఞాత వ్యక్తులు ఎవరో ఎవరికీ తెలీదు. ఎలాగైనా వదిలించు కోవాలనుకుంటున్న వ్యవస్థ తాలూకు హిట్ మెనా లేక విదేశీ హిట్ మెనా? ఏమైనాగానీ చాలా పెద్దది ఏదో జరుగుతోంది.

– జాహక్ తన్వీర్, కాలమిస్ట్

ఆరోగ్య ప్రభావాలు



కోవిడ్ టీకాల ఘోర ఫలితాలు ఇప్పుడు బయటపడుతున్నాయి. లక్షలాది మంది కోవిడ్–19 టీకా తీసుకున్న, తీసుకోని వారిని పోల్చిన మూడు అధ్యయనాలు–– మస్కులోస్కెలెటల్ అపసవ్యతలు, గైనాకాలాజికల్ అపసవ్యతలు, రక్త అపసవ్యతల నుంచి టీకా తీసుకోనివారు తక్కువ ఇబ్బంది పడతారని చెబుతున్నాయి.

– ప్రశాంత్ భూషణ్, యాక్టివిస్ట్

అండగా ఉంటా!



డచ్ ఎన్నికల్లో విజయం సాధించినందుకుగానూ ప్రపంచవ్యాప్తంగా నాకు శుభాకాంక్షలు తెలిపిన స్నేహితులందరికీ ధన్యవాదాలు. ఇండియా నుంచి చాలా దయాపూరిత సందేశాలు వచ్చాయి. కేవలం హిందువు అయిన కారణంగా బంగ్లాదేశ్, పాకిస్తాన్‌లలో దాడులకు గురైన, చావు బెదిరింపులను ఎదుర్కొన్న హిందువులకు నేను ఎల్లప్పుడూ అండగా ఉంటాను.

– గీర్ట్ వైల్డర్స్, నెదర్లాండ్స్ నేత

స్వదేశానికి పిలుపు



ఇండియా బయట పెరిగిన మనిషిగా, నేను ఇండియాలో స్థిరపడేందుకు ఒక ముఖ్య ఉద్వేగపూరిత కారణం 'స్వదేశ్' సినిమా (షారుక్ ఖాన్ నటించారు; 2004లో డిసెంబర్ 17న విడుదలైంది.) మార్పు సాధ్యమేనని నమ్మేట్టు చేసింది.

– నిఖిల్ తనేజా, ఆంట్రప్రెన్యూర్

చెడగొట్టింది!



మూర్ఖత్వాన్ని అంటువ్యాధిగా మలచడమే సామాజిక మాధ్యమాల ఘన వారసత్వం అని ఏదో ఒకరోజు చరిత్రకారులు పుస్తకాలు రాస్తారు.


– వీర్ దాస్, కమెడియన్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

ఇన్ బాక్స్

స్వచ్ఛత కోసం తపించి...

పరిశుభ్రత దైవమని నిర్వచించిన తొలి సంస్కర్తా, చీపురుతో వీధుల్నీ– కీర్తనలతో మస్తిష్కాలను శుభ్రం చేసిన వాగ్గేయకారుడూ, బడిలో ఆధ్యాత్మికతను వెతికిన వాడూ, నిమ్న వర్గాలకు అంబేడ్కరే దేవుడు అన్న దార్శనికుడూ సంత్ గాడ్గే బాబా. ఆయన సామాజిక న్యాయం కోసం పరితపించారు. సమస్త ఛాందసాలను హేతువుతో ఖండించిన సాధువు. అంతేకాదు ప్రకృతిని కాపాడుకోవాలని చెప్పిన పర్యావరణ వాది కూడా.



సంత్ గాడ్గే బాబా

ఆయన అసలు పేరు దేబు. 1870 ఫిబ్రవరి 23వ తేదీన మహారాష్ట్రలోని 'షేన్ గావ్'లో ఒక రజక కుటుంబంలో జన్మించారు. చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయి మేన మామ ఇంట్లో పెరిగాడు. చిన్న వయసు నుంచే పగలంతా చాకిరీ చేసేవాడు. రాత్రి అయితే చాలు ఊర్లోనో, పొరు గూరులోనో పాటకచేరికి వెళ్లిపోయేవాడు. కులాచారం ప్రకారం తన కుమార్తె బారసాలకు మేకలను బలిచ్చే ఆచా రాన్ని అడ్డుకొని మిఠాయిలు పంచిపెట్టారు. 1905లో ఒక సాధువు ప్రభావంతో దేబు తల్లినీ, భార్యాపిల్లలను వదిలి సత్యాన్వేషణకు ఇంటి నుంచి బయటపడ్డారు.

ఇంటి నుంచి బయటపడ్డాక మూకుడు, చీపురు ఆయన ప్రతీకలయ్యాయి. దర్జీల దగ్గర రంగురంగుల పీలికలను ఏరుకొని దుస్తులను కుట్టుకునే వారు. మూకుడునే నెత్తిమీద టోపీ లాగా బోర్లించుకునేవారు. భిక్షం అవసరమైనప్పుడు అడుక్కొని తిన్నాక శుభ్రంగా కడిగి దాన్నే నెత్తి మీద బోర్లించుకునేవారు. మరాఠీలో మట్టిచిప్పను గాడ్గే అంటారు. అందుకే ఆయనకి 'గాడ్గే బాబా' అని పేరు వచ్చింది. సత్యాన్వేషణలో ఉన్నవాడు ముందుగా అహాన్ని రద్దు చేసుకోవాలి. దీన్ని దృష్టిలో పెట్టుకొని గాడ్గే బాబా ఎవరైనా 'మీదే కులం' అని అడుగుతే అంటరానివాడనని చెప్పేవారు. దానితో అవమానాలూ, ఛీత్కారాలూ ఎదురయ్యాయి. ఆ రకంగా వందల ఏళ్లుగా ఓ ప్రధాన సమూహం అనుభవిస్తున్న బాధల్ని అనుభవంలోకి తెచ్చుకున్నారు.

ఊళ్ళో వాళ్ళ పనులు చేసి పెట్టి వాళ్లు పెట్టే జొన్న రొట్టెలు మాత్రమే తీసుకునేవారు. ఏ ఊరు వెళితే ఆ వూరి వాళ్లను చీపురు అడిగి చెత్తను ఊడ్చి పరిసరాలను శుభ్రంగా ఉంచుకొనేలా ప్రజలకు ఆదర్శంగా నిలిచారు. సాయంత్రం తాను శుభ్రపరచిన గుడి దగ్గరే రెండు రాళ్ళను తీసుకుని తాళం వేస్తూ తన అద్భుతమైన కంఠంతో కీర్తనలు పాడేవారు. చివరికి 1956 డిసెంబర్ 20న తుది శ్వాస విడిచారు. ఆయన స్ఫూర్తితో సామాజిక సమరసతను పెంపొందిద్దాం. విద్వేషాలు లేని సమ సమాజాన్ని నిర్మిద్దాం.

– సామల కిరణ్ | 99493 94688

(రేపు గాడ్గే బాబా వర్ధంతి)

సాంకేతిక పోటీలో నిలబడాలంటే...

సందర్భం



ఆచార్య అజయ్ కుమార్ సూద్

గౌరవనీయులైన ఛాన్సలర్ శ్రీ గిరిధర్ మాలవ్య, వైస్–ఛాన్సలర్ ప్రొఫెసర్ సుధీర్ జైన్ తదితరులకు నమస్కారం. 103వ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా పాల్గొనడం నాకు దక్కిన గౌరవం. ఈ రోజు డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు జ్ఞాపకాల పుస్తకంలో శాశ్వతంగా నిలిచిపోయే రోజు ఇది. తరగతి గదులనూ, పరీక్షలనూ దాటుకొని వాస్తవ ప్రపంచంలోకి మీ ప్రయాణం ప్రారంభమయ్యే రోజు ఇది. ఈ తరుణంలో రాబోయే కాలంలో శాస్త్ర, సాంకేతిక రంగాలలో భారతదేశం ఎదుర్కొనే సవాళ్లను, లభించే అవకాశాలను పరిశీలిద్దాం.

విద్య, శాస్త్ర (సైన్స్), సాంకేతికత (టెక్నాలజీ), నూతన పరిశోధనలు – అనే నాలుగు స్తంభాలు ఏ దేశాన్నైనా బలంగా నిలబెట్టేవి. ఈ నాలుగు స్తంభాలూ దేనికదే గణనీయమైన బలాన్ని సముపార్జించుకున్నప్పటికీ దేనికదే ఒంటరిగా చాలా కాలం పయనించాయి. గతానుగతికమైన ఈ దృక్పథం మారాలి. అలా మారిన దృక్పథం ఎక్కువ ప్రయోజనాలను పొందేలా చేస్తుంది. ఈ విధానం వలన ఉత్సుకతతో నడిచే ప్రాథమిక శాస్త్ర విజ్ఞాన పరిశోధనలు, అనువర్తిత పరిశోధనలు అనే విభజనకు దారితీసింది. నేటి ప్రాథమిక శాస్త్ర విజ్ఞానం త్వరలో సాంకేతికతా రూపంలోకి అనువర్తించ బడుతుందని గుర్తుంచుకోవాలి. గురుత్వాకర్షణ తరంగాలను కూడా అంచనా వేసిన ఐన్‌స్టీన్ 'సాపేక్షతా' సిద్ధాంతం గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్(జీపీ) అనే సాంకేతికతకు కచ్చితంగా అవసరమని ఆనాడు ఎవరూ ఊహించి ఉండరు. ఐన్‌స్టీన్ ప్రతిపాదించిన సాధారణ సాపేక్ష సిద్ధాంతం లేకుండా ఉపగ్రహాలు ఎలా కదులుతాయో కచ్చితంగా అంచనావేసి చెప్పలేం కదా.

ఈ సందర్భంలో భారత ప్రభుత్వ ప్రధాన సాంకేతిక సలహాదారుగా, నా సహచరులతో కలిసి సాంకేతికతకు సంబంధించి ప్రస్తుత, భవిష్యత్ అవసరాలను రూపొందించే క్రమంలో మా ఆలోచనలను మీతో పంచుకోవాలనుకుంటున్నాము. విఘాతం కలిగించే అభివృద్ధి కన్నా క్రమాభివృద్ధే మాకు ముఖ్యం. భారతదేశం అనేక రంగాలలో వైజ్ఞానిక విప్లవాల దిశగా దూసుకుపోతోంది. క్వాంటం టెక్నాలజీ, ఎమర్జింగ్ డిజిటల్ టెక్నాలజీ, ఆరోగ్య రక్షణ, క్లీన్ ఎనర్జీ వంటివి అందులో కొన్ని ముఖ్యమైనవి.

క్వాంటం విప్లవం గురించి రెండు మాటలు చెబుతాను. మొదటి క్వాంటం విప్లవం 1913–1925



మధ్య సంభవించింది. దీనివల్ల హైడ్రోజన్ అణువు వర్ణపట రేఖలు క్వాంటం పద్ధతి ద్వారా మాత్రమే అర్థం చేసుకోగలిగాం. ప్రస్తుతం చూస్తున్న రెండవ క్వాంటం విప్లవంలో వ్యక్తిగతమైన, సంక్లిష్టమైన క్వాంటం సిస్టమ్‌లను నియంత్రించడంపై దృష్టి పెట్టడం కనిపిస్తుంది. అంటే సంప్రదాయ కంప్యూటర్‌లను ఉపయోగించి పరిష్కరించలేని సమస్యలను పరిష్కరించడమన్నమాట! ఉదాహరణకు ప్రకృతిలో సహజసిద్ధంగా జరిగే కిరణజన్య సంయోగక్రియలో సౌరశక్తిని రసాయనశక్తిగా మార్చగలిగే పత్రహరిత రేణువులూ, అలాగే వాటి అనుబంధ ద్రవ్యాల శక్తినీ 'క్వాంటం మోడల్' అనే చిత్రపటం ద్వారా కిరణజన్య సంయోగక్రియ సమర్థతను తెలుసుకోవచ్చు. కొన్ని ప్రయోగశాలల్లో ఇప్పటికే క్వాంటం కంప్యూటర్స్ ద్వారా ఏర్పాటు చేసిన 'క్యూ బిట్స్' ఉండటాన్ని మనం గమనిస్తున్నాము. భారతదేశం క్వాంటం టెక్నాలజీకి సంబంధించి ఇటీవల ఒక మిషన్‌ను ప్రారంభించింది.

ఇవ్వాళ డిజిటల్ టెక్నాలజీ కృత్రిమ మేధ... యాంత్రిక శిక్షణ, ఆగ్మెంటెడ్ రియాలిటీ, వర్చువల్ రియా లిటీ, మిక్స్‌డ్ రియాలిటీ, బ్లాక్ చైన్ టెక్నాలజీ, ఇంట ర్నెట్ ఆఫ్ థింగ్స్ వంటి విషయాలపై దృష్టిని సారించింది. సాంకేతిక రంగంలో ప్రపంచపోటీలో నిలబడటానికి, పరిశోధన–అభివృద్ధి, లక్ష్యంగా సాంకేతిక అభివృద్ధి – విస్తరణయే సరైన మార్గం. అందువల్ల, మేము ఇప్పటికే అమెర్జింగ్, ఫ్యూచరిస్టిక్ టెక్నాలజీస్‌లపై వివిధ జాతీయ మిషన్లను రూపకల్పన చేశాం. సైబర్ ఫిజికల్ సిస్టమ్‌పై జాతీయ మిషన్, సెమీకండక్టర్లపై జాతీయ మిషన్, కృత్రిమ మేధపై జాతీయమిషన్ వంటివి ఇటువంటివే.

భారత్ కృత్రిమమేధ, యంత్ర అభ్యాసాన్ని, రోబోటిక్స్, టెలిహెల్త్‌ను ఉపయోగించుకొని స్వదేశీయమైన కొత్త వైద్య పరికరాల తయారీలో ముందడుగులో ఉంది. సాంకేతికంగా స్వావలంబనతో ఉండాలంటే మెరుగైన సాంకేతిక ఆధారిత ఉత్పత్తులనూ, సాంకేతిక ఆధారిత వ్యవస్థాపకతనూ సమాంతరంగా ప్రోత్సహించాలి. శాస్త్ర, సాంకేతిక రంగాలకు సంబంధించిన విషయాలలో ఒకటి కంటే ఎక్కువ మార్గాల్లో భాగం కావడానికి మీ తరానికి ఇది అద్భుతమైన అవకాశం. మీలో చాలా మంది భవిష్యత్తులో శాస్త్ర, సాంకేతిక రంగాలకు సంబంధించిన సవాళ్ళనూ, సామాజికంగా ఎదురయ్యే అవరోధాలనూ పరిష్కరించడానికి కృషి చేస్తారని భావిస్తున్నాను.

(బెనారస్ హిందూ విశ్వవిద్యాలయ స్నాతకోత్సవంలో భారత ప్రభుత్వ శాస్త్ర, సాంకేతిక సలహా దారు ఆచార్య అజయ్ కుమార్ సూద్ ప్రసంగ సంక్షిప్త రూపం. అనువాదం: ఆచార్య బూదాటి వేంకటేశ్వర్లు)

కర్మఫలం వదిలి పోదు!

ఆధ్యాత్మిక భారతీయతకు కర్మసిద్ధాంతం వెన్నెముక వంటిది. ఈ సిద్ధాంతం ప్రకారం మనిషి పుట్టిన తరువాత చేసే ప్రతి పని కూడా కర్మగానే పరిగణించబడుతుంది. మనుషుల జీవితాలలో సమస్తమైన పనులూ కర్మములేననీ, ప్రతి కర్మకు కారణం, ఫలితం అనేవి రెండూ ఉంటాయని కర్మ సిద్ధాంతం చెబుతుంది. అయితే చేసే పని, అనగా కర్మ, కంటికి కనపడుతుంది కాని ఆ కర్మ ఫలితం కంటికి వెంటనే కనిపించాలన్న నియమం లేదు. కర్మ ఫలితం పాప పుణ్యాల రూపంలో రెండు విధాలుగా ఉంటుందన్నది కూడా కర్మ



సిద్ధాంతంలో ఒక ప్రధానాంగం. ఈ విశ్వంలో ఏ చిన్న ప్రాణి యొక్క జన్మ కూడా ఏదో ఒక్క జన్మతో సమాప్తమయ్యేది కాదనీ, ఒక జన్మలో చేసిన కర్మల ఫలితాలు ఆ జన్మలోనే అనుభవించబడవనీ, పునర్జన్మ ఉంటుందనీ, ప్రాణుల కర్మల యొక్క ఫలాలైన పాపపుణ్యాలు వారిని వదలక ముందు జన్మలలో సైతం వెంటాడతాయనీ చెప్పడం కర్మసిద్ధాంతంలో అతి ముఖ్యమైన భాగం. ఈ విషయాన్నే 'మార్కండేయ పురాణం' ద్వితీయాశ్వాసంలో ఒక వినసొంపైన కందపద్యం ద్వారా చెప్పాడు ఆ పురాణకర్త మారన కవి.

వినుతొలియ నిడిన యన్నం
బును బోలెం జేసినట్టి పుణ్యము పాపం
బును మానవులకు నేవిధ
మున గుడువక పోవు గర్మములు ప్రబలంబుల్.

'కుడుచు' అనే మాటకు తినుట, తాగుట, అనుభవించుట అని మూడు అర్థాలున్నాయి. ఆ సౌకర్యాన్ని ఆధారంగా చేసుకుని కూర్చిన పద్యం పైది. ఆహ్లాదకరమైన శ్లేష ఉన్నది ఇందులో. 'మనిషి చేసుకున్న పాపపుణ్యాలు కంచంలో పెట్టి ఉంచిన భోజన పదార్థాల వంటివి. ఎవరివైతే వారికే ఉద్దేశించబడినట్టివి. ఎప్పటికైనా వాటిని భుజించక తప్పదు. కర్మలనేవి అలాంటివి. వాటికి చాలా గొప్ప శక్తి ఉంది. ఎన్ని జన్మలకైనా వెంటనంటి వస్తూ, ఫలం అనుభవించేదాకా వదలవు అవి!' అని పై పద్యం భావం. కర్మఫలాన్ని భోజన పదార్థంతో పోల్చి కర్మసిద్ధాంతం యొక్క హృదయాన్ని గురించి హృద్యంగా చెప్పాడు మారన కవి ఇందులో.

– భట్టు వెంకటరావు

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, **తిథి:** శు.సప్తమి సా.4.02 వరకు, తదుపరి అష్టమి, **నక్షత్రం:** పూర్వాభాద్ర రా.3.12 వరకు, తదుపరి ఉత్తరాభాద్ర, **వర్జ్యం:** ఉ.10.47 నుండి 12.17 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.37 నుండి 9.25 వరకు, తదుపరి రా.10.39 నుండి 11.31 వరకు, **అమృతఘడియలు:** రా.7.46 నుండి 9.13 వరకు; **రాహుకాలం:** ప.3.00 నుండి 4.30 వరకు, **యమగండం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **సూర్యోదయం:** 6.28, **సూర్యాస్తమయం:** 5.26.

ఏపీకి జగనే ఎందుకు కావాలంటే.. వివరించే కార్యక్రమంలో భాగంగా..


తిరుపతి జిల్లా జంగావాండ్లపల్లెలో జనం సమస్యలు తెలుసుకుంటున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి


విజయనగరం జిల్లా వండవలో అభివృద్ధి, సంక్షేమ బ్రోచర్లను అందజేస్తున్న ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి


మచిలీపట్నంలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న యువజన విభాగం ఇన్‌చార్జ్ పేర్ని కృష్ణమూర్తి


నెల్లూరు నగరంలోని 54వ డివిజన్‌లో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ షేక్ సఫియా బేగం

క్లుప్తంగా...

ముగ్గురు రైల్వే ఉద్యోగులకు జీఎం సేఫ్టీ అవార్డులు


జీఎం సేఫ్టీ అవార్డులను అందజేస్తున్న డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్

రైల్వేస్టేషన్(విజయవాడ పశ్చిమ): విధి నిర్వహణలో అప్రమత్తంగా వ్యవహరిస్తూ, ప్రమాదాలను నివారించడంలో విశేష కృషి చేసిన విజయవాడ రైల్వే డివిజన్‌కు చెందిన ముగ్గురు ఉద్యోగులకు జీఎం మ్యాన్ ఆఫ్ ద మంత్ సేఫ్టీ అవార్డులు దక్కాయి. సోమవారం జోనల్ హెడ్ క్వార్టర్స్ సికింద్రాబాద్‌లోని రైలు నిలయంలో జీఎం అరుణ్‌కుమార్ జైన్ విజయవాడ, గుంటూరు, గుంతకల్లు, సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్ డివిజన్ల డీఆర్ఎంలతో వర్చువల్ సమావేశంలో సేఫ్టీ అవార్డులను ప్రకటించారు. వీటికి విజయవాడ డివిజన్‌లో సీనియర్ గూడ్స్ ట్రైన్ మేనేజర్ జె.భీమయ్య, ట్రాలి మెన్ పి.శాంతికుమార్, ట్రాక్ మెయింటెయినర్ ఆర్.క్రాంతికుమార్‌ను ఎంపిక చేసినట్లు డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ తెలిపారు. అనంతరం ఉద్యోగులకు అవార్డులను అందజేశారు.

మహిళపై ఎలుగుబంట్లు దాడి

మడకశిర రూరల్: ఎలుగుబంట్ల దాడిలో ఓ మహిళ తీవ్రంగా గాయపడిన ఘటన శ్రీసత్యసాయి జిల్లాలో జరిగింది. మడకశిర మండలం గోవిందాపురం గ్రామానికి చెందిన లక్ష్మీనరసమ్మ సోమవారం మేకలను మేపు కోసం గ్రామ శివారులోని బిదిరికెర చెరువు వద్దకు తోలుకెళ్లింది. ఆ సమయంలో పొదల్లో దాగున్న మూడు ఎలుగుబంట్లు ఒక్కసారిగా దాడి చేశాయి. ఈ దాడిలో లక్ష్మీనరసమ్మ తీవ్రంగా గాయపడింది. స్థానిక రైతులు లక్ష్మీనరసమ్మను కాపాడి 108 అంబులెన్స్‌లో మడకశిరలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హిందూపురంలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు.

తెలంగాణ, ఏపీల్లో ఒక్కో ఎంపీ సీటుకు పోటీ

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ, ఏపీ రాష్ట్రాల్లో ఒక్కో స్థానంలో సీపీఐ పోటీ చేస్తుందని పార్టీ జాతీయ కార్యదర్శి నారాయణ వెల్లడించారు. సోమవారం మాట్లాడుతూ.. కాంగ్రెస్‌తో ఎన్నికల అవగాహన కుదిరితే సరేనని, లేదంటే కలిసొచ్చే శక్తులతో కలసి పోటీ చేస్తామన్నారు. పార్లమెంట్ దాడి నేపథ్యంలో హోం మంత్రిపై ఉపా చట్టం కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

8 వేల టన్నుల కందిపప్పు సిద్ధం



పండుగ సీజన్ దృష్ట్యా పౌరసరఫరాలశాఖ ప్రత్యేక చర్యలు

గిరిజన ప్రాంతాల్లోని జీసీసీ స్టోర్లలోను సబ్సిడీపై కందిపప్పు విక్రయాలకు ప్రోత్సాహం

సాక్షి, అమరావతి: ప్రజాపంపిణీ వ్యవస్థ (పీడీఎస్) ద్వారా రైస్ కార్డుదారులందరికీ సబ్సిడీపై కందిపప్పు సరఫరా చేసేందుకు పౌరసరఫరాల శాఖ చర్యలు చేపడుతోంది. పండుగ సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని జనవరిలో ఎనిమిదివేల టన్నుల కందిపప్పు నిల్వలను సిద్ధం చేస్తోంది. ఈ నెల 23వ తేదీలోగా మండలస్థాయి నిల్వ కేంద్రాలకు (ఎంఎల్ఎస్ పాయింట్లకు) సరుకు తరలించనుంది. ప్రస్తుత నెలలో 46.64 లక్షల మందికి సుమారు 4,604 టన్నుల కందిపప్పును కిలో రూ.67కే అందించింది. గిరిజన ప్రాంతాల్లోని జీసీసీల ద్వారా కూడా సబ్సిడీపై కందిపప్పు విక్రయాలు సాగించేలా ప్రోత్సహించనుంది. ఏడాదిగా మార్కెట్‌లో కందిపప్పు ధరలు పెరుగుతూ వచ్చాయి. మహారాష్ట్రలో భారీవర్షాలకు కందిపంట పూర్తిగా దెబ్బతినడంతో ఒక్కసారిగా కందిపప్పునకు డిమాండ్ పెరిగింది. ప్రస్తుతం మార్కెట్‌లోకి కొత్తపంట వస్తుండటంతో రేటు నెమ్మదిగా దిగొస్తోంది. ఒకప్పుడు మార్కెట్‌లో కిలో కందిపప్పు రూ.115 ఉన్నప్పుడు సబ్సిడీపై రూ.67కే అందించిన ప్రభుత్వం.. ఆ తర్వాత రేటు రూ.160–170కి పెరిగినా సబ్సిడీని తగ్గించలేదు. మధ్యలో మూడు, నాలుగునెలలు మార్కెట్‌లో లోటు ఉండటంతో పీడీఎస్‌లో కందిపప్పు సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఇకపై నిరంతరాయంగా పంపిణీ చేసేలా పౌరసరఫరాలశాఖ ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తోంది.

గోధుమపిండికి డిమాండ్

పీడీఎస్ లబ్ధిదారులకు వీలైనన్ని ఎక్కువ పౌష్టికాహార పదార్థాల పంపిణీపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందులో భాగంగానే పైలెట్ ప్రాజెక్టు కింద పట్టణ ప్రాంతాల్లో ఫోర్టిఫైడ్ (విటమిన్లతో కూడిన) గోధుమపిండిని పరిచయం చేసింది. ప్రజల నుంచి స్పందన బాగుండటంతో నెమ్మదిగా గ్రామీణ ప్రాంతాలకు విస్తరిస్తోంది. ప్రస్తుతం నెలకు మూడువేల టన్నుల గోధుమపిండి సరఫరా చేస్తోంది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం భారత్ ఆటా పేరుతో కిలో రూ.27.50కు ఇస్తుంటే.. ఏపీలో మాత్రం కిలో రూ.16కే అందిస్తుండటం గమనార్హం. లబ్ధిదారులకు దీన్ని మరింత తక్కువ రేటుకు ఇచ్చేలా పౌరసరఫరాలశాఖ కేంద్ర ప్రభుత్వానికి ఓ ప్రతిపాదన పంపనుంది. రైస్ కార్డుదారుల ఇష్టం మేరకు కిలో బియ్యానికి బదులు కిలో గోధుమపిండి ఇవ్వనుంది. ఇక్కడ కేంద్ర ప్రభుత్వం బియ్యం పరిమాణాన్ని తగ్గించుకుని దానికి బదులు గోధుమలను సరఫరా చేస్తుంది. వాటిని ప్రాసెసింగ్ చేసి ఫోర్టిఫైడ్ అనంతరం ప్యాకింగ్, రవాణాకు అయ్యే ఖర్చులను లెక్కించి పౌరసరఫరాలశాఖ ధర నిర్ణయించనుంది. ఈ విధంగా కిలో రూ.11–12కే గోధుమపిండి ఇవ్వొచ్చని భావిస్తోంది. ప్రస్తుతం ఎన్ఎఫ్ఎస్ఏ కార్డులకు మాత్రమే నెలకు 1,800 టన్నుల గోధుమలను కేంద్రం అందిస్తోంది. మిగిలిన కార్డుదారులకు రాష్ట్ర ప్రభుత్వమే సొంతంగా పంపిణీ చేస్తోంది. ఫిబ్రవరి నుంచి మొత్తం కార్డుదారులకు గోధుమపిండిని అందుబాటులో ఉంచేలా కసరత్తు చేస్తోంది. వీటితోపాటు పంచదార, రాయలసీమలో చిరుధాన్యాల పంపిణీకి అవసరమైన నిల్వలను తరలిస్తోంది.



నెలాఖరులోగా కందుల సేకరణ

పౌరసరఫరాలసంస్థ ద్వారా స్థానిక రైతుల నుంచి మద్దతు ధరకు కందులు సేకరించడంతోపాటు వాటిని ప్రాసెసింగ్, ప్యాకింగ్ చేసి తిరిగి పీడీఎస్‌లోకి ప్రవేశపెట్టేలా పౌరసరఫరాలశాఖ ప్రణాళికలు రూపొందించింది. ఈ నెలాఖరులోగా ప్రకాశం, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో కందుల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనుంది. అవసరమైతే మార్కెట్ రేటును చెల్లించైనా రైతుల నుంచి 35 వేల టన్నులకుపైగా కందులను సేకరించాలని నిర్ణయించింది. ధాన్యం మాదిరిగానే రవాణా, కూలీ, గోతాల ఖర్చులను సైతం రైతులకు ఇవ్వనుంది. కందులు సేకరించిన వారంలోగా రైతుల ఖాతాల్లో మద్దతు ధరను జమచేయనుంది.

మూడు జిల్లాల్లో కందుల ఉత్పత్తి, సేకరించాలనుకుంటున్న పరిమాణం వివరాలు

జిల్లా	కందుల ఉత్పత్తి	సేకరించాలనుకుంటున్న పరిమాణం (టన్నుల్లో)
ప్రకాశం	55,993	33,595
బాపట్ల	2,334	500
పల్నాడు	32,581	5,000

నాణ్యతలో రాజీలేకుండా



ఇప్పటివరకు పీడీఎస్‌లో పంపిణీ చేస్తున్న కందిపప్పు బయట ప్రాంతం నుంచి దిగుమతి చేసుకున్నదే. తొలిసారిగా ఏపీలో పండిన పంటను రైతుల నుంచి మద్దతు ధరకు కొనుగోలు చేసి మర ఆడించి ప్రత్యేక ప్యాకింగ్‌లో రైస్ కార్డుదారులకు ఇవ్వాలని నిర్ణయించాం. తద్వారా అక్కడక్కడ కందిపప్పు నాణ్యతపై వస్తున్న విమర్శలను అధిగమించవచ్చు. ఏపీ అవసరాలకు తగినంత నిల్వలను ఇక్కడే సేకరిస్తాం. పండుగ సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని ఇకపై జాప్యం లేని పంపిణీకి చర్యలు చేపడుతున్నాం. ఆర్బీకేలోని క్షేత్రస్థాయి సిబ్బంది, జాయింట్ కలెక్టర్లు, పౌరసరఫరాలసంస్థ సిబ్బంది సమన్వయంతో రైతులకు అవగాహన కల్పించి కందులు కొనుగోలు చేస్తాం – హెచ్.అరుణ్‌కుమార్, కమిషనర్, పౌరసరఫరాలశాఖ

రాష్ట్ర తలసరి ఆదాయం రూ.2.19 లక్షలు

- ఏటా భారీ పెరుగుదల
- 2020–21లో రూ.1,63,746
- 2021–22లో రూ.1,92,587
- 2022–23లో 2,19,518
- కేంద్ర గణాంకాల మంత్రిత్వ శాఖ వెల్లడి

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయి. ఏటా తలసరి ఆదాయంలో భారీ వృద్ధి నమోదవుతుండటమే ఇందుకు నిదర్శనం. 2020–21లో రూ.1,63,746గా రాష్ట్ర తలసరి ఆదాయం 2022–23లో ఏకంగా రూ.2,19,518కి పెరిగింది. ఈ మేరకు కేంద్ర గణాంకాల మంత్రిత్వ శాఖ తాజాగా వివరాలు వెల్లడించింది. తలసరి నికర రాష్ట్ర దేశీయ ఉత్పత్తి (ఎన్ఎస్‌డీపీ) తాజా సమాచారం ప్రకారం.. 2011–12 జనాభా లెక్కలు, ప్రస్తుత ధరల మేరకు ఆంధ్రప్రదేశ్‌లో 2022–23 తలసరి ఆదాయం రూ.2,19,518గా ఉంది. 33 రాష్ట్రాలు/ కేంద్రపాలితప్రాంతాల తలసరి ఆదాయాల పరంగా ఆంధ్రప్రదేశ్ తొమ్మిదో స్థానంలో నిలిచింది. 2011–12 జనాభా లెక్కలు, తాజా ధరల ప్రకారం.. 2020–21లో తలసరి ఆదాయం రూ.1,63,746 ఉండగా, 2021–22లో రూ.1,92,587, 2022–23లో 2,19,518కి పెరిగింది. అలాగే 2011–12 స్థిరీకరించిన ధరల ప్రకారం .. ఏపీలో తలసరి ఆదాయం 2020–21లో రూ.1,05,880, 2021–22లో రూ.1,17,464, 2022–23లో రూ.1,23,526 ఉందని కేంద్ర గణాంకాల మంత్రిత్వ శాఖ తెలిపింది.

మద్యం కుంభకోణం కేసులో అరుణ్ పిళ్లైకు మధ్యంతర బెయిలు

సాక్షి, న్యూఢిల్లీ : ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో హైదరాబాద్‌కు చెందిన వ్యాపారవేత్త అరుణ్‌రామచంద్ర పిళ్లైకు సీబీఐ ప్రత్యేక కోర్టు బెయిలు మంజూరు చేసింది. పిళ్లై బెయిలు పిటిషన్‌ను సోమవారం ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం కె.నాగ్‌పాల్ విచారించారు. పిళ్లై తరపు న్యాయవాది నితీశ్‌రాణా వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్ భార్య అనారోగ్యానికి గురైందని, ఆమెకు శస్త్రచికిత్స కొనసాగుతోందన్నారు. వాదనల అనంతరం పిళ్లై భార్య అనారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఆయనకు 2 వారాల మధ్యంతర బెయిలు మంజూరు చేస్తున్నామని న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు.

రాజ్యసభ | ఏపీ ఇన్ పార్లమెంట్

విశాఖ ఉక్కుకు భూములు బదలాయించే ప్రతిపాదన లేదు

వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి ప్రశ్నకు కేంద్రం సమాధానం



సాక్షి, న్యూఢిల్లీ: విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయడానికి సేకరించిన భూములను ఆ కర్మాగారానికి బదిలీ చేసే ప్రతిపాదన ఏదీ లేదని ఉక్కు శాఖ మంత్రి ఫగ్గన్‌సింగ్ కులస్తే స్పష్టం చేశారు. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ (ఆర్ఐఎన్ఎల్) ఏర్పాటు కోసం కేంద్ర ప్రభుత్వం తరఫున రాష్ట్ర ప్రభుత్వం భూములను సేకరించి అప్పగించిందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి ప్రశ్నకు సోమవారం రాజ్యసభలో ఈ మేరకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు. స్టీల్ ప్రాజెక్ట్ కోసం ఆ భూములను వినియోగించుకోవడానికి వీలుగా ఉక్కు మంత్రిత్వ శాఖ ఆర్ఐఎన్ఎల్‌కు పవర్ ఆఫ్ అటార్నీ జారీ చేసిందని, అందువల్ల ఆ భూములపై యాజమాన్య హక్కులను ఆర్ఐఎన్ఎల్‌కు బదిలీ చేసే ప్రతిపాదన ఏదీ ప్రభుత్వం వద్ద లేదని మంత్రి స్పష్టం చేశారు.

బయో ఫ్యూయల్స్ కూటమిలో 22 దేశాలు

బయో ఫ్యూయల్స్ (జీవ ఇంధనాలు) వినియోగం, అభివృద్ధిని వేగవంతం చేసే ప్రక్రియలో ప్రపంచ దేశాల సహకారాన్ని బలోపేతం చేసే దిశగా భారత్ చొరవతో ప్రారంభమైన గ్లోబల్ బయో ఫ్యూయల్స్ కూటమిలో చేరిన దేశాల సంఖ్య 22కు పెరిగిందని పెట్రోలియం సహజ వనరుల శాఖ సహాయ మంత్రి రామేశ్వర్ తేలి తెలిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిస్తూ.. మరో 12 అంతర్జాతీయ సంస్థలు ఈ కూటమిలో సభ్యత్వం పొందినట్టు వెల్లడించారు.

బీసీ మహిళలకూ రిజర్వేషన్ కల్పించాలి

జమ్మూ కశ్మీర్ శాసనసభలో బీసీ మహిళలకు కూడా రిజర్వేషన్లు కల్పించాలని కేంద్రానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత విజయసాయిరెడ్డి విజ్ఞప్తి చేశారు. సోమవారం రాజ్యసభలో జమ్మూ కశ్మీర్ శాసనసభలో మహిళలకు రిజర్వేషన్ కల్పించే బిల్లుపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ మహిళలతోపాటు వెనుకబడిన తరగతులకు చెందిన మహిళలకు సైతం అసెంబ్లీలో రిజర్వేషన్ కల్పించాలని పేర్కొన్నారు. నామినేటెడ్ పదవుల్లోనూ బీసీ మహిళలకు స్థానం కల్పించాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ తరఫున ఎంపీ విజయసాయిరెడ్డి బిల్లుకు మద్దతు తెలిపారు.

మార్చి 2024 కల్లా 1,49,119 కనెక్షన్లు

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో మార్చి 2024 కల్లా 1,49,119 డొమెస్టిక్ పైప్డ్ నేచురల్ గ్యాస్ (పీఎన్జీ) కనెక్షన్లు లక్ష్యంగా పెట్టుకున్నట్టు కేంద్ర పెట్రోలియం సహజ వనరుల శాఖ సహాయ మంత్రి రామేశ్వర్‌తేలి తెలిపారు. జిల్లాలో 17 సీఎన్జీ స్టేషన్లు ఏర్పాటు చేయగా అక్టోబర్ 2023 నాటికి 1,696 పీఎన్జీ కనెక్షన్లు అందించినట్టు వైఎస్సార్‌సీపీ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు.



ఏపీలో 7,34,034 ఇళ్లను లబ్ధిదారులకు అందించాం

ప్రధానమంత్రి ఆవాస్ యోజన–అర్బన్ (పీఎంఏవై–యు) కింద ఏపీకి మొత్తం రూ.21,839.49 కోట్లు విడుదల చేశామని కేంద్ర గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి కౌశల్ కిశోర్ తెలిపారు. కాగా.. రాష్ట్ర ప్రభుత్వం రూ.19,767.25 కోట్లకు యుటిలైజేషన్ సర్టిఫికెట్లు సమర్పించిందని బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి బదులిచ్చారు. 2015 జూన్ 25న పీఎంఏవై–యు ప్రారంభమైనప్పటి నుంచి ఈ నెల 4వ తేదీ వరకు ఈ పథకంలో భాగంగా ఏపీకి 21,32,432 ఇళ్లు మంజూరు చేశామన్నారు. ఇందులో 20,07,436 ఇళ్ల పనులు జరుగుతుండగా.. 8,68,342 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. 7,34,034 ఇళ్లను లబ్ధిదారులకు అందించినట్టు వివరించారు.

ఉపరాష్ట్రపతితో భేటీ


ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్‌ను పార్లమెంట్‌లోని ఆయన చాంబర్‌లో కలిసిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత వి.విజయసాయిరెడ్డి

పవన్ ముమ్మాటికీ ప్యాకేజీ స్టారే..

ఏపీటీపీసీ చైర్మన్ కనుమూరి రవిచంద్రారెడ్డి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో నివాసం ఉండని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ తెలంగాణలోని హైదరాబాద్‌లో ప్యాకేజీ పొత్తుపై చర్చించడం కోసం ఒకరి ఇంటికి మరొకరు వెళ్తే.. అది లోక కళ్యాణం కోసమన్నట్లుగా ఎల్లో మీడియా హడావుడి చేయడం సిగ్గుచేటని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఆంధ్రప్రదేశ్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ (ఏపీటీపీసీ) చైర్మన్ కనుమూరి రవిచంద్రారెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తాము ప్యాకేజీ స్టార్ అన్నప్పుడల్లా పవన్‌కళ్యాణ్ ఉలికిపడుతూ ఎగిరెగిరిపడుతుంటారని చెప్పారు. చంద్రబాబు ఇస్తున్న ప్యాకేజీతోనే జనసేన పార్టీ నడుస్తోందనే విషయం అందరికీ తెలిసిందేనన్నారు. పవన్ ముమ్మాటికీ ప్యాకేజీ స్టారే అన్నారు. ఇటీవల ప్యాకేజీ సరిపోకపోవడం, లోకేశ్ పెత్తనం గిట్టకపోవడంతో అలిగిన పవన్‌తో చర్చించడానికే ఆయన ఇంటికి చంద్రబాబు వెళ్లారని పేర్కొన్నారు. పుత్రుడు, దత్తపుత్రుడు మధ్య సంధి కుదిర్చి, ప్యాకేజీపై ఒప్పించి... ఒళ్లు తగ్గించుకోవడానికి లోకేశ్ చేస్తున్న పాదయాత్ర ముగింపు సభకు పవన్‌ను రప్పించడంపైనే చంద్రబాబు చర్చించారని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో 50 ఎమ్మెల్యే సీట్లు అడగాలని పవన్‌కు జనసేన నాయకులు సూచిస్తుంటే.. చంద్రబాబు, లోకేశ్ మాత్రం 25 కూడా ఇచ్చేందుకు సుముఖంగా లేకపోవడంతో జాయింట్ ప్రెస్‌మీట్‌కు పవన్ ముఖం చాటేశారని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ తుఫాన్‌ను ఒంటరిగా ఎదుర్కోలేమనే భయంతోనే టీడీపీ, జనసేన పొత్తుల కోసం వెంపర్లాడుతున్నారని మండిపడ్డారు. అమరావతి రైతుల పేరుతో చేస్తున్న ఉద్యమాన్ని రియల్ ఎస్టేట్ వ్యాపారుల ముసుగులో ఉన్న పెట్టుబడిదారులే నడిపిస్తున్నారని విమర్శించారు.

చంద్రబాబు అవినీతే అభివృద్ధికి విఘాతం

1,177వ రోజు రిలే దీక్షల్లో బహుజన నేతలు

తాడికొండ: అధికారంలో ఉండగా అమరావతి పేరుతో చంద్రబాబు ఆయన వర్గీయులు చేసిన అవినీతి వల్లే రాజధానిలో అభివృద్ధి కుంటుపడి మరో 20 ఏళ్లు వెనక్కు వెళ్లిందని బహుజన పరిరక్షణ సమితి నాయకులు ధ్వజమెత్తారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,177వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షల్లో సోమవారం పలువురు మాట్లాడారు. రాజధాని ప్రకటించి 4 ఏళ్లు నిండాయంటూ ఆర్భాటపు సభలు పెడుతున్న కులవాదులు ఆర్థిక ఉగ్రవాదులు, అరాచక శక్తులుగా మారి ఇష్టారీతిగా ప్రవర్తిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పులి దాసు, ఈపూరి ఆదాం, బొలిమేర శ్యామ్యూల్, మాదిగాని గురునాథం, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

లోక్‌సభ

రైళ్లలో వృద్ధులకు రాయితీ పునరుద్ధరించండి

కేంద్రాన్ని కోరిన వైఎస్సార్‌సీపీ ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు



సాక్షి, న్యూఢిల్లీ: రైలు ప్రయాణ చార్జీల్లో వృద్ధులు, కళాకారులకు రాయితీలను పునరుద్ధరించాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు సోమవారం లోక్‌సభలో కేంద్రాన్ని కోరారు. 26 జనవరి వేడుకలు, ఇతర ముఖ్యమైన సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రదర్శనలు ఉన్న నేపథ్యంలో ఈ రాయితీలను పునరుద్ధరించడం చాలా కీలకం అని ఆయన పేర్కొన్నారు.

ఎస్సీ, ఎస్టీ వర్గాలకు సాధికారత కల్పించండి



ఎస్సీ, ఎస్టీలు 40 శాతం లేదా అంతకన్నా ఎక్కువ ఉన్న గ్రామాలను ప్రత్యేక పంచాయతీలుగా ఏర్పాటు చేసి ఎస్సీ, ఎస్టీ వర్గాలకు సాధికారత కల్పించాలని వైఎస్సార్‌సీపీ ఎంపీ గురుమూర్తి కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎంపీ గురుమూర్తి కోరారు.

విశాఖలో పెరుగుతున్న పర్యాటకులు



కరోనా పరిస్థితుల అనంతరం విశాఖపట్నంలో పర్యాటకుల సంఖ్య క్రమేపీ పెరుగుతోందని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ బీవీ సత్యవతి ప్రశ్నకు సోమవారం లోక్‌సభలో లిఖితపూర్వక సమాధానమిస్తూ.. 2020లో కోటి మంది స్వదేశీయులు, 30వేల మంది విదేశీయులు విశాఖను సందర్శించగా.. 2021లో 1.49 కోట్ల మంది స్వదేశీయులు, 19వేల మంది విదేశీయులు సందర్శించారన్నారు. కాగా.. 2022లో 1.62 కోట్ల మంది స్వదేశీయులు, 46 వేల మంది విదేశీయులు పర్యటించారని చెప్పారు. స్వదేశీ దర్శన్ 2.0 పథకంలో గండికోట, అరకు–లంబసింగిలను అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్టు చెప్పారు.

కౌన్సిల్ సిఫార్సుల మేరకే జీఎస్టీ రేట్లలో మార్పులు

జీఎస్టీ కౌన్సిల్ సిఫార్సుల ఆధారంగా జీఎస్టీ రేట్లలో మార్పులను ప్రభుత్వం అవసరమైన చోట కొనసాగించాల్సి ఉంటుందని.. ఈ విషయంలో మద్రాస్ హైకోర్టు తీర్పు ప్రభుత్వ అధికారాన్ని ప్రభావితం చేయదని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ బాలశౌరి అడిగిన ప్రశ్నకు లోక్‌సభలో కేంద్రమంత్రి లిఖితపూర్వక సమాధానమిస్తూ.. జీఎస్టీ రేటులో మార్పునకు సంబంధించి జీఎస్టీ కౌన్సిల్ చేసే అన్ని సిఫార్సులు నోటిఫికేషన్ ద్వారా అమలవుతాయన్నారు.



పోస్టాఫీసు బిల్లుకు వైఎస్సార్‌సీపీ మద్దతు

లోక్‌సభలో పోస్టాఫీసు బిల్లుకు వైఎస్సార్‌సీపీ మద్దతు తెలిపింది. సోమవారం సభలో జరిగిన చర్చలో వైఎస్సార్‌సీపీ ఎంపీ బీవీ సత్యవతి మాట్లాడుతూ.. కొరియర్/పార్సిల్ పరిశ్రమలో పోస్టాఫీసు 15 శాతం కంటే తక్కువ మార్కెట్ వాటా కలిగి ఉందని తెలిపారు. ఇండియా పోస్టుకు స్వయంప్రతిపత్తి కీలకమైనప్పటికీ కఠినమైన నియంత్రణలు లేకుండా పెద్దసంఖ్యలో పనిచేసే కొరియర్ సేవలపై ప్రభావం పెద్దగా ఉండకపోవచ్చని ఎంపీ సత్యవతి అభిప్రాయపడ్డారు. తగిన మౌలిక సదుపాయాలు లేకపోవడం వల్ల ఉద్యోగులు సవాళ్లు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

కేజ్రీవాల్‌కు మళ్లీ ఈడీ సమన్లు

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీ ల్యాండరింగ్ కేసులో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) మరోసారి నోటీసులు జారీ చేసింది. ఈ నెల 21వ తేదీన తమ ముందు విచారణకు హాజరు కావాలని కోరింది. నవంబర్ 2వ తేదీన మొదటిసారిగా ఈడీ అధికారులు కేజ్రీవాల్‌కు నోటీసు పంపారు. కానీ, అది ఉద్దేశపూర్వకం, అస్పష్టం, అన్యాయమని ఆరోపిస్తూ కేజ్రీవాల్ ఆ విచారణకు గైర్హాజరయ్యారు. ఇలా ఉండగా, ఈ నెల 19వ తేదీ నుంచి 10 రోజులపాటు సాగే విపాసన మెడిటేషన్ కోర్సులో పాల్గొనేందుకు సీఎం కేజ్రీవాల్ గుర్తు తెలియని ప్రాంతానికి వెళతారని ఢిల్లీ ప్రభుత్వ అధికారి ఒకరు శనివారం ప్రకటించడం గమనార్హం.

లద్దాఖ్‌లో మూడు భూకంపాలు

జమ్మూ: కేంద్రపాలిత ప్రాంతం లద్దాఖ్‌లో సోమవారం పావుగంట వ్యవధిలో మూడుసార్లు భూకంపం సంభవించగా జమ్మూకశ్మీర్‌లో కిష్త్వార్‌లో స్వల్ప తీవ్రతతో భూమి కంపించింది. నష్టం, మరణాలకు సంబంధించి ఎటువంటి సమాచారం లేదని అధికారులు తెలిపారు. కార్గిల్ కేంద్రంగా సాయంత్రం 3.48 గంటల సమయంలో భూమికి 10 కిలోమీటర్ల లోతులో సంభవించిన భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 5.5గా నమోదైందన్నారు. అనంతరం 4.01 గంటల సమయంలో సంభవించిన రెండు భూకంపాల తీవ్రత రిక్టర్ స్కేలుపై వరుసగా 4.8, 3.8గా నమోదైంది. జమ్మూకశ్మీర్‌లోని కిష్త్వార్ కేంద్రంగా భూమికి 10 కిలోమీటర్ల లోతులో సాయంత్రం 4.18 గంటలకు సంభవించిన భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 3.6గా నమోదైనట్లు అధికారులు తెలిపారు.

మెక్సికోలో క్రిస్మస్ వేడుకల్లో కాల్పులు...

12 మంది దుర్మరణం

మెక్సికో సిటీ: మెక్సికోలో క్రిస్మస్ సీజన్ వేడుకలు రక్తసిక్తంగా మారాయి.గ్వానజువాటో రాష్ట్రంలో జరిగిన కాల్పుల ఘటనలో 12 మంది ప్రాణాలు కోల్పోయారు. సల్వాటియెర్రా పట్టణంలో శనివారం రాత్రి నుంచి మొదలైన క్రిస్మస్ 'పాసడా'వేడుకలు ఆదివారం వేకువజాము వరకు కొనసాగాయి. అనంతరం ప్రజలు వేడుక ప్రాంతం నుంచి బయటకు వస్తుండగా గుర్తు తెలియని దుండగులు యథేచ్ఛగా వారిపైకి కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో 12 మంది చనిపోయారు. డ్రగ్స్ ముఠాల మధ్య విభేదాలే ఈ విషాదానికి కారణమని పోలీసులు చెబుతున్నారు.

బెంగాల్‌లో టీఎంసీ, కాంగ్రెస్ లెఫ్ట్ పొత్తు సాధ్యమే: మమత

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ ప్రతిపక్ష ఇండియా కూటమి నేత, పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో తమ తృణమూల్ కాంగ్రెస్ పార్టీ(టీఎంసీ), కాంగ్రెస్, వామపక్షాల మధ్య త్రిముఖ పొత్తు కుదిరే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని పేర్కొన్నారు. విభేదాలను పరిష్కరించుకోవడంలో కూటమి పార్టీలు కాలహరణం చేశాయన్న ఆమె..ఇప్పటికీ మించిపోయింది లేదన్నారు. బెంగాల్‌లో టీఎంసీ, కాంగ్రెస్, వామపక్ష పార్టీల మధ్య సీట్ల పంపకంపై ఏకాభిప్రాయం సాధ్యమయ్యే అవకాశాలున్నాయని చెప్పారు. హిందీ బెల్టుతోపాటు ఇతర ప్రాంతాల్లో బీజేపీ బలం పుంజుకుంటోందన్న వ్యాఖ్యలపై... 'బీజేపీ బలంగా లేదు. మేం బలహీనంగా ఉన్నాం. దీనిని అధిగమించేందుకు కలిసికట్టుగా పని చేయాలి' అని అన్నారు.

నేడు అయోధ్యకు శ్రీరామ పాదుకలు

8 కిలోల వెండి, కిలో బంగారంతో చేయించిన హైదరాబాద్ వాసి

సాక్షి, న్యూఢిల్లీ: అయోధ్యలో భవ్య రామాలయం గర్భగుడిలో ప్రాణ ప్రతిష్ఠకు ముహూర్తం దగ్గర పడింది. ఈలోపు శ్రీరామ పాదుకా యాత్రలో భాగంగా దేశ వ్యాప్తంగా రాముడు నడిచిన మార్గాలమీదుగా పూజలందుకుంటూ శ్రీరామ పాదుకలు మంగళవారం అయోధ్యకు చేరుకోనున్నాయి. 9 కిలోల బరువున్న ఈ పాదుకల కోసం 8 కిలోల వెండి వాడారు. కిలో బంగారంతో పాదుకలకు తాపడం చేశారు. హైదరాబాద్‌కు చెందిన అయోధ్య భాగ్యనగర సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు చల్లా శ్రీనివాస శాస్త్రి ఈ పాదుకలను తయారు చేయించారు. జనవరి 22న ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం తర్వాత ఈ పాదుకలను ఆలయంలో ప్రతిష్ఠించనున్నారు.

ఉగ్ర కుట్ర భగ్నం

న్యూఢిల్లీ/బనశంకరి: పేలుళ్లకు పథకరచన చేసిన అనుమానిత ఇస్లామిక్ స్టేట్(ఐసిస్) ఉగ్రవాదులను జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్‌ఐఏ) సోమవారం అరెస్ట్‌చేసింది. దేశ రాజధానిసహా కర్ణాటక, మహారాష్ట్ర, జార్ఖండ్‌లోని 19 ప్రాంతాల్లో ఎన్‌ఐఏ అధికారులు సోమవారం తెల్లవారుజామున ఆకస్మిక దాడులు చేసి ఎనిమిది మంది అనుమానిత ఐసిస్ ఉగ్రవాదులను అరెస్ట్‌చేశారు. కర్ణాటకలోని బళ్లారి, బెంగళూరు, మహారాష్ట్రలోని అమరావతి, ముంబై, పుణె, జార్ఖండ్‌లోని జంషెడ్‌పూర్, బొకారో పట్టణాల్లో ఈ ఆకస్మిక దాడులు జరిగాయి. దాడి ప్రాంతాల్లో అత్యాధునిక పేలుడు పదార్థం(ఐఈడీ) సంబంధ ముడి పదార్థాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. భారీ స్థాయిలో నగదు, ఉగ్రవాద సాహిత్యం, స్మార్ట్‌ఫోన్లు, డిజిటల్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. బళ్లారిలో ఉగ్ర మాడ్యూల్‌కు సారథ్యం వహిస్తున్న మినాజ్ అలియాస్ మొహమ్మద్ సులేమాన్‌ను అరెస్ట్ చేశారు. ఐసిస్ స్ఫూర్తితో ఉగ్రవాదులు బళ్లారి మాడ్యూల్‌ను ఏర్పాటు చేశారని తెల్సుకుని ఎన్‌ఐఏ డిసెంబర్ 14న కేసు నమోదుచేసి వారి జాడ కోసం వెతుకుతోంది.

78 మందిపై వేటు

పార్లమెంటులో సస్పెన్షన్ల పర్వం • ఇప్పటిదాకా 92కు చేరిన సస్పెండైన ప్రతిపక్ష ఎంపీల సంఖ్య

న్యూఢిల్లీ: పార్లమెంట్‌లో సోమవారం అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. ఉభయ సభల్లో ఏకంగా 78 మంది ప్రతిపక్ష సభ్యులపై సస్పెన్షన్ వేటు పడింది. ఒకేరోజు 78 మందిని బహిష్కరించడం భారత పార్లమెంట్ చరిత్రలో ఇదే మొదటిసారి. పార్లమెంట్‌లో ఈ నెల 13వ తేదీనాటి భద్రతా వైఫల్యంపై ప్రభుత్వాన్ని నిలదీస్తూ సభలో తీవ్ర అలజడి సృష్టించిందుకు వీరిని సస్పెండ్ చేస్తున్నట్లు లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ చైర్మన్ ప్రకటించారు. లోక్‌సభ నుంచి 33 మంది, రాజ్యసభ నుంచి 45 మంది విపక్ష ఎంపీలు సస్పెన్షన్‌కు గురయ్యారు. గత వారమే లోక్‌సభలో 13 మంది, రాజ్యసభలో ఒక విపక్ష ఎంపీపై సస్పెన్షన్ వేటు పడిన సంగతి తెలిసిందే. దీంతో ప్రస్తుత పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో సస్పెండైన మొత్తం ప్రతిపక్ష సభ్యుల సంఖ్య 92కు చేరుకుంది. వీరంతా ఒకే కారణంతో వేటుకు గురయ్యారు. భద్రతా వైఫల్యంపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా వివరణ, రాజీనామాకు డిమాండ్ చేస్తూ ఉభయ సభల్లో ఆందోళనకు దిగారు. ఎంపీల నినాదాలు, నిరసనలతో ఉభయ సభలు దద్దరిల్లాయి. సస్పెన్షన్ల పర్వంపై వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కీలకమైన బిల్లులపై పార్లమెంట్‌లో చర్చ జరగకుండా ప్రభుత్వం కుట్ర పన్నిందని, అందులో భాగంగానే సస్పెండ్ చేసిందని మండిపడ్డారు.

లోక్‌సభలో విపక్షాల రగడ

భద్రతా వైఫల్యంపై విపక్ష సభ్యులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ బిగ్గరగా నినాదాలు చేయడంతో లోక్‌సభ సోమవారం పలుమార్లు వాయిదా పడింది. కేంద్ర మంత్రి అమిత్ షా సభకు వచ్చి సమాధానం చెప్పాలని, పదవికి రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. శాంతించాలని, సభా కార్యకలాపాలకు సహకరించాలని స్పీకర్ పలుమార్లు కోరినా ఫలితం లేకుండాపోయింది. దాంతో 33 మంది విపక్ష ఎంపీలను సభ నుంచి సస్పెండ్ చేయాలని కోరుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రెండు వేర్వేరు తీర్మానాలు మూజువాణి ఓటుతో ఆమోదం పొందాయి. అనంతరం సదరు ఎంపీలను సస్పెండ్ చేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు. వీరిలో 10 మంది డీఎంకే, 9 మంది తృణమూల్ కాంగ్రెస్ పార్టీ, 8 మంది కాంగ్రెస్ సభ్యులు ఉన్నారు. స్పీకర్ పోడియంపైకి చేరుకొని నినాదాలు చేసిన ముగ్గురు కాంగ్రెస్ సభ్యుల ప్రవర్తనపై విచారణ జరపాలని సభా హక్కుల కమిటీని స్పీకర్ ఆదేశించారు. ఆ నివేదిక వచ్చేదాకా వారిని సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. మిగతా ఎంపీలను శీతాకాల సమావేశాలు ముగిసేదాకా బహిష్కరిస్తున్నట్లు తెలిపారు.

రాజ్యసభలో అదే దృశ్యం

రాజ్యసభలో కూడా అదే దృశ్యం పునరావృతమైంది. చైర్మన్ ఆదేశాలను ధిక్కరించడంతోపాటు సభా కార్యక్రమాలకు అడ్డు తగులుతూ అనుచితంగా ప్రవర్తించడంతో మొత్తం 45 మంది ప్రతిపక్ష సభ్యులు సస్పెన్షన్‌కు గురయ్యారు. వీరిలో 12 మంది కాంగ్రెస్, ఏడుగురు తృణమూల్, నలుగురు డీఎంకే సభ్యులున్నారు. 45 మందిలో 34 మందిని ప్రస్తుత శీతాకాల సమావేశాల్లో మిగిలిన సెషన్ మొత్తం సస్పెండ్ చేశారు. మిగతా 11 మంది సభలో ప్రవర్తించిన తీరుపై విచారణ జరిపి మూడు నెలల్లోగా నివేదిక ఇవ్వాలని సభా హక్కుల కమిటీని చైర్మన్ ఆదేశించారు. నివేదిక వచ్చేదాకా సభకు దూరంగా ఉండాలని వారిని చైర్మన్ ఆదేశించారు. దాంతో వారు 3 నెలల దాకా సభకు హాజరయ్యే అవకాశం లేనట్లే.



భద్రతా వైఫల్యంపై కేంద్ర హోం మంత్రి వివరణకు డిమాండ్ చేస్తూ సోమవారం లోక్‌సభలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విపక్ష ఎంపీలు

ప్రస్తుత సెషన్ ముగిసేదాకా సస్పెండైన లోక్‌సభ సభ్యులు

అధీర్ రంజన్ చౌదరి, గౌరవ్ గొగొయ్, కె.సురేశ్, అమర్‌సింగ్, రాజమోహన్ ఉన్నిథాన్, తిరుణావుక్కరసర్, కె.మురళీధరన్, ఆంటోనీ (కాంగ్రెస్); కల్యాణ్ బెనర్జీ, అపురూప పొద్దార్, ప్రసూన్ బెనర్జీ, సౌగతా రాయ్, శతాబ్ది రాయ్, ప్రతిమా మండల్, కకోలీ ఘోష్ దస్తీదార్, అసిత్ కుమార్ మాల్, సునీల్ కుమార్ మండల్ (తృణమూల్ కాంగ్రెస్); టీఆర్ బాలు, ఎ.రాజా, దయానిధి మారన్, టి.సుమతి, కె.నవాస్‌కని, కళానిధి వీరస్వామి, సి.ఎన్.అన్నాదురై, ఎస్.ఎస్.పళనిమాణిక్కం, జి.సెల్వన్, ఎస్.రామలింగం (డీఎంకే); ఈటీ మొహమ్మద్ బషీర్ (ఐయూఎంఎల్); ఎన్.కె.ప్రేమచంద్రన్ (ఆర్‌ఎస్పీ); కౌసలేంద్ర కుమార్ జేడీ(యూ)

సభా హక్కుల కమిటీ నివేదిక వచ్చేదాకా సస్పెండైన సభ్యులు:
కె.జయకుమార్, విజయ్ వసంత్, అబ్దుల్ ఖలీక్ (కాంగ్రెస్)

ప్రస్తుత సెషన్ ముగిసేదాకా సస్పెండైన రాజ్యసభ సభ్యులు

ప్రమోద్ తివారీ, జైరాం రమేశ్, కె.సి.వేణుగోపాల్, రణదీప్‌సింగ్ సుర్జేవాలా, అమీ యాజ్ఞిక్, నరేన్‌భాయ్ జె.రాథ్వా, సయీద్ నాసిర్ హుస్సేన్, ఫూలోదేవి నేతమ్, శక్తిసింహ్ గోహిల్, రజని అశోక్‌రావు పాటిల్, రంజీత్ రంజన్, ఇమ్రాన్ ప్రతాప్‌గార్హీ (కాంగ్రెస్); సుఖేందు శేఖర్ రాయ్, మొహమ్మద్ నదీముల్ హక్, అబిర్ రంజన్ బిశ్వాస్, శాంతను సేన్, మౌసమ్ నూర్, ప్రకాశ్ చిక్ బరాయిక్, సమీరుల్ ఇస్లాం (తృణమూల్ కాంగ్రెస్); ఎం.షణ్ముగలింగం, ఎన్.ఆర్.ఇలాంగో, కనిమొళి ఎన్‌వీఎన్ సోము, ఆర్.గిరిరాజన్ (డీఎంకే); మనోజ్ కుమార్ ఝా, ఫయాజ్ అహ్మద్ (ఆర్జేడీ), రామ్‌గోపాల్ యాదవ్, జావెద్ అలీఖాన్ (ఎస్పీ); రామ్‌నాథ్ ఠాకూర్, అనీల్ ప్రసాద్ హెగ్డే (జేడీ-యూ); వి.సదాశివన్ (సీపీఎం); వందనా చవాన్ (ఎన్సీపీ); మహువా మజీ (జేఎంఎం); జోస్ కె.మణి (కేసీ-ఎం); అజిత్ కుమార్ భూయాన్ (స్వతంత్ర)

సభా హక్కుల కమిటీ నివేదిక వచ్చేదాకా సస్పెండైన సభ్యులు:
జెబీ మాథర్ హిషామ్, ఎల్.హనుమంతయ్య, నీరజ్ డాంగీ, రాజమణి పటేల్, కుమార్ కేట్కర్, జి.సి.చంద్రశేఖర్ (కాంగ్రెస్); జాన్ బ్రిట్టాస్, ఎ.ఎ.రహీం (సీపీఎం); బినోయ్ విశ్వం, పి.సందోష్‌కుమార్ (సీపీఐ); మొహమ్మద్ అబ్దుల్లా (డీఎంకే)

> నియంతృత్వాన్ని పరాకాష్టకు తీసుకెళ్లారు. అచ్చం బాహుబలుల మాదిరిగా ప్రవర్తించారు. సభ నడవాలంటే విపక్షాలు ఉండాలనే కనీస నియమాన్నీ మరిచారు. అందర్నీ దారుణంగా సస్పెండ్ చేశారు.
> - అధీర్ రంజన్ చౌదరి, లోక్‌సభలో కాంగ్రెస్ నేత

> లోక్‌సభలో పొగ ఘటనకు కారకుడైన బీజేపీ ఎంపీ ప్రతాప్ సింహాను సస్పెండ్ చేయాలని మేం కోరుతుంటే మమ్మల్నే సస్పెండ్ చేశారు. ఈ దారుణ ధోరణి ప్రజాస్వామ్యానికే వ్యతిరేకం.
> - సౌగతా రాయ్, తృణమూల్ కాంగ్రెస్ నేత

> పార్లమెంట్ చరిత్రలో ఎన్నడూ ఇలాంటిది జరగలేదు. 33 మంది లోక్‌సభ ఎంపీలను సస్పెండ్ చేస్తారా?. సభను ప్రశాంతంగా నడపాలి. అధికార పార్టీ సభ్యుల వైఖరి మీదే అది ఆధారపడి ఉంటుంది. విపక్షాలు వివరణ కోరుతుంటే ప్రభుత్వం ఈ విధంగా స్పందించడం దారుణం.
> - టీఆర్ బాలు, డీఎంకే నేత

కోవిడ్ కేసులు పైపైకి

అప్రమత్తంగా ఉండాలంటూ కేంద్రం సూచన

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా కోవిడ్ కేసులు నెమ్మదిగా పెరుగుతున్నాయి. దీంతో ముందు జాగ్రత్త చర్యగా అప్రమత్తంగా ఉండాలని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు కేంద్ర ప్రభుత్వం సూచనలు జారీచేసింది. కోవిడ్ కేసుల్లో పెరుగుదల, కేరళలో కరోనా కొత్త సబ్‌వేరియంట్ జేఎన్1 (బీఏ 2.86.1.1) వెలుగుచూసిన నేపథ్యంలో కేంద్రం సోమవారం ముందస్తు చర్యలకు దిగింది. ''కోవిడ్ కేసుల్లో ఉధృతి కట్టడికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా చర్యలు తీసుకోవాలి. పెరుగుతున్న కేసులను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రాలన్నీ అప్రమత్తంగా ఉండాలి. భారత వాతావరణాన్ని తట్టుకుని వేరియంట్లు విజృంభించేలోపు ముందస్తు చర్యలతో సమాయత్తం అవుదాం'' అని కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి సుధాన్ష్ పంత్ రాష్ట్రాలకు లేఖ రాశారు. ఆదివారం దేశవ్యాప్తంగా ఐదుగురు కోవిడ్‌తో కన్నుమూశారు. కొత్తగా వందలాది కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి.

24 గంటల్లో 110 మంది దుర్మరణం

జబాలియా(గాజా స్ట్రిప్): హమాస్ మెరుపుదాడి తర్వాత నిరంతరాయంగా కొనసాగిస్తున్న భీకరదాడులను ఇజ్రాయెల్ మరింత పెంచింది. ఉత్తర గాజాలోని జబాలియా పట్టణంలో గత 24 గంటల్లో ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడుల్లో 110 మంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ఎక్కువ మంది చిన్నారులు, మహిళలు ఉన్నారు. డజన్ల మంది గాయాలపాలయ్యారు. ''శిథిలాల కింద ఇంకా చాలా మంది చిక్కుకున్నారు. నా బంధువుల పిల్లలు ముగ్గురు ఈ దాడిలో ప్రాణాలు కోల్పోయారు. 110 మృతదేహాలను దగ్గర్లోని అల్-ఫలూజా శ్మశానవాటికకు తరలించలేని పరిస్థితి. అక్కడ ఆగకుండా బాంబుల వర్షం కురుస్తోంది. దిక్కులేక దగ్గర్లోని నిరుపయోగంగా ఉన్న పాత శ్మశానవాటికలో పూడ్చిపెట్టాం' అని గాజా ప్రాంత ఆరోగ్య విభాగ డైరెక్టర్ జనరల్ మునీర్ చెప్పారు.

వారి 'ఫేస్‌బుక్' వివరాలివ్వండి

న్యూఢిల్లీ: లోక్‌సభలో పొగబెట్టిన ఉదంతంలో అరెస్టయిన నిందితుల 'ఫేస్‌బుక్' ఖాతాల వివరాలు ఇవ్వాలని 'మెటా' సంస్థను ఢిల్లీ పోలీసులు కోరారు. నిందితులు సభ్యులుగా ఉన్న, ప్రస్తుతం మనుగడలో లేని 'భగత్ సింగ్ ఫ్యాన్ క్లబ్' ఫేస్‌బుక్ పేజీ వివరాలను అందించాలని 'మెటా'కు ఢిల్లీ పోలీస్ కౌంటర్ ఇంటెలిజెన్స్ విభాగం లేఖ రాసిందని సంబంధితవర్గాలు వెల్లడించాయి. ఈ ఫేస్‌బుక్ పేజీని నిందితులే క్రియేట్ చేసి ఘటన తర్వాత డిలీట్ చేశారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్‌లకు 'మెటా' మాతృసంస్థ. ఈ నేపథ్యంలో నిందితుల మధ్య జరిగిన వాట్సాప్ ఛాటింగ్‌లనూ తమకు ఇవ్వాలని పోలీసులు 'మెటా'ను కోరారు.

కోర్టుకు చేరిన జ్ఞానవాపి సర్వే నివేదిక

- సీల్డుకవర్‌లో అందజేసిన ఏఎస్‌ఐ అధికారులు
- ఈ నెల 21న విచారణ చేపడతామన్న వారణాసి జిల్లా కోర్టు

వారణాసి: వారణాసిలోని జ్ఞానవాపి మసీదులో చేపట్టిన శాస్త్రీయ సర్వే నివేదికను సోమవారం ఏఎస్‌ఐ(ఆర్కియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా) అధికారులు సీల్డు కవర్‌లో వారణాసి జిల్లా కోర్టుకు సమర్పించారు. దీనిపై ఈ నెల 21న విచారణ చేపడతామని కోర్టు తెలిపింది. వారణాసిలోని ప్రఖ్యాత కాశీ విశ్వేశ్వరుని ఆలయాన్ని ఆనుకుని ఉన్న 17వ శతాబ్దం నాటి మసీదును అప్పట్లో ఉన్న ఆలయంపైనే నిర్మించారంటూ అందిన పలు పిటిషన్లపై కోర్టు సర్వే చేపట్టాలని జూలైలో ఆదేశించిన విషయం తెలిసిందే. సర్వే నివేదిక ప్రతులను ముస్లిం పక్షం వారికి కూడా ఏఎస్‌ఐ అధికారులు అందజేసినట్లు హిందూ పిటిషనర్ల తరపున న్యాయవాది మదన్ మోహన్ యాదవ్ వెల్లడించారు. తదుపరి విచారణ 21న ఉంటుందని కోర్టు పేర్కొందని తెలిపారు. సర్వే నివేదిక వివరాలను బహిర్గతం చేయరాదంటూ ముస్లిం పక్షం కోర్టులో వేసిన పిటిషన్‌ను తాము సవాల్ చేస్తామన్నారు. మసీదు వెలుపలి గోడపై ఉన్న హిందూ దేవతల శిల్పాల వద్ద పూజలు చేసేందుకు అనుమతించాలంటూ కొందరు మహిళలు వేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా జూలై 21న జిల్లా కోర్టు పలు ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుత నిర్మాణాలకు ఎటువంటి నష్టం కలగని రీతిలో అత్యాధునిక సాంకేతికతను ఉపయోగించుకుని శాస్త్రీయంగా సర్వే చేపట్టాలని ఏఎస్‌ఐకి పురమాయించింది. 'మసీదు గోపురాలు, సెల్లార్లు, పశ్చిమ దిక్కు గోడ కింద సర్వే చేయాలి. పిల్లర్ల వయస్సును నిర్ధారించాలి. భవనం రీతిని విశ్లేషించాలి'అని సూచించింది. ఈ ఆదేశాలను సవాల్ చేస్తూ అంజుమన్ ఇంతెజామియా మసీదు కమిటీ అలహాబాద్ హైకోర్టు, సుప్రీంకోర్టులను ఆశ్రయించగా చుక్కెదురైంది. ఏఎస్‌ఐ అధికారులు సకాలంలో సర్వేను పూర్తి చేయలేకపోవడంతో కోర్టు ఆరు పర్యాయాలు గడువును పొడిగించింది.

కృష్ణ జన్మభూమి-షాహీ ఈద్గా కేసు విచారణ వాయిదా

ప్రయాగ్‌రాజ్: మథురలోని కృష్ణ జన్మభూమి ఆలయాన్ని ఆనుకుని ఉన్న షాహీ ఈద్గా మసీదు ఆవరణలో సర్వే చేపట్టాలన్న అలహాబాద్ హైకోర్టు ఆదేశాలను ముస్లిం పక్షం సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. దీనిపై వచ్చే జనవరి 9వ తేదీన విచారణ చేపట్టేందుకు సుప్రీంకోర్టు అంగీకరించిందని ముస్లిం పక్షం అలహాబాద్ హైకోర్టుకు తెలిపింది. దీంతో, సర్వే కమిషన్ విధివిధానాలు, కూర్పుపై సోమవారం జరగాల్సిన విచారణను హైకోర్టు వాయిదా వేసింది. హిందూ ఆలయంపైనే మసీదును నిర్మించినట్లు ఆనవాళ్లు ఉన్నాయంటూ కొందరు వేసిన పిటిషన్‌పై గురువారం విచారణ జరిపిన అలహాబాద్ హైకోర్టు.. మసీదు సర్వేను పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా అధికారిని నియమించేందుకు అంగీకరించింది.

భర్త చేసినా అత్యాచారమే

అహ్మదాబాద్: 'అత్యాచారం ఎవరు చేసినా అత్యాచారమే. భర్త అత్యాచారానికి పాల్పడినా అది నేరమే' అని గుజరాత్ హైకోర్టు పేర్కొంది. మహిళలపై లైంగిక హింస పట్ల నిశ్శబ్దాన్ని ఛేదించాల్సిన అవసరముందని న్యాయమూర్తి జస్టిస్ దివ్యేశ్ జోషి అన్నారు. ఓ మహిళ బెయిల్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఇటీవల ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కోడలి పట్ల క్రూరత్వం, నేరపూరిత ప్రవర్తన కారణంగా పిటిషనర్‌కు బెయిలిచ్చేందుకు నిరాకరించారు. భర్త, కొడుకు కలిసి కోడలిపై అత్యాచారం చేస్తూ వాటిని వీడియోలు తీసి పోర్నోగ్రఫీ సైట్లలో పెట్టి డబ్బు సంపాదిస్తున్నారని తెలిసినా ఆమె మిన్నకుండిపోవడంపై జడ్జి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

బానిస మనస్తత్వం నుంచి విముక్తి

ఎర్రకోట పైనుంచి విముక్తిని ప్రకటించుకుంది | ఘనమైన సాంస్కృతిక వారసత్వం పట్ల భారత్ గర్విస్తోంది

- శరవేగంగా రామ్ సర్క్యూట్ అభివృద్ధి పనులు: మోదీ
- వారణాసిలో స్వర్‌వేద్ మహామందిర్ ప్రారంభం

వారణాసి: బానిస మనస్తత్వం నుంచి భారత్ విముక్తిని ప్రకటించుకుందని, ఘనమైన సాంస్కృతిక వారసత్వాన్ని గర్వకారణంగా భావిస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. బానిసత్వంలో మగ్గుతున్న సమయంలో కుట్రదారులు మన దేశాన్ని బలహీనపర్చేందుకు ప్రయత్నించారని, మన సాంస్కృతిక చిహ్నాలను లక్ష్యంగా చేసుకున్నారని చెప్పారు. ఈ చిహ్నాలను పునర్నిర్మించుకోవడం చాలా ముఖ్యమని అన్నారు. ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో నిర్మించిన ప్రపంచంలోనే అతిపెద్ద ధ్యాన కేంద్రం స్వర్‌వేద్ మహామందిర్‌ను ప్రధాని మోదీ సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత సోమనాథ్ ఆలయ పునర్నిర్మాణాన్ని కొందరు వ్యతిరేకించారని చెప్పారు. ఇలాంటి ఆలోచనా విధానం కొన్ని దశాబ్దాల పాటు కొనసాగిందన్నారు. దీనివల్ల దేశం ఆత్మన్యూనత భావంలోకి జారిపోయిందని, సుసంపన్నమైన సాంస్కృతిక వారసత్వం పట్ల గర్వించడం కూడా మర్చిపోయిందని వ్యాఖ్యానించారు. స్వాతంత్ర్యం వచ్చాక ఏడు దశాబ్దాల తర్వాత కాలచక్రం మరోసారి తిరగబడిందని, బానిస మనస్తత్వం నుంచి విముక్తిని ఎర్రకోటపై నుంచి భారత్ ప్రకటించుకుందని స్పష్టం చేశారు. సోమనాథ్ నుంచి ప్రారంభించిన కార్యాచరణ ఇప్పుడొక ఉద్యమంగా మారిందని తెలిపారు. కాశీ విశ్వనాథ్ కారిడార్, కేదార్‌నాథ్, మహాకాళ్ మహాలోక్ క్షేత్రాల అభివృద్ధే అందుకు నిదర్శనమని వివరించారు. బుద్ధా సర్క్యూట్‌ను గొప్పగా అభివృద్ధి చేశామని, బుద్ధుడు ధ్యానం చేసుకున్న క్షేత్రాలు ప్రపంచ పర్యాటకులను ఆకర్షిస్తున్నాయని ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. రామ్ సర్క్యూట్ అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. మరికొన్ని వారాల్లో అయోధ్యలో భవ్య రామమందిర నిర్మాణం పూర్తవుతుందని వెల్లడించారు.

'వికసిత్'లో పాల్గొనండి...

మౌలిక సదుపాయాల లేమి మన ఆధ్యాత్మిక యాత్రకు పెద్ద అవరోధంగా మారుతోందని, ఆ పరిస్థితిని మార్చేస్తున్నామని మోదీ వివరించారు. వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రపై ప్రజల్లో అవగాహన పెంచడానికి ఆధ్యాత్మిక గురువులు, మత పెద్దలు చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఏడంతస్తుల స్వర్‌వేద్ మహామందిర్ కేంద్రంలో ఏకకాలంలో 20,000 మంది ధ్యానం చేసుకోవచ్చు. స్వరవేద శ్లోకాలను ఇక్కడి గోడలపై అందంగా చెక్కారు.




స్వర్‌వేద్ మహామందిర్ లోపలి భాగాన్ని పరిశీలిస్తున్న మోదీ, యోగి

నాలుగు కులాల సాధికారతే లక్ష్యం

యువత, పేదలు, రైతులు, మహిళలనే నాలుగు కులాలు సంపూర్ణ సాధికారత సాధించాలన్నదే తన లక్ష్యమని మోదీ అన్నారు. సోమవారం వారణాసిలో ఆయన వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో పాల్గొన్నారు. అనంతరం రూ.19,000 కోట్లకుపైగా విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. మరికొన్నింటికి శంకుస్థాపన చేశారు.

దేశ ప్రజలకు మోదీ 9 వినతులు

1. ప్రతి నీటి బొట్టును ఆదా చేయండి. జల సంరక్షణ విషయంలో ప్రజలను చైతన్యవంతులుగా మార్చండి
2. గ్రామాలకు వెళ్లండి. డిజిటల్ లావాదేవీలపై ప్రజల్లో అవగాహన పెంచండి.
3. పరిశుభ్రతలో మీ ప్రాంతాన్ని నంబర్ వన్‌గా మార్చడానికి కృషి చేయండి.
4. స్థానికంగా తయారైన ఉత్పత్తులను ప్రోత్సహించండి.
5. ఎంత ఎక్కువ వీలైతే అంతగా సొంత ఊరును సందర్శించండి. దేశమంతటా తిరగండి. మన దేశంలోనే పెళ్లిళ్లు చేసుకోండి.
6. ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేసేలా రైతులను ప్రోత్సహించండి.
7. నిత్యం తీసుకొనే ఆహారంలో తృణధాన్యాలను ఒక భాగంగా మార్చుకోండి.
8. జీవితంలో ఆరోగ్య సంరక్షణకు అధిక ప్రాధాన్యం ఇవ్వండి.
9. కనీసం ఒక పేద కుటుంబానికి అండగా నిలవండి.



మోస్ట్ వాంటెడ్ అండర్ వరల్డ్ డాన్, 1993 ముంబై పేలుళ్ల సూత్రధారి దావూద్ ఇబ్రహీం ఆరోగ్యం విషమంగా ఉన్నట్టు తెలుస్తోంది. దాంతో అతన్ని రెండు రోజుల క్రితం పాకిస్తాన్‌లోని కరాచీలో హుటాహుటిన ఆస్పత్రికి తరలించినట్టు సమాచారం. ఒక ఫ్లోర్ మొత్తాన్నీ ఖాళీ చేయించి అత్యంత కట్టుదిట్టమైన భద్రత నడుమ చికిత్స అందిస్తున్నట్టు

ఆస్పత్రిలో దావూద్!

కరాచీలో మూడు రోజులుగా చికిత్స • విషప్రయోగం, మృతి అవాస్తవాలే: నిఘా వర్గాలు

చెబుతున్నారు. ఆస్పత్రి వర్గాలు, కుటుంబీకులకు తప్ప మరెవరికీ ప్రవేశం లేకుండా పోలీసులు భారీ సంఖ్యలో పహారా కాస్తున్నారట. విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ పలు మీడియా సంస్థలు ఈ మేరకు వార్తా కథనాలు ప్రసారం చేశాయి. అంతేగాక 67 ఏళ్ల దావూద్‌కు విషప్రయోగం జరిగిందని, అందుకే ఉన్నపళాన ఆస్పత్రికి తరలించారని సోమవారమంతా జోరుగా పుకార్లు షికారు చేశాయి. చికిత్స పొందుతూ ఆదివారమే అతను మరణించినట్టు కూడా వార్తలొచ్చాయి! అయితే దావూద్‌పై విషప్రయోగం, అతని మృతి వార్తలు పూర్తిగా అవాస్తవమని నిఘా వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. ఆరోగ్య సమస్యలతో ఆస్పత్రి పాలవడం మాత్రం నిజమేనని నిర్ధారణ అయినట్టు తెలుస్తోంది. దావూద్ చాలా ఏళ్లుగా కుటుంబంతో పాటుగా పాకిస్తాన్‌లోనే నివసిస్తున్నట్టు ఇప్పటికే తేలింది. అతను కరాచీలోనే ఉంటున్నట్టు పక్కా ఆధారాలున్నాయని భారత్ వెల్లడించింది కూడా. భారత్‌తో పాటు ఐరాస భద్రతా మండలి కూడా 2003లోనే దావూద్‌ను మోస్ట్ వాంటెడ్ అంతర్జాతీయ ఉగ్రవాదిగా ప్రకటించడం తెలిసిందే. అతని తలపై ఏకంగా 2.5 కోట్ల డాలర్ల రివార్డు ఉంది!

రోజంతా కలకలం

దావూద్‌పై విషప్రయోగం, మృతి వార్తలు సోమవారం ఉదయం నుంచే కలకలం రేపాయి. ఆదివారం అర్ధరాత్రి దాటాక ఓ యూట్యూబర్ వీటిని తొలుత బయట పెట్టాడు. పలు సోషల్ మీడియా వార్తలను ఉటంకిస్తూ ఈ మేరకు కథనం ప్రసారం చేసి దుమారం రేపాడు. ఆది, సోమవారాల్లో పాకిస్థాన్ అంతటా గంటల తరబడి ఇంటర్నెట్ మూగబోవడానికి, దావూద్ మృతికి లింకుందని చెప్పుకొచ్చాడు. ''దేశంలో ఏదో పెద్ద ఉదంతమే జరిగింది. దాన్ని దాచేందుకే నెట్‌పై ఆంక్షలు విధించారు'' అంటూ ప్రముఖ పాక్ జర్నలిస్టులు ఎక్స్ పోస్టుల్లో అనుమానాలు వెలిబుచ్చడంతో మరింత అలజడి రేగింది. దావూద్ విషమ పరిస్థితుల్లో కరాచీ ఆస్పత్రిలో చేరినట్టు పాక్ జర్నలిస్టు అర్జూ కాజ్మీ ఎక్స్ పోస్టులో నిర్ధారించారు.

తొలిసారేమీ కాదు...

దావూద్‌పై విషప్రయోగం జరిగిందని, అతను మరణించాడని వార్తలు రావడం ఇది తొలిసారేమీ కాదు. ఏటా కనీసం ఒకట్రెండుసార్లు ఇలాంటి వార్తలు రావడం, అవన్నీ పుకార్లేనని తేలడం పరిపాటిగా మారింది.

- సాక్షి, నేషనల్ డెస్క్

కరాచీలోనే దావూద్: అల్లుడు

పాక్ ఖండిస్తున్నా, దావూద్ కరాచీలో ఉండటం వాస్తవమేనని అతని అల్లుడు అలీ షా పార్కర్ గత జనవరిలో ధ్రువీకరించాడు. కరాచీలోని అబ్దుల్లా గాజీ బాబా దర్గా వెనక రహీం ఫకీ సమీపంలోని డిఫెన్స్ ఏరియాలో దుర్భేద్యమైన ఇంట్లో కొన్నేళ్లుగా దావూద్ నివాసముంటున్నట్టు తెలిపాడు. దావూద్ చెల్లెలు హసీనా పార్కర్ కొడుకైన అలీ షా జాతీయ దర్యాప్తు సంస్థ ఎన్‌ఐఏకు ఇచ్చిన స్టేట్‌మెంట్‌లో ఇంకా పలు విషయాలు వెల్లడించాడు. ''దావూద్ ఓ పాక్ పఠాన్ స్త్రీని రెండో పెళ్లి చేసుకున్నాడు. దావూద్‌కు ముగ్గురు సోదరులు, నలుగురు అక్కచెల్లెళ్లు, ఒక కొడుకు, ముగ్గురు కూతుళ్లున్నారు. ఒక కూతురును పాక్ మాజీ క్రికెటర్ జావెద్ మియాందాద్ కుమారునికిచ్చి పెళ్లి చేశాడు'' అని అలీ షా తెలిపాడు.

బోధకులం ఏదీ అభయం?



ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలని బెంగళూరు ఫ్రీడంపార్క్‌లో అతిథి అధ్యాపకుల ఆందోళన

న్యూస్‌రీల్

అక్కడికక్కడే ట్రాఫిక్ జరిమానా వసూలు వద్దు: హైకోర్టు



శివాజీనగర: వాహన చోదకులు ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘిస్తే ట్రాఫిక్ పోలీసులు అక్కడికక్కడే జరిమానా వసూలు చేసే అవకాశం లేదని హైకోర్టు తెలిపింది. హెల్మెట్ లేకుండా వెళ్తుండగా పోలీసులు అడ్డుకున్నారు, దీంతో వాదనకు దిగడంతో తనపై విధులకు ఆటంకపరిచారని కేసు పెట్టారని, ఈ కేసును రద్దు చేయాలని కే.ఆర్.పేట పట్టణానికి చెందిన కే.టీ.నటరాజు హైకోర్టులో కేసు వేశాడు. న్యాయమూర్తి జస్టిస్ హేమంత్ చందన్‌గౌడర్ ధర్మాసనం దీనిని విచారించింది. ట్రాఫిక్ ఉల్లంఘనల విచారణను పోలీసులు వీడియో తీయాలి. అలాగే నిందితుల నుండి అక్కడే జరిమానాను వసూలు చేసే అధికారం లేదని జడ్జి స్పష్టంచేశారు. పోలీస్ అధికారులపై దాడికి సిద్ధపడిన వ్యక్తిని అడ్డుకోవాలి. స్థానిక పోలీసులను పిలిపించి, నిందితుడిని అప్పగించాలి. లేనిపక్షంలో విధుల నిర్వహణను అడ్డగించిన కేసును రుజువు చేయడం సాధ్యపడదని పేర్కొన్నారు. దీంతో అర్జీదారుకు ఊరట లభించినట్లయింది.

పాత స్కూటీపై రూ.3 లక్షల చలానాలు

యశవంతపుర: బెంగళూరు రోడ్డుపై ట్రాఫిక్ నియమాలను 643 సార్లు ఉల్లంఘించిన స్కూటీకి లక్షల రూపాయల జరిమానా పడింది. ఈ ఘటన ఆర్‌టీ నగరలో జరిగింది. స్కూటీపై ప్రయాణించిన వ్యక్తి హెల్మెట్ లేకపోవడం, సిగ్నల్ జంప్ ద్వారా 643 సార్లు అతిక్రమణలకు పాల్పడ్డాడు. ట్రాఫిక్ కెమెరాలో ఇవన్నీ రికార్డ్ అయ్యాయి. దీంతో మొత్తం చలానాలను లెక్కించగా రూ. 3.22 లక్షలుగా తేలింది. ఇక ఆ స్కూటీ విలువ రూ. 30 వేలకు మించదు. ఆ స్కూటీ వ్యక్తి కోసం ట్రాఫిక్ పోలీసులు వెతకడం ప్రారంభించారు.

పడవ మునిగి ఇద్దరు జాలర్లు మృతి

యశవంతపుర: సముద్రంలో చేపల వేటకు వెళ్లిన పడవ బోల్తా పడిన ఘటనలో ఇద్దరు మత్స్యకారులు మరణించిన ఘటన ఉడుపి జిల్లా బైందూరు తాలూకా శిరూరు కళిహిత్లులో జరిగింది. ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో కళహిత్లు నుంచి ముగ్గురు జాలర్లు పడవలో సముద్రంలోకి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో సోమవారం తెల్లవారుజామున కళిహిత్లు అళివె దగ్గర అలలు ఎక్కువగా రావడంతో పడవ తిరగబడింది. అబ్దుల్ సత్తార్ (45), విస్టా యూసుఫ్ (48) అనే ఇద్దరు నీట మునిగి చనిపోయారు. మామ్ను యాకూబ్‌ను మరో పడవలోని జాలర్లు రక్షించారు. బైందూరు పోలీసులు కేసు నమోదు చేశారు.



నగర మయూరాలు: సోమవారం బెంగళూరు రవీంద్ర కళాక్షేత్రలో విశిష్ట అతిథులు. ఎక్కడి నుంచో కొన్ని నెమళ్లు వచ్చి తిరుగాడాయి



ఉగ్ర ముఠాలపై ఎన్‌ఐఏ పంజా



ఐటీ సిటీలో కొంతకాలంగా పెరిగిన ఎన్‌ఐఏ దాడులు తీవ్రతకు అద్దం పడుతున్నాయి

- బెంగళూరులో 20 చోట్లకు పైగా సోదాలు
- పేలుడు పదార్థాల స్వాధీనం



ఉగ్రవాదుల స్లీపర్ సెల్‌గా ఉద్యాననగరి?


బనశంకరి: ప్రశాంత నగరంలో ఉగ్ర స్థావరాల కలకలం నెలకొంది. సిలికాన్ సిటీలో ఉగ్రవాదుల అడ్డాలపై ఎన్‌ఐఏ దాడులను తీవ్రతరం చేసింది. సోమవారం మరోసారి నగరవ్యాప్తంగా దాడులు నిర్వహించి పేలుళ్లకు ఉపయోగించే 7 కేజీల సోడియం నైట్రేట్ అనే రసాయనాన్ని సీజ్‌చేశారు. బ్యాడరహళ్లిలో అనుమానిత ఉగ్రవాది షమీవుల్లా ఇంట్లో ఈ రసాయనం దొరికింది. వీటిని పేలుడు వస్తువులు తయారీకి వినియోగిస్తున్నట్లు షమీవుల్లా నోరువిప్పాడు. సూఫియా అలియాస్ నిఖిల్, బళ్లారి పీఎఫ్ఐ నేత సులేమాన్, అజాజ్ అహ్మద్, తబ్రేజ్, ముజామిల్‌ను అనే అనుమానితులు ఎన్‌ఐఏ అధికారులు అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు.

20 ప్రదేశాల్లో దాడులు

ఇటీవల పట్టుబడిన అనుమానిత ఉగ్రవాది అలీ అబ్బాస్ పేటీవాలా ఇచ్చిన సమాచారంతో పాటు ఇతర మూలాల నుంచి అందిన వివరాలతో ఎన్‌ఐఏ తాజాగా సోదాలను నిర్వహించింది. సుల్తాన్‌పాళ్య, అర్‌టీ.నగర, శివాజీనగర, పులకేశినగర తో పాటు నగరవ్యాప్తంగా 20 కి పైగా ప్రాంతాల్లో అనుమానితుల ఇళ్లలో తనిఖీలు సాగుతున్నాయి.

అబ్బాస్ పేటీవాలా ముఖ్యపాత్ర

సుల్తాన్‌పాళ్యలో గతంలో దాడుల్లో దొరికిన సమాచారంతో పులకేశినగర అలీఅబ్బాస్ పేటీవాలా ఇంటిలో గత వారం గాలింపు నిర్వహించారు. ఇతడు ఉగ్రవాద సంస్థ ఐసిస్‌లో చేరాలని యువకులను ప్రేరేపిస్తున్నట్లు ఆరోపణ ఉంది. ముంబై కి చెందిన ఇతను ట్యానరీ రోడ్డులో ఉర్దూపాఠశాల నిర్వహిస్తున్నాడు. భార్య డయాబెటిక్ క్లినిక్ నిర్వహిస్తుంది. షామాజ్ అనే వ్యక్తి నుంచి 2018లో రూ.62 లక్షలకు ఫ్లాటు కొని అందులో ముగ్గురు పిల్లలతో జీవిస్తున్నారు. సోదాల్లో రూ.16,42,000 నగదు లభించింది.



బళ్లారిలో సోదాలు

సాక్షి, బళ్లారి: బళ్లారి నగరంలోని కౌల్‌బజార్, జాగృతి నగర్‌కు చెందిన పలువురు అనుమానితుల ఇళ్లలో సోమవారం ఎన్‌ఐఏ అధికారులు దాడులు నిర్వహించడం సంచలనాత్మకమైంది. షమీవుల్లా అనే వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు తెలుస్తోంది. ఇతడు గతంలో అఫ్గనిస్థాన్ తదితర దేశాలకు వెళ్లి చట్టవ్యతిరేక కార్యకలాపాలు సాగించినట్లు తెలియడంతో ఎన్‌ఐఏ నిఘా వేసింది. గుట్టుగా నివసిస్తూనే ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే నగరంలో తెలియడంతో ప్రజల్లో ఆందోళన నెలకొంది. సోదాలు జరిగేచోట పెద్దసంఖ్యలో జనం పోగయ్యారు. ఈ దాడుల్లో కొంత నగదుతో పాటు సల్ఫర్, పొటాషియం నైట్రేట్, గన్ పౌడర్ తదితర పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారని తెలిసింది. స్థానిక పోలీసులు సోదాలు జరిగే చోట్ల బందోబస్తు నిర్వహించారు.



బళ్లారిలో ఎన్‌ఐఏ సోదాల సందర్భంగా గుమికూడిన జనం

ఉగ్ర స్లీపర్ సెల్‌గా బెంగళూరు : హోంమంత్రి


బనశంకరి: బెంగళూరు మొదటి నుంచీ ఉగ్రకార్యకలాపాలకు స్లీపర్‌సెల్ అని ప్రచారంలో ఉందని హోంమంత్రి జీ.పరమేశ్వర్ అన్నారు. నగరంలో ఎన్‌ఐఏ దాడుల గురించి ఆయన సోమవారం స్పందిస్తూ స్లీపర్ సెల్స్ గురించి తెలిసి సోదాలు జరుగుతూ ఉండవచ్చన్నారు. ఎన్‌ఐఏ దక్షిణాది ఆఫీసు బెంగళూరులోనే ఉంది, కొన్నిసార్లు మాతో సంప్రదిస్తారు, మరికొన్ని సార్లు సంప్రదించకుండానే దాడులు చేస్తుంటారని అన్నారు. బెంగళూరు వాతావరణం బాగుండడం వల్ల చాలామంది ఇక్కడికి వస్తారని, అలాగే ఉగ్రవాదులు కూడా తలదాచుకుని ఉంటారన్నారు. ఇటీవల ఎన్‌ఐఏ చాలా క్రియాశీలకంగా మారిందని, వారి విధులపై తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు.



సోమవారం బెంగళూరు శివాజీనగరలో క్రిస్మస్ షాపింగ్ సందడి

60 ఏళ్లు దాటితే మాస్క్ వేయాలి

- ఆరోగ్య మంత్రి వెల్లడి
- కోవిడ్ కొత్త వేరియంట్‌పై నిఘా
- కేరళ సరిహద్దుల్లో తనిఖీలు





శివాజీనగర/ మైసూరు: దేశంలో కరోనా వైరస్ మళ్లీ వ్యాపిస్తున్నందున రాష్ట్ర ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యలను చేపట్టిందని, బహిరంగ ప్రదేశాల్లో 60 సంవత్సరాల పైబడినవారు మాస్క్ ధరించటం తప్పనిసరి అని ఆరోగ్య మంత్రి దినేశ్ గుండూరావు తెలిపారు. సోమవారం ఆయన కొడుగు జిల్లా కుశాలనగరలో విలేకరులతో మాట్లాడారు. 60 ఏళ్లు దాటినవారు మాస్క్ ధరించాలని ఉత్తర్వులు ఇచ్చాము. కరోనా గురించి ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. వృద్ధుల్లో గుండె, మూత్రకోశ ఇతర జబ్బులు ఉండొచ్చు, అందుకే ముందు జాగ్రత్తగా మాస్క్‌ను వేసుకోవాలని ఆదేశాలిచ్చామని తెలిపారు. ఎలాంటి నివారణ చర్యలు చేపట్టాలో అధికారుల సమావేశంలో చర్చించాను. కేంద్ర ఆరోగ్యశాఖతో కూడా సంప్రదించామన్నారు. 2-3 రోజుల్లో కొత్త వేరియంట్ వల్ల కరోనా కేసులు పెరుగుతాయా, లేదా అనేది తెలుస్తుంది. ఆ తరువాత తగిన నిర్ణయాలు తీసుకుంటామన్నారు.

కేరళ సరిహద్దుల్లో ఆరోగ్య పరీక్షలు

పొరుగున ఉన్న కేరళలో కొత్తగా కోవిడ్‌వైరస్ కేసులు పెరగడంపై జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు మంత్రి చెప్పారు. కర్ణాటక, కేరళ సరిహద్దులో బందోబస్తును పెంచాం. కేరళలో పాజిటివ్ కేసులు అధికమైతే ఆ రాష్ట్ర వాహనాలు మన రాష్ట్రంలోకి రాకుండా పూర్తిగా నిలిపి వేయడంతో పాటు ప్రయాణికుల బస్సులను కూడా బంద్ చేస్తామని చెప్పారు. కేరళ సరిహద్దులను ఆనుకుని ఉన్న కర్ణాటక ప్రాంతాల్లో ఎలాంటి కరోనా కేసులు లేవని చెప్పారు. కేరళ నుంచి వచ్చే వారికి సరిహద్దుల్లో వైద్య సిబ్బంది ఆరోగ్య పరీక్షలు, కోవిడ్ టెస్టులు చేస్తున్నట్లు తెలిపారు. ఎలాంటి అనారోగ్యం లేనివారికే అనుమతి ఇస్తున్నారన్నారు. మైసూరు తో పాటు జిల్లాలో కోవిడ్ రోగుల కోసం ఆక్సిజన్ వసతి, బెడ్లు, వెంటిలేటర్ తదితరాలను ప్రభుత్వం సిద్ధం చేసిందన్నారు.

బెంగళూరు నుంచి హుబ్లీకి వెళ్లి..



మాట్లాడుతున్న ఆటో డ్రైవర్ జాధవ్



మృతుల బంధువులతో మాట్లాడుతున్న పోలీస్

- ఆటోడ్రైవర్ ఇంట్లో బావా మరదళ్ల ఆత్మహత్య

హుబ్లీ: కొంత డబ్బు వస్తుంది కదా అని గది ఇచ్చిన పాపానికి ఆటోడ్రైవర్ ఇబ్బందుల్లో పడ్డాడు. నగరంలోని మురార్జీ నగరలో బెంగళూరుకు చెందిన ఓ జంట ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన వెలుగు చూసింది. బెంగళూరులోని పీణ్యాకు చెందిన శాంతి, ఆమె బావ లోకేష్ ఆత్మహత్య చేసుకున్న జోడి. బెంగళూరు నుంచి ఆదివారం ఉదయం హుబ్లీలోని అక్షయ పార్క్‌కు వచ్చిన ఈ జంట కొద్దిసేపు ఫ్రెషప్ కావడానికి గది కావాలని ఆటో డ్రైవర్ మారుతి పుండలీకరావ్ జాధవ్‌ను కోరారు. తక్కువ ఖర్చు ఉండాలని వారు కోరగా జాధవ్ నేరుగా తన ఇంటికే తీసుకెళ్లాడు. వారిద్దరినీ ఇంట్లో వదిలి మరో బాడుగ వస్తే ఆటోడ్రైవర్ వెళ్లాడు. సాయంత్రం తిరిగి వచ్చి చూడగా తలుపులు మూసి ఉన్నాయి. ఎంత తట్టినా తీయలేదు, దీంతో పోలీసులకు కాల్ చేశాడు. వారు వచ్చి తలుపులు బద్దలు కొట్టి చూడగా ఇద్దరూ ఉరి వేసుకుని ప్రాణాలు తీసుకున్నారు.



అక్రమ సంబంధమే కారణం

శాంతికి ఇదివరకే మూడు పెళ్లిళ్లు అయ్యాయి. కానీ తన అక్క భర్త లోకేష్‌తో అక్రమ సంబంధం నెరుపుతోంది. ఇది తెలిసి అక్క తీవ్రంగా మందలించడంతో ఇద్దరూ ఇల్లు వదిలి వచ్చి ప్రాణాలు తీసుకున్నారు. పాత హుబ్లీ పోలీసులు వెళ్లి పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. బంధువులకు సమాచారం ఇచ్చారు.

ఒంటరి మహిళ హత్య, కూతురు మిస్సింగ్

- లైన్‌మెన్‌పై అనుమానాలు
- కొళ్లేగాళలో మిస్టరీ



అదృశ్యమైన లైన్‌మెన్ నాగేంద్ర (ఫైల్)



హతురాలు రేఖా (ఫైల్)

మైసూరు: చామరాజనగర జిల్లాలోని కొళ్లేగాలలో రేఖా (29) అనే ఒంటరి మహిళ ఇంట్లో అనుమానస్పదంగా మరణించగా, ఆమె కూతురు కనిపించడం లేదు. ఈ సంఘటన మిస్టరీగా మారింది.

వివరాలు.. శనివారం సాయంత్రం కొళ్లేగాల పట్టణం ఆదర్శ నగరలోని ఇంట్లో కుళ్ళిపోయిన స్థితిలో రేఖా మృతదేహం కనిపించింది. ఆమె ఆరేళ్ల కూతురు మాన్విత ఎక్కడుందో తెలియడం లేదు. వారం రోజుల నుంచి మాన్విత పాఠశాలకు రాకపోవడంతో ఏమైందోనని టీచర్.. రేఖాకు ఫోన్ చేసింది. ఎన్నిసార్లు కాల్ చేసినా స్పందన లేదు. దీంతో ఉపాధ్యాయురాలు నేరుగా రేఖా ఇంటికే వచ్చి చూడగా కుళ్ళిపోయిన స్థితిలో రేఖా మృతదేహం పడి ఉంది. భయాందోళనకు గురైన ఆమె పోలీసులకు సమాచారం ఇవ్వగా, వారు వచ్చి పరిశీలించి కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేయగా రేఖా బంధువులు అడ్డుకున్నారు. హంతకులను పట్టుకునేవరకూ మృతదేహాన్ని కదలనిచ్చేది లేదని గలాటాకు దిగారు. చివరకు పోలీసులు సర్దిచెప్పారు.

గతంలో రేఖా భర్త ఆత్మహత్య

రేఖాతో అక్రమ సంబంధం ఉన్న కెఈబి లైన్‌మెన్ నాగేంద్ర అలియాస్ ఆనందస్ పైన అనుమానం వస్తోంది. అతడు కూడా వారం రోజుల నుంచి పత్తా లేడు. రేఖా- నాగేంద్ర వ్యవహారం తెలిసి ఆమె భర్త సునీల్ విరక్తితో ఆత్మహత్య చేసుకున్నాడు. భర్త అడ్డు తొలగిపోవడంతో నాగేంద్రకు చెందిన ఇంటిలో ఇద్దరూ సహజీవనం చేయసాగారు. రేఖాను పెళ్లి చేసుకుంటానని చెప్పేవాడు. కానీ కొన్ని రోజుల నుంచి ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. దాంతో రేఖాను నాగేంద్ర హత్య చేసి మాన్వితను తీసుకెళ్లి ఉంటాడని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. నాగేంద్ర, పాప కోసం గాలిస్తున్నారు.

మైసూరు ఎయిర్‌పోర్టుకు నాల్వడి పేరు

మైసూరు: టిప్పు సుల్తాన్ మైసూరువాసి అని, ఆయనేమీ విదేశాల నుంచి వలస రాలేదని, అలాంటి టిప్పును దేశద్రోహి అనడం సరికాదని మైసూరు జిల్లా మంత్రి హెచ్‌సీ మహాదేవప్ప అన్నారు. సోమవారం మైసూరులో ఆయన మాట్లాడుతూ ఇక్కడి మండకళ్ళి విమానాశ్రయానికి గత మైసూరు మహారాజు నాల్వడి కృష్ణరాజ ఒడెయార్ పేరు పెట్టాలని కేబినెట్ నిర్ణయించిందని, దానిని తిరస్కరించడానికి సాధ్యం కాదని అన్నారు. కానీ కొంతమంది ఈ విమానాశ్రయానికి టిప్పు పేరు పెట్టాలని కోరుతున్నారు, ఈ సందర్భంగా కొందరు టిప్పును దేశద్రోహి అని చిత్రీకరించడం సరికాదని అన్నారు.

చేతన్.. మొరిగితే ఏమొస్తుంది

యశవంతపుర: నాడుప్రభు కెంపేగౌడపై అవహేళనగా పోస్ట్ చేసిన నటుడు చేతన్‌పై రాష్ట్రవ్యాప్తంగా వ్యతిరేకత వస్తోంది. నటుడు, బీజేపీ రాజ్యసభ సభ్యుడు జగ్గేశ్.. చేతన్ పేరును ప్రస్తావించకుండా కుక్క, నక్కలు మొరిగితే చరిత్ర మారిపోదని విమర్శించారు. కెంపేగౌడ విజయనగర సామ్రాజ్యంలో ధనవంత కుటుంబీకుడు. సామాజిక న్యాయం కోరిన సార్వభౌమ. కుక్కలు, నక్కలు మొరిగితే ఆయన చరిత్ర మారిపోతుందా? అని ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

సడన్ బ్రేక్‌తో తంటా





ప్రమాదంలో దెబ్బతిన్న కార్లు


- 9 కార్లు వరుసగా ఢీ

దొడ్డబళ్లాపురం: బెంగళూరులో కెంపేగౌడ ఎయిర్ పోర్టు రోడ్డులో వాహనాలు వరుసగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో 9 కార్లు ధ్వంసమైన సంఘటన సోమవారం ఉదయం చోటుచేసుకుంది. విమానాశ్రయం రోడ్డులోని సాదహళ్లి గేట్ వద్ద ముందు వెళ్తున్న ఒక కారు సడన్ బ్రేక్ వేయడంతో వెనుక వేగంగా వస్తున్న కార్లు వరుసగా ఒకటికొకటి ఢీకొన్నాయి. దీంతో 9 కార్లు ధ్వంసమయ్యాయి. కొందరికి చిన్న చిన్న గాయాలు తప్ప అదృష్టవశాత్తు ఎటువంటి ప్రాణాపాయం సంభవించలేదు. అత్యవసర పనుల మీద వెళ్తున్న ప్రయాణికులు లబోదిబోమన్నారు. ప్రమాదం కారణంగా కాసేపు ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. చిక్కజాల పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి ట్రాఫిక్‌ను సరిదిద్దారు.

దొడ్డ వద్ద ఎత్తినహోళె ఆనకట్ట

- 2,500 ఎకరాలకు ముంపు సమస్య
- హోంమంత్రి పరమేశ్వర్

బనశంకరి: కాంగ్రెస్ జాతీయ కార్యవర్గ సమావేశంలో పాల్గొనడానికి సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే.శివకుమార్ ఢిల్లీకి వెళ్లారు. అక్కడ పలువిషయాలపై చర్చిస్తారని, నామినేటెడ్ పదవులను భర్తీ చేయాలని పార్టీ నాయకుల నుంచి ఒత్తిడి ఉందని హోంమంత్రి పరమేశ్వర్ అన్నారు. ఈ పదవుల్లో మొదటి దశలో ఎమ్మెల్యేలను, రెండోదశలో కార్యకర్తలను నియమిస్తారన్నారు. బెంగళూరులో ఆయన మాట్లాడుతూ కోలారు, చిక్కబళ్లాపుర, తుమకూరు తో పాటు బయలుసీమ కు తాగునీరిచ్చే ఎత్తినహోళెను రెండేళ్లలో పూర్తిచేసేలా పనులు జరుగుతున్నాయన్నారు. మొదట్లో రూ.13,500 కోట్లతో ప్రాజెక్టును అంచనా వేయగా, ఇప్పుడు రూ.22 వేల కోట్లకు పెరిగిపోయిందన్నారు. దొడ్డబళ్లాపుర తాలూకాను అనుకుని ఉన్న బైరగుండ్లు దగ్గర ఈ నీటి కోసం ఒక ఆనకట్ట నిర్మించాలని ఆలోచన ఉందన్నారు. మునిగిపోయే భూములకు దొడ్డబళ్లాపుర తాలూకా వైపు ఎకరాకు రూ.32 లక్షలు పరిహారం అందిస్తే, కొరటిగెరె తాలూకాలో రూ.8 నుంచి 12 లక్షలు పరిహారం అందించాలన్నారు. సుమారు 2,500 ఎకరాల భూమి మునిగిపోతుందని ప్రజల నుంచి వ్యతిరేకత వస్తోందని, నేను రెండుమూడు సార్లు రైతులతో చర్చించినప్పటికీ రాజీ సాధ్యం కాలేదని అన్నారు. దొడ్డబళ్లాపుర తాలూకాలో రెండుచోట్ల ఆనకట్ట నిర్మాణ పనులను వేగిరం చేశామని ఆయన చెప్పారు.



కుక్కె ఆలయంలో బ్రహ్మ రథోత్సవం



సుబ్రమణ్యా శరణు దేవా

- ఘనంగా చంపా షష్టి

యశవంతపుర: దక్షిణ కన్నడ జిల్లా కడబ తాలూకా కుక్కె సుబ్రమణ్యస్వామి దేవస్థానంలో చంపా షష్టి ఉత్సవం సోమవారం వైభవంగా జరిగింది. ధనుర్ లగ్న ముహూర్తంలో బ్రహ్మ రథోత్సవం ప్రారంభం కాగా, వేల సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయంలో అన్ని సేవలను రద్దు చేశారు. కుక్కె సుబ్రమణ్యస్వామి దేవస్థానంలో ఇదే పెద్ద ఉత్సవం. ఈ నెల 10 నుంచి చంపాషష్ఠి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. 24వ తేదీ రాత్రి నీటిలో బండి ఉత్సవం ద్వారా ఉత్సవాలు ముగుస్తాయి.



స్కంధ షష్టి పర్వదినం సందర్భంగా సోమవారం బెంగళూరు వీవీ పురంలో సుబ్రమణ్యస్వామి ఆలయంలో తేరు ఉత్సవం

క్లుప్తంగా

వంటమురి ఘటనపై దర్యాప్తు వేగవంతం



బెళగావి విచ్చేసిన సీఐడీ డీఐజీ సుధీర్‌కుమార్

బనశంకరి: బెళగావి వంటమురి గ్రామంలో మహిళను వివస్త్రను చేసి దాడికి పాల్పడిన కేసులో దర్యాప్తు వేగవంతంగా సాగుతోంది. సోమవారం సీఐడీ డీఐజీ సుధీర్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలోని సీఐడీ బృందం బీమ్స్ ఆసుపత్రి ఆవరణలోని సఖి వన్‌స్టాప్‌సెంటర్‌ను సందర్శించి బాధితురాలి నుంచి సమాచారం సేకరించారు. సీఐడీ ఎస్పీ పద్విక్, రశ్మీ, డీవైఎస్పీ అంజుమళనాయక్‌తో కూడిన బృందం కేసు దర్యాప్తు చేపడుతోంది. కేసుకు సంబంధించి సమాచారం సేకరించడానికి బెళగావికి వచ్చాని, బాధితురాలిని, ఆమె కుటుంబ సభ్యులను కలిసిన అనంతరం మీడియాకు సమాచారం ఇస్తానని సునీల్‌కుమార్‌మీనా తెలిపారు. జాతీయ మానవ హక్కుల కమిషన్ డీఐజీ సునీల్‌కుమార్‌మీనా కూడా సోమవారం ఉదయం బెళగావికి విచ్చేశారు.

ఆహార ఉత్పత్తుల విక్రయ మేళా



ఉత్పత్తులను పరిశీలిస్తున్న దృశ్యం

కంప్లి: చిన్న పరిశ్రమదారులు తయారు చేసిన ఉత్పత్తులకు మార్కెట్‌లో విక్రయ సౌకర్యం కల్పించాలని సంజీవిని కార్యక్రమ వ్యవస్థాపకులు సోమశేఖర్ తెలిపారు. వడ్డు గ్రామంలో కుటీర పరిశ్రమ అభివృద్ధి ఉద్యమశీలత, జీవనోపాయ జీవిని సమాఖ్య పరంగా ఏర్పాటు చేసిన ఆహార ఉత్పత్తుల ప్రదర్శన విక్రయ మేళాలో స్వసహాయ సంఘాలను ప్రోత్సహించి వారు తయారు చేసిన ఉత్పత్తులు మార్కెట్‌లో విక్రయించుకునే ఏర్పాటు చేయాలన్నారు.

ఎమ్మెల్యేకు పరామర్శ

బొమ్మనహళ్లి: మోకాలికి శస్త్రచికిత్స చేయించుకున్న బొమ్మనహళ్లి ఎమ్మెల్యే ఎం. సతీష్ రెడ్డి ఆస్పత్రిలో కోలుకుంటున్నారు. బీజేఎల్పీ నేత ఆర్.అశోక్‌తో పాటు బెంగళూరు దక్షిణ ఎమ్మెల్యే ఎం.కృష్ణప్ప, జయనగర బీజేపి ఎమ్మెల్యే కేసీ రామ్మూర్తి ఆస్పత్రిలో సతీష్‌రెడ్డిని కలిసి పరామర్శించారు. శ్రీనివాస్ రెడ్డి, జీ.నరేంద్రబాబు, జల్లి రమేష్ తదితరులు ఉన్నారు.

కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఇవ్వాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నేమిరాజ్ నాయక్

కంప్లి: ప్రభుత్వ పథకాలను సక్రమంగా ప్రజల దరిచేర్చాలని, రాజకీయాలు చేస్తే పీడీఓలపై చర్యలు తప్పవని ఎమ్మెల్యే నేమిరాజ్ నాయక్ హెచ్చరించారు. హగరిబొమ్మనహళ్లి టీపీ ఆవరణలో జరిగిన సామాన్య సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ పరికరాలు కాలిపోతే రైతులు ఫిర్యాదు చేసిన వెంటనే జెస్కాం అధికారులు కొత్త పరివర్తకం(ట్రాన్స్‌ఫార్మర్) అందించాలన్నారు. తన క్షేత్రంలో ఎలాంటి సమస్య ఉన్నా పంచాయతీ అధికారులు బాధ్యతగా పరిష్కరించాలని ఆయన సూచించారు.

పౌష్టికాహార కిట్ల పంపిణీ

కంప్లి: కుష్టు రోగులను దత్తత తీసుకుని వారి బాగోగులు చూస్తూ అందరితో కలిసిమెలిసి తిరిగేలా చేసిన జీఎస్‌డబ్ల్యూ ఫౌండేషన్ సేవలు శ్లాఘనీయమని ఆరోగ్య శాఖ ఉపనిర్దేశకులు డాక్టర్ అనిల్ అన్నారు. ఆయన సండూరు పట్టణంలోని గురుభవనంలో సంస్థ తరపున ఏర్పాటు చేసిన క్షయమిత్ర పథకం ద్వారా పౌష్టికాహార పంపిణీ కార్యక్రమంలో మాట్లాడారు. పౌష్టికాహారం తీసుకోవడం వల్ల రోగాలు దరిచేరకుండా ఆరోగ్యవంతులు అవుతారన్నారు.

నీవు లేని లోకంలో ఉండలేనని..

- భార్య సమాధి వద్ద భర్త ఆత్మహత్య
- ఏడాది క్రితం భార్య మృతి



ఆత్మహత్య చేసుకున్న గురుమూర్తి (ఫైల్)

బాగేపల్లి: భార్య మరణాన్ని జీర్ణించుకోలేక భర్త ఆమె సమాధి వద్ద ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన బాగేపల్లి తాలూకా తిమ్మాకలపల్లి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గురుమూర్తి, మౌనిక దంపతులు. వీరికి 12 ఏళ్ల కుమార్తె ఉంది. ఇదిలా ఉంటే ఏడాది క్రితం మౌనిక ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. అప్పటి నుంచి తీవ్ర మనోవేదనతో ఉన్న ఆయన సోమవారం భార్య సమాధి వద్ద పూజలు చేసి వస్తానని చెప్పి అక్కడికి వెళ్లాడు. సమాధి వద్దనే భార్య చీరతోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

గురుకుల హాస్టళ్లలో సమస్యల తిష్ట

- ఇన్‌చార్జ్ వార్డెన్ల ఆధిపత్యం
- పట్టించుకోని అధికారులు

రాయచూరు రూరల్: మేడి పండు చూడు మేలిమియై ఉండు, పొట్ట విప్పి చూడు పురుగులుండు అనే సామెత చందంగా జిల్లాలోని గురుకుల హాస్టల్, పాఠశాలల్లో సమస్యలు తిష్ట వేశాయి. మాన్వి, సింధనూరు, రాయచూరు, దేవదుర్గ బాలికల హాస్టల్‌లో తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యాలు కల్పించకుండా మౌనంగా ఉన్నారు. రాయచూరు బాలికల గురుకుల పాఠశాలల్లో తాగునీటిని అడిగిన విద్యార్థులకు వార్డెన్ భోజనం పెట్టకుండా ఉపవాస దీక్షకు పూనుకుంది. ఇన్‌చార్జ్ వార్డెన్లు దౌర్జన్యంతో వారు ఆడిందే ఆట, పాడిందే పాటగా మారింది. వంట చేసే వారు తమకు ఇష్టమొచ్చినట్లు వ్యవహరిస్తున్నారు.

ఆహార నాణ్యత అంతంత మాత్రమే

ఆహార పదార్థాలు అంతంత మాత్రమే. అన్నంలో రాళ్లు, నూకలు, చారులో కాయగూరలు వేయకుండా విద్యార్థులకు వడ్డిస్తున్నారు. వారానికి ఒకసారి పాలు, గుడ్లు, స్వీట్లు, పండ్లు ఇవ్వకున్నా ఇచ్చినట్లు రికార్డుల్లో రాసుకుంటారు. తాగునీరు ఇతర మౌలిక సౌకర్యాలు కల్పించాలని వారం రోజుల క్రితం విద్యార్థులు ఆందోళనకు దిగారు. నగరానికి దూరంగా ఉండడంతో విద్యార్థుల బాగోగులు పట్టించుకునే, అధికారుల ఆగడాల గురించి ప్రశ్నించేవారు లేరు. సింధనూరు పీడబ్ల్యూడీ క్యాంప్‌లో మొరార్జీ దేశాయి పాఠశాలలో కూడా ఇదే తంతు కొనసాగుతోంది. 13 ఏళ్ల నుంచి స్వంత భవనం లేక నెలకు రూ.3.47 లక్షలు అద్దె చెల్లిస్తున్నారు.



మొరార్జీ దేశాయి గురుకుల పాఠశాల వసతిగృహం



ఇరుకైన బాలుర హాస్టల్ వరండా

250 మందికి ఐదు గదులే

ఆరు నుంచి 10వ తరగతి వరకు 250 మంది విద్యార్థులున్నారు. 20 మందికి ఒక తరగతి గది కావాలి, కానీ 50 మందిని ఒకే గదిలో విద్యను బోధిస్తున్నారు. వరండా గదుల్లోనే పెట్టె, పరుపు, పాఠ్య పుస్తకాలను అక్కడే ఉంచుకోవాలి. పడుకోడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఐదు గదులకుగాను మూడింటిలో 115 మంది, రెండు గదుల్లో 122 మంది విద్యార్థుల బసకు అవకాశం కల్పించారు. జిల్లాలో అంబేడ్కర్, దేవరాజ్ అరసు, కిత్తూరు రాణి చెన్నమ్మ, మొరార్జీ దేశాయి గురుకుల పాఠశాలలున్నా వాటి బాగోగుల గురించి ఇన్‌చార్జ్ మంత్రి శరణ ప్రకాష్ పాటిల్, ఎంపీ రాజా అమరేశ్వర నాయక్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నిర్లక్ష్యం వహించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పనులు పూర్తి కాకుండానే టోల్ వసూలు

- విజయ కర్ణాటక రక్షణ వేదిక ధర్నా



టోల్ వద్ద రోడ్డుపై బైఠాయించిన కన్నడ భాషా సంఘాల కార్యకర్తలు

దొడ్డబళ్లాపురం : యలహంక–దొడ్డబళ్లాపురం 9వ రాష్ట్ర రహదారిలో రోడ్డు నిర్మాణ పనులు పూర్తి కాకుండానే టోల్ ఫీజు వసూలు చేస్తున్నారని ఆరోపిస్తూ విజయ కర్ణాటక రక్షణ వేదిక ఆధ్వర్యంలో మారసంద్ర టోల్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ రహదారి మార్గంలో అనేక చోట్ల వీధిలైట్లు, స్కైవాక్‌లు ఏర్పాటు చేయలేదని, ముఖ్యంగా పలు చోట్ల రోడ్డు పనులు ఇంకా పూర్తి కాలేదని అయినా టోల్ వసూలు చేస్తున్నారని ఆందోళకారులు ఆగ్రహించారు. ప్రశ్నించిన వారిపై టోల్ సిబ్బంది దాడికి పాల్పడుతున్నారన్నారు. రోడ్ల పనులు పూర్తయ్యే వరకూ టోల్ ఫీజు వసూలు చేయరాదని, టోల్ సిబ్బంది తమ ప్రవర్తన మార్చుకోవాలని హెచ్చరించారు. ఆందోళనకారులు రోడ్డుపై బైఠాయించడంతో కాసేపు వాహన రాకపోకలు స్తంభించాయి.

భక్తిశ్రద్ధలతో స్కంధషష్టి

కోలారు: నగరంలోని శారదా శంకరమఠంలో సోమవారం స్కంధ షష్టి కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం శ్రీవల్లీ సమేత సుబ్రమణ్య స్వామికి అభిషేకం, షోడషోపచార పూజ, సుబ్రమణ్య హోమం, నవగ్రహ పూజ, గణపతి హోమం, పూర్ణాహుతి, చివరన వటు పూజను చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పూజల్లో పాల్గొనగా, భక్తులకు అన్నసంతర్పణ జరిగింది.

మండ్యలో ఘనంగా షష్టి వేడుకలు

మండ్య: మండ్య నగరంలోని చెరువు వీధిలో ఉన్న శ్రీ బాల సుబ్రమణ్యం స్వామి దేవాలయంతో పాటు జిల్లాలో వివిధ ప్రాంతాల్లో షష్టి వేడుకలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా సోమవారం తెల్లవారు జామునే బాల సుబ్రమణ్యం స్వామికి పండ్లు, పంచామృతాలతో అభిషేకం, రుద్రాభిషేకం, వెన్నతో అలంకరణ చేశారు. 8.30 గంటలకు మహామంగళహారతి అనంతరం భక్తులకు స్వామివారి దర్శనం కల్పించారు.



సుబ్రమణ్య స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



మండ్యలో స్వామి వారికి పూజలు చేసిన దృశ్యం

చదువుల తల్లికి ఆర్థిక ఇబ్బందులు

- దాతల సాయం కోసం పేద విద్యార్థిని ఉషా ఎదురు చూపులు



తండ్రి ఖలీల్ పాషాతో ఉషా మెహక్

రాయచూరు రూరల్: నేటి ఆధునిక యుగంలో ఆర్థిక సంక్లిష్టతలో పేదింటి విద్యార్థులు ఎంబీబీఎస్ వంటి ఉన్నత చదువులు చదవడం కష్టసాధ్యంగా మారింది. రాయచూరు ప్రభుత్వ వైద్య విజ్ఞాన సంస్థ(రిమ్స్) కళాశాలలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ఉషా మెహక్ పరిస్థితి ప్రస్తుతం అగమ్యగోచరంగా ఉంది. జిల్లాలోని సింధనూరులో నివాసముంటున్న ఖలీల్ పాషాకు నలుగురు కుమార్తెలు. మొదటి కూతురుకు పెళ్లి చేశారు. రెండో కూతురు బీకాం, మూడో కూతురు ఉషా మెహక్ రాయచూరులో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం, నాలుగో కూతురు 8వ తరగతి చదువుతున్నారు. ఉషా 1 నుంచి పీయూసీ(12వ తరగతి) వరకు సింధనూరులోని రుద్రగౌడ స్మారక విద్యా సంస్థలో చదివింది. టెన్త్, ఇంటర్‌ల్లో 97 శాతం చొప్పున మార్కులు సాధించింది. సీఈటీలో 3030 ర్యాంక్, నీట్‌లో 47,936వ ర్యాంక్‌తో రిమ్స్ కళాశాలలో సీటు సంపాదించింది. పాఠశాల ఉపాధ్యాయులు కలిసి మొదటి ఏడాది ఫీజులను భరించారు. రెండో, మూడో ఏడాది ఫీజులు చెల్లించడానికి ఆర్థికంగా ఇబ్బందులు ఎదురయ్యాయి. తండ్రి ఖలీల్ పాషా సాదాసీదా వస్తువులు విక్రయించే వ్యాపారి కావడంతో పాటు అనారోగ్యంతో చిక్కుల్లో పడ్డారు. తనకు న్యూరో సర్జన్‌ను కావాలనే తపన ఉన్నా ఆర్థిక ఇబ్బందులు వెన్నంటుతున్నాయని తెలిపింది. ఈ నెల 21న రెండో ఏడాది ఫీజుల చెల్లింపునకు చివరి తేదీ అని, తనకు ఆర్థికంగా చేదోడు అందించాలని ఆమె దాతలకు విన్నవించింది. తన విద్యాభ్యాసానికి ఆర్థికంగా చేయూతనిస్తే భవిష్యత్తులో పేదలకు ఉచితంగా వైద్యసేవలు అందిస్తానని తెలిపింది.

ఈవీగో పేరిట రూ.లక్షల వంచన

హుబ్లీ: గొలుసు కట్టు(చైన్ సిస్టమ్) మాదిరిగా తమ కంపెనీలో డబ్బులు పెట్టుబడి పెడితే అధిక లాభాలు గడించవచ్చని నమ్మించి ఓ మహిళకు సుమారు రూ.2.05 లక్షలను వంచించిన ఘటన నగరంలోని నవనగరలో చోటు చేసుకుంది. ఎం.ప్రీతి మోసానికి గురైన బాధితురాలు. గుర్తు తెలియని ఓ వ్యక్తి అమెరికాకు చెందిన ఈవీగో ఫాస్ట్ చార్జింగ్ కంపెనీ నుంచి మాట్లాడుతున్నానని, తమ కంపెనీ చూబ్లిసెట్ శాఖలో పేయింగ్ సిస్టమ్‌లో వివిధ ప్లాన్లలో డబ్బులు పెట్టుబడి పెడితే రెట్టింపు ఆదాయం గడించవచ్చని నమ్మించాడు. ఈ క్రమంలో వెబ్‌సైట్ లింక్ పంపి ప్రీతి, పలువురి పేరున అకౌంట్లు తెరిపించి ప్రారంభంలో లాభాలు ఇచ్చినట్లుగా నమ్మకం పుట్టించారు. అనంతరం బాధితురాలి ఓ బ్యాంక్ ఖాతా నుంచి రూ.74,380, మరో బ్యాంక్ ఖాతా నుంచి రూ.1,31,210లను బదిలీ చేయించుకొని వంచించినట్లు బాధితురాలు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రైలు మరుగుదొడ్డిలో పిస్తోలు లభ్యం

- పోలీస్ కానిస్టేబుల్ సస్పెండ్

మండ్య: రైలుబోగీలోని ఓ మరుగుదొడ్డిలో పిస్తోల్‌ను మండ్య రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో మండ్య జిల్లా డీఆర్ కానిస్టేబుల్ నాగరాజును సస్పెండ్ చేశారు. వివరాలు...మండ్య జిల్లాలో డీఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న నాగరాజు అంగరక్షకుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. అతను సోమవారం బెంగళూరు నుంచి మండ్యకు కాచిగూడ రైలులో ప్రయాణించాడు. ఆ సమయంలో మరుగుదొడ్డిలోకి వెళ్లిన నాగరాజు తన పిస్తోల్ తీసి వాష్‌బేసిన్‌పై పెట్టి మరచిపోయి బయటకు వచ్చేశాడు. కొద్ది సేపు అనంతరం ఓ ప్రయాణికుడు బాత్‌రూమ్‌కు వెళ్లి అక్కడ పిస్తోల్ ఉండటాన్ని గమనించి తోటి ప్రయాణికులకు చెప్పడంతో క్షణాల్లో అందరికి తెలిసిపోయింది. అంతలోనే రైలు మండ్య నగరం చేరుకుంది. సమాచారం తెలుసుకున్న రైల్వే పోలీసులు పిస్తోల్‌ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం బెంగళూరు రైల్వే కంట్రోల్ రూమ్‌కు సమాచారం ఇచ్చారు. వారి ద్వారా సమాచారం తెలుసుకున్న పోలీసులు విచారణ చేపట్టి ఆ పిస్తోల్ మండ్య జిల్లాలో అదనపు బలగాల్లో పనిచేస్తున్న నాగరాజుదిగా గుర్తించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన నాగరాజును సస్పెండ్ చేస్తూ జిల్లా ఎస్పీ యతీశ్ ఆదేశాలు జారీ చేశారు.

ఉప ఎన్నిక బరిలో ఆరుగురు

- ఒకరి నామినేషన్ ఉపసంహరణ



నామినేషన్ వాపసు తీసుకుంటున్న డేవిడ్

కేజీఎఫ్: నగరంలోని 11వ వార్డుకు జరుగుతున్న ఉప ఎన్నికలో నామినేషన్ వాపసు తీసుకోవడానికి ఆఖరు రోజైన సోమవారం 1 నామినేషన్‌ను వాపసు తీసుకోవడంతో బరిలో 6 మంది అభ్యర్థులు మిగిలారు. కాంగ్రెస్ రెబెల్ అభ్యర్థి డేవిడ్ నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. గత కాంగ్రెస్ అభ్యర్థి మరణంతో వార్డు కౌన్సిలర్ స్థానానికి ఉప ఎన్నిక నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్ మద్దతుతో రమేష్ భార్య సుభాషిణి పోటీ పడుతున్నారు. ఇదే సమయంలో అభ్యర్థులకు ఎన్నికల కమిషన్ గుర్తులను అందించింది. కాంగ్రెస్ నాయకుడు, మాజీ అధ్యక్షుడు వళ్లల్ మునిస్వామి నగరసభ అభివృద్ధికి ఎమ్మెల్యే రూపా శశిధర్ ఎంతగానో శ్రమిస్తున్నారని, నగర అభివృద్ధి కోసం కాంగ్రెస్ అభ్యర్థిని వార్డు ప్రజలు గెలిపించాలని కోరారు.

చట్టాలపై అవగాహన అవసరం

కోలారు: ప్రతి ఒక్కరు చట్టాల గురించి అవగాహన పెంచుకోవాలని జిల్లా న్యాయ సేవల ప్రాధికార కార్యదర్శి సునీల్ ఎస్.హోసమని తెలిపారు. సోమవారం పాత్రికేయుల భవనంలో నిర్వహించిన తాలూకా స్థాయి మహిళా చర్చాగోష్టి, లక్ష్మీ పూజలో ఆయన మాట్లాడారు. భ్రూణ లింగ హత్యలకు పాల్పడితే రూ.2 లక్షల వరకు జరిమానా, ఏడాది పాటు జైలు శిక్ష పడుతుందన్నారు. పిల్లలకు చదువు చెప్పించకపోతే చట్ట ప్రకారం నేరమన్నారు. అందువల్ల 6 నుంచి 16 ఏళ్ల లోపు పిల్లలకు తప్పనిసరిగా చదువు చెప్పించాలన్నారు. పాత్రికేయుల సంఘం జిల్లా అధ్యక్షుడు బీవీ గోపినాథ్, సంస్థ జిల్లా డైరెక్టర్ పద్మయ్య, జనజాగృతి వేదిక సభ్యురాలు అరుణ, నివృత్త ఉపాధ్యాయిని మంజుల భీమరావ్ పాల్గొన్నారు.

20న తల్లిపాల బ్యాంకు ప్రారంభం

శివమొగ్గ: రోటరీ క్లబ్ శివమొగ్గ సహకారంతో శివమొగ్గ నగరంలో ఉన్న సర్జి తల్లీ బిడ్డల ఆస్పత్రిలో 20వ తేదీన అమృత బిందు పేరుతో తల్లి పాల బ్యాంకు ప్రారంభం కానుందని నిర్వాహకులు తెలిపారు. డాక్టర్.ధనంజయ సర్జి మాట్లాడుతూ తల్లి పాల కొరత ఉన్న శిశువులకు ఈ బ్యాంకు ఎంతగానో సహాయకంగా ఉంటుందన్నారు.

బాప్టిస్ట్ చర్చిలో ముందస్తు క్రిస్మస్

బనశంకరి: బెంగళూరు నగరంలోని రామచంద్రాపుర తెలుగు బాప్టిస్ట్ చర్చి (టీబీసీ)లో సోమవారం రాత్రి ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. చుట్టుపక్కల ప్రాంతాలు తెలుగు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. మహిళలు ఆంధ్ర కీర్తనలు ఆలపించారు. బాలలు ఏసుక్రీస్తు జన్మవృత్తాన్ని నాటక రూపంలో ప్రదర్శించారు. బాలలు చేసిన నృత్యం అందరిని ఆకట్టుకుంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ కార్పొరేటర్ పిళ్లప్ప మాట్లాడుతూ... ఏసుక్రీస్తు ప్రపంచ శాంతి కోసం ప్రాణాలు అర్పించారని తెలిపారు. మాజీ కార్పొరేటర్ పార్థీభన్‌రాజ్ మాట్లాడుతూ... ప్రజలందరూ శాంతియుతంగా జీవించాలన్నదే ఏసుక్రీస్తు సందేశమన్నారు. కార్యక్రమంలో ఫాదర్ రెవరెండ్ ఎంబీ.మోసస్, కాంగ్రెస్ నేతలు శ్రీనివాస్, జే.మార్యాద్రి, జనార్దన్, ఫాదర్ నాగభూషణరావు, బాలసుందరం తదితరులు పాల్గొన్నారు.



బాలలు నృత్యం చేస్తున్న దృశ్యం

కోలారు వార్తలు...

మొరార్జీలో కేంద్ర మంత్రి తనిఖీ



పిట్‌ను పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి నారాయణస్వామి

మాలూరు: తాలూకాలోని యలువళ్లి మొరార్జీ దేశాయి వసతి పాఠశాలలో విద్యార్థులను టాయ్‌లెట్ పిట్‌లోకి దింపి శుభ్రం చేయించిన ఘటనపై సోమవారం కేంద్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి ఎ.నారాయణస్వామి పాఠశాలను సందర్శించి పరిశీలించారు. కేంద్ర మంత్రి మాట్లాడుతూ వసతి పాఠశాలలో జరిగిన ఘటన సభ్య సమాజం తలదించుకునే విధంగా ఉందన్నారు. ఇది అక్షమ్య అపరాధమన్నారు. విద్యార్థి లోకానికి జరిగిన అవమానమన్నారు. జిల్లా యంత్రాంగం వైఫల్యం వల్లనే ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయన్నారు. జిల్లా యంత్రాంగానికి అధికారులపై పట్టు లేదని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఘటనకు నైతిక బాధ్యత వహించాలన్నారు. ఎంపీ ఎస్ మునిస్వామి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ తదితరులు ఉన్నారు.

బీజేపీ నేతల బృందం పరిశీలన

మొరార్జీ దేశాయి వసతి పాఠశాలను అసెంబ్లీలో ప్రతిపక్ష బీజేపీ నేత ఆర్.అశోక్, ఎమ్మెల్సీలు నారాయణస్వామి, రవికుమార్, బీజేపీ నాయకురాలు తేజస్వినిగౌడలతో కూడిన ప్రతినిధుల బృందం సోమవారం సందర్శించి పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వివరాలు సేకరించారు.

పాఠశాలలో గ్రూపులతోనే ఇలా చేశారు–ప్రిన్సిపాల్

కోలారు: మాలూరు తాలూకా యలువళ్లి గ్రామం వద్ద ఉన్న మొరార్జీ దేశాయి వసతి పాఠశాలలో బోధన, బోధనేతర సిబ్బంది రెండు గ్రూపులుగా మారి అనవసరంగా రాజకీయాలు చేస్తున్నారని పాఠశాల ప్రిన్సిపాల్ భారతమ్మ తెలిపారు. సోమవారం ఘటనపై స్పందించిన ఆమె గత ఆరేళ్లుగా తాను ఇక్కడ ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్నానన్నారు. ఎప్పుడూ ఎలాంటి వివాదాలు లేవు. ఉపాధ్యాయులందరం కలిసికట్టుగా ఉండేవారం అన్నారు. ఇద్దరు ఉపాధ్యాయులు బదిలీపై ఇక్కడికి వచ్చినప్పటి నుంచి ఇలాంటివి చోటు చేసుకుంటున్నాయన్నారు. విద్యార్థులను ఏనాడు హింసించలేదన్నారు. విద్యార్థినుల గదుల్లో రహస్యంగా వీడియో చిత్రీకరణ చేయలేదన్నారు. తరగతి గదుల్లో ఉపాధ్యాయులు పిల్లలను నామమాత్రంగానే దండిస్తున్నారు కాని ఇష్టారాజ్యంగా కొట్టడం లేదన్నారు. ప్రతి తరగతి గదిలోను సీసీ టీవీలు ఉన్నాయని, ఫుటేజ్‌ను ఎవరైనా గమనించవచ్చని తెలిపారు.

అధికారులపై చర్యలకు వినతి



వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

కోలారు: జిల్లా వ్యాప్తంగా వసతి పాఠశాలల్లో విద్యార్థులపై జరుగుతున్న దౌర్జన్యాలను తీవ్రంగా పరిగణించి సాంఘిక సంక్షేమ శాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం రైతు సంఘం పదాధికారులు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె నారాయణగౌడ మాట్లాడుతూ వసతి పాఠశాలలపై అజమాయిషీ చేయాల్సిన సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో ఉపాధ్యాయులు, సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. నకిలీ బిల్లులను సృష్టించి రూ.కోట్లను స్వాహా చేయడమే కాకుండా వసతి పాఠశాలల్లో పిల్లలపై దౌర్జన్యాలు చేస్తున్నారన్నారు. వసతి పాఠశాలల్లో ఉండలేక ఎంతో మంది విద్యార్థులు బయటకు వచ్చేస్తున్నారన్నారు. వసతి పాఠశాలల్లో జరుగుతున్న అక్రమాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం ఉప విభాగాధికారిణి వెంకటలక్ష్మికి వినతిపత్రం సమర్పించారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు ఎ.నళినిగౌడ, మంగసంద్ర తిమ్మణ్ణ, వక్కలేరి హనుమయ్య, నరసింహయ్య తదితరులు పాల్గొన్నారు.

మంత్రాక్షతలకు ఘన స్వాగతం

- కోలారమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



మంత్రాక్షతలకు స్వాగతం పలుకుతున్న దృశ్యం

కోలారు: శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు ఆధ్వర్యంలో పవిత్ర మంత్రాక్షతలకు నగరంలోని బస్టాండు సర్కిల్ వద్ద ఉన్న శ్రీరామ ఆలయం ముందు ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రాక్షతలను కోలారమ్మ ఆలయం వరకు ఊరేగింపుగా తీసుకు వెళ్లారు. అక్కడ మంత్రాక్షతల కలశాలకు పూజలు నిర్వహించారు. సోమేశ్వరస్వామి ఆలయంలో కూడా విశేష పూజలు చేశారు. నాగలాపుర మహా సంస్థాన పీఠాధ్యక్షుడు తేజేశలింగ శివాచార్య స్వామీజీ మాట్లాడుతూ దేశ భావైక్యతకు ప్రతీక అయిన రామజన్మభూమి మందిర ప్రారంభానికి దేశం యావత్తూ వేచి చూస్తోందన్నారు. శ్రీరామ మందిర ప్రారంభోత్సవం జరుగుతున్న రోజు భారతీయులకు పవిత్ర దినమన్నారు. ప్రారంభోత్సవంలో ప్రతి భారతీయుడు శ్రద్ధాభక్తులతో పాల్గొనాలన్నారు. భజరంగదళ్ బాబు, బాలాజీ, అప్పి, ఆర్‌ఎస్‌ఎస్ డాక్టర్ శంకర్‌నాయక్, బీహెచ్‌పీ డాక్టర్ శివణ్ణ, బీజేపీ నాయకులు ఓం శక్తి చలపతి, విజయకుమార్, తిమ్మరాయప్ప, అరుణమ్మ, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపరిహారం కోసం ధర్నా



రోడ్డుపై బైఠాయించి ధర్నా చేస్తున్న దృశ్యం

శ్రీనివాసపురం: పంట నష్ట పోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేల చొప్పున నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేస్తూ సోమవారం రైతు సంఘం కార్యకర్తలు శ్రీనివాస సర్కిల్ వద్ద రోడ్డుపై ఎండు గడ్డిని పారేసి ధర్నా చేశారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె నారాయణగౌడ మాట్లాడుతూ వానలు లేక పశువుల మేత కరువై కరువుతో జిల్లా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం తాలూకాకు ఒకటి చొప్పున గోశాలను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. అనంతరం గ్రేడ్–2 తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ధర్నాలో తాలూకా అధ్యక్షుడు యలువళ్లి ప్రభాకర్, జిల్లా కార్యాధ్యక్షుడు హెబ్బణి ఆనందరెడ్డి, రాజేష్ పాల్గొన్నారు.

ఎలుగుబంటి ప్రత్యక్షం



రోడ్డుపై తిరుగుతున్న ఎలుగుబంటి

తుమకూరు: తుమకూరు జిల్లా మధుగిరి తాలూకా పులమాచి గ్రామంలో సోమవారం తెల్లవారుజామున ఎలుగుబంటి ప్రత్యక్షమైంది. దీంతో చుట్టుపక్కల గ్రామాల భయాందోళనతో ఉన్నారు. పులమాచి గ్రామంలో తెల్లవారుజామున 5 గంటల సమయంలో రోడ్డుపక్కన ఎలుగుబంటి వెళ్తున్న దృశ్యాన్ని గుర్తించిన గ్రామస్తులు మొబైల్‌లో ఫొటోలు తీశారు. సమాచారం అందుకున్న అటవీ అధికారులు ఎలుగుబంటి కోసం గాలిస్తున్నారు.

ఉపాధికొస్తే ఊపిరి పోయింది



మృతి చెందిన శివరాజు దృశ్యం

గుడిబండ: మడకశిర నియోజకవర్గం పరిధిలోని తాళికెర గ్రామంలో ఓ ఇంట్లో టైల్స్ అమర్చుతూ కరెంటు షాక్ తగిలి శివరాజు (45) అనే కార్మికుడు మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. కర్ణాటక రాష్ట్రం మధుగిరి పట్టణానికి చెందిన శివరాజు రోజు టైల్స్ పని చేస్తుంటాడు. గుడిబండ మండలం తాళికెరలో ఓ ఇంట్లో టైల్స్ వేస్తుండగా కరెంటు వైర్లు తగిలి షాక్ కొట్టడంతో స్పృహ తప్పి పడిపోయాడు. స్థానికులు వాహనంలో మడకశిర ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్లారు. వైద్యులు పరీక్షించి చికిత్సలు అందించేలోపు మృతి చెందాడు.

నేడు ప్రధాని మోదీతో సీఎం భేటీ!

- సిద్దు 3 రోజులు ఢిల్లీ యాత్ర

శివాజీనగర: సీఎం సిద్దరామయ్య, మంగళవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఢిల్లీలో భేటీ చేయనున్నారు. ఈ ఏడాది మే లో ముఖ్యమంత్రి పదవిని చేపట్టిన సిద్దరామయ్య ఆనాటి నుంచి ప్రధానితో సమావేశం కోసం ప్రయత్నిస్తూ ఉన్నారు. అయితే ప్రధాని ఆఫీసు నుంచి అనుమతి రాలేదు. నవంబర్ 17న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు లేఖ రాసిన సిద్దరామయ్య, రాష్ట్రంలో కరువు పరిస్థితి, నీటి సరఫరా ప్రాజెక్టులతో పాటుగా వివిధ విషయాల గురించి చర్చించేందుకు అవకాశమివ్వాలని విన్నవించారు. సోమవారం సాయంత్రం ఢిల్లీకి తరలిన సిద్దరామయ్య, మూడు రోజుల పాటు అక్కడే ఉంటారు. కాంగ్రెస్ పార్టీ సమావేశాల్లో పాల్గొంటారు. ఆపై పలువురు కేంద్రమంత్రులతో భేటీ అవుతారని తెలిసింది. ఎట్టకేలకు మంగళవారం ఉదయం 11 గంటలకు ప్రధాని మోదీని కలవడానికి అపాయింట్‌మెంట్ లభించింది.

క్లుప్తంగా

హక్కు పత్రాల పంపిణీ


హక్కు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే


కృష్ణరాజపురం: బెంగళూరు గ్రామీణ జిల్లా పరిధి హోసకోటె నియోజకవర్గం దొడ్డహుల్లూరు గ్రామంలో నివాసం ఉంటున్న 40 మంది నిరుపేద కుటుంబాలకు స్థానిక ఎమ్మెల్యే శరత్ బచ్చేగౌడ సోమవారం హక్కు పత్రాలను అందజేశారు. హోసకోటె తాలూకా దొడ్డహులూరు గ్రామంలో 102 మంది అర్హులకు హక్కు పత్రాలు అందజేయాల్సి ఉంది.

ఏనుగు అర్జున మృతిపై విచారణ జరపాలి


ధర్నా చేస్తున్న సభ్యులు

తుమకూరు: మైసూరు దసరా ఉత్సవాల్లో పలుమార్లు అంబారీ మోసిన ఏనుగు అర్జున మృతిపై అనుమానాలు ఉన్నాయని, ఈఘటనపై వెంటనే ఉన్నతస్థాయి విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ జిల్లా విభాగం గంధద గుడి ఫౌండేషన్ సభ్యులు సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం తుమకూరు కలెక్టరేట్ చేరుకుని అక్కడ ఆందోళన చేశారు. ఏనుగు మృతిపై వెంటనే విచారణ జరిపి కారకులను శిక్షించాలని డిమాండ్ చేశారు. ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు లోకేశ్‌రెడ్డి జిల్లా అధికారికి వినతిపత్రం అందజేశారు.

ఘాటిలో చంపా షష్టి పూజలు



దొడ్డబళ్లాపురం: చంపాషష్టి సందర్భంగా దొడ్డ తాలూకాలోని ప్రసిద్ధ ఘాటి సుబ్రమణ్య దేవాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు జరిగాయి. తెల్లవారుజాము నుండే వేల సంఖ్యలో భక్తులు ఘాటి క్షేత్రానికి విచ్చేసి స్వామి దర్శనానికి బారులు తీరారు. షష్టి సందర్భంగా దేవాలయాన్ని విద్యుత్ దీపాలతో, పూలతో సర్వాంగసుందరంగా అలంకరించారు.

ఆట బొమ్మలు పంపిణీ



బొమ్మనహళ్లి: సీపీ చంద్రశేఖర శెట్టి, క్యాప్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కలాం పర్ కలాం పథకంలో భాగంగా మైసూరు నగరంతో పాటు జిల్లాలోని వెయ్యి అంగన్‌వాడీ కేంద్రాలు, 531 ప్రభుత్వ పాఠశాలలకు ఆట బొమ్మలు, పుస్తకాలు పంపిణీ చేశారు. మైసూరు జిల్లా నంజనగూడు ప్రభుత్వ పీయూ కళాశాల మైదానంలో సోమవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో అంగనవాడీ పాఠశాలలకు చెక్కతో చేసిన గుర్రం బొమ్మలు, ఇతర ఆట వస్తువులు, పంపిణీ చేశారు. అదే విధంగా ఐదువేల మంది విద్యార్థులకు టీషర్టులు అందజేశారు.

దైవ కుమారుడు భువికి ఏతెంచిన రోజే క్రిస్మస్


సెమీ క్రిస్మస్ వేడుకల్లో వివిధ చర్చీల పాస్టర్లు

శివాజీనగర: లోక కల్యాణార్థమై దైవ కుమారుడు ఈ భువికి ఏతెంచిన రోజే క్రిస్మస్ అని సీనియర్ పాస్టర్ రెవరెండ్ ప్రేమానందం తెలిపారు. ఆదివారం సాయంత్రం నగరంలోని శేషాద్రిపురం గ్లోరీ ప్రేయర్ హాల్‌లో కర్ణాటక క్రిస్టియన్ మైనార్టీ కౌన్సిల్ బోర్డు నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో యేసు క్రీస్తు పుట్టుక గురించి విశదీకరించిన ఆయన, మానవ పాప పరిహార నిమిత్తం ఏసుక్రీస్తు పశువుల పాకలో జన్మించి, పవిత్ర రక్తాన్ని ఆ సిలువపై కార్చి మానవులకు విముక్తి కలిగించారని తెలిపారు. ప్రపంచమంతా డిశెంబర్ 25న క్రీస్తు పుట్టుకను జ్ఞాపకం చేసుకొంటూ అత్యంత సంబరంగా వేడుకలను జరుపుకొంటున్నారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కర్ణాటక క్రిస్టియన్ మైనార్టీ కౌన్సిల్ బోర్డు సభ్యులు, వివిధ చర్చీలు పాస్టర్లు పాల్గొన్నారు.

రమణీయం కోటెబెట్ట


ట్రెక్కింగ్ చేస్తున్న పర్యాటకులు


మల్లళ్లి జలపాతం

- ట్రెక్కింగ్‌కు అనువైన ప్రాంతం
- కూర్గ్‌లో ఎత్తైన ప్రదేశం
- జలపాతాలు, కొండలతో కమనీయ దృశ్యాలు

బనశంకరి: కోటెబెట్ట మడికేరి నుంచి 15 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇది 1620 మీటర్ల ఎత్తులో ఉన్న ప్రాంతంలోని 3 ఎత్తైన శిఖరాల్లో ఒకటి. హిందూపురాణాల్లో ఈ ప్రదేశానికి ప్రాముఖ్యత ఉంది. కోటెబెట్ట అనేది పోర్ట్ హిల్‌గా ఉండగా ప్రసిద్ధ ఇతిహాసం. మహాభారతంలోని పాండవులు ఈ ప్రాంతంలో తమ అజ్ఞాతవాస సమయంలో గణనీయమైన సమయాన్ని గడిపారని నమ్ముతారు. ఈ కొండప్రాంతం అద్భుతమైన పచ్చని అడవులు, గంభీరమైన పశ్చిమ కనుమలకు ప్రసిద్ధిచెందింది. అనేక కాఫీ తోటలు, సుగంధద్రవ్యాల ఎస్టేట్స్‌లతో పాటు జాక్‌ఫ్రూట్ తోటలు కూడా ఇక్కడ చూడవచ్చు. కొండపై నుంచి 360 డిగ్రీల దృశ్యం మంత్రముగ్ధులను చేస్తుంది.

కనువిందు చేసే అందాలు :

కోటెబెట్ట సాహసం, ట్రెక్కింగ్ లేదా రాక్ క్లైంబింగ్ వంటి ఉత్తేజకరమైన క్రీడలను ఇష్టపడే వ్యక్తులకు అద్భుతమైన ప్రదేశం. ఇక్కడ శివాలయం కూడా ఉంది. ట్రెక్కింగ్ ట్రయల్స్ గూండా వెళుతున్నప్పుడు, సాంబార్లు, ముంగిసలు, ఇండియన్ స్క్విరిల్స్, గౌర్స్ వంటి అనేక అడవి జంతువులను చూడవచ్చు. వాలు చాలా నిటారుగా లేకపోగా ట్రెక్కింగ్ ట్రయల్స్ చాలా స్నేహపూర్వకంగా ఉంటాయి కాబట్టి, ప్రజలు కొండపైకి చక్కని సౌకర్యవంతమైన ట్రెక్‌ను ఆస్వాదించడం సులభతరం అవుతుంది. కొన్ని స్పేర్ బ్యాటరీలతో పాటు కెమెరాను మీతో తీసుకెళ్లాలి. కోటెబెట్ట పైనుంచి అద్భుతమైన దృశ్యాలు, స్పష్టంగా మెరుస్తున్న నీలాకాశం దృశ్యాలు ప్రకృతి పరవశింపచేస్తుంది. హట్టినదిపై కనిపించే హట్టిహోల్ వంతెనను కూడా వీక్షించవచ్చు. ఇది కోటెబెట్ట నుంచి కొద్ది దూరంలో ఉంది. వంతెన చెక్క పలకలతో తయారు చేయబడింది. తాడుసాయంతో గట్టిగా భద్రపరచబడింది. అద్భుతమైన ఫొటోలు తీయడానికి అనువైన ప్రదేశం. కోటెబెట్ట ఆశ్చర్యాలతో నిండి ఉంది. పశ్చిమ కనుమల్లోని మల్లళ్లి జలపాతం ఈ ప్రాంతంలో వీక్షించే మరో ప్రదేశం. వసంత కాలంలో ఈ కొండను సందర్శించడం ఉత్తమం, ఎందుకంటే వేసవికాలంలో ఇది చాలా వెచ్చగా ఉంటుంది. వర్షాకాలంలో చాలా జారుడుగా ఉంటుంది.


ప్రకృతి సౌందర్యాల నడుమ సాగుతున్న ట్రెక్కింగ్


పొగమంచుతో పశ్చిమ కనుమల అందాలు


వేలాడే వంతెన

21న సీఎం జగన్ పుట్టిన రోజు


పోస్టర్‌ను విడుదల చేస్తున్న వైఎస్‌ఆర్‌సీపీ కుటుంబ సభ్యులు

- వలు సేవా కార్యక్రమాల నిర్వహణ

బనశంకరి: సీఎం వైఎస్ జగన్ పుట్టిన రోజును పురస్కరించుకుని బెంగళూరు–మారతహళ్లి వైఎస్‌ఆర్ సీపీ కుటుంబ సభ్యులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 21న మారతహళ్లి వర్తూరు రోడ్డు, కుందనహళ్లిగేట్ కరుణాశ్రయ క్యాన్సర్ ఆసుపత్రిలో ఉదయం 7.30 గంటలకు కేక్ కటింగ్, స్వీట్లు, పండ్ల పంపిణీ చేస్తామని వైఎస్‌ఆర్ సీపీ కుటుంబం తెలిపింది. ఈ మేరకు వైఎస్‌ఆర్‌సీపీ కుటుంబ సభ్యులు, మిత్రులు కార్యక్రమ పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో లయన్ భాస్కర్ రెడ్డి అంబవరం (ఏపీసీఓఎస్ స్టేట్ డైరెక్టర్) వైఎస్ ఆర్‌సీపీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 29న బనశంకరీ సన్నిధిలో సామూహిక వివాహాలు

బనశంకరి: బనశంకరి సామూహిక వివాహ వేదిక ఆధ్వర్యంలో 2024 ఫిబ్రవరి 29న సామూహిక వివాహాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు సోమవారం నగరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివాహ వేదిక వ్యవస్థాపకుడు, బీబీఎంపీ మాజీ విపక్షనేత ఏహెచ్.బసవరాజ్ వివరాలు వెల్లడించారు. గత 24 ఏళ్లుగా సామూహిక వివాహాలు నిర్వహిస్తున్నామని, ఇప్పటి వరకు తమ వేదిక ద్వారా 1431కి పైగా జంటలకు ఉచిత వివాహాలు జరిపించామని, నేటి రోజుల్లో పెళ్లి ఎంతో ఖర్చుతో కూడుకున్న వ్యవహారమని, పేదలు భరించలేరన్నారు. దీంతో సామూహిక వివాహాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. 2024 ఫిబ్రవరి 29 తేదీ ఉదయం 11.12 నిమిషాల వృషభ లగ్నంలో సామూహిక వివాహ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. బెంగళూరు, బెంగళూరు గ్రామాంతర, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో నివసించే వారు సామూహిక వివాహాల్లో పెళ్లి చేసుకోవచ్చన్నారు. వివాహం చేసుకోబోయే వధూవరులు, తల్లిదండ్రులు తమ పేర్లు నమోదు చేసుకోవాలి, హిందూ సాంప్రదాయం ప్రకారం దుస్తులు, బాసింగం, కంకణధార, పూలహారం, మాంగళ్యం, కాలి మెట్టెలు, తలపేటి భోజన వ్యవస్థ కల్పిస్తామన్నారు. విలేకరుల సమావేశంలో వేదిక పదాధికారులు దామోదర్‌నాయుడు, హెచ్‌కే.ముత్తప్ప, ఆర్.నారాయణస్వామి, సీ.ముత్తప్ప తదితరులు పాల్గొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న ఏహెచ్.బసవరాజ్ తదితరులు

23, 24న తెలుగు ప్రతినిధుల సభలు

శివాజీనగర: బెంగళూరు తెలుగు విజ్ఞాన సమితి ఆధ్వర్యంలో ఈ నెల 23–24 తేదీల్లో బెంగళూరులో అఖిల భారత తెలుగు సంస్థల ప్రతినిధుల సమావేశం జరగనుంది. సోమవారం సమితి అధ్యక్షుడు ఏ.రాధాకృష్ణరాజు, రాష్ట్రేతర తెలుగు సమాఖ్య అధ్యక్షుడు రాళ్లపల్లి సుందరరావు విలేకరుల సమావేశంలో తెలిపారు. దేశంలోని 18 రాష్ట్రాల తెలుగు సంస్థల ప్రతినిధులు సుమారు 300 మంది పాల్గొంటారని తెలిపారు. తెలుగు భాషా వికాసం, పరభాషలతో తెలుగు అనుబంధం తదితరాలపై చర్చలు జరుగుతాయని చెప్పారు. ఆయా రాష్ట్రాలలో తెలుగు భాషా వికాసానికి కృషి చేస్తున్న తెలుగు ప్రముఖులను రాష్ట్రేతర రత్న పురస్కారాలతో సత్కరించనున్నట్లు చెప్పారు. ఈ నెల 23న ఉదయం 9 గంటలకు మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు హాజరై లాంఛనంగా ప్రారంభిస్తారని, అనేకమంది తెలుగు ప్రముఖులు పాల్గొంటారని చెప్పారు. ఈ సమావేశంలో తెలుగు విజ్ఞాన సమితి ప్రధాన కార్యదర్శి ఇడమకంటి లక్ష్మీరెడ్డి, ఉపాధ్యక్షులు కే.గంగరాజు, ఆర్.ఆదికేశవులు నాయుడు, కోశాధికారి సీపీ వరదరాజులు పాల్గొన్నారు.


తెలుగు విజ్ఞాన సమితి సభ్యులు

సాంస్కృతిక కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలి

గౌరిబిదనూరు: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలలో పాలుపంచుకోవాలని మాజీ మంత్రి శివశంకరరెడ్డి తెలిపారు. ఆదివారం రాత్రి డా హెచ్ఎన్ కళాభవనంలో దిక్సూచి నాట్యాలయ ఆధ్వర్యంలో జరిగిన రెండు రోజుల నృత్య శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. తన హయాంలో నిర్మించిన ఈ కళాభవనం చాలా ఉపయోగ పడుతోందని, ఇప్పుడు 250 మంది విద్యార్థులు ఇక్కడ శిక్షణ పొందుతూ ఉండటం సంతోషకరమన్నారు. దిక్సూచి నాట్యాలయ వారు ఇప్పటికే వేలాది మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చారన్నారు. దక్షిణ కన్నడ జిల్లా పుత్తూరు నుండి వచ్చిన మంజునాథ్ విద్యార్థులకు నృత్యంలో మెళకువలు నేర్పించారు. కార్యక్రమంలో దిక్సూచి నాట్యాలయం సంస్థాపకురాలు దివ్యా శివనారాయణ్, సాసూ నాగేంద్ర, డా కెవి ప్రకాశ్, సహ ఉపాధ్యాయురాలు భాగ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.


నృత్య శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే శివశంకర్ రెడ్డి తదితరులు

సిట్ దర్యాప్తు రద్దు

బనశంకరి: బృహత్ బెంగళూరు మహానగర పాలికెలో అభివృద్ధి పనుల్లో జరిగిన అక్రమాలకు సంబంధించి నియమించిన సిట్ దర్యాప్తును రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. కోర్టు స్టే ఇచ్చిన నేపథ్యంలో సిట్ రద్దు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. పాలికె పరిధిలో 2019–20 నుంచి 2022–23 వరకు చేపట్టిన అభివృద్ధి పనుల్లో చోటుచేసుకున్న అక్రమాలపై అందిన ఫిర్యాదుకు సంబంధించి దర్యాప్తునకు ఏర్పాటు చేసిన సిట్‌ను రద్దు చేసింది. పొడిచెత్త నిర్వహణ, రోడ్ల అభివృద్ధి, ఓఎఫ్‌సీ కేబుల్ అమరిక, బృహత్ నీటికాలువతో పాటు ఇతర అభివృద్ధి పనుల్లో అక్రమాలు చోటుచేసుకున్నాయని ఫిర్యాదులతో పూర్తి స్థాయి దర్యాప్తు నివేదికను 30 రోజుల్లోగా ప్రభుత్వానికి అందించాలనే ఆదేశాలను నలుగురు నిపుణులతో ఎస్ఐటీ ఏర్పాటు చేసింది. తాజాగా సిట్‌ను రద్దు చేస్తూ ప్రభుత్వం సోమవారం ఆదేశాలు ఇచ్చింది.

హోసూరు వార్తలు..

మద్యం మత్తులో బావిలో పడి మృతి

క్రిష్ణగిరి: మద్యం మత్తులో బావిలో పడి ట్రాక్టర్ డ్రైవర్ మృతి చెందిన ఘటన కందికుప్పం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకొంది. వివరాలు... క్రిష్ణగిరి జిల్లా కందికుప్పం సమీపంలోని మరుదేపల్లి గ్రామానికి చెందిన తిరుపతి (28) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. మద్యం అలవాటు ఉన్న ఇతను ఆదివారం రాత్రి ద్విచక్ర వాహనంలో బయటకు వచ్చి అతిగా మద్యం తాగాడు. ద్విచక్ర వాహనాన్ని రోడ్డు పక్కన నిలిపి సమీపంలోని బావివద్దకెళ్లాడు. అదుపుతప్పి నీటిలో పడి మృతి చెందాడు. కందికుప్పం పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు.

చెరువు కట్టను బాగు చేయరూ


తెగిపోయిన చెరువు కట్ట

కెలమంగలం: గత ఏడాది కురిసిన భారీ వర్షాల కారణంగా తెగిపోయిన చెరువు కట్టకు మరమ్మత్తులు చేపట్టాలని ఏడాది కాలంగా కోరుతున్నా ఫలితం లేదని హెచ్.శెట్టిపల్లి గ్రామస్థులు వాపోయారు. గత ఏడాది భారీ వర్షాలకు కెలమంగలం సమీపంలోని హోసపురం, హెచ్.శెట్టిపల్లి సమీపంలోని చెరువుకు 15 ఏళ్ల తర్వాత వరదనీరు చేరింది. నీటి ఉధృతికి చెరువు కట్ట తెగిపోయింది. దీంతో చెరువులో నిల్వ ఉన్న నీరు పూర్తిగా బయటకెళ్లిపోయింది. ఈ కట్టను బాగు చేయాలని ప్రజలు, రైతు సంఘ నాయకులు శాఖాధికార్లతో పాటు జిల్లా కలెక్టర్‌కు కూడా వినతిపత్రం అందజేసినా ఫలితం లేదని తెలిపారు.

సహాయక సామగ్రి తరలింపు

హోసూరు: మిగ్‌జామ్ తుపాను బాధితులకు క్రిష్ణగిరి జిల్లా నుంచి రూ. 12 లక్షల విలువ చేసే వస్తు సామగ్రిని జిల్లా కలెక్టర్ శరయు సోమవారం పంపించారు. తుపాను వల్ల చెన్నై అతలాకుతలమైంది. వరద బాధితులను ఆదుకొనేందుకు జిల్లాలోని పరిశ్రమాధిపతులు, సంస్థలు ముందుకొచ్చి తమవంతు సాయాన్ని అందజేస్తున్నారు. అందులో భాగంగా 10వ విడతగా రూ. 12 లక్షల విలువ చేసే నిత్యావసర వస్తువులను రెండు లారీలలో చెన్నైకు పంపారు.

మేయర్ పర్యటన

మేయర్ ఎస్.ఏ.సత్య సోమవారం హోసూరులోని 25వ వార్డుకు చెందిన తిలగర్ పేట, గొల్లవీధి, ఆల్వార్ అయ్యా సంధు, నెసవాళర్ వీధి, ఎం.జి.రోడ్డు, కాజల్‌బండా ప్రాంతాల్లో పర్యటించారు. పలు సమస్యలు ప్రజలు ప్రస్తావించారు. కార్పొరేటర్లు మల్లిగాదేవరాజ్, నాగరాజ్ ఉన్నారు.

న్యాయమూర్తి స్థల పరిశీలన

క్రిష్ణగిరి: తాలూకా కేంద్రం సూళగిరిలో కోర్టు ఏర్పాటు స్థలాన్ని చెన్నై హైకోర్టు న్యాయమూర్తి దండపాణి పరిశీలించారు. తాలూకా కేంద్రంగా స్థాయి పెంచిన సూళగిరిలో కోర్టును ఏర్పాటు చేయాలని తాలూకా ప్రజలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ వచ్చింది. ప్రస్తుతం సూళగిరి యూనియన్‌లోని 42 గ్రామపంచాయతీల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి హోసూరు, క్రిష్ణగిరి కోర్టులకు వెళ్లవలసి ఉందని, సూళగిరిలో కోర్టును ఏర్పాటు చేయాలని కోరుతూ వచ్చారు. ఈ విషయంపై స్పందించిన ప్రభుత్వం సూళగిరిలో కోర్టు ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం సూళగిరిలోని పాత బీడీవో కార్యాలయంలో తాత్కాలిక కోర్టు నిర్వహణకు ఆదేశాలు జారీ చేయడంతో చెన్నై హైకోర్టు న్యాయమూర్తి దండపాణి పాతబీడీవో కార్యాలయాన్ని పరిశీలించారు. జనవరి 15 లోపు భవనంలో మరమ్మతు పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం సూళగిరి– బేరికె రోడ్డులో కొత్తగా ఏర్పాటు చేయనున్న కోర్టు భవన నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో క్రిష్ణగిరి కోర్టు ప్రధాన న్యాయమూర్తి సుమతిసాయిప్రియ, చైర్‌పర్సన్ లావణ్యమధు, బీడీవో విమల్ రవికుమార్ తదితరులు ఉన్నారు.


కోర్టు స్థల పరిశీలన చేస్తున్న దృశ్యం

ప్లాస్టిక్ కవర్లను వాడొద్దు

హోసూరు: హోసూరు కార్పొరేషన్ పరిధిలో ప్లాస్టిక్ కవర్ల నిషేధంపై మాంస దుకాణదారులకు అవగాహన కల్పించారు. పారిశుధ్య శాఖాధికారి ప్రభాకరన్, పారిశుధ్య కమిటీ అధ్యక్షుడు ఎస్.ఎస్.మాదేశ్వరన్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొని చైతన్య కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంగళ్లలో ప్లాస్టిక్ కవర్లను స్వాధీనపరుచుకొని జరిమానా విధిస్తున్నామని, పట్టణంలో ప్రధానంగా కాయగూరల వ్యాపారులు, మాంస దుకాణదారులు, చేపల దుకాణదారులు ఎక్కువ సంఖ్యలో ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తున్నారని తెలిపారు. ప్లాస్టిక్ కవర్ల వినియోగం వల్ల ఏర్పడే సమస్యలపై వ్యాపారులకు చైతన్య కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పట్టణంలో ప్లాస్టిక్ నిషేధంపై ప్రజల్లో చైతన్యం కల్పించి సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధానికి కృషి చేస్తామని చెప్పారు.

సబ్‌కలెక్టర్‌గా ప్రియాంక


బాధ్యతలు స్వీకరిస్తున్న ప్రియాంక

హోసూరు: హోసూరు సబ్ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న శరణ్య కొద్ది రోజుల క్రితం బదిలీ కావడంతో ఆమె స్థానంలో ప్రియాంకను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం ప్రియాంక సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. కార్యాలయ సిబ్బంది ఆమెకు స్వాగతం పలికారు.

బరిలో ముగ్గురు అభ్యర్థులు

చింతామణి: ఈనెల 27న జరిగే నగరసభ 18వ వార్డు ఉప ఎన్నికలో సోమవారం నామినేషన్ల ఉపసంహరణ జరగ్గా ముగ్గురు అభ్యర్థులు మాత్రమే బరిలో నిలిచినట్లు ఎన్నికల అధికారి సవిత తెలిపారు. కాంగ్రెస్ మద్దతుదారుడు మహ్మద్ షఫిక్, జేడీఎస్ పార్టీ మద్దతుదారు మునావర్, బీజేపీ మద్దతుదారు సూర్య ప్రకాశ్ బరిలో నిలిచారు. మొత్తం 1800 ఓట్లు ఉండగా మార్కెట్‌యార్డులో రెండు ఓటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

పందిదాడిలో రైతు మృతి

యశవంతపుర: పొలం పనుల్లో ఉన్న రైతుపై అడవి పంది దాడి చేయడంతో అతను అక్కడికక్కడే మృతి చెందిన ఘటన హాసన జిల్లా హొళెనరసీపుర తాలూకా హరగొడనహళ్లిలో జరిగింది. అదే గ్రామానికి చెందిన రైతులు రాజేగౌడ (63), కాంతమ్మ, నంజమ్మలు పొలంలో పని చేస్తుండగా అడవి పంది ఆకస్మికంగా రైతులపై దాడి చేసింది. దాడిలో రాజేగౌడకు బలమైన గాయాలు కావడంతో అతను తీవ్ర రక్తస్రావంతో మృతి చెందాడు. గాయపడిన మహిళలను హాసన హిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అటవీశాఖ అధికారులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. గ్రామస్తులు అడవి పందిని వెతికి చంపినట్లు తెలిసింది.

నలుగురి అరెస్ట్

దక్షిణ కన్నడ జిల్లాకు చెందిన లీలాధర శెట్టి కూతురు, మైనర్ బాలిక అపహరణ కేసుకు సంబంధించి పోలీసులు కాసరగోడు కుంబలెలో ఆమె స్నేహితులు శిర్వ నివాసి గిరీశ్ (20), రూపేశ్ (22), జయంత్ (23), మహమ్మద్ అజీజ్ (21)లను అరెస్ట్ చేశారు. లీలాధర శెట్టి ఓ బాలికను దత్తత తీసుకుని పెంచుకుంటున్నాడు. ఆమె ఈ నెల 11న అపహరణకు గురైంది. ఆమె స్నేహితుడు గిరీశ్‌పై కాపు పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. తమకు జరిగిన అవమానాన్ని భరించలేక లీలాధర శెట్టి, అయన భార్య వసుంధరా ఇంటిలో ఉరి వేసుకుని ఇటీవల ఆత్మహత్య చేసుకున్నారు. ఘటనకు గిరీశ్ కారణమని తెలియటంతో అతడికి సహకరించిన వారిని కూడా పోలీసులు అరెస్ట్ చేశారు.

లారీ ఢీ, బైకిస్టు మృతి



తుమకూరు: లారీ బైక్‌ను ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన తుమకూరు నగర సమీపంలోని శిరగేట్ ఎస్‌మాల్ వద్ద చోటుచేసుకుంది. మృతుడిని తుమకూరు శాంతి నగరకు చెందిన రాజన్న (64)గా గుర్తించారు. రాజన్న బెంగళూరు లాల్‌బాగ్ విశ్రాంత ఉద్యోగి. సోమవారం ఉదయం కూరగాయల కోసం అంతరసనహళ్లి మార్కెట్‌కు వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా వేగంగా వచ్చిన లారీ ఢీకొంది. దీంతో రాజన్న ఘటన స్థలంలోనే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు..

బనశంకరి: బ్యాటరాయనపుర పరిధిలో సోమవారం గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధురాలు మృతి చెందారు. హొసగుడ్డదహళ్లి నివాసి జయలక్ష్మి అనే వృద్ధురాలు సోమవారం ఉదయం 6 గంటల సమయంలో అగరబత్తి ఫ్యాక్టరీలో విధులకు వెళ్తుండగా మైసూరురోడ్డు బ్యాటరాయనపుర వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వృద్ధురాలు అక్కడికక్కడే మృతి చెందింది. ప్రమాదం జరిగిన వెంటనే వాహనంతో సహా డ్రైవర్ ఉడాయించాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

విద్యార్థిని కిడ్నాప్.. డ్రైవర్ అరెస్ట్


వెంకటేష్

హోసూరు: హోసూరు పారిశ్రామిక ప్రాంతంలో పదవ తరగతి చదువుతున్న బాలికను కిడ్నాప్ చేసిన కారు డ్రైవర్‌ను మహిళా పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు... హోసూరు పారిశ్రామిక ప్రాంతానికి చెందిన 15 ఏళ్ల బాలిక అదే ప్రాంతంలోని పాఠశాలలో పదవ తరగతి చదువుతుంది. రెండు రోజుల క్రితం పాఠశాలకెళ్లిన బాలిక తిరిగి రాకపోవడంతో భయపడిన తల్లిదండ్రులు చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో గాలించారు. జాడ తెలియకపోవడంతో మహిళా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ జరిపి సూళగిరి సమీపంలోని నీలివంక గ్రామానికి చెందిన వెంకటేష్‌ను అరెస్ట్ చేసి అతనిపై పోక్సో కేసు నమోదు చేసి సేలం జైలుకు తరలించారు.

వైట్‌ఫీల్డ్‌లో మిడ్‌నైట్ మారథాన్


మారథాన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మంజుల

కృష్ణరాజపురం: నగరంలోని మహాదేవపుర నియోజకవర్గం వైట్‌ఫీల్డ్ కేటీపీఓలో మిడ్‌నైట్ మారథాన్‌ను ఎమ్మెల్యే మంజుల లింబావళి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... 16 ఏళ్లుగా బెంగళూరు మిడ్‌నైట్ మారథాన్‌ను విజయవంతంగా నిర్వహిస్తున్నారని రోటరీ సంస్థను అభినందించారు. పేదల కుటుంబాల్లో వెలుగులు నింపడానికి రోటరీ సంస్థ ఈ మారథాన్‌ను నిర్వహిస్తున్నారని అన్నారు.

పొగాకుపైనా వితండవాదమేనా?

పొగాకు పంటకు దేశంలో ఎక్కడా బీమా లేని సంగతి తెలియదా రామోజీ?
అయినా మన రైతులను ఆదుకునేందుకు ఈ-క్రాప్‌లో నమోదు చేస్తోంది కనిపించదా?

సాక్షి, అమరావతి: రామోజీరావు, ఆయన విషపుత్రిక 'ఈనాడు'కు నిత్యం ఒకటే ఎజెండా.. 'కుక్కపిల్ల, అగ్గిపుల్ల, సబ్బు బిళ్ల.. కాదేదీ కవితకనర్హం' అన్నట్టు.. రాష్ట్ర ప్రభుత్వంపై విషం చిమ్మడంలో రామోజీరావు వ్యవహారం కూడా ఇంతే. మోకాలికి, బోడి గుండుకు ముడివేసినట్టు ప్రతి అంశాన్ని ప్రభుత్వానికి అంటగడతారు. తాజాగా పొగాకును ప్రభుత్వం పంటల బీమాలో చేర్చలేదని.. ఈ-క్రాప్‌లో నమోదు కూడా చేయలేదని ఒక అబద్ధపు కథనంతో ప్రభుత్వంపై దుష్ప్రచారానికి దిగారు. 'పంటల బీమా లేదు.. ఈ-క్రాప్‌లో నమోదూ కాలేదు' అంటూ ఒక విష కథనాన్ని సోమవారం 'ఈనాడు'లో వండివార్చారు. దానిపై అసలు నిజాలు ఇవీ..



సాగు చేయాలంటే బోర్డు అనుమతి తప్పనిసరి

పొగాకు.. వాణిజ్య పంట..పైగా నార్కోటిక్ ప్లాంట్. ఇదేమీ ఆహార పంటో, ఉద్యాన పంటో కాదు. అయినా సరే పొగాకుకు పంటల బీమా ఎందుకు వర్తింప చేయడం లేదంటూ 'ఈనాడు' వితండవాదం చేస్తోంది. పోనీ గత చంద్రబాబు ప్రభుత్వం ఏ ఒక్క పొగాకు రైతునైనా ఆదుకుందా అంటే అదీ లేదు. ఈ నాలుగున్నరేళ్లలో పొగాకు రైతులను అన్ని విధాలుగా ఆదుకున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై బురదజల్లడమే పనిగా పెట్టుకొని 'ఈనాడు' విషప్రచారానికి ఒడిగడుతోంది. రాష్ట్రంలో పొగాకు సాధారణ విస్తీర్ణం 2.10 లక్షల ఎకరాలు. ప్రధానంగా ఉమ్మడి ప్రకాశం, కర్నూలు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, కృష్ణా, ఉభయగోదావరి జిల్లాల్లో సాగవుతోంది. సాధారణంగా ఏటా ఎన్ని మిలియన్ కిలోల పొగాకు ఉత్పత్తి చేయాలో? ఆ మేరకు ఎన్ని ఎకరాల్లో పంటసాగు చేయాలో కేంద్ర పొగాకు బోర్డ్ నిర్ణయిస్తుంది. అనుమతికి మించి సాగు చేసినా, అదనపు ఉత్పత్తి సాధించినా అమ్ముకోవాలంటే బోర్డు అనుమతులు తప్పనిసరి. అనుమతించిన విస్తీర్ణాన్ని బట్టి ఖరీఫ్‌లో 50 వేల టన్నులు, రబీలో లక్షన్నర టన్నులకు పైగా దిగుబడి వస్తుంది.

రైతుల్ని ఆదుకోవడానికి ప్రభుత్వమే కొనుగోలు..

కరోనా దెబ్బకు అంతర్జాతీయంగా పొగాకు రేట్లు పతనమైన సంగతి తెలిసిందే. పొగాకు వాణిజ్య పంటయినప్పటికీ రైతులెవ్వరూ నష్టపోకూడదని చరిత్రలో తొలిసారి రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోళ్లను చేపట్టింది. 2019-20 సీజన్‌లో ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా 1,29,31,590 కిలోలు కొనుగోలు చేసింది. సగటున కిలోకు రూ.81 చొప్పున 29,228 మంది రైతుల నుంచి రూ.128.65 కోట్లతో కొనుగోళ్లు చేపట్టింది. అత్యధికంగా 7.11 మిలియన్ కిలోల ఎన్‌వోజీ గ్రేడ్, 4.37 మిలియన్ కిలోల ఎఫ్-05 గ్రేడ్ పొగాకును కొనుగోలు చేసి రైతులను ఆదుకుంది. అంతేకాదు..ఈ నాలుగున్నరేళ్లలో వివిధ రకాల వైపరీత్యాల వేళ అన్ని రకాల రైతులతోపాటే పొగాకు రైతులకూ నష్టపరిహారం చెల్లిస్తూనే వచ్చింది.

కొనసాగుతున్న ఈ-క్రాప్ నమోదు..

పొగాకు పంటకాలం.. 100-120 రోజులు. రబీ సీజన్‌లో అక్టోబర్‌లో సాగు చేస్తారు. అయితే వర్షాభావ పరిస్థితులతో సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గడమే కాకుండా చాలా చోట్ల నవంబర్ నాటికి కూడా సాగు ప్రారంభం కాలేదు. సాధారణంగా ఏ పంటయినా సరే పంట వేసిన నెల తర్వాత ఈ-క్రాప్‌లో నమోదు చేసి ఫొటో అప్లోడ్ చేస్తారు. ఇలా ఏటా నమోదు చేస్తున్నారు. ప్రస్తుత రబీ సీజన్‌లో ఇప్పటికే 25 వేల ఎకరాల్లో సాగైన పొగాకు పంటను ఈ-క్రాప్‌లో నమోదు చేశారు. అయితే పంట నమోదు మొదలు పెట్టిన కొద్ది కాలానికే వచ్చిన మిచాంగ్ తుపాన్‌తో నీట మునిగిన ప్రాంతాల్లో నమోదు చేయడం కొంత కష్టతరంగా మారింది. దీంతో ఈ పంట బుకింగ్‌కు మినహాయింపునిచ్చారు. కాగా ఈ-క్రాప్ నమోదనేది ఇంకా కొనసాగుతూనే ఉంది.

నష్టపరిహారం కోసం ప్రతిపాదనలు సిద్ధం..

కాగా కరువు ప్రభావిత మండలాల్లో 1,600 ఎకరాల్లో పొగాకు పంట దెబ్బతిన్నట్టు గుర్తించారు. ఆ మేరకు పంట నష్టపరిహారం(ఇన్‌పుట్ సబ్సిడీ) అందించేందుకు ఇప్పటికే ప్రతిపాదనలు కూడా సిద్ధం చేశారు. ఇటీవల మిచాంగ్ తుపాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలతో ప్రాథమికంగా 65 వేల ఎకరాల్లో పొగాకు పంట దెబ్బతిన్నట్టు గుర్తించారు. ప్రస్తుతం పంట నష్టం తుది అంచనాల రూపకల్పన కోసం ఎన్యుమరేషన్ బృందాలు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నాయి. ఈ అంచనాలు కొలిక్కి వచ్చాక నిర్దేశించిన పరిహారాన్ని అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ విషయంలో పొగాకు రైతులు ఆందోళన చెందాల్సిన అవసరమే లేదు. వాస్తవాలు ఇలా ఉంటే రైతులను భయభ్రాంతులకు గురిచేసేలా 'ఈనాడు' దుష్ప్రచారం చేస్తుండటంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది.

దేశంలోనే బీమా ఎక్కడా లేదు..

రాష్ట్రంలో రైతులు సాగు చేసే దాదాపు అన్ని ప్రధాన పంటలకు వైఎస్సార్ ఉచిత పంటల బీమాను ప్రభుత్వం వర్తింపజేస్తోంది. ఖరీఫ్-2023లో 21 పంటలకు, రబీ-2023-24లో 17 పంటలకు బీమా వర్తింప చేస్తూ పూర్తి మార్గదర్శకాలతో నోటిఫికేషన్ కూడా ఇచ్చింది. అయితే పొగాకు పంట ఆహార భద్రతకు సంబంధించిన పంట కాదు....పైగా వీటి ఉత్పత్తుల వినియోగంతో దుష్పరిణామాల కారణంగా ఈ పంటకు రాష్ట్రంలోనే కాదు..దేశంలోనూ మరెక్కడా బీమా లేదు. నార్కోటిక్ ప్లాంట్‌గా గుర్తించిన కారణంగా ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంబీఎంవై) ద్వారా నోటిఫై చేసిన పంటల జాబితాలోనూ పొగాకుకు చోటు దక్కలేదు. గతంలో మన రాష్ట్రంలో కూడా ఎప్పుడూ బీమా పథకం ద్వారా నోటిఫై చేసిన దాఖలాలు కూడా లేవు.

సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక చొరవతో పెనాల్టీ లేకుండా..

2022-23లో 2.04 లక్షల హెక్టార్లలో సాగుకు, 142 మిలియన్ కిలోల పొగాకు కొనుగోలుకు కేంద్ర పొగాకు బోర్డు అనుమతినిచ్చింది. అయితే మాండూస్ తుపాన్‌తో అన్ని పంటలు దెబ్బతినడంతో రైతులంతా రేటు బాగుందని పొగాకు సాగు చేశారు. ఫలితంగా 172 మిలియన్ కిలోల పొగాకు ఉత్పత్తి అయ్యింది. సాధారణంగా అనుమతికి మించి ఉత్పత్తి అయిన సందర్భాల్లో ప్రత్యేక పరిస్థితులుంటే 5 శాతం పెనాల్టీతో కొనుగోలుకు కేంద్రం అనుమతినిస్తుంది. అలాంటిది సీఎం వైఎస్ జగన్ ప్రత్యేక చొరవ చూపడంతో పెనాల్టీ లేకుండా కొనుగోలుకు కేంద్రం అంగీకరించింది. దీంతో ఆ మేరకు రైతులు పొగాకును అమ్ముకోగలిగారు.

మీ 'బాబు'దే నయవంచన

చంద్రబాబు హయాంలో వ్యవసాయానికి రాత్రి పూట కూడా 4 గంటలు కరెంటు ఇవ్వలేదు

ప్రస్తుతం పగలు 9గంటలు కరెంటు ఇస్తున్నా సీఎం జగన్‌పై అక్కసుతో అడ్డగోలు రాతలు


రైతులు ఉతికి విసిరేసిన బాబు కోసం ఉన్మాదపు రాతలు రాస్తున్న రామోజీ

సాక్షి, అమరావతి: ప్రజలు ఉతికి ఆరేసిన పార్టీని తిరిగి అధికారంలోకి తేవడం కోసం ఈనాడు రాస్తున్న ఉన్మాద రాతలకు పరాకాష్టే రైతులకు ఉచిత విద్యుత్‌పై రాసిన కథనం. ప్రజలను తప్పుదోవ పట్టించి, దాని అనుకూల పార్టీకి రాజకీయ ప్రయోజనం కలిగించే ఉద్దేశంతో అచ్చేసిన ఆ అబద్ధపు రాతల్లో అసలు నిజాలను రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లు సోమవారం వెల్లడించాయి. ఆ వివరాలిలా ఉన్నాయి.

ఇదీ నయవంచన అంటే..

ఉమ్మడి రాష్ట్రంలో, విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చంద్రబాబు పాలనను పరిశీలిస్తే.. రైతులను నిలువునా వంచించిన చంద్రబాబు అసలు స్వరూపం కళ్ల ముందు కదలాడుతుంది. రైతు రుణ మాఫీ పేరుతో అన్నదాతలను నిలువునా దగా చేయడంతో పాటు కనీసం పంట పండించుకోవడానికి కరెంటు కూడా ఇవ్వలేని దౌర్భాగ్య స్థితి కనిపిస్తుంది. కరెంటు ఫ్రీగా ఇస్తే తీగలపై బట్టలు ఆరేసుకోవాలన్న చంద్రబాబు అహంకారపూరిత వ్యాఖ్య ఒక్కటి చాలు ఆయన నిజ స్వరూపానికి తార్కాణం. అటువంటి చంద్రబాబు కోసం రైతులకు ఉచిత విద్యుత్ వద్దని, దీనివల్ల విద్యుత్ సంస్థలు సంక్షోభంలోకి వెళ్లిపోతాయంటూ ఆనాడు పరోక్షంగా కథనాలు రాసింది ఈనాడు పత్రిక. టీడీపీ ప్రభుత్వ రైతు వ్యతిరేక చర్యలకు పూర్తిగా మద్దతు పలికింది. ఉచిత విద్యుత్ ఇస్తే కరెంటు తీగలపై బట్టలు ఆరేసుకోవాల్సిందేనన్న చంద్రబాబు మాటలను గొప్పగా కీర్తించి, రైతుల ప్రయోజనాలను పూర్తిగా మంటగలిపేందుకు తన వంతు సాయం చేసింది. చంద్రబాబు హయాంలో పగటిపూట దేవుడెరుగు.. రాత్రి పూట కూడా కనీసం నాలుగు గంటలు నిరంతరాయంగా కరెంటు ఇచ్చిన పాపానపోలేదు. రాత్రి వేళ నీటి తడులు పెట్టడానికి పొలాలకు వెళ్లి అనేక మంది రైతులు పాము కాట్లకు, విద్యుదాఘాతాలకు మరణించిన ఘటనలు అనేకం. 2014లో చంద్రబాబు తిరిగి అధికారం చేపట్టిన తర్వాత కూడా పరిస్థితుల్లో మార్పే లేదు. రైతులకు సరఫరా చేసిన విద్యుత్తు అరకొరే. అదికూడా రాత్రిపూటే. పైగా ఉచిత విద్యుత్ కోసం డిస్కంలకు చెల్లించాల్సిన సబ్సిడీ రూ.12వేల కోట్లు చెల్లించకపోవడంతో రైతులకు ఉచిత విద్యుత్ పథకం పూర్తిగా సంక్షోభంలో చిక్కుకుంది.

రాష్ట్ర విభజన నాటికి మొత్తం విద్యుత్ సంస్థల అప్పులు దాదాపు 29,700 కోట్లు ఉంటే చంద్రబాబు పదవి ముగిసిన 2019 మార్చి నాటికి 68,600 కోట్లకు (131 శాతం పెరుగుదల) చేరాయి. 2023 మార్చి నాటికి రూ.97,500 కోట్లకు (42 శాతం పెరుగుదల) చేరాయి. విద్యుత్ సంస్థల అప్పుల భారం చంద్రబాబు హయాంలో 2014 - 2019 మధ్య ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోయిందనడానికి ఈ గణాంకాలే నిదర్శనం. వీటి గురించి ఈనాడు ఎక్కడా ప్రస్తావించదు.



విద్యుత్ పంపిణీ సంస్థలు, డిస్కంల నికర విలువ 2014లో సుమారుగా మైనస్ 4,315 కోట్లు ఉంటే, 2019లో చంద్రబాబు ప్రభుత్వం దిగిపోయేనాటికి డిస్కంల నికర విలువ దారుణంగా క్షీణించి మైనస్ 20 వేల కోట్లకు చేరింది. ఈ విషయాలు ఈనాడు చెప్పదు. చంద్రబాబు ఘనకార్యాల కారణంగా రైతు అన్నవాడు పూర్తిగా సంక్షోభంలో చిక్కుకుపోయాడు. చంద్రబాబే నయవంచకుడని, ఆయన పాలన మరో చీకటి అధ్యాయమని రైతులే చెబుతున్నారు.

రైతులకు మేలు చేసిందే సీఎం వైఎస్ జగన్

వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు పక్షపాత ప్రభుత్వంగా అనేక చర్యలు తీసుకుంది. ముఖ్యంగా ఉచిత్ విద్యుత్ పథకం దీర్ఘకాలంగా, స్థిరంగా, ఎలాంటి ఇబ్బంది లేకుండా అందడానికి గట్టి చర్యలు తీసుకున్నారు. మేనిఫెస్టోలో చెప్పినట్టుగా 9 గంటలపాటు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ప్రారంభించారు. సీఎం జగన్ ఆదేశాలను అనుసరించి రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో వ్యవసాయ రంగానికి రోజుకి తొమ్మిది గంటలపాటు అదీ పగటిపూటే ఏ ఇబ్బందీ లేకుండా విద్యుత్ సరఫరా జరుగుతోంది. ఇప్పుడు రైతులు రాత్రి వేళ ప్రాణాలకు తెగించి పొలాలకు వెళ్లాల్సిన అవసరం లేదు. అంతేకాదు.. సీఎం జగన్ అధికారంలోకి వచ్చాక రూ.1,760 కోట్లు ఖర్చు చేసి 6,663 ఫీడర్లకు అదనపు సామర్థ్యం కల్పించి, అవసరమైన చోట కొత్తవి ఏర్పాటు చేయడం ద్వారా పగటిపూట నాణ్యమైన విద్యుత్ సరఫరాకు మార్గాన్ని సుగమం చేసింది. రైతులకు ఉచిత విద్యుత్ కోసం పంపిణీ వ్యవస్థపై ఇంత పెద్ద ఎత్తున ఖర్చు చేసిన ప్రభుత్వం ఇదే. చంద్రబాబు ప్రభుత్వం రైతులకు ఉచిత విద్యుత్ సబ్సిడీ కింద చెల్లించాల్సిన రూ.12 వేల కోట్లు డిస్కంలకు ఎగ్గొట్టింది. దీంతో డిస్కంలు విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు చెల్లింపులు చేయలేక మొత్తం రైతులకు ఉచిత విద్యుత్ పథకాన్ని సంక్షోభంలో పడింది. వైఎస్ జగన్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ బకాయిలను చెల్లించడంతోపాటు, ఉచిత విద్యుత్ సబ్సిడీ కోసం రూ.46 వేల కోట్లు ఖర్చు చేసింది. దీంతో డిస్కంలు జెన్‌కోలకు సకాలంలో చెల్లింపులు చేస్తూ విద్యుత్ కొనుగోలు చేసి రైతులకు అందించగలుగుతున్నాయి.

కచ్చితంగా 9 గంటలు సరఫరా

రాష్ట్రంలో ఇచ్చేదే ఏడు గంటలని, అందులోనూ సగటున 2 గంటలు కోతలేనని, లోడ్ రిలీఫ్ ఇతరత్రా పేరిట ఇష్టారాజ్యంగా నిలిపేస్తున్నారంటూ ఈనాడు రాసింది పూర్తిగా అవాస్తవం. రాష్ట్రంలో అన్ని రంగాలకు మరీ ముఖ్యంగా వ్యవసాయ రంగానికి విద్యుత్ సరఫరాలో ఎటువంటి లోటు లేదు. వచ్చే వేసవి పూర్తయ్యేవరకు ఏ ఇబ్బందీ లేకుండా అందుబాటులో ఉన్న విద్యుత్ కేంద్రాలతో పాటు స్వల్పకాలిక మార్కెట్ నుండి కొనుగోళ్లు ఖరారు చేసినట్లు డిస్కంలు తెలిపాయి. గ్రిడ్ నిర్వహణ నిమిత్తం ఎప్పుడైనా డిమాండ్‌కు సరిపడినంత విద్యుత్ అందుబాటులో లేనప్పుడు, గ్రిడ్ ఫ్రీక్వెన్సీ పరిమితికి మించి అదుపులో లేనప్పుడు, పగటి పూట సౌర విద్యుత్ ఉత్పత్తి ఉన్న ప్రాంతాల్లో మేఘాలు కమ్మినప్పుడు మాత్రమే కొద్దిసేపు సరఫరా నియంత్రణ ఉంటుంది. అలాగే దక్షిణాది విద్యుత్ గ్రిడ్‌లో సరఫరాకు తీవ్ర కొరత ఏర్పడినప్పుడు, గ్రిడ్ ఫ్రీక్వెన్సీ తీవ్ర ఒడిదొడుకులకు లోనయినప్పుడు, దక్షిణ రీజియన్ లోడ్ డిస్పాచ్ - బెంగళూరు కేంద్ర విద్యుత్ గ్రిడ్ నుండి వచ్చే విద్యుత్‌ను రాష్ట్రాల వాటా ప్రకారం నియంత్రణ చేసే క్రమంలో ఒక్కోసారి కేంద్ర గ్రిడ్ కు అనుసంధానమైన అధిక కెపాసిటీ గ్రిడ్ ట్రాన్స్‌ఫార్మర్లను ట్రిప్ చెయ్యడం ద్వారా పరిస్థితిని అదుపులోకి తెస్తుంటారు. అలాంటి సమయాల్లో కూడా కొన్ని చోట్ల విద్యుత్ సరఫరాకు కొద్దిసేపు అంతరాయం ఏర్పడే అవకాశం ఉంది. ఇది రాష్ట్ర లోడ్ డిస్పాచ్ సెంటర్ చేతుల్లో ఉండదు. ఇలా చాలా అరుదుగా జరుగుతుందని డిస్కంలు తెలిపాయి. ఇలా ఎప్పుడైనా వ్యవసాయ రంగానికి విద్యుత్ అంతరాయం ఏర్పడితే... మళ్లీ అదే రోజు వేరొక సమయంలో ఇచ్చి 9 గంటల సరఫరా భర్తీ చేస్తున్నట్లు డిస్కంలు వివరించాయి. ఏ సమస్యా లేకుండా రైతులకు ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తున్నప్పటికీ, ఈనాడు తప్పుడు రాతలు రాస్తోందని వివరించాయి. కేవలం ప్రభుత్వం మీద దుష్ప్రచారం చేయాలన్న దురుద్దేశంతోనే ఈనాడు అవాస్తవ కథనాలు ప్రచురిస్తోందని తెలిపాయి.

వ్యవసాయ విద్యుత్‌కు ఢోకా లేదు

సీఎం జగన్ సంకల్పంతో ఉచిత విద్యుత్ హామీకి అనుగుణంగా దీర్ఘకాలికంగా పగటి పూట వ్యవసాయ విద్యుత్ సరఫరా చెయ్యడానికి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ సెకీతో డిస్కంలు ఒప్పందం చేసుకున్నాయి. ఈ ఒప్పందం ప్రకారం 7 వేల మెగావాట్ల సౌర విద్యుత్ యూనిట్ కేవలం రూ.2.43 కే లభిస్తుంది. వచ్చే ఏడాది సెప్టెంబరు నుంచి 3 వేల మెగావాట్లు, 2025 సెప్టెంబరు నాటికి మరో 3 వేల మెగావాట్లు, ఆ మరుసటి ఏడాది వెయ్యి మెగావాట్లు అందుబాటులోకి వస్తుంది. గత ప్రభుత్వం పీపీఏల రూపంలో ఆర్థిక వ్యవస్థ నడ్డి విరిచేలా నిర్ణయాలు తీసుకుంటే.. ఈ ప్రభుత్వం రైతులకు మేలు చేసేలా వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకుంది. సెకీతో జరిగిన ఒప్పందంలో రాష్ట్ర ప్రభుత్వం కూడా భాగస్వామిగా ఉంది. దాని ప్రకారం ఈ ఒప్పందం నిమిత్తం అయ్యే విద్యుత్ కొనుగోలు వ్యయం పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుంది. రానున్న మూడు దశాబ్దాలపాటు ఎలాంటి అవాంతరాలు లేకుండా రైతులకు ఉచిత విద్యుత్ అందుతుంది. అలాగే గత ఆర్థిక సంవత్సరం (2022- 23)లో రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 1.25 లక్షల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను ప్రభుత్వం మంజూరు చేసింది. 2019-2023 మధ్య నాలుగున్నరేళ్లలో సుమారు 3.83 లక్షల వ్యవసాయ పంపు సెట్లు మంజూరు చేసింది. ఇదంతా రైతాంగం మేలు కోసమే. ఇటువంటివి ఒక్కటైనా చంద్రబాబు ప్రభుత్వంలో ఉంటే ఒట్టు. అసలు చంద్రబాబు హయాంలో జరిగిన విద్యుత్ ఒప్పందాలే ఓ అడ్డగోలు వ్యవహారం. విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు అత్యధిక ప్రయోజనం కలిగించడం కోసం ప్రజలపై మోయలేని భారం వేయడానికి కూడా చంద్రబాబు ప్రభుత్వం సంకోచించలేదు. అదే ఉద్దేశంతో అత్యధిక రేట్లు చెల్లించేలా ఒప్పందాలు చేసుకుంది.

పనులు జరుగుతున్న రోడ్డుపై ఫొటోలకు ఫోజులా?

లోకేశ్ తీరును విమర్శిస్తున్న విశాఖవాసులు


బాగున్న కణితి రోడ్

గాజువాక: విశాఖపట్నంలో యువగళం పాదయాత్ర సందర్భంగా టీడీపీ నాయకుడు లోకేశ్ వ్యవహరించిన తీరుపై స్థానికులు విస్మయం వ్యక్తం చేశారు. పనులు జరుగుతున్న రోడ్డుపై లోకేశ్ ఫొటో దిగి రోడ్డు బాగోలేదంటూ దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. గాజువాక ఉక్కునగరంలోని సెక్టార్-5 నుంచి బయల్దేరిన ఆయన పోర్టు రోడ్, జగ్గు జంక్షన్, కణితి రోడ్ మీదుగా గాజువాక పరిసర ప్రాంతాల్లో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా కణితి రోడ్‌లోని చైతన్యనగర్ సమీపంలో ఒకచోట రోడ్డు బాగులేదంటూ ప్రభుత్వాన్ని విమర్శించే విధంగా ఫొటోకు పోజిచ్చారు. ఆ రోడ్డులో పైప్‌లైన్ నిర్మాణం కోసం గతంలో గొయ్యి తవ్వి పనిపూర్తయిన తరువాత అధికారులు దాన్ని పూడ్చారు. ఇటీవల వర్షాలకు ఒకచోట రోడ్డుపై గుంతపడటంతో అందులో భవన వ్యర్థాలను వేసి పూడ్చారు. అదే రోడ్డులో పాదయాత్ర కొనసాగించిన లోకేశ్ అక్కడ రోడ్డు బాగులేదని చూపిస్తూ ఫొటో దిగారు. ప్రస్తుతం ఈ రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయి. దీన్ని రెండు భాగాలుగా విభజించి మొదటి భాగం విస్తరణ పనులు చేస్తున్నారు. ఆ పనులు పూర్తయిన వెంటనే రెండో భాగం పనులు చేపడతామని అధికారులు ఇప్పటికే ప్రకటించారు. దీనివల్లే ఆ భాగంలో ఉన్న చిన్నచిన్న గుంతలను తాత్కాలికంగా పూడ్చినట్టు అధికారులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో లోకేశ్ వ్యవహరించిన తీరును స్థానికులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఆ రోడ్డు మొత్తం బాగానే ఉందని, ఎక్కడో ఒకచోట చిన్న గొయ్యి ఉన్నంత మాత్రాన దాన్ని ఎత్తి చూపించాల్సిన అవసరం లేదని వ్యాఖ్యానించారు. టీడీపీ హయాంలో ఇంతకంటే పెద్ద గోతుల్లోనే పడ్డామని కూడా వారు పేర్కొనడం గమనార్హం.


పైపులైన్ కోసం తవ్వి పూడ్చిన ప్రాంతాన్ని చూపిస్తూ మొత్తం రోడ్డు ఇలాగే ఉందంటున్న లోకేశ్

క్లుప్తంగా...

సూరత్ డైమండ్ బోర్స్‌కు 'శ్రీసిటీ' ఉత్పత్తులు


సూరత్ ఎయిర్‌పోర్టు టెర్మినల్ సీలింగ్

సత్యవేడు(తిరుపతి జిల్లా): ప్రపంచంలో అతిపెద్ద కార్యాలయ భవనం అయిన సూరత్ డైమండ్ బోర్స్‌కు హంటర్ డగ్లస్ గ్రూప్‌నకు చెందిన హంటర్ డగ్లస్ ఇండియా లిమిటెడ్ సంస్థ శ్రీసిటీలోని తన పరిశ్రమలో లుక్సలోన్ బ్రాండ్ పేరుతో తయారయ్యే ఉత్పత్తులను సరఫరా చేసింది. దీంతోపాటు సూరత్ విమానాశ్రయంలో కొత్త టెర్మినల్ భవనం సుందరీకరణకు అవసరమైన ఉత్పత్తులను అందించింది. సూరత్ డైమండ్ బోర్స్ ప్రత్యేక ఆకృతిని రూపొందించడంలో హంటర్ డగ్లస్ కీలక పాత్ర పోషించింది. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు కోసం సరఫరా చేసిన ఉత్పత్తులలో 150 మి.మీ మాడ్యూల్‌లో 50 ఇంటూ75 అంగుళాల లక్సలోన్ ఉడ్ ఫినిషింగ్ రోల్ ఫార్మేట్ మెటల్ బాఫిల్ కూడా ఉన్నాయి. కాగా, ఈ రెండు ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం ప్రారంభించడం విశేషం. కాగా, హంటర్ డగ్లస్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ పీకే సుందరమూర్తి మాట్లాడుతూ చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, ఢిల్లీ, గోవా సహా దేశవ్యాప్తంగా ఉన్న ప్రధాన విమానాశ్రయాలను ఆకర్షణీయంగా రూపొందించటానికి అవసరమైన పరికరాలను హంటర్ డగ్లస్ అందిస్తుందన్నారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఓ ప్రకటనలో హంటర్ డగ్లస్ బృందానికి అభినందనలు తెలిపారు.

పవన్ ఇంటికి బాబు పరుగులు

మంత్రి కొట్టు సత్యనారాయణ



మోపిదేవి: టీడీపీ, జనసేన పొత్తులో భాగంగా సమావేశానికి పవన్‌కళ్యాణ్ హాజరు కాకపోయేసరికి టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబుకు ప్యాంట్ తడిసిపోయిందని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఎద్దేవా చేశారు. కృష్ణాజిల్లా మోపిదేవిలో ఆయన సోమవారం మాట్లాడుతూ పొత్తులో భాగంగా ఇరుపార్టీ నాయకులు ఆదివారం నాటి సమావేశానికి హాజరుకావాల్సి ఉండగా.. పవన్‌కళ్యాణ్ డుమ్మా కొట్టినట్లు చెప్పారు. కంగారు పడిన బాబు పవన్‌కళ్యాణ్ ఇంటికి పరుగులు తీశారన్నారు. కాపు సామాజిక వర్గం తలదించుకునేలా పవన్ టీడీపీకి తాకట్టు పెట్టడాన్ని ఆ సామాజికవర్గం పూర్తిగా వ్యతిరేకిస్తుందని తెలిపారు. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, జెడ్పీ చైర్ పర్సన్ ఉప్పాల హారిక తదితరులు పాల్గొన్నారు.

20న టీడీపీ, జనసేన ఎన్నికల శంఖారావం

మహారాణిపేట (విశాఖ దక్షిణ): టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్ర విజయోత్సవ సభ ఈ నెల 20న విజయనగరం జిల్లా భోగాపురం మండలం పరిధిలో పోలిపల్లి వద్ద నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అచ్చెన్నాయుడు తెలిపారు. సోమవారం విశాఖ టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ, జనసేన ఎన్నికల శంఖారావం పూరించాలని నిర్ణయించాయని చెప్పారు. ప్రభుత్వం ఎన్ని ఆటంకాలు సృష్టించినా సభ విజయవంతం చేసి తీరుతామని, రాష్ట్ర నలుమూలల నుంచి రైళ్లలోనైనా ప్రజలు వచ్చి తీరుతారని అచ్చెన్నాయుడు అన్నారు.

ఆయేషా మీరా హత్యకేసు దర్యాప్తు ఎంతవరకు వచ్చింది?

సాక్షి, అమరావతి: బీఫార్మసీ విద్యార్థిని ఆయేషా మీరా హత్యకేసు దర్యాప్తు పురోగతికి సంబంధించిన పూర్తి వివరాలతో నివేదికను తమ ముందుంచాలని హైకోర్టు సోమవారం సీబీఐని ఆదేశించింది. పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని కేంద్ర హోంశాఖ కార్యదర్శి, సీబీఐ అధికారులను ఆదేశిస్తూ వారికి నోటీసులు జారీచేసింది. విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య ఉత్తర్వులు జారీచేశారు. సీబీఐ తనకు నోటీసులివ్వడాన్ని సవాలు చేస్తూ సత్యంబాబు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై జస్టిస్ జయసూర్య విచారించారు. పిటిషనర్ తరఫున న్యాయవాది పిచ్చుక శ్రీనివాసులు వాదనలు వినిపిస్తూ.. ఆయేషా మీరా హత్యకేసులో సత్యంబాబును దోషిగా తేలుస్తూ కిందికోర్టు ఇచ్చిన తీర్పును హైకోర్టు 2017లో రద్దుచేసిందని తెలిపారు. తమ కుమార్తె ఆయేషా మీరా హత్యకేసులో అసలైన దోషులను గుర్తించి శిక్షించాలని కోరుతూ శంషాద్‌బేగం, సయ్యద్ ఇక్బాల్‌బాషా 2018లో పిటిషన్ దాఖలు చేశారని, విచారించిన హైకోర్టు ధర్మాసనం దర్యాప్తు చేయాలని సీబీఐని ఆదేశించిందని చెప్పారు. దీంతో దర్యాప్తు ప్రారంభించిన సీబీఐకి సత్యంబాబు పూర్తిగా సహకరించారని తెలిపారు. కోర్టు అనుమతి లేకుండానే అతడికి డీఎన్ఏ పరీక్షలు నిర్వహించిన సీబీఐ ఇప్పుడు నోటీసులిచ్చి వాంగ్మూలం ఇవ్వాలంటూ ఒత్తిడి చేస్తోందని చెప్పారు. సీబీఐ తరఫున జూపూడి యజ్ఞదత్ వాదనలు వినిపిస్తూ.. తార్కిక ముగింపునకు తీసుకొచ్చేదిశగా దర్యాప్తు సాగుతోందని, పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేస్తామని తెలిపారు. దీంతో న్యాయమూర్తి దర్యాప్తు పురోగతిపై నివేదిక ఇవ్వాలని సీబీఐని ఆదేశిస్తూ, విచారణను వాయిదా వేశారు.


సీబీఐ ఎస్పీ, వైఎస్ వివేకా కుమార్తె, అల్లుడిపై కేసు నమోదు

పులివెందుల కోర్టు ఆదేశాల మేరకు నమోదు చేసిన పోలీసులు

పులివెందుల: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసుకు సంబంధించి పులివెందుల కోర్టు ఆదేశాల మేరకు సీబీఐ ఎస్పీ రాం సింగ్, వివేకా కుమార్తె సునీత, అల్లుడు రాజశేఖరరెడ్డిలపై వైఎస్సార్ జిల్లా పులివెందుల పోలీసులు కేసు నమోదు చేశారు. వివేకా హత్యకేసుకు సంబంధించి సీబీఐ దర్యాప్తు చేసిన సంగతి తెలిసిందే. దీనిపై అప్పట్లో సీబీఐ అదనపు ఎస్పీ రాంసింగ్ (తరువాత ఎస్పీ అయ్యారు) నేతృత్వంలో దర్యాప్తు కొనసాగిన విషయం విదితమే. రాంసింగ్ ఏకపక్షంగా, కేవలం కేసుతో సంబంధం లేని వ్యక్తులను టార్గెట్ చేసి దర్యాప్తు చేశారని విమర్శలు ఎదుర్కొన్నారు. అందులో భాగంగా అప్పట్లో వైఎస్ వివేకా పీఏ కృష్ణారెడ్డిని కూడా రాంసింగ్, వైఎస్ వివేకా కుమార్తె సునీత, అల్లుడు రాజశేఖర్‌రెడ్డి పలుమార్లు తమకు అనుకూలంగా వ్యవహరించాలని బెదిరించారు. కేసు దర్యాప్తులో భాగంగా పీఏ కృష్ణారెడ్డిని పలుమార్లు రాంసింగ్ విచారణకు పిలిపించుకుని తాము చెప్పినట్లుగా కోర్టులో 164 వాంగ్మూలం ఇవ్వాలని, కేసుతో సంబంధం ఉందని కొంతమంది వ్యక్తుల పేర్లు చెప్పాలని బెదిరించారు. దీనికి అంగీకరించని కృష్ణారెడ్డిపై ఆయన కుటుంబసభ్యుల ముందే పలుమార్లు రాంసింగ్ థర్డ్ డిగ్రీ ఉపయోగించి దారుణంగా కొట్టారు. వివేకా కుమార్తె సునీత, అల్లుడు రాజశేఖరరెడ్డి కూడా కృష్ణారెడ్డిని తమ వద్దకు పిలిపించుకుని సీబీఐ వారు చెప్పినట్లుగా వినాలని, లేకపోతే ఈ కేసులో ఇరికిస్తారని, సీబీఐ వాళ్లు చెప్పినట్లుగా వినడంవల్లనే వాచ్‌మెన్ రంగన్న, డ్రైవర్ దస్తగిరిలను కేసు నుంచి కాపాడటం జరిగిందని పలుమార్లు బెదిరించారు. అయినా సాక్ష్యం చెప్పడానికి అంగీకరించని పీఏ కృష్ణారెడ్డి 2021 డిసెంబర్ 28న పులివెందుల కోర్టుకు వెళ్లి ప్రైవేట్ కంప్లయింట్ చేశారు. దీన్ని పరిశీలించిన కోర్టు రాంసింగ్, సునీత, రాజశేఖరరెడ్డిలపై కేసు నమోదు చేసి విచారించాలని ఆదేశాలు జారీచేసింది. దీంతో ఆ ముగ్గురిపై పులివెందుల పోలీసులు ఐపీసీ సెక్షన్లు 352, 323, 330, 342, 348, 506, 194/ఏ, 166ఏ(బి), 109 కింద కేసు నమోదు చేశారు. దీనిపై సోమవారం వైఎస్సార్‌సీపీ లీగల్ అడ్వయిజర్ ఓబుళరెడ్డి పులివెందులలో మీడియాతో మాట్లాడుతూ పోలీసుల విచారణలో మిగిలిన విషయాలు తెలుస్తాయన్నారు.

పవన్‌కళ్యాణ్ ఓనర్ చంద్రబాబు

- కాపులు వీరిద్దరినీ నమ్మడం లేదు
- లోకేశ్ పాదయాత్రకు ప్రజాస్పందన లేదు
- మంత్రి గుడివాడ అమర్‌నాథ్



మహారాణిపేట (విశాఖ దక్షిణ): చంద్రబాబు చెప్పిన మాట తూచ తప్పకుండా పాటించే యంత్రంలా పవన్‌కళ్యాణ్ తయారయ్యాడని, వీరిద్దరి మధ్య ఓనర్, కాంట్రాక్టర్ రిలేషన్ కొనసాగుతున్నదని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ధ్వజమెత్తారు. లోకేశ్ పాదయాత్రకు ప్రజల నుంచి స్పందన లేదని అనేక చోట్ల రుజువవుతుందని మంత్రి వివరించారు. విశాఖలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు, పవన్ మధ్య ఇప్పటివరకు చీకటి ఒప్పందాలు జరిగాయని, ఇప్పుడు అవి బహిర్గతం అవుతున్నాయన్నారు. కొంతకాలం క్రితం వరకు పవన్‌కళ్యాణ్ విస్తృతంగా రాష్ట్రమంతా పర్యటిస్తున్నప్పుడు ఆయన సీఎం అవుతాడని కాపు సామాజికవర్గం అభిప్రాయపడిందని, అయితే పవన్ చంద్రబాబుతో మిలాఖత్ కావడంతో ఆ వర్గం తీవ్ర ఆవేదనకు గురవుతుందని చెప్పారు. చంద్రబాబు ఆదినుంచి కాపు ద్రోహి అని, వంగవీటి రంగా హత్యతోనే ఇది రుజువుకాగా.. ముద్రగడ పద్మనాభం, ఆయన కుటుంబాన్ని హతమార్చాలన్న చంద్రబాబు వ్యూహంతో ఇది స్పష్టమయ్యిందన్నారు. చిరంజీవిని ఎక్కువ కాలం రాజకీయాల్లో ఉండనీయకుండా పన్నాగం పన్నింది చంద్రబాబు, పవన్‌లేనని అమర్‌నాథ్ విమర్శించారు. కాపులను హోల్‌సేల్‌గా చంద్రబాబుకు అప్పగించాలన్న పవన్ ఆలోచనను కాపులు పసిగట్టారని, అందుకే వీరిద్దరిని దూరం పెట్టేందుకు నిర్ణయించుకున్నారని మంత్రి స్పష్టం చేశారు. రైలు దగ్ధం ఘటనకు సంబంధించి అనేకమంది కాపులపై చంద్రబాబు కేసులు పెట్టారని, అయితే తాను అధికారంలోకి వచ్చిన వెంటనే జగన్‌మోహన్‌రెడ్డి ఆ కేసులన్నీ ఎత్తివేసిన విషయాన్ని కాపులు మరచిపోలేరని తెలిపారు. రాజ్యాధికారంలో సైతం కాపులకు సింహభాగాన్ని కేటాయించి.. కాపులపై తనకున్న అభిమానాన్ని చాటుకున్నారని చెప్పారు.

ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభం

సాక్షి, అమరావతి: విజయవాడలో సోమవారం 26వ ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ ఘనంగా ప్రారంభమైంది. ఈ మీట్‌ను విజయవాడ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బహుముఖ ప్రజ్ఞతోనే పోటీ ప్రపంచంలో రాణించగలరని చెప్పారు. విద్యార్థులు కేవలం చదువులోనే కాకుండా క్రీడల్లోనూ విద్యార్థులు ప్రతిభను కనబర్చాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో క్రీడా సౌకర్యాలను మెరుగుపరుస్తున్నట్టు చెప్పారు. క్రీడలతో మానసిక ఒత్తిడిని అధిగమించి విద్యపై మరింత దృష్టి పెట్టొచ్చని ఆమె పేర్కొన్నారు. కృష్ణా రీజియన్ పరిధిలోని 19 పాలిటెక్నిక్ కళాశాలలకు చెందిన 508 మంది క్రీడాకారులు 18 విభాగాల్లో పోటీపడుతున్నారు. ఈ కార్యక్రమంలో సాంకేతిక విద్య, శిక్షణ మండలి కార్యదర్శి కె.వి.రమణబాబు, సంయుక్త కార్యదర్శి జానకి రామయ్య, ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు జె.ఎ స్.ఎస్.మూర్తి, ఉప సంచాలకులు కె.విజయభాస్కర్, ఎం.ఎ.వి.రామకృష్ణ, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయసారథి తదితరులు పాల్గొన్నారు.

అది ఆదివారం సాయంత్రం.
రవీంద్రభారతి ఆడిటోరియం.
అందెలరవళి మధ్య శ్లోక ఆరంగేట్రం.
కూచిపూడి సాధనలో మూడవతరం ఆమెది.
పదహారేళ్ల నాట్యసాధనకు ప్రతీక ఆ అరంగేట్రం.

మూడుతరాల నాట్యోత్సాహం



అమ్మమ్మ రాధిక, అమ్మ దీపికతో శ్లోకారెడ్డి

హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో మొన్నటి రోజున ఆరంగేట్రం చేసిన శ్లోకారెడ్డి కూచిపూడి నాట్యసాధనను తన ఆరవ ఏట మొదలు పెట్టింది. పదకొండవ ఏట 'బాల చైతన్య అకాడమీ అవార్డు' అందుకుంది. నాట్యమే శ్వాసగా అడుగులు వేస్తూ గడిచిన బాల్యాన్ని గుర్తు చేసుకుంటూ 'భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ నుంచి సీసీఆర్‌టీ స్కాలర్‌షిప్‌కు ఎంపిక కావడం గర్వకారణంగా భావిస్తున్నట్లు' చెప్పారు. ఆరంగేట్రం సందర్భంగా ఆమె 'సాక్షి'తో మాట్లాడారు.

''నా నాట్యగురువు అమ్మే. అమ్మ దీపాంజలి నాట్యసంస్థను ప్రారంభించి నాట్యంలో శిక్షణతోపాటు నాట్య ప్రదర్శనలు ఇస్తోంది. అలా నాకు ఆ ప్రదర్శనల్లో నాట్యం చేసే అవకాశం దక్కింది. గోదాకల్యాణం, స్టాచ్యూ ఆఫ్ ఈక్వాలిటీ ప్రారంభోత్సవం సందర్భంగా నాట్య ప్రదర్శన, జీ ట్వంటీ సదస్సు, గ్లోబల్ ఎంటర్‌ప్రెన్యూర్ సమ్మిట్, ప్రపంచ తెలుగు మహాసభలు, రాజ్‌భవన్, ఖజురహో, హంపి, నిశగంధి, కింకిణి డాన్స్ ఫెస్టివల్స్, త్యాగబ్రహ్మ గానసభ, దుబాయ్‌లో భారత పర్యాటక రంగం ప్రదర్శన, భారత 70వ స్వాతంత్ర్యదినోత్సవ వేడుకల సందర్భంగా టర్కీలోని ఇండియన్ ఎంబసీ నిర్వహించిన కార్యక్రమం, లెజెండరీ పర్సనాలిటీ మ్యాస్ట్రో పండిట్ బిర్జు మహారాజ్ డాన్స్ ఫెస్టివల్ ... ఇలా అమ్మతోపాటు, ఆమె ఆధ్వర్యంలో లెక్కలేనన్ని ప్రదర్శనల్లో నాట్యం చేయగలిగాను. అమ్మ ప్రధాన పాత్ర పోషిస్తున్న ప్రదర్శనల్లో నేను కూడా వేదికమీద ఉండడం వల్ల చాలా నేర్చుకున్నాను. శిక్షణ సమయంలో, వేదిక మీద ప్రదర్శనలిచ్చేటప్పుడు మాత్రమే గురువు. క్లాస్ నుంచి బయటకు వచ్చి ఇంట్లో అడుగుపెట్టగానే అమ్మలోని గురువు మాయమై అమ్మ బయటకు వస్తుంది. మేము ఏం తినాలి, హోమ్‌వర్క్ గురించి తెలుసుకుని మర్నాటి స్కూల్‌కి సిద్ధం చేయడంలో మునిగిపోయేది. అమ్మ బాగా గారం చేస్తుంది, కానీ నాకు నాన్న దగ్గరే ఎక్కువ చనువు.



రుద్రమదేవిగా శ్లోక

అమ్మమ్మ అడుగుజాడల్లో

మా ఇంట్లో నాట్యసాధనకు అంకితమైన మూడవ తరం నాది. మా అమ్మమ్మ రాధిక, అమ్మ దీపిక, నేను. మేము ముగ్గురమూ ఒకే వేదిక మీద కనిపించడం సంతోషకరం. రుద్రమదేవి, భద్రకాళి అష్టకం, గోదాదేవి, కృష్ణలీలలు ప్రదర్శించాను. అమ్మమ్మ రవీంద్రభారతి ప్రారంభోత్సవ కార్యక్రమం(1961, మే, 11వ తేదీ) లో నాట్యప్రదర్శన ఇచ్చింది. ఇప్పుడు అదే వేదిక మీద నా ఆరంగేట్రం జరగడం నా అదృష్టం. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భరతనాట్య కళాకారిణి పద్మభూషణ్ గ్రహీత అలర్మేల్‌వల్లి గారు రావడం నా పూర్వజన్మ సుకృతం. మరో ఆసక్తికరమైన విషయమేమిటంటే... నాకు సమాజం పట్ల శ్రద్ధ కలగడానికి కారణం కూడా నాట్యమే. నాట్యం గొప్ప మాధ్యమం. ఈ మాధ్యమం ద్వారా పౌరాణిక, ఇతిహాసాలతోపాటు జాతీయాంశాలు, సామాజికాంశాలను కూడా సామాన్యులకు చేరవేయగలుగుతాం. ఒక కొత్త ఇతివృత్తాన్ని రూపొందించడానికి సమాజాన్ని చదువుతాం. కాబట్టి సమాజంలో ఉండే సమస్యలు అవగతమవుతాయి. వాటి మీద నాట్య రూపకాన్ని ప్రదర్శించి అంతటితో మిన్నకుండిపోవడం స్వార్థమే అవుతుంది. కళాకారులుగా మేము సమాజానికి మా వంతుగా తిరిగి ఇవ్వాలి కూడా. మన సమాజంలో సాంస్కృతిక కళల పట్ల ఆసక్తి ఉండి కూడా ప్రోత్సాహం కరవైన వాళ్లెంతోమంది ఉన్నారు. వాళ్లలో కొందరికైనా నేను చేయగలిగిన సహాయం చేయాలనేది నా కోరిక.

కోవిడ్ సమయంలో వైద్యరంగంలో పనిచేసే వారి పట్ల సానుకూలంగా వ్యవహరించడం మీద చేసిన నాట్యరూపకం యూట్యూబ్‌లో బాగా వైరల్ అయింది. ప్రకృతి పరిరక్షణ, ప్రపంచశాంతి కోసం నాట్య రూపకాలను రూపొందిస్తున్నాను. లలితకళల ఇతివృత్తంగా చిత్రీకరించిన మ్యూజిక్ స్కూల్ ద్విభాషా చిత్రానికి అసిస్టెంట్ కొరియోగ్రాఫర్‌గా లండన్‌కు చెందిన ప్రముఖ కొరియోగ్రాఫర్ ఆడమ్ మర్రేతో పనిచేయడం నా కెరీర్‌లో మరో ఆణిముత్యం అనే చెప్పాలి. ఆరంగేట్రంలో రుద్రమ పాత్రను ఎంచుకోవడానికి కారణం మహిళాసాధికారత పట్ల చైతన్యవంతం చేయడం కూడా. నా భవిష్యత్తు రూపకాలు కూడా సమాజం, ప్రకృతితోపాటు మహిళల భద్రత, మహిళాభ్యుదయం మీద ఉంటాయి'' అని వివరించారు శ్లోకా రెడ్డి.


– వాకా మంజులారెడ్డి
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

సంగీతమూ ఇష్టమే!

నేను పుట్టింది, పెరిగింది అంతా హైదరాబాద్‌లోనే. పాఠశాల విద్య చిరక్ ఇంటర్నేషనల్ స్కూల్. సెయింట్ ఫ్రాన్సిస్ కాలేజ్ నుంచి గ్రాడ్యుయేషన్ తర్వాత లండన్‌లో క్వీన్ మేరీ యూనివర్సిటీ నుంచి డిజిటల్ మార్కెటింగ్‌లో మాస్టర్స్ చేశాను. మన కల్చర్ కోసం పనిచేయడం స్కూల్లోనే మొదలైంది. స్కూల్ కల్చరల్ కమిటీకి డిప్యూటీ హెడ్‌ని. డాన్స్, మ్యూజిక్ రెండూ ఇష్టమే. తమ్ముడితోపాటు ఏడేళ్లు కర్ణాటక సంగీతం కూడా సాధన చేశాను. కానీ నా స్ట్రెస్ బస్టర్ మాత్రం బుక్ రీడింగే. 'స్పందన' చిల్డ్రన్‌హోమ్‌లోని పిల్లలతో గడపడం కూడా నాకిష్టం. 'యట్-రైజ్' అనే నాన్ ప్రాఫిట్ ఆర్గనైజేషన్ స్థాపించి కళాభిరుచి ఉన్నవారితోపాటు గ్రామాల్లో కనీస అవసరాల కోసం పోరాడుతున్న వాళ్లకు ఆసరాగా నిలుస్తున్నాను. క్లెన్లీనెస్ డ్రైవ్, మెడికల్ క్యాంపులు, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనలో నా వంతుగా కొంతమేర సహకారం అందిస్తున్నాను.

– శ్లోకారెడ్డి, కూచిపూడి నాట్యకారిణి

● ముగ్గు-ముచ్చట





కాసర సింధు
జంగారెడ్డిగూడెం
పశ్చిమ గోదావరి జిల్లా

15 చుక్కలు
8 వచ్చేవరకు
మధ్య చుక్క



అర్రా ప్రసూన
హనుమకొండ

21 చుక్కలు
సరి చుక్క 1 వరకు



ధనుర్మాసం వచ్చిందంటే ఇంటిముంగిట తీర్చిదిద్దిన అందమైన రంగవల్లులు... ముచ్చటైన గొబ్బెమ్మలు... తెలుగింటి ఆడపడుచులందరూ తమకు వచ్చిన ముగ్గులను మరొకరితో పంచుకుంటూ... తెలియని వాటిని నేర్చుకుంటూ కనిపిస్తుంటారు. మరి మీరు కూడా చక్కటి ముగ్గులు వేస్తారా? అలా అయితే ముచ్చటైన మీ ముగ్గులను అందమైన రంగులతో కాగితం మీద పెట్టండి. చుక్కల వివరాలతో సహా వాటిని మాకు పంపండి. అందిన వాటిలో మంచి ముగ్గును మీ ఫొటోతో సహా మేము ప్రచురిస్తాం.

ముగ్గులకు ఆహ్వానం



ముగ్గులు పంపవలసిన చిరునామా
ముగ్గు-ముచ్చట, సాక్షి ఫ్యామిలీ,
సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34.
ఈ మెయిల్: muggulu.sakshi@gmail.com

సాగుబడి
మూల కార్తె: డిసెంబర్ 16 నుంచి

'వ్యవసాయ' ఉద్గారాలు 31% కాదు.. 60%!

● రసాయనిక ఎరువులే కాదు సేంద్రియ ఎరువులు కూడా భూగోళాన్ని పెద్దఎత్తున వేడెక్కిస్తున్నాయి

● రోగ కారకం కాని ఆహారం విలువను గుర్తెరిగిన వినియోగదారుల ఉద్యమం ద్వారానే పర్యావరణహితమైన వ్యవసాయం విస్తరిస్తుంది

● పద్మశ్రీ పురస్కార గ్రహీత డా॥ సుభాష్ పాలేకర్‌తో 'సాక్షి సాగుబడి' ముఖాముఖి



డా॥ సుభాష్ పాలేకర్

వాతావరణంలోకి విడుదలయ్యే మొత్తం ఉద్గారాల్లో వ్యవసాయం, ఆహార సంబంధిత ఉద్గారాల వాటా 31% అని ఐక్యరాజ్య సమితికి చెందిన ఆహార వ్యవసాయ సంస్థ (ఎఫ్.ఎ.ఓ.) ప్రకటించగా.. ఇవి 60% మేరకు ఉంటాయని పద్మశ్రీ పురస్కార గ్రహీత డా॥ సుభాష్ పాలేకర్ అంచనా వేస్తున్నారు. పశువుల ఎరువు/ వర్మీ కంపోస్టు/ కంపోస్టు వంటివి ఏటా ఎకరానికి 10 టన్నుల మేరకు వేస్తుండటం కూడా భూతాపం విపరీతంగా పెరగడానికి ఓ ముఖ్య కారణంగా అందరూ గుర్తించాలని స్పష్టం చేస్తున్నారు. వ్యవసాయ, ఆహార రంగాల ఉద్గారాలు తగ్గాలంటే.. రసాయనిక ఎరువులతో పాటు సేంద్రియ ఎరువుల వాడకం కూడా మాని, రైతులందరూ సుభాష్ పాలేకర్ కృషి పద్ధతిని అనుసరించాలన్నారాయన.

భవిష్యత్తులో పెను తుపాన్లు, కరువులను తట్టుకోవాలన్నా.. పోషక విలువలున్న ఆహారం అందరికీ అందాలన్నా ఇదొక్కటే మార్గమన్నారు. దేశవ్యాప్తంగా 70 లక్షల మంది రైతులు తాను చెప్పిన పద్ధతిలో సాగు చేస్తున్నారని, సుసంపన్న దిగుబడులిస్తున్న వారి క్షేత్రాలే ఇందుకు నిదర్శనాలన్నారు. రోగ కారకం కాని ఆహారం విలువను వినియోగదారులు గుర్తించి ఉద్యమ స్ఫూర్తితో రైతులను ప్రోత్సహిస్తేనే పర్యావరణ హితమైన వ్యవసాయం విస్తరిస్తుందని పాలేకర్ స్పష్టం చేస్తున్నారు. భారతీయ వ్యవసాయ విస్తరణ యాజమాన్య సంస్థ (ఐసిఎఆర్-మేనేజ్)లో ఇటీవల జరిగిన అంతర్జాతీయ వ్యవసాయ సదస్సులో పాల్గొన్న డా॥ పాలేకర్‌తో 'సాక్షి సాగుబడి' ప్రత్యేక ఇంటర్వ్యూ విశేషాలు..

■ **పర్యావరణ హితమైన వ్యవసాయ పద్ధతులపై మీరు చాలా ఏళ్లుగా స్వచ్ఛందంగా దేశవ్యాప్తంగా రైతులకు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితి ఏమిటి?**

డా॥ పాలేకర్: శిక్షణా శిబిరాల ద్వారా దేశంలోనే కాదు విదేశాల్లో కూడా లక్షలాది మంది సుభాష్ పాలేకర్ కృషి పద్ధతిని సోషల్ మీడియా (వెబ్ సైట్, యూట్యూబ్, వాట్సప్) ద్వారా నేర్చుకుంటున్నారు. నీతి ఆయోగ్ తోపాటు హిమాచల్ ప్రదేశ్, గుజరాత్ తదితర రాష్ట్రాల్లో విస్తారంగా రసాయనిక ఎరువులతో పాటు ఎకరానికి ఏటేటా పది టన్నుల చొప్పున పశువుల ఎరువు, కంపోస్టు, వర్మీ కంపోస్టు వంటి సేంద్రియ ఎరువులు కూడా వాడకుండా.. నేను చెప్పినట్లు అనేక నమూనాల ప్రకారం పంటలు పండిస్తున్నారు. నేను చెప్పింది చెప్పినట్లు చేసిన వారు తొలి ఏడాదిలోనే రసాయనిక వ్యవసాయానికి తగ్గకుండా దిగుబడులు పొందుతున్నారు. రసాయనాలు వాడకుండా.. నేలలో పోషకాలను రూపుమార్చి మొక్కల వేర్లకు అందించేందుకు ఘన జీవామృతం, ద్రవ జీవామృతం వంటి బెస్ట్ మైక్రోబియల్ కల్చర్‌ను వినియోగిస్తే చాలు.

■ **దేశంలో ఎంత మంది రైతులు మీ పద్ధతిలో పంటలు పండిస్తున్నారు?**

డా॥ పాలేకర్: సుమారు 70 లక్షల మంది రైతులు అనుసరిస్తున్నారు. సోషల్ మీడియా ద్వారా ఎప్పటికప్పుడు అవగాహన పెంపొందించుకుంటూ, వాట్సప్ ద్వారా సందేహాలు తీర్చుకుంటున్నారు. యూరప్, ఆఫ్రికా, ఆసియా దేశాల్లో చాలా మంది ఫాలో అవుతున్నారు. నీతి ఆయోగ్ నా టెక్నాలజీతో కన్విన్స్ అయ్యింది. హైదరాబాద్‌లోని 'మేనేజ్' సంస్థ నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తోంది. సుభాష్ పాలేకర్ కృషి పద్ధతిలో ఆశ్చర్యకరమైన దిగుబడులు సాధిస్తున్న రైతుల క్షేత్రాలను నేనే స్వయంగా రైతులకు చూపిస్తున్నాను. మొన్న వికారాబాద్ జిల్లాలో విజయరామ్ సాగు చేస్తున్న ఫైవ్ లేయర్ మోడల్ క్షేత్రాన్ని వందలాది మందికి చూపించాను. ఈ నెల 24,25 తేదీల్లో అహ్మదాబాద్ దగ్గర క్షేత్ర సందర్శన ఉంది. నేను రూపాయి పారితోషికం ఆశించకుండా ఉచితంగానే కర్బన ఉద్గారాలు లేని వ్యవసాయం గురించి ప్రచారం చేస్తున్నాను.

■ **పర్యావరణ సంక్షోభంపై దుబాయ్‌లో ఇటీవల ముగిసిన శిఖరాగ్రసభ 'కాప్28'లో వ్యవసాయ ఆహార వ్యవస్థల ఉద్గారాల గురించి ప్రధానంగా చర్చ జరిగింది కదా..**

డా॥ పాలేకర్: అవును. చైనా, అమెరికా తర్వాత మన దేశమే ఎక్కువ ఉద్గారాలను వెలువరిస్తున్నది. కానీ, భారత ప్రభుత్వం సంతకం చేయకపోవటం ఆశ్చర్యంగా ఉంది.

■ **మన దేశపు తలసరి ఉద్గారాలు తక్కువ. గతం నుంచీ ఎక్కువగా కాలుష్యానికి కారకులైన అభివృద్ధి చెందిన దేశాలు విపత్తులకు నష్టపోతున్న అభివృద్ధి చెందుతున్న దేశాలకు పరిహారం ఇవ్వాలని, ఆధునిక టెక్నాలజీ ఇవ్వాలని మన దేశం అడుగుతోంది కదా..!**

డా॥ పాలేకర్: సంపన్న దేశాలు ఏమీ విదల్చటం లేదు కదా. పైగా, కుట్రపూరితంగా కాలుష్య కారక ఫ్యాక్టరీలు మనలాంటి దేశాల్లో పెట్టిస్తూ, వస్తువుల్ని ఆ దేశాలు కొనుక్కుంటున్నాయి. దీర్ఘకాలిక పంటైన బాస్మతి బియ్యం కిలో పండించడానికి 5,600 లీటర్ల నీరు ఖర్చవుతోంది. స్వల్పకాలిక వరి రకాలతో కిలో బియ్యం పండించడానికి 2,500 లీటర్ల నీరు ఖర్చవుతోంది. పైగా వరి పొలాల్లో నీటిని నిల్వగట్టటం వల్ల, రసాయనిక ఎరువులు, పురుగుమందులు, కలుపుమందులు, శిలీంధ్రనాశన రసాయనాల వల్ల పెద్ద ఎత్తున మిథేన్ వంటి అత్యంత ప్రమాదకర ఉద్గారాలు వెలువడుతున్నాయి. సంపన్న దేశాలు డబ్బులు ఇచ్చే వరకు మనం ఈ ఉద్గారాలు వెలువరించటం మానుకోకూడదా? రసాయనిక వ్యవసాయం ఒక్కటే కాదు.. సేంద్రియ ఎరువుల వల్ల కూడా పెద్ద మొత్తంలో కర్బన ఉద్గారాలు వెలువడుతూ భూగోళాన్ని వేడెక్కిస్తున్నాయి. గాలిలో ఉద్గారాలు 280 నుంచి 480 పీపీఎంకి పెరిగాయి. ఫలితం ఇప్పటికే చూశారుగా ప్రకృతి విపత్తులు ఎలా పెరిగిపోయాయో. గత ఏడాది గోధుమల దిగుబడి 30% తగ్గిపోయింది. గడచిన ఏడాది అంతా యూరప్‌లో, మన దేశంలోనే కాదు ప్రపంచం అంతా ఉష్ణోగ్రతలు అనూహ్యంగా పెరిగాయి. మనం వ్యవసాయ ఉద్గారాలు తగ్గించకుండా మీనమేషాలు లెక్కిస్తూ ఉంటే.. మున్ముందు చాలా ప్రమాదకర పరిస్థితులు దాపురిస్తాయి. వాటి కోసం ఎదురుచూద్దామా? ఎఫ్.ఎ.ఓ. చెప్తున్నట్లు అన్ని రకాల ఉద్గారాలలో వ్యవసాయ ఆహార వ్యవస్థ వెలువరిస్తున్న ఉద్గారాలు 31% కాదు, 60%కి పైగా ఉంటాయి. నేనంటాను.. విపత్తుల నుంచి రక్షించుకోవాలంటే వెంటనే మనం ఉద్గారాలు తగ్గించేందుకు పనిని ప్రారంభించాలి. దేశంలో రసాయనిక వ్యవసాయాన్ని, సేంద్రియ వ్యవసాయాన్ని కూడా వెంటనే నిషేధించాలి. ఈ వాస్తవాన్ని ప్రభుత్వాలు, రైతులు, ముఖ్యంగా రసాయనిక అవశేషాలతో కూడిన ఆహారం తిని డయాబెటిస్, కేన్సర్, కరోనా వంటి జబ్బుల పాలవుతున్న వినియోగదారులైన ప్రజలు ఎంత తొందరగా గుర్తిస్తే అంత మంచిది.

■ **రసాయనిక ఎరువుల తయారీలో శిలాజ ఇంధనాలు వాడుతారు కాబట్టి ప్రమాదమే. సేంద్రియ ఎరువులతో ప్రమాదం ఎలా?**

డా॥ పాలేకర్: ఎకరానికి ప్రతి ఏటా 20 బండ్ల లేదా 10 టన్నుల మాగిన పశువుల ఎరువు లేదా వర్మీ కంపోస్టు లేదా కంపోస్టు వేస్తూ సేంద్రియ వ్యవసాయం చేస్తున్నారు. రసాయనిక వ్యవసాయం కన్నా కూడా ఇది అనేక రెట్లు ఎక్కువ ఖర్చుతో కూడినది. అందుకే రైతులు పట్టించుకోవటం లేదు. అంతేకాదు, రసాయనిక వ్యవసాయంలో మాదిరిగానే పశువుల ఎరువు లేదా వర్మీకంపోస్టు, కంపోస్టు, నూనెగింజల తెలగ పిండిని పొలాల్లో వెదజల్లిన తర్వాత.. అందులో నుంచి కర్బనం విడుదలై ఆక్సీకరణం చెంది కార్బన్ డయాక్సయిడ్, నైట్రస్ ఆక్సైడ్, మీథేన్ వంటి హరిత గృహ విష వాయువులు వెలువడి వాతావరణాన్ని వేడెక్కిస్తున్నాయి. మన నేలల్లో సేంద్రియ కర్బనం 0.03% మాత్రమే మిగిలి ఉండటం వల్ల ఈ సేంద్రియ ఎరువులు వాడినా నేలల్లో హ్యూమస్ (జీవన ద్రవ్యం) ఏర్పడటం లేదు. ఈ విధంగా రసాయనిక ఎరువుల వల్లనే కాకుండా టన్నుల కొద్దీ వేసే పశువుల ఎరువు వల్ల కూడా పెద్ద మొత్తంలో ఉద్గారాలు వెలువడుతున్నాయి. అందువల్లనే, వ్యవసాయ ఆహార ఉద్గారాలు ఇతరత్రా మొత్తం ఉద్గారాల్లో 60%కి పైగా ఉంటాయని నా అంచనా.

■ **మీరు కూడా ఆవు పేడతో తయారు చేసిన ఘనజీవామృతం, జీవామృతం వాడమంటున్నారు కదా..?**

డా॥ పాలేకర్: ఈ రెండూ సేంద్రియ ఎరువులు కాదు. నేలలో రసాయనాల వల్ల అంతరించిపోయిన సూక్ష్మజీవరాశిని పెంపొందించే మైక్రోబియల్ కల్చర్లు మాత్రమే. ఎకరానికి ఏటా మహా అయితే 400 కిలోల ఘన జీవామృతం చాలు. 'సుభాష్ పాలేకర్ కృషి పద్ధతి' ద్వారా ఒక్క గ్రాము కర్బన ఉద్గారాలు వెలువడవు. నేను చెప్పినట్లు చేస్తే మారిన మొదటి ఏడాది కూడా దిగుబడి తగ్గదు. పది శాతం నీటితోనే ఆరుతడి పద్ధతిలో మిథేన్ వెలువడకుండా వెద వరి సాగు చేయొచ్చు.

■ **'పెట్టుబడి లేని ప్రకృతి వ్యవసాయం' అనే మాటకు బదులు 'సుభాష్ పాలేకర్ కృషి' అని అంటున్నారెందుకని?**

డా॥ పాలేకర్: పెట్టుబడి లేకుండా పనులు జరగవు. మనం పొలంలో పనిగట్టుకొని చేసే వ్యవసాయ పనులేవీ ప్రకృతిలో ఉండవు. అలాంటప్పుడు ప్రకృతి వ్యవసాయం అనటం సరికాదు అనిపించి పేరు మార్చాను. 'సుభాష్ పాలేకర్ కృషి' పద్ధతి అని పిలవమని చెబుతున్నాను. ఇదే విషయాన్ని నీతి ఆయోగ్, మేనేజ్ తదితర సంస్థలన్నిటికీ చెప్పాను.

■ **పర్యావరణ అనుకూల సాగు పద్ధతుల వ్యాప్తి నెమ్మదిగా ఉండటానికి కారణం?**

డా॥ పాలేకర్: ప్రభుత్వాలతో పాటు ప్రజలు చైతన్యవంతులై పోషకాల సాంద్రతతో, ఔషధ గుణాలతో కూడిన ఆరోగ్యదాయకమైన పంట దిగుబడులు పండించడానికి రైతులను ప్రోత్సహించాలి. డయాబెటిస్, కేన్సర్ వంటి జబ్బుల నుంచి తమను తాము రక్షించుకోవడానికి ఇది అవసరమని వాళ్లు ఎంత త్వరగా గుర్తిస్తే అంత మంచిది. యూరప్, అమెరికాలో ప్రజలు ఈ విషయం గుర్తించి జాగ్రత్తపడుతున్నారు. మన ప్రజలూ గుర్తెరగాలి.

■ **రైతులకు శిక్షణా శిబిరాలేమైనా పెడుతున్నారా?**

డా॥ పాలేకర్: రంగారెడ్డి జిల్లాలోని రామచంద్రమిషన్ ఆవరణలో 6 వేల మంది రైతులకు 2024 ఏప్రిల్‌లో పది రోజుల శిక్షణా శిబిరం నిర్వహించబోతున్నాం. దీనికి సహకరించమని టీటీడీని కోరుతున్నాం.

(డా॥ సుభాష్ పాలేకర్: వాట్సప్– 98503 52745
palekarsubhash@yahoo.com / spk.org.in)

ఇంటర్వ్యూ: పంతంగి రాంబాబు

పనస రైతు వైభవం!



కేరళలోని కొట్టాయంకు చెందిన రైతు వి.ఎ. థామస్ 8 ఏళ్ల క్రితం రబ్బర్ సాగుకు స్వస్తి చెప్పారు. 70 ఏళ్ల వయసులో రసాయనిక వ్యవసాయం వదిలి సేంద్రియ వ్యవసాయం చేపట్టారు. ఇంత వరకే అయితే పెద్ద విశేషం లేదు. కొట్టాయం దగ్గర్లోని చక్కంపురు గ్రామంలోని తమ 5 ఎకరాల కుటుంబ క్షేత్రాన్ని 400 రకాల పనస చెట్లతో జీవవైవిధ్యానికి చెరగని చిరునామాగా మార్చారు థామస్. బడ్ గ్రాఫ్టింగ్ లేదా బడ్డింగ్ మెథడ్‌లో గ్రాఫ్టింగ్ చేస్తూ కొత్త రకాలను సృష్టిస్తున్నారు. దేశవ్యాప్తంగా పర్యటిస్తూ పనస తొనలను రుచి చూస్తారు. నచ్చిన రకాల మొక్కల్ని వెంట తెచ్చి నాటుకుంటారు. రెండేళ్లు, ఏడాదిన్నరలోనే కాపుకొచ్చే వియత్నాం, కంబోడియాల నుంచి కూడా కొన్ని పనస రకాలను సేకరించారు. మొక్కలతో పాటు ఎండబెట్టిన పనస తొనలను అమ్ముతూ ఎకరానికి ఏటా రూ.4 లక్షల ఆదాయం పొందుతున్నారు. ఎండబెట్టిన పచ్చి పనస కాయలను కిలో రూ. వెయ్యి. ఎండబెట్టిన పనస పండ్లను కిలో రూ. 2 వేలకు అమ్ముతుండటం విశేషం!



మెయిన్ 'డ్రా'కు శ్రావ్య శివాని

అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) మహిళల టోర్నీలో హైదరాబాద్ ప్లేయర్లు శ్రావ్య శివాని, హుమేరా బహార్మస్ మెయిన్ 'డ్రా'కు అర్హత సాధించారు. షోలాపూర్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో సోమవారం జరిగిన క్వాలిఫయింగ్ తొలి రౌండ్‌లో శ్రావ్య శివాని 6-4, 4-6, 11-9తో సుహిత మారూరి (భారత్)పై, రెండో రౌండ్‌లో 6-0, 2-6, 11-9తో పూజా ఇంగాలె (భారత్)పై గెలిచింది. హుమేరా తొలి రౌండ్‌లో 6-0, 7-5తో బేలా తమాంకర్ (భారత్)పై, రెండో రౌండ్‌లో 6-1, 6-3తో రాచపూడి ప్రత్యూష (భారత్)పై నెగ్గింది.

పాండ్యాకు పగ్గాలు సరైన నిర్ణయమే: గావస్కర్



ముంబై ఇండియన్స్ కెప్టెన్‌గా హార్దిక్ పాండ్యాను నియమించడం సరైందేనని క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ అన్నారు. యువ నాయకత్వానికి, కొత్త ఆలోచనలకు ఇది ప్రోత్సాహకరమని అభిప్రాయపడ్డారు. 'ముంబై కెప్టెన్‌గా హార్దిక్‌ను నియమించడాన్ని తప్పొప్పా అనే కోణంలో చూడొద్దు. టీమ్‌కు లబ్ధి చేకూరుతుందనే ఫ్రాంచైజీ నిర్ణయం తీసుకుంది. ఆటలోనే కాదు... జట్టును నడిపించడంలోనూ రోహిత్ శర్మలో ఉత్సాహం తగ్గింది' అని గావస్కర్ వివరించారు.

సిరీస్ విజయమే లక్ష్యంగా...



- నేడు దక్షిణాఫ్రికాతో భారత్ రెండో వన్డే
- పరువు కోసం సఫారీల ప్రయత్నం
- సాయంత్రం గం.4:30 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

పోర్ట్ ఎలిజబెత్: దక్షిణాఫ్రికాతో తొలి వన్డేలో అదరగొట్టిన భారత జట్టు ఇప్పుడు అదే తరహాలో మరో గెలుపుపై కన్నేసింది. ఒక మ్యాచ్ ముందే సిరీస్‌ను తమ ఖాతాలో వేసుకోవాలని పట్టుదలగా ఉంది. గత మ్యాచ్ ఘన విజయం ఇచ్చిన ఉత్సాహం టీమిండియాలో కనిపిస్తుండగా... సొంతగడ్డపై అనూహ్యంగా 116 పరుగులకే కుప్పకూలిన దక్షిణాఫ్రికా తమ టీమ్ ప్రదర్శనపై కొత్త సందేహాలు రేపింది. మూడో టి20లో ఓటమి తర్వాత తొలి వన్డేలో ఆ జట్టు ఆటతీరు మరీ పేలవంగా కనిపించింది. ఈ నేపథ్యంలో ఇరు జట్ల మధ్య నేడు రెండో వన్డే మ్యాచ్‌కు రంగం సిద్ధమైంది. భారత్ సిరీస్ అందుకుంటుందా లేక సఫారీ టీమ్ కోలుకొని తగిన రీతిలో బదులిస్తుందా అనేది చూడాలి.

రజత్ పటిదార్‌కు అవకాశం!

గత మ్యాచ్‌లో భారత బౌలర్లు అర్ష్‌దీప్, అవేశ్ ఖాన్ ప్రత్యర్థిని పడగొట్టగా... ఐదో బౌలర్ అవసరం కూడా రాకుండానే దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ ముగిసింది. అరంగేట్ర మ్యాచ్‌లోనే సాయి సుదర్శన్ ఆకట్టుకున్నాడు. ఈ స్థితిలో తుది జట్టులో ఎలాంటి మార్పు అవసరం లేకుండానే జట్టు బరిలోకి దిగేది. అయితే టెస్టు సిరీస్ సన్నద్ధత కోసం శ్రేయస్ అయ్యర్ ఈ మ్యాచ్‌తో పాటు తర్వాతి మ్యాచ్ నుంచి తప్పుకున్నాడు. దాంతో బ్యాటింగ్ విభాగంలో ఒక ఖాళీ ఏర్పడింది. చాలా కాలంగా తొలి అవకాశం కోసం ఎదురు చూస్తున్న మధ్యప్రదేశ్ బ్యాటర్ రజత్ పటిదార్‌కు నేరుగా చోటు దక్కనుంది. ఈ స్థానం కోసం రింకూ సింగ్ నుంచి కూడా పోటీ ఉన్నా... టి20 సిరీస్‌లో అవకాశం దక్కించుకున్న రింకూకంటే రజత్‌కే మొదటి ప్రాధాన్యత దక్కనుంది. తొలి మ్యాచ్‌లో బ్యాటింగ్ చేయని రాహుల్, సంజు సామ్సన్‌లు కూడా రాణిస్తే భారత్‌కు తిరుగుండదు. బౌలింగ్‌లో మరోసారి కుల్దీప్ పదునైన బంతులను సఫారీలు ఎలా ఎదుర్కొంటారో చూడాలి.



హెన్‌డ్రిక్స్

హెన్‌డ్రిక్స్‌పై దృష్టి...

దక్షిణాఫ్రికా కూడా గత ఓటమిని మరచి కోలుకునే ప్రయత్నంలో ఉంది. అయితే ఆ జట్టు బ్యాటింగ్‌లో ఆత్మవిశ్వాసం కనిపించడం లేదు. ఎన్నో అంచనాలతో వన్డేల్లో వరుసగా అవకాశం దక్కించుకుంటున్న ఓపెనర్ హెన్‌డ్రిక్స్ పేలవంగా ఆడుతుండగా... డసెన్, మార్క్‌రమ్, మిల్లర్ కూడా ప్రభావం చూపలేకపోతున్నారు. భారత గడ్డపై వరల్డ్ కప్‌లో చెలరేగిన క్లాసెన్ సొంత మైదానంలో మాత్రం ఇంకా తన స్థాయిని ప్రదర్శించలేదు. అనుభవం లేని బర్గర్, ముల్డర్‌ల బౌలింగ్ భారత్‌కు ఏమాత్రం ఇబ్బంది పెట్టలేదు. పిచ్ కారణంగా ఈ సారి కూడా ఇద్దరు స్పిన్నర్లు కేశవ్, షమ్సీ తుది జట్టులో ఉంటారు.

పిచ్, వాతావరణం

దక్షిణాఫ్రికా అత్యంత నెమ్మదైన మైదానాల్లో ఇదొకటి. సాధారణ పిచ్. భారీ స్కోర్లకు అవకాశం లేదు. గత 12 ఏళ్లలో ఇక్కడ 8 వన్డేలు జరగ్గా... ఒక్కసారి కూడా స్కోరు 300 దాటలేదు. మ్యాచ్‌కు అనుకూల వాతావరణం ఉంది. వర్షసూచన లేదు.

ఎవరికి అందలం!

నేడు దుబాయ్‌లో ఐపీఎల్ మినీ వేలం • ఖాళీలు 77, బరిలో 333 మంది • అందరి కళ్లు రచిన్‌పైనే

విశ్వవ్యాప్త క్రికెట్ అభిమానాన్ని యేటికేడు పెంచుకుంటున్న ఐపీఎల్‌లో ఆటకు ముందు వేలం పాట జరగబోతోంది. దుబాయ్‌లో నేడు నిర్వహించే మినీ వేలానికి 333 మంది ఆటగాళ్లు అందుబాటులో ఉన్నారు. 10 ఫ్రాంచైజీలకు కావాల్సింది 77 మంది కాగా... ఇటీవల ప్రపంచకప్‌తో పాటు పరిమిత ఓవర్ల ఆటలో మెరిపిస్తున్న న్యూజిలాండ్ క్రికెటర్ రచిన్ రవీంద్రపై కోట్లు కురిపించేందుకు ఫ్రాంచైజీలన్నీ సై అంటున్నాయి.

దుబాయ్: వచ్చే ఏడాది ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) టి20 క్రికెట్ టోర్నమెంట్‌కు నేడు దుబాయ్‌లో ఆటగాళ్ల మినీ వేలం పాట నిర్వహిస్తున్నారు. ఈ లీగ్ చరిత్రలో తొలిసారి వేలం ప్రక్రియ విదేశీ గడ్డపై జరగనుంది. ఒక రోజు ముందు సోమవారం ఫ్రాంచైజీ యాజమాన్యాలతో మాక్ వేలం కూడా నిర్వహించారు. ఇక కోట్ల పందేరం, ఆటగాళ్లకు అందలం పలికేందుకు ఒకటోసారి, రెండోసారి అని సుత్తి బద్దలు కొట్టే ప్రక్రియే తరువాయి.

1,166 మంది నమోదు చేసుకుంటే...

ఈ మినీ వేలం కోసం ఐసీసీ సభ్య, అనుబంధ దేశాలు, దేశవాళీ ఆటగాళ్లు ఆసక్తి చూపారు. ఏకంగా 1,166 మంది ఐపీఎల్ వేలం కోసం నమోదు చేసుకుంటే... ఫ్రాంచైజీ జట్లతో సంప్రదింపుల అనంతరం లీగ్ పాలకమండలి 333 మంది ఆటగాళ్లతో తుది జాబితాను సిద్ధం చేసింది. ఇందులోనే ఇద్దరు అసోసియేట్ ప్లేయర్లు సహా 119 విదేశీ ఆటగాళ్లున్నారు. అయితే 10 ఫ్రాంచైజీలకు కావాల్సింది మాత్రం 77 మంది ఆటగాళ్లు. ఇందులో 30 ఖాళీలను విదేశీ ఆటగాళ్లతోనే భర్తీ చేసుకోవాల్సి ఉంది. అత్యధికంగా 12 ఖాళీలు కోల్‌కతా నైట్‌రైడర్స్‌లో ఉన్నాయి. నలుగురు విదేశీ ఆటగాళ్లు సహా 12 మందిని కొనేందుకు కోల్‌కతా వద్ద రూ. 32.70 కోట్లు అందుబాటులో ఉన్నాయి.

హాట్ కేక్... రచిన్?

భారత్‌లో ఈ ఏడాది జరిగిన వన్డే ప్రపంచకప్‌లో డాషింగ్ బ్యాటర్‌గా రచిన్ రవీంద్ర అందరికంటా పడ్డాడు. ఆరంభంలో ఎదురుదాడికి దిగి న్యూజిలాండ్ విజయాలకు గట్టి పునాది వేసిన రచిన్ ఈ మినీ వేలంలో హాట్‌కేక్ కానున్నాడు. రూ.50 లక్షల కనీస ధరతో ఫ్రాంచైజీల్ని ఆకర్షిస్తున్నాడు. ఆసీస్ స్పీడ్‌స్టర్స్ స్టార్క్, కమిన్స్, బ్యాటర్ ట్రావి హెడ్, దక్షిణాఫ్రికా సంచలనం కొయెట్జీ, హసరంగ (శ్రీలంక) తదితర స్టార్ క్రికెటర్ల కోసం ఫ్రాంచైజీ యాజమాన్యాలు ఎగబడే అవకాశాలు న్నాయి. భారత్ నుంచి శార్దుల్ ఠాకూర్, హర్షల్ పటేల్, అన్‌క్యాప్డ్ ఆల్‌రౌండర్ల సెట్ నుంచి షారుఖ్ ఖాన్‌లపై రూ.కోట్లు కురిసే అవకాశముంది. వేలం కోసం ప్లేయర్ల ప్రత్యేకతను బట్టి 19 సెట్‌లుగా విభజించారు. అంటే బ్యాటర్, ఆల్‌రౌండర్, పేసర్, స్పిన్నర్, వికెట్ కీపర్, క్యాప్డ్, అన్‌క్యాప్డ్ ఇలా సెట్‌ల వారీగా వేలం ప్రక్రియ జరుగుతుంది.

మధ్యాహ్నం గం. 1 నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం



హెడ్, కమిన్స్, కొయెట్జీ, శార్దుల్, రచిన్ రవీంద్ర

హరికృష్ణ గేమ్ 'డ్రా'



చెన్నై: చెన్నై గ్రాండ్‌మాస్టర్స్ అంతర్జాతీయ చెస్ టోర్నీలో భారత అగ్రశ్రేణి ప్లేయర్ పెంటేల హరికృష్ణ వరుసగా మూడో 'డ్రా' నమోదు చేశాడు. లెవాన్ అరోనియన్ (అమెరికా)తో సోమవారం జరిగిన నాలుగో రౌండ్ గేమ్‌ను హరికృష్ణ 41 ఎత్తుల్లో 'డ్రా' చేసుకున్నాడు. పావెల్ ఎల్యానోవ్ (ఉక్రెయిన్)తో జరిగిన గేమ్‌ను తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ 54 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించాడు. తమిళనాడు ప్లేయర్ గుకేశ్ 44 ఎత్తుల్లో అలెగ్జాండర్ ప్రెడ్కె (సెర్బియా)ను ఓడించాడు. నాలుగో రౌండ్ తర్వాత హరికృష్ణ, గుకేశ్ 2.5 పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో ఉన్నారు.

పుణేరి పల్టన్‌కు మూడో గెలుపు

పుణే: ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్‌లో పుణేరి పల్టన్ జట్టు ఖాతాలో మూడో విజయం చేరింది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో పుణేరి పల్టన్ 30-23 పాయింట్ల తేడాతో దబంగ్ ఢిల్లీ జట్టుపై గెలిచింది. పుణేరి జట్టు తరఫున కెప్టెన్ అస్లామ్ ముస్తఫా 8 పాయింట్లు, మోహిత్ గోయట్ 7 పాయింట్లు స్కోరు చేశారు. ఢిల్లీ తరఫున కెప్టెన్ అషు మలిక్ 9 పాయింట్లు సాధించాడు. బెంగాల్ వారియర్స్, యూపీ యోధాస్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ 37-37తో 'డ్రా'గా ముగిసింది. ఈ సీజన్‌లో ఇది రెండో 'డ్రా'కాగా రెండింటిలోనూ వారియర్స్ ప్రత్యర్థి జట్టుగా ఉంది. వారియర్స్‌తో మ్యాచ్‌లో చివరి ఐదు నిమిషాల వరకు యోధాస్ జట్టు 35-30తో ఆధిక్యంలో ఉంది. అయితే వారియర్స్ కీలక ఆటగాడు నితిన్ కీలకదశలో పాయింట్లు రాబట్టి స్కోరును సమం చేశాడు. ఆ తర్వాత చివర్లో ఇరు జట్లు రెండు పాయింట్ల చొప్పున స్కోరు చేయడంతో మ్యాచ్ 'టై' అయింది. నేడు జరిగే మ్యాచ్‌లో హరియాణా స్టీలర్స్‌తో గుజరాత్ జెయింట్స్ తలపడుతుంది.



ప్రొ కబడ్డీ లీగ్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	టై	పా
బెంగాల్ వారియర్స్	6	3	1	2	21
గుజరాత్ జెయింట్స్	5	3	2	0	17
పుణేరి పల్టన్	4	3	1	0	16
యు ముంబా	5	3	2	0	16
యూపీ యోధాస్	5	2	2	1	15
జైపూర్ పింక్ పాంథర్స్	5	2	2	1	15
హరియాణా స్టీలర్స్	4	3	1	0	15
బెంగళూరు బుల్స్	6	2	4	0	14
పట్నా పైరేట్స్	5	2	3	0	12
దబంగ్ ఢిల్లీ	4	2	2	0	11
తమిళ్ తలైవాస్	4	2	2	0	10
తెలుగు టైటాన్స్	5	0	5	0	2

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు

సినిమా



• మహేశ్ బాబు, శ్రీలీల

హైదరాబాద్‌లో ఆటా పాట

'అతడు', 'ఖలేజా' చిత్రాల తర్వాత హీరో మహేశ్ బాబు, దర్శకుడు త్రివిక్రమ్ కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం 'గుంటూరు కారం'. శ్రీలీల కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో మీనాక్షీ చౌదరి, రమ్యకృష్ణ, ప్రకాష్‌రాజ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. హారిక అండ్ హాసినీ క్రియేషన్స్ పతాకంపై సూర్యదేవర రాధాకృష్ణ (చినబాబు) నిర్మిస్తున్న ఈ చిత్రం సంక్రాంతి కానుకగా జనవరి 12న విడుదల కానుంది. ఈ సినిమా తాజా షెడ్యూల్ చిత్రీకరణ ఈ నెల 21 నుంచి హైదరాబాద్‌లో జరగనుంది. ''గుంటూరు కారం' సినిమాలో నాలుగు పాటలు, ఓ బిట్ సాంగ్ ఉన్నాయి. వాటిలో మూడు పాటలు, బిట్ సాంగ్ పూర్తయ్యాయి. మిగిలిన ఓ పాటను ఈ నెల 21 నుంచి చిత్రీకరించేలా ప్లాన్ చేశాం'' అని సూర్యదేవర నాగవంశీ పేర్కొన్నారు.



• వరుణ్ తేజ్, మానుషీ చిల్లర్

గుర్తుచేయాల్సిన సమయం వచ్చింది

వరుణ్ తేజ్, మానుషీ చిల్లర్ జంటగా నటించిన దేశభక్తి చిత్రం 'ఆపరేషన్ వాలెంటైన్'. తెలుగు, హిందీ భాషల్లో తెరకెక్కుతున్న ఈ సినిమాకు శక్తి ప్రతాప్ సింగ్ హడా దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రంలో అర్జున్‌దేవ్ పాత్రలో వరుణ్ తేజ్ కనిపిస్తారు. రాడార్ ఆఫీసర్‌గా మానుషి చిల్లర్ నటించారు. సోనీ పిక్చర్స్ ఇంటర్నేషనల్ ప్రొడక్షన్స్, సందీప్ ముద్దా నిర్మిస్తున్న ఈ సినిమా ఫిబ్రవరి 16న విడుదల కానుంది. సోమవారం 'ఫస్ట్ స్ట్రైక్' పేరుతో ఈ సినిమా టీజర్‌ను తెలుగు, హిందీ భాషల్లో విడుదల చేశారు. 'శత్రువులకు ఓ విషయం గుర్తుచేయాల్సిన సమయం వచ్చింది. మన దేశం గాంధీజీతో పాటు సుభాష్ చంద్రబోస్‌ది కూడా..', 'ఏం జరిగినా సరే చూసుకుందాం' (వరుణ్ తేజ్) వంటి డైలాగ్స్ టీజర్‌లో ఉన్నాయి. ''దేశ వైమానిక దళ హీరోల ధైర్యసాహసాలు, దేశాన్ని రక్షించడంలో వారు ఎదుర్కొనే సవాళ్ల నేపథ్యంలో ఈ మూవీ కథనం ఉంటుంది'' అని చిత్రయూనిట్ పేర్కొంది.



• ప్రభాస్

ఖాన్సార్ ఎరుపెక్కాల..!

''చిన్నప్పుడు నీకో కథ చెప్పేవాడిని.. పర్షియన్ సామ్రాజ్యంలో సుల్తాన్ ఎంత పెద్ద సమస్య వచ్చినా తన బలమైన సైన్యానికి కూడా చెప్పకుండా ఒక్కడికే చెప్పేవాడు'' అనే వాయిస్ ఓవర్‌తో 'సలార్: సీజ్‌ఫైర్' సినిమా రిలీజ్ ట్రైలర్ విడుదలైంది. ప్రభాస్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వం వహించిన చిత్రం 'సలార్'. శ్రుతీహాసన్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో పృథ్వీరాజ్ సుకుమారన్, జగపతిబాబు, టీనూ ఆనంద్, ఈశ్వరీరావు కీలక పాత్రలు పోషించారు. హోంబలే ఫిలింస్‌పై విజయ్ కిరగందూర్ నిర్మించిన 'సలార్' మూవీ మొదటి భాగం 'సలార్: సీజ్‌ఫైర్' ఈ నెల 22న విడుదల కానుంది. ఈ సందర్భంగా 'సలార్: సీజ్‌ఫైర్' రిలీజ్ ట్రైలర్‌ను విడుదల చేశారు మేకర్స్. ట్రైలర్ చూస్తే.. ఈ చిత్రంలో మెకానిక్ పాత్రలో ప్రభాస్ నటించినట్లు తెలుస్తోంది. 'ఖాన్సార్‌లో క్యాలిక్యులేటర్ పెట్టుకుని ఏం లెక్క పెట్టలేం', 'అందుకే లెక్కపెట్టలేని ఓ పిచ్చోడిని తీసుకువచ్చాను' (పృథ్వీరాజ్ సుకుమారన్), 'ఖాన్సార్ ఎరుపెక్కాల..', 'మండే నిప్పుతోనైనా.. వీళ్ల రక్తంతోనైనా' (ప్రభాస్), 'ఖాన్సార్ వల్ల చాలా కథలు మారాయి.. కానీ, ఖాన్సార్ కథ మార్చింది ఇద్దరు ప్రాణస్నేహితులు బద్ధ శత్రువులుగా మారడం'' వంటి డైలాగ్స్ ట్రైలర్‌లో ఉన్నాయి.

అంతకుమించిన స్థాయి లేదు - నాని



• విజయేందర్ రెడ్డి, మోహన్ చెరుకూరి, నాని, కియారా ఖన్నా, శౌర్యువ్, హేషమ్ అబ్దుల్, ప్రియదర్శి, షాను

''చిత్ర పరిశ్రమలో బాక్సాఫీసు లెక్కలు, స్థానాలు, స్థాయి అని మాట్లాడుతుంటారు. నాకు సంబంధించి శుక్రవారం నా సినిమా విడుదలైతే.. 'నాని సినిమాకి వెళ్దాం రా' అని ప్రేక్షకులు అన్నారంటే అదే గొప్ప స్థాయి.. దానికి మించిన స్థాయి ప్రపంచంలో మరొకటి లేదని నమ్ముతాను. ఆ స్థాయి, స్థానాన్ని కాపాడుకోవడానికి ప్రయత్నిస్తూనే ఉంటాను'' అని హీరో నాని అన్నారు. శౌర్యువ్ దర్శకత్వంలో నాని, మృణాల్ ఠాకూర్ జంటగా, బేబీ కియారా ఖన్నా కీలక పాత్రలో నటించిన చిత్రం 'హాయ్ నాన్న'. మోహన్ చెరుకూరి, డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల నిర్మించిన ఈ సినిమా ఈ నెల 7న రిలీజైంది. ఈ మూవీ బ్లాక్ బస్టర్ సక్సెస్ సెలబ్రేషన్స్‌లో నాని మాట్లాడుతూ–''మా సినిమాపై ప్రేక్షకులు ఎన్నో ప్రశంసలు కురిపిస్తున్నారు. నేను నమ్మంది నిజమైనందుకు ఆనందంగా ఉంది. 'హాయ్ నాన్న' కి ఇంత పెద్ద విజయం అందించిన తెలుగు ప్రేక్షకులకు ఎప్పటికీ రుణపడి ఉంటాం. ఇలాంటి మంచి సినిమాలు చేయడానికి ప్రయత్నిస్తూనే ఉంటాను'' అన్నారు. ''నానిగారు 'హాయ్ నాన్న' కథని నా కోసం, తెలుగు సినిమా కోసం ఎంపిక చేసుకున్నారని భావిస్తున్నాను'' అన్నారు శౌర్యువ్. ''హాయ్ నాన్న' చరిత్రలో నిలిచిపోయే చిత్రం'' అన్నారు డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల. కెమెరామేన్ షాను మాట్లాడారు.


సరికొత్తగా...



• నిహారిక

నిహారిక కొణిదెల లీడ్ రోల్‌లో నటిస్తున్న చిత్రం 'వాట్ ది ఫిష్'. 'వెన్ ది క్రేజీ బికమ్స్ క్రేజియర్' అనేది ఉపశీర్షిక. ఈ చిత్రంతో వరుణ్ కోరుకొండ దర్శకునిగా పరిచయమవుతున్నారు. 6 ఐఎక్స్ సినిమాస్‌పై విశాల్ బెజవాడ, సూర్య బెజవాడ నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. ''ఈ సినిమాలో అష్టలక్ష్మి పాత్రలో కనిపిస్తారు నిహారిక. ఆమె పాత్ర సరికొత్తగా, ప్రేక్షకులను అలరించేలా ఉంటుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: శక్తికాంత్ కార్తీక్, సహ నిర్మాత: వరుణ్ కోరుకొండ. కాగా 2019లో వచ్చిన 'సూర్యకాంతం' చిత్రం తర్వాత మళ్లీ నిహారిక నటిస్తున్న సినిమా 'వాట్ ది ఫిష్' కావడం విశేషం.

మారుతినగర్‌లో నవ్వులు



• రావు రమేశ్

రావు రమేష్, ఇంద్రజ జంటగా నటించిన చిత్రం 'మారుతినగర్ సుబ్రమణ్యం'. లక్ష్మణ్ కార్య దర్శకత్వం వహిస్తున్నారు. పీబీఆర్ సినిమాస్, లోకమాత్రే సినిమాటిక్స్ సంస్థలు నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ పూర్తయింది. ''ఈ చిత్రంలో మంచి వినోదాత్మక పాత్రలో నటించారు రావు రమేష్‌గారు. ఈ మూవీ ప్రేక్షకులను అలరిస్తుంది'' అన్నారు లక్ష్మణ్ కార్య. ''అజీజ్ నగర్, బీహెచ్ఈఎల్, కనకమామిడి, వనస్థలిపురం... ఇలా హైదరాబాద్ పరిసరాల్లో ఈ సినిమా షూటింగ్ చేశాం. రావు రమేష్‌గారు ఈ సినిమాలో చెప్పిన డైలాగ్స్ ప్రేక్షకులను నవ్వించడం పక్కా'' అన్నారు నిర్మాతలు. ఈ సినిమాకు సంగీతం: కల్యాణ్ నాయక్.

రాజస్థాన్ ఫిలిం ఫెస్టివల్‌కి మధురపూడి..



• శివ

'మధురపూడి గ్రామం అనే నేను' సినిమా 'రాజస్థాన్ ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్' 2023కి ఎంపిక అయింది. ఈ విషయాన్ని చిత్రయూనిట్ వెల్లడించింది. శివ కంఠమనేని, క్యాథలిన్ గౌడ జంటగా మల్లి దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'మధురపూడి గ్రామం అనే నేను'. జి.రాంబాబు యాదవ్ సమర్పణలో లైట్ హౌస్ సినీ మ్యాజిక్‌పై కేఎస్ శంకర్ రావు, ఆర్.వెంకటేశ్వర రావు నిర్మించిన ఈ సినిమా అక్టోబర్ 13న విడుదలైంది. ఈ మూవీ 10వ 'రాజస్థాన్ ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్'కి ఎంపిక అయింది. 2024 జనవరిలో ఈ అవార్డును ప్రదానం చేయనున్నారు. ''మా మూవీ భవిష్యత్‌లో మరిన్ని అవార్డులు సాధిస్తుందనే నమ్మకం ఉంది'' అన్నారు శివ కంఠమనేని. ''ఈ సినిమాపై మొదటి నుండి మా టీమ్ చాలా నమ్మకంగా ఉన్నాం. ఈ రోజు మా నమ్మకం నిజమైంది'' అన్నారు మల్లి.

నన్ను చూసినావే పిల్లా!



• సంపూర్ణేష్‌బాబు, ఆర్తి గుప్తా

సంపూర్ణేష్ బాబు, సంజోష్, ప్రాచీ బంసాల్, ఆర్తి గుప్తా ప్రధాన తారాగణంగా నటించిన చిత్రం 'సోదరా'. మన్‌మోహన్ మేనంపల్లి దర్శకత్వం వహిస్తున్నారు. క్యాన్స్ ఎంటర్‌టైన్మెంట్స్, మాంక్ ఫిల్మ్స్‌పై చంద్ర చగంలా నిర్మిస్తున్నారు. సునీల్ కశ్యప్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'నన్ను చూసినావే పిల్లా.. నా కలలే నిజమయ్యేలా...' అంటూ సాగే రెండో పాటని విడుదల చేశారు మేకర్స్. ''సోదరా' నుంచి ఇప్పటికే రిలీజైన 'అన్నంటే దోస్తే సోదరా..' అనే తొలి పాటకి మంచి స్పందన వచ్చింది. 'నన్ను చూసినావే పిల్లా..' పాట ఫ్రెష్ ఫీల్‌తో మంచి లవ్ రొమాంటిక్‌గా ఉంటుంది'' అని చిత్ర బృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: జాన్.

రాచరికం ఆరంభం

విజయ్ శంకర్ హీరోగా, అప్సరా రాణి హీరోయిన్‌గా 'రాచరికం' సినిమా ఆరంభం అయింది. సురేష్ లంకలపల్లి దర్శకుడు. చిల్ బ్రోస్ ఎంటర్‌టైన్మెంట్స్‌పై ఈశ్వర్ నిర్మిస్తున్న 'రాచరికం' మూవీ సోమవారం ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాతలు డీఎస్ రావు కెమెరా స్విచ్చాన్ చేయగా, రాజ్ కందుకూరి క్లాప్ కొట్టగా, ఈశ్వర్ స్క్రిప్ట్‌ను అందించారు. ఈశ్వర్ మాట్లాడుతూ–''సురేష్‌తో ఆరు నెలలుగా ప్రయాణించాం. సినిమా బాగా వస్తుందనే నమ్మకం ఉంది'' అన్నారు. ''రాచరికం' చిత్రంలో ప్రతి పాత్రకు ప్రాధాన్యత ఉంటుంది'' అన్నారు సురేష్ లంకలపల్లి. ''రాచరికం' లాంటి మంచి చిత్రంలో నాకు అవకాశం ఇచ్చిన దర్శక–నిర్మాతలకు ధన్యవాదాలు'' అన్నారు విజయ్ శంకర్. ''రాచరికంతో అరాచకం సృష్టించబోతున్నాం'' అన్నారు అప్సరా రాణి. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: చాణక్య, కెమెరా: ఆర్య సాయికృష్ణ, సంగీతం: వెంగి.



• అప్సరా రాణి, విజయ్ శంకర్, రాజ్ కందుకూరి

సాక్షి బిజినెస్
మంగళవారం
19-12-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▽	169	71,315
నిఫ్టీ ▽	38	21,419

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమ రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	14,896	△ 82
డోజోన్స్	37,359	△ 54
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,614	△ 38
డాక్స్	16,651	▽ 101
షాంఘై	2,931	▽ 12
నికాయ్	32,759	▽ 212

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో) — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	61,902
బంగారం (99.5 స్వచ్ఛత)	61,654
వెండి (కిలో)	73,588

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	82.58	83.88
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	104.23	106.79
€	యూరో	ఒకటి	89.59	92.09
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	54.23	56.10
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	54.12	57.23
S$	సింగపూర్ డాలర్	ఒకటి	61.45	63.44
SAR	సౌదీ రియాల్	ఖాతాపరిమితి	21.19	22.82
UAE D	యూఏఈ దిర్హామ్	ఖాతాపరిమితి	21.72	23.51
¥	చైనా యువాన్	ఖాతాపరిమితి	10.52	12.59

మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ 'మైన్ డైమండ్ ఫెస్టివల్'



హైదరాబాద్: ఆభరణాల సంస్థ మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ 'మైన్ డైమండ్ ఫెస్టివల్' ప్రకటించింది. ఉత్సవ ఆఫర్లలో భాగంగా వజ్రాల విలువపై 25% తగ్గింపు, పాత వజ్రాభరణాల మార్పిడిపై 100% విలువ పొందవచ్చు. మైన్ డైమండ్ ఫెస్టివల్ సందర్భంగా సోలిటైర్, పార్టీవేర్, క్యాజువల్, బ్రైడల్‌తో సహా భిన్న శ్రేణి వజ్రాభరణాలు అందుబాటులో ఉంచారు. స్టేట్‌మెంట్ నెక్లెస్‌లు, చెవిరింగులు, స్టడ్స్, రింగులు కూడా ఉన్నాయి. ఇప్పటికే ప్రారంభమైన ఫెస్టివల్ ఆఫర్లు దేశవ్యాప్తంగా అన్ని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూంల్లో జనవరి 14 వరకు అందుబాటులోకి ఉంది. అయితే ఎన్‌సీఆర్, పంజాబ్, హరియాణా, ఉత్తర ప్రదేశ్‌ల్లో జనవరి 5న మొదలై ఫిబ్రవరి 11 వరకు కొనసాగుతాయి.

విద్యుత్‌పై అంబుజా పెట్టుబడులు

పునరుత్పాదక ప్రాజెక్టులపై దృష్టి

న్యూఢిల్లీ: అదానీ గ్రూప్ దిగ్గజం అంబుజా సిమెంట్స్ పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులపై దృష్టి పెట్టింది. 2026కల్లా 1,000 మెగావాట్ల విద్యుత్ ప్రాజెక్టులను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొంది. ఇందుకు రూ. 6,000 కోట్లు వెచ్చించనున్నట్లు వెల్లడించింది. పరివర్తన పెట్టుబడులకింద అంతర్గత వనరుల నుంచి నిధులను సమకూర్చుకోనున్నట్లు తెలియజేసింది. ప్రణాళికల్లో భాగంగా సౌర, పవన విద్యుత్ ప్రాజెక్టుల పోర్ట్‌ఫోలియోకు తెరతీయనున్నట్లు తెలియజేసింది. వీటిని వ్యూహాత్మకంగా గుజరాత్, రాజస్తాన్‌లలో ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొంది. గుజరాత్‌లో 600 మెగావాట్ల సోలార్, 150 మెగావాట్ల పవన విద్యుత్ ప్రాజెక్టులు, రాజస్తాన్‌లో 250 మెగావాట్ల సోలార్ పవర్ ప్రాజెక్టును చేపట్టనున్నట్లు వెల్లడించింది. 2024 మార్చికల్లా 200 మెగావాట్లను అందుకోనున్నట్లు తెలియజేసింది. ప్రస్తుత 84 మెగావాట్ల సౌర, పవన విద్యుత్‌కు ఇవి అదనమని తెలియజేసింది.



ఓఎన్‌డీసీ @ 50 లక్షల లావాదేవీలు

యారీ యాప్ ఆవిష్కరణ



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఆన్‌లైన్‌లో కొనుగోలుదారులు, విక్రేతలను అనుసంధానించే ఓఎన్‌డీసీ (ఓపెన్ నెట్‌వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్)లో లావాదేవీల సంఖ్య ఈ డిసెంబరు ఆఖరు కల్లా నెలకు 50 లక్షల స్థాయికి చేరనున్నాయి. వచ్చే ఏడాది మార్చి ఆఖరు నాటికి ఇవి 70 లక్షలకు చేరే అవకాశం ఉందని సంస్థ ఎండీ టి. కోషి తెలిపారు. ఈ ఏడాది తొలినాళ్లలో లావాదేవీలు కొద్ది వేల సంఖ్యలో మాత్రమే ఉండేవని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం ఓఎన్‌డీసీలో దాదాపు 40 యాప్‌లు ఉన్నట్లు వివరించారు. నిత్యావసరాలు, ఫ్యాషన్ మొదలైనవి ఉండగా, వాటితో పాటు కొత్తగా ఆర్థిక సేవలు, ఇతరత్రా సర్వీసులను కూడా ఓఎన్‌డీసీలో అందుబాటులోకి తెస్తున్నట్లు సోమవారమిక్కడ ఆటో, క్యాబ్ సేవల యాప్ యారీని ఆవిష్కరించిన సందర్భంగా ఆయన చెప్పారు. హైదరాబాద్‌లో వాహన సేవల రంగాన్ని పునర్నిర్వచించేలా తమ యాప్ ఉంటుందని యారీ సీఈవో, సహ వ్యవస్థాపకుడు హరిప్రసాద్ తెలిపారు. ప్రస్తుతం ఉన్న యాప్‌లకు భిన్నంగా సున్నా కమీషన్ ప్రాతిపదికన దీన్ని తీర్చిదిద్దినట్లు చెప్పారు. రోజుకు అయిదు ట్రిప్‌లు దాటితే డ్రైవర్లు నామమాత్రంగా రూ. 25 చెల్లిస్తే సరిపోతుందన్నారు. ఇందులో ప్రభుత్వ నిర్దేశిత రేట్ల ప్రకారం చార్జీలు ఉంటాయని, కస్టమర్లు చెల్లించే మొత్తం డబ్బు డ్రైవర్లకు వెడుతుందని హరిప్రసాద్ వివరించారు. హైదరాబాద్‌తో ప్రారంభించి వచ్చే 6 నెలల్లో 4 నగరాలకు విస్తరించనున్నట్లు చెప్పారు. ప్రస్తుతం 12,000 పైచిలుకు డ్రైవర్ల ఆన్‌బోర్డింగ్ ప్రక్రియ పూర్తయిందని, 20,000 మంది డ్రైవర్లు ఇన్‌స్టాల్ చేసుకున్నారని పేర్కొన్నారు. హరిప్రసాద్, మదన్ బాలసుబ్రమణియన్, పరితోష్ వర్మ కలిసి యారీని ఏర్పాటు చేశారు.

భారత్‌కు సానుకూలంగా అంతర్జాతీయ పరిణామాలు

టాటా సన్స్ చీఫ్ ఎన్ చంద్రశేఖరన్



న్యూఢిల్లీ: అంతర్జాతీయంగా చోటు చేసుకుంటున్న మార్పులన్నీ భారత్‌కు సానుకూలంగా పరిణమిస్తున్నాయని టాటా సన్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ అభిప్రాయపడ్డారు. తద్వారా నేడు అనిశ్చితిలో కొట్టుమిట్టాడుతున్న ప్రపంచంలో ప్రబల శక్తిగా ఎదిగేందుకు అవసరమైన సామర్థ్యాలను సంతరించుకునేందుకు భారత్‌కు అవకాశాలు ఉన్నాయని చెప్పారు. అయితే, సమ్మిళిత వృద్ధి సాధన అనేది దేశానికి అతి పెద్ద సవాలుగా ఉంటోందని జేఆర్‌డీ టాటా స్మారకోపన్యాసంలో ఆయన పేర్కొన్నారు. కృత్రిమ మేథ (ఏఐ) నుంచి తప్పించుకోజాలమని, దాన్ని అందిపుచ్చుకుంటే భారత్ గణనీయంగా ప్రయోజనం పొందగలదని చంద్రశేఖరన్ వివరించారు.

1,000 వాహన తుక్కు కేంద్రాలు కావాలి

కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ వెల్లడి



న్యూఢిల్లీ: దేశీయంగా 1,000 వాహన తుక్కు కేంద్రాలు, 400 ఆటోమేటెడ్ ఫిట్‌నెస్ టెస్ట్ సెంటర్లు అవసరమని కేంద్ర రహదారి రవాణా, హైవేల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. ఇప్పటి వరకు దేశ వ్యాప్తంగా 85 స్క్రాపింగ్ సెంటర్లకు ప్రభుత్వం అనుమతినిచ్చినట్లు 'డిజిఈఎల్‌వీ'ని ఆవిష్కరించిన సందర్భంగా ఆయన వివరించారు. జాతీయ వాహన స్క్రాపేజీ పాలసీ అనేది అన్ని వర్గాలకు ప్రయోజనకరమని, దక్షిణాసియాలో భారత్ స్క్రాపింగ్ హబ్‌గా ఎదిగేందుకు పుష్కలంగా అవకాశాలు ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. వాహన స్క్రాపింగ్ కోసం వాహనదారుకు స్క్రాపింగ్ కేంద్రం (ఆర్‌వీఎస్‌ఎఫ్) జారీ చేసిన సర్టిఫికెట్ ఆఫ్ డిపాజిట్ (సీడీ)లను ట్రేడింగ్ చేసుకునేందుకు డిజిఈఎల్‌వీ ప్లాట్‌ఫాం ఉపయోగపడుతుంది. గత మూడు నెలలుగా బీటా ఫేజ్‌లో ఉన్న డిజిఈఎల్‌వీ దాదాపు 800 సర్టిఫికెట్ల ట్రేడింగ్‌కు తోడ్పడింది. పాతబడిన, ఫిట్‌నెస్ కోల్పోయిన, కాలుష్యకారక వాహనాలను దశలవారీగా తప్పించేందుకు 2021 ఆగస్టులో ప్రధాని నరేంద్ర మోదీ జాతీయ వాహన స్క్రాపేజీ పాలసీని ప్రవేశపెట్టారు. దీని ప్రకారం పాత వాహనాలను స్క్రాపింగ్ చేసిన వారు కొత్త వాహనాలు కొనుగోలు చేస్తే రోడ్ ట్యాక్స్‌లో పాతిక శాతం వరకు రిబేటు పొందవచ్చు. ఈ పాలసీ 2022 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చింది.

విద్యార్థులకు బీవోబీ ప్రత్యేక సేవింగ్స్ ఖాతా



హైదరాబాద్: విద్యార్థుల కోసం సున్నా బ్యాలన్స్ సదుపాయంతో ప్రత్యేక సేవింగ్స్ ఖాతాను బ్యాంక్ ఆఫ్ బరోడా (బీవోబీ) ప్రారంభించింది. 16–25 ఏళ్ల వయసులోని విద్యార్థుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని 'బీవోబీ బ్రో సేవింగ్స్ ఖాతా'ను రూపొందించినట్లు తెలిపింది. జీవిత కాలం పాటు కాంప్లిమెంటరీ డెబిట్ కార్డ్, ఇతర ప్రయోజనాలను ఈ ఖాతాకు అనుసంధానంగా ఆఫర్ చేస్తున్నట్లు ప్రకటించింది.

ప్రయోజనాలు..

16–25 ఏళ్ల వయసు వారికి ఈ ఖాతా సున్నా బ్యాలన్స్‌తో వస్తుంది. ఆకర్షణీయమైన ఆఫర్లతో కూడిన ఉచిత రూపే ప్లాటినం డెబిట్ కార్డ్ సొంతం చేసుకోవచ్చు. ప్రతి త్రైమాసికానికీ విమానాశ్రయాల్లో రెండు సార్లు లాంజ్ ప్రవేశాలను పొందొచ్చు. రూ.2 లక్షల వరకు వ్యక్తిగత ప్రమాద బీమా ఉచితం. ఆటో స్వీప్ సదుపాయం కూడా ఉంది. నెఫ్ట్, ఆర్టీజీఎస్, ఐఎంపీఎస్, యూపీఐ లావాదేవీలు ఉచితం. చెక్‌లను కూడా ఉచితంగా పొందొచ్చు. ఉచిత ఎస్ఎంఎస్, ఈమెయిల్ అలర్ట్‌ల సదుపాయం కూడా ఉంది. డీమ్యాట్ ఖాతా ఏఎంసీపై నూరు శాతం రాయితీ ఉంది. విద్యా రుణాలపై ఎలాంటి ప్రాసెసింగ్ చార్జీ లేకపోగా, వడ్డీ రేటులో 0.15 శాతం తగ్గింపు లభిస్తుంది. ఈ ఖాతాను యువతకు చేరువ చేసేందుకు గాను ఐఐటీ బోంబేకి చెందిన మూడ్ ఇండిగోను ఎక్స్‌క్లూజివ్ బ్యాంకింగ్ పార్ట్‌నర్‌గా నియమించుకుంది.

రికార్డు ర్యాలీకి బ్రేక్

లాభాల స్వీకరణ

- స్వల్ప నష్టాల ముగింపు
- బ్యాంకులు, ఫైనాన్స్, ఐటీ షేర్లలో అమ్మకాలు



ముంబై: ట్రేడింగ్ ఆద్యంతం తీవ్ర ఒడిదుడుకులకు లోనైన స్టాక్ సూచీలు సోమవారం స్వల్ప నష్టాలతో ముగిశాయి. బ్యాంకులు, ఫైనాన్స్, ఐటీ షేర్ల పతనంతో సెన్సెక్స్ 169 పాయింట్లు నష్టపోయి 71,315 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 38 పాయింట్లు పతనమై 21,419 వద్ద నిలిచింది. దీంతో సూచీల 3 రోజుల లాభాలకు ముగింపు పడినట్లైంది. ఎర్ర సముద్రంలో తలెత్తిన యుద్ధ అలజడితో చమురు సరఫరా అంతరాయాలు తలెత్తడం, అధిక వాల్యుయేషన్ల ఆందోళనలతో స్టాక్ మార్కెట్ ఉదయం స్తబ్దుగా ట్రేడైంది. ఆసియా మార్కెట్లలోని ప్రతికూల సంకేతాలు బ్యాంక్ ఆఫ్ జపాన్ ద్రవ్య విధాన ప్రకటన, బ్రిటన్ ద్రవ్యోల్బణ డేటా వెల్లడి తదితర పరిణామాల నేపథ్యంలో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు పాల్పడ్డారు. ఒక దశలో సెన్సెక్స్ 342 పాయింట్లు క్షీణించి 71,142 వద్ద, నిఫ్టీ 92 పాయింట్లు పతనమై 21,365 వద్ద ఇంట్రాడే కనిష్టానికి దిగివచ్చాయి. మెటల్, ఆటో, ఫార్మా, ఎఫ్ఎంసీజీ, మీడియా షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో బీఎస్ఈ మిడ్, స్మాల్‌క్యాప్ సూచీలు అరశాతం వరకు పెరిగాయి. ఆసియా, యూరప్ మార్కెట్లు బలహీనంగా ట్రేడవుతున్నాయి.

- రైల్వేలో మాత్రమే కాకుండా దేశవ్యాప్తంగా క్యాటరింగ్ సేవలను విస్తరించే యోచనలో ఉన్నట్లు ఐఆర్‌సీటీసీ తెలపడంతో సంస్థ షేరు 12.5% లాభపడి రూ.879 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 14% ర్యాలీ చేసి రూ.889 వద్ద 20 నెలల గరిష్టాన్ని తాకింది.
- ఇథనాల్ తయారీకి చెరకు రసం వాడకూడదంటూ కేంద్రం గతంలో జారీ చేసిన ఆదేశాలను తాజాగా ఎత్తివేయడంతో చక్కెర షేర్లు లాభపడ్డాయి. శ్రీ రేణుక 5%, ఈఐడీ ప్యారీ 1%, బల్‌రాంపూర్ చీనీ 4.50%, త్రివేణి ఇంజనీరింగ్–ఇండస్ట్రీస్ 2.50%, బజాజ్ హిందుస్థాన్ 6%, దాల్మియా షుగర్ 3.50% చొప్పున లాభపడ్డాయి.

వేదాంతా రూ. 11 మధ్యంతర డివిడెండ్

డైవర్సిఫైడ్ దిగ్గజం వేదాంతా లిమిటెడ్ వాటాదారులకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి(2023–24)గాను రెండో మధ్యంతర డివిడెండును ప్రకటించింది. షేరుకి రూ. 11 చొప్పున చెల్లించనుంది. ఇందుకు డిసెంబర్ 27 రికార్డ్ డేట్‌గా నిర్ణయించింది. వెరసి తాజా డివిడెండుకు రూ. 4,089 కోట్లు వెచ్చించనున్నట్లు వేదాంతా తెలియజేసింది. ప్రయివేట్ రుణదాతల నుంచి 1.25 బిలియన్ డాలర్ల రుణ సమీకరణకు తెరతీస్తున్నట్లు గత వారం కంపెనీ మాతృ సంస్థ వేదాంతా రీసోర్సెస్ వెల్లడించిన సంగతి తెలిసిందే. ఈ నిధులతో 2024, 2025లలో గడువుతీరనున్న 3.2 బిలియన్ డాలర్ల రుణాలను రీఫైనాన్స్ చేయనున్నట్లు వివరించింది. డివిడెండ్ వార్తలతో వేదాంతా షేరు ఎన్ఎస్ఈలో 1.5 శాతం బలపడి రూ. 261 వద్ద ముగిసింది.

ముత్తూట్ వివాహ సన్మానం.. దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్: ముత్తూట్ ఫైనాన్స్ లిమిటెడ్ ముత్తూట్ వివాహ సన్మానం ప్రాజెక్టు కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. వితంతువులైన తల్లుల కుమార్తెల వివాహానికి ఆర్థిక సహాయం అందించడానికి సంస్థ నిర్వహిస్తున్న ప్రత్యేక కార్పొరేట్ సేవా బాధ్యత(సీఎస్ఆర్) కార్యక్రమం ఇది. ఈ ప్రాజెక్టు కింద ప్రతి లబ్ధిదారు రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని పొందవచ్చు. అర్హత కలిగిన లబ్ధిదారులు డిసెంబర్ 25 సాయంత్రం 5.30 గంటలలోగా లక్ష్మీ నారాయణ యమగాని, మేనేజర్ సీఆర్ఎస్, ముత్తూట్ ఫైనాన్స్ లిమిటెడ్, హైదరాబాద్ చిరునామాకు సమర్పించాలని కంపెనీ ఒక ప్రకటనలో తెలియజేసింది. వితంతు తల్లులకు ఆర్థిక సాయం ద్వారా వారి ఆర్థిక ఒత్తిడిని తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ముత్తూట్ ఫైనాన్స్ సీఎస్ఆర్ హెడ్ బాబు జాన్ మలయల్ తెలిపారు.

భవిత

గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం- ఇండియన్ పాలిటీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఇండియన్ నేవీలో 910 పోస్టులు

ఇండియన్ నేవీ–సివిలియన్ ఎంట్రన్స్ టెస్ట్(ఐఎన్‌సెట్–01/2023) నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఛార్జ్‌మ్యాన్, సీనియర్ డ్రాఫ్ట్స్‌మ్యాన్, ట్రేడ్స్‌మ్యాన్ మేట్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవచ్చు.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 910
» **ట్రేడులు:** కార్పెంటర్, సీవోపీపీ, డ్రెస్ మేకింగ్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఫౌండ్రీమ్యాన్, ఎలక్ట్రోప్లేటర్, ఇండస్ట్రియల్ పెయింటర్, ప్లంబర్, సర్వేయర్ తదితరాలు.
» **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, బీఎస్సీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 31.12.2023 నాటికి ఛార్జ్‌మ్యాన్/ట్రేడ్స్‌మ్యాన్ మేట్ పోస్టులకు 25 ఏళ్లు, సీనియర్ డ్రాఫ్ట్స్‌మ్యాన్ పోస్టులకు 27ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.18,000 నుంచి రూ.56,900.
» **ఎంపిక విధానం:** అప్లికేషన్ స్క్రీనింగ్, రాతపరీక్ష, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 31.12.2023
» **వెబ్‌సైట్:** www.joinindiannavy.gov.in

ఎఫ్‌డీడీఐలో యూజీ, పీజీ కోర్సుల్లో ప్రవేశాలు

ఫుట్‌వేర్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ ఇన్‌సిట్యూట్(ఎఫ్‌డీడీఐ).. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి బ్యాచిలర్, మాస్టర్ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» **ఎఫ్‌డీడీఐ క్యాంపస్:** నోయిడా, ఫుర్సత్‌గంజ్, చెన్నై, కోల్‌కతా, రోహ్‌తక్, జోధ్‌పూర్, చింద్వారా, గుణ, అంకలేశ్వర్, పాట్నా, హైదరాబాద్, చండీగఢ్.
» **మొత్తం సీట్ల సంఖ్య:** 2360
» **విభాగాలు:** ఫుట్‌వేర్ డిజైన్ అండ్ ప్రొడక్షన్, ఫ్యాషన్ డిజైన్, లెదర్–లైఫ్‌స్టైల్ అండ్ ప్రొడక్ట్ డిజైన్, రిటైల్ అండ్ ఫ్యాషన్‌మర్చండైజ్.
» **బ్యాచిలర్ డిగ్రీ(బీడిజైన్/బీబీఏ): అర్హత:** 10+2 ఉత్తీర్ణులవ్వాలి. **వయసు:** 01.07.2024 నాటికి 25 ఏళ్లు మించకూడదు.
» **మాస్టర్ డిగ్రీ ప్రోగ్రామ్(ఎండిజైన్/ఎంబీఏ): అర్హత:** బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. **వయసు:** వయోపరిమితి లేదు.
» **ఎంపిక విధానం:** ఆల్ ఇండియా సెలక్షన్ టెస్ట్(ఏఐఎస్‌టీ) 2024 ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 20.04.2024
» **అలస్య రుసుముతో దరఖాస్తులకు చివరితేది:** 30.04.2024.
» **దరఖాస్తు సవరణ తేదీలు:** 01.05.2024, 02.05.2024.
» **అడ్మిట్ కార్డుల విడుదలతేది:** 06.05.2024.
» **ప్రవేశ పరీక్ష తేది:** 12.05.2024.
» **ఫలితాల వెల్లడి తేది:** 31.05.2024.
» **కౌన్సిలింగ్ తేదీలు:** 2024 జూన్ 2 లేదా 3వ వారం.
» **వెబ్‌సైట్:** www.fddiindia.com

ఐఆర్‌ఎంఏలో పీజీడిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలు

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ మేనేజ్‌మెంట్, ఆనంద్(ఐఆర్‌ఎంఏ).. 2024–26కు సంబంధించి పీజీడీఎం(రూరల్ మేనేజ్‌మెంట్) కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

» **కోర్సు:** పోస్టు గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్(రూరల్ మేనేజ్‌మెంట్).
» **అర్హత:** ఏదైనా డిగ్రీ చేసినవారితో పాటు డిగ్రీ చివరి ఏడాది చదువుతున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు.
» **దరఖాస్తులకు చివరితేది:** 26.12.2023.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **వెబ్‌సైట్:** ww.irma.ac.in

ఎన్‌ఆర్‌ఎస్‌సీ, హైదరాబాద్‌లో 54 టెక్నీషియన్ పోస్టులు

ఇస్రోకు చెందిన హైదరాబాద్‌లోని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్..వివిధ విభాగాల్లో టెక్నీషియన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 54
» **పోస్టుల వివరాలు:** టెక్నీషియన్ బి(ఎలక్ట్రానిక్ మెకానిక్)–33, టెక్నీషియన్ బి(ఎలక్ట్రికల్)–08, టెక్నీషియన్ బి(ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్)–09, టెక్నీషియన్ బి(ఫోటోగ్రఫీ)–02, టెక్నీషియన్ బి(డెస్క్‌టాప్ పబ్లిషింగ్ ఆపరేటర్)–02
» **అర్హత:** ఎస్ఎస్‌సీ, సంబంధిత విభాగంలో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.21,700 నుంచి రూ.69,100
» **వయసు:** 31.12.2023 నాటికి 18 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండాలి.
» **పోస్టింగ్ స్థలం:** ఎన్‌ఆర్‌ఎస్సీ–ఎర్త్ స్టేషన్ (షాద్‌నగర్/బాలానగర్), రీజినల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ సెంట్రల్(నాగ్‌పూర్), రీజనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ నార్త్(న్యూఢిల్లీ), రీజనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్–ఈస్ట్(కోల్‌కతా), రీజనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్–వెస్ట్(జోధ్‌పూర్), రీజనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్–సౌత్ (బెంగళూరు).
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, స్కిల్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 31.12.2023
» **వెబ్‌సైట్:** nrsc.gov.in

త్రివిధ దళాల్లో నర్సింగ్ ఆఫీసర్

నర్సింగ్‌లో.. బీఎస్సీ, ఎమ్మెస్సీ పూర్తి చేసిన మహిళలకు శుభవార్త! త్రివిధ దళాల్లో నర్సింగ్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి ఇండియన్ మిలిటరీ నర్సింగ్ సర్వీస్ ఎగ్జామినేషన్ నోటిఫికేషన్ వెలువడింది. ఎంపికైతే ప్రారంభంలోనే లెఫ్టినెంట్ హోదాతో కొలువు సొంతమవుతుంది. ఆకర్షణీయ వేతనం అందుకునే వీలుంది. ఈ నేపథ్యంలో.. ఎన్‌టీఏ–మిలిటరీ నర్సింగ్ సర్వీస్ పోస్టుల వివరాలు, ఎంపిక ప్రక్రియ, రాత పరీక్ష, కెరీర్ అవకాశాలు తదితర వివరాలతో ప్రత్యేక కథనం..

» మిలటరీ నర్సింగ్ సర్వీసెస్ నోటిఫికేషన్ విడుదల
» ఎన్‌టీఏ ఆధ్వర్యంలో రాత పరీక్ష నిర్వహణ
» మలి దశలో ఇంటర్వ్యూ, మెడికల్ ఎగ్జామినేషన్
» ఎంపికైతే లెఫ్టినెంట్ హోదాలో నర్సింగ్ ఆఫీసర్ కొలువు
» ప్రారంభ వేతన శ్రేణి రూ.56,100–రూ.1,77,500



ఇండియన్ మిలటరీ నర్సింగ్ సర్వీస్ ఎగ్జామినేషన్ ద్వారా ఆర్మీలో నర్సింగ్ విభాగంలో షార్ట్ సర్వీస్ కమిషన్ విధానంలో పోస్టులను భర్తీ చేస్తారు. తొలుత అయిదేళ్ల వ్యవధికి నియామకం ఖరారు చేస్తారు. ఆ తర్వాత మరో అయిదేళ్లకు పొడిగిస్తారు. అభ్యర్థుల ఆసక్తిని బట్టి చివరగా మరో నాలుగేళ్లకు సర్వీసు పొడిగిస్తారు. ఇలా మొత్తం 14 ఏళ్లపాటు మిలటరీ నర్సింగ్ సర్వీస్‌లో విధులు నిర్వర్తించే అవకాశం లభిస్తుంది.

అర్హతలు

- ఎమ్మెస్సీ నర్సింగ్/పోస్ట్ బ్యాక్యులరేట్ బీఎస్సీ(నర్సింగ్)/బీఎస్సీ నర్సింగ్ ఉత్తీర్ణత ఉండాలి. మహిళా అభ్యర్థులు మాత్రమే అర్హులు.
- వయసు: 2023, డిసెంబర్ 26 నాటికి 21– 35 ఏళ్ల మధ్య ఉండాలి.

ప్రతిభే ప్రామాణికం

మిలటరీ నర్సింగ్ సర్వీస్‌కు అభ్యర్థులను ఎంపిక చేసే క్రమంలో ముందుగా రాత పరీక్ష నిర్వహిస్తారు. అందులో వచ్చిన మార్కులు, అందుబాటులో ఉన్న పోస్టుల సంఖ్యను పరిగణనలోకి తీసుకుని.. ఒక్కో పోస్టుకు 10 మందిని చొప్పున మలి దశలో ఇంటర్వ్యూకు, మెడికల్ టెస్ట్‌కు ఎంపిక చేస్తారు. మలి దశ ప్రక్రియను ఇండియన్ ఆర్మీ అధికారులు చేపడతారు.

ఎన్‌టీఏ రాత పరీక్ష

మిలటరీ నర్సింగ్ సర్వీస్ ఎంపిక ప్రక్రియ తొలి దశలో రాత పరీక్షను.. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) నిర్వహించనుంది. ఈ పరీక్షను కంప్యూటర్ బేస్డ్ టెస్ట్‌గా నాలుగు విభాగాల్లో నిర్వహిస్తారు. అవి.. బేసిక్ నర్సింగ్ 30 ప్రశ్నలు–30 మార్కులు, క్లినికల్ స్పెషాలిటీస్ 100 ప్రశ్నలు–100 మార్కులు, జనరల్ ఇంటెలిజెన్స్ 10 ప్రశ్నలు–10 మార్కులు, జనరల్ ఇంగ్లిష్ 10 ప్రశ్నలు–10 మార్కులకు ఉంటాయి.

- పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో మొత్తం 150 ప్రశ్నలు–150 మార్కులకు జరుగుతుంది. ఈ పరీక్షకు కేటాయించిన సమయం రెండున్నర గంటలు.

మలి దశ ఇంటర్వ్యూ

రాత పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా.. మలి దశలో ఇండియన్ ఆర్మీ అధ్వర్యంలో ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఈ ఇంటర్వ్యూ ప్రక్రియ మూడు నుంచి అయిదు రోజుల పాటు జరుగుతుంది. అభ్యర్థులకు జనరల్ ఇంటెలిజెన్స్, జనరల్ ఇంగ్లిష్, సైకలాజికల్ అసెస్‌మెంట్ టెస్ట్‌లు నిర్వహిస్తారు. ఆ తర్వాత మిలటరీ నర్సింగ్ సర్వీస్‌కు చెందిన ఉన్నతాధికారుల నేతృత్వంలో పర్సనల్ ఇంటర్వ్యూ ఉంటుంది. ఈ ఇంటర్వ్యూకు 100 మార్కులు కేటాయిస్తారు.

పర్సనల్ ఇంటర్వ్యూ ఇలా

పర్సనల్ ఇంటర్వ్యూలో భాగంగా..సైకలాజికల్ అసెస్‌మెంట్ టెస్ట్, ఇంటర్వ్యూ కూడా ఉంటుంది. ఇంటర్వ్యూలో అభ్యర్థులకున్న సబ్జెక్ట్ నాలెడ్జ్‌తో పాటు జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్‌పై అవగాహనను పరిశీలిస్తారు. దీంతోపాటు వ్యక్తిగత ఆసక్తి, అలవాట్లుతోపాటు నర్సింగ్ కెరీర్ పట్ల ఉన్న అంకిత భావాన్ని పరిశీలించేలా ఇంటర్వ్యూలో ప్రశ్నలు అడుగుతారు. అదే విధంగా సైకలాజికల్ అసెస్‌మెంట్‌లో భాగంగా.. అభ్యర్థుల వ్యవహార శైలి, వ్యక్తిగత వైఖరి, దృక్పథం వంటి వాటిని పరిశీలిస్తారు. ఇంటర్వ్యూలోనూ ప్రతిభ చూపిన వారికి చివరగా మెడికల్ ఎగ్జామినేషన్ ఉంటుంది.

లెఫ్టినెంట్ హోదాతో కొలువు

ఎంపిక ప్రక్రియలో విజయం సాధించి తుది నియామకం ఖరారు చేసుకున్న వారికి లెఫ్టినెంట్ హోదాతో కొలువు ప్రారంభం అవుతుంది. ప్రారంభంలో వేతన శ్రేణి రూ. రూ.56,100–రూ.1,77,500గా ఉంటుంది. అంటే.. ప్రారంభంలో నెలకు రూ.లక్ష వరకు వేతనం పొందొచ్చు.

మేజర్ స్థాయికి చేరుకునే అవకాశం

నర్సింగ్ ఆఫీసర్లుగా ఎంపికైన వారు.. షార్ట్ సర్వీస్ కమిషన్ విధానంలో మేజర్ స్థాయికి చేరుకునే అవకాశం ఉంది. లెఫ్టినెంట్ హోదాలో మూడేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న తర్వాత కెప్టెన్‌గా పదోన్నతి లభిస్తుంది. కెప్టెన్ హోదాలో ఎనిమిదేళ్ల సర్వీసు పూర్తి చేసుకుంటే మేజర్ స్థాయికి చేరుకోవచ్చు.

విధులు ఇలా

మిలటరీ నర్సింగ్ సర్వీస్‌కు ఎంపికైన వారు.. దేశ వ్యాప్తంగా ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌లకు చెందిన సైనిక శిబిరాల్లో, ఆర్మీ మెడికల్ హాస్పిటల్స్‌లో, అదే విధంగా త్రివిధ దళాలకు సంబంధించి ఆయా సెక్టార్లలో ఉన్న బేస్ క్యాంప్‌లలో విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2023, డిసెంబర్ 26
- **ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ అవకాశం:** డిసెంబర్ 27 – 28, 2023
- **అడ్మిట్ కార్డ్ డౌన్‌లోడ్ సదుపాయం:** 2024 జనవరి మొదటి వారం
- **పరీక్ష తేదీ:** 2024, జనవరి 14
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్, వరంగల్
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://exams.nta.ac.in/SSCMNS

రాత పరీక్షలో రాణించేలా

మిలటరీ నర్సింగ్ సర్వీస్ ఎంపిక ప్రక్రియలో తొలి దశ రాత పరీక్షలో విజయానికి అభ్యర్థులు సిలబస్ అంశాలపై పట్టు సాధించాలి.

బేసిక్ నర్సింగ్

ఈ విభాగానికి సంబంధించి మాలిక్యులర్ బయాలజీ, జెనెటిక్స్ అండ్ ఎవాల్యుయేషన్, హ్యూమన్ హెల్త్, డిసీజెస్, ప్లాంట్ అండ్ హ్యూమన్ ఫిజియాలజీ, బయో టెక్నాలజీ అండ్ అప్లికేషన్స్, బయో డైవర్సిటీ, ఎకాలజీ, ఎన్విరాన్‌మెంట్ తదితర అంశాలపై దృష్టి పెట్టాలి.

క్లినికల్ స్పెషాలిటీస్

ఇందులో పేషెంట్ కేర్, హెల్త్ కేర్ డెలివరీ సిస్టమ్స్, కేస్ స్టడీ బేస్డ్ రీసెర్చ్, ఆపరేషన్ థియేటర్ ప్రొసీజర్స్, మెడికల్ టెస్ట్స్ అండ్ ప్రొసీజర్స్, పేషెంట్ డేటా కలెక్షన్ వంటి అంశాలపై పట్టు సాధించాలి. అదే విధంగా కమ్యూనిటీ హెల్త్‌కేర్, జనరల్ డిసీజెస్‌పైనా అవగాహన ఏర్పరచుకోవాలి.

జనరల్ ఇంటెలిజెన్స్

ఈ విభాగంలో మార్కుల కోసం కరెంట్ అఫైర్స్, స్టాక్ జీకే అంశాలపై పట్టు సాధించాలి. అదే విధంగా రీజనింగ్ అంశాలైన నంబర్ సిరీస్, స్పేస్ విజువలైజేషన్, డెసిషన్ మేకింగ్ అండ్ ప్రాబ్లమ్ సాల్వింగ్, విజువల్ మెమొరీ, రిలేషన్‌షిప్స్, నాన్–వెర్బల్ సిరీస్, ఫిగర్ క్లాసిఫికేషన్ వంటి అంశాలను అధ్యయనం చేయాలి.

జనరల్ ఇంగ్లిష్

ఈ విభాగానికి సంబంధించి బేసిక్ గ్రామర్ అంశాలు, సినానిమ్స్, యాంటానిమ్స్, స్పాటింగ్ ద ఎర్రర్స్, ఫిల్ ఇన్ ద బ్లాంక్స్, ఇడియమ్స్ అండ్ ఫ్రేజెస్, వన్ వర్డ్ సబ్‌స్టిట్యూషన్స్, సెంటెన్స్ ఫార్మేషన్, కాంప్రహెన్షన్‌లపై దృష్టి పెట్టాలి.

పాఠ్య పుస్తకాలు

రాత పరీక్షలో విజయం దిశగా అభ్యర్థులు బీఎస్సీ స్థాయిలోని నర్సింగ్ పుస్తకాలను అధ్యయనం చేయడం ఉపయుక్తంగా ఉంటుంది. అదే విధంగా ప్రీవియస్ పేపర్స్‌ను ప్రాక్టీస్ చేయడం, మోడల్ టెస్ట్‌లకు హాజరు కావడం కూడా మేలు చేస్తుంది. బీఎస్సీ నర్సింగ్ సబ్జెక్ట్‌లకు సంబంధించి.. కాన్సెప్ట్‌లు, అప్లికేషన్స్‌పై ప్రధానంగా దృష్టి పెట్టాలి. అదే విధంగా క్లినికల్ స్పెషాలిటీస్‌కు సంబంధించి సమకాలీన అంశాలతో సమన్వయం చేసుకుంటూ అధ్యయనం సాగించాలి.

క్లుప్తంగా...

మల్లన్న సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి


సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హిమకోహ్లీకి జ్ఞాపికను అందజేస్తున్న ఆలయ అధికారులు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైలం శ్రీభ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామివార్లను సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ హిమకోహ్లీ సోమవారం దర్శించుకున్నారు. న్యాయమూర్తికి ప్రధాన ఆలయ రాజగోపురం వద్ద ఈవో డి.పెద్దిరాజు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం జస్టిస్ హిమకోహ్లీ స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అమ్మవారి ఆశీర్వచన మండపంలో వేదపండితులు ఆశీర్వచనాలు పలుకగా, ఆలయ అధికారులు స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూ ప్రసాదాలు, జ్ఞాపికను అందజేశారు.

జనవరి 26 నుంచి 'స్ప్రింగ్ ఫెస్ట్'

సాక్షి, అమరావతి: ఆసియాలోనే అతిపెద్ద సామాజిక, సాంస్కృతిక ఉత్సవం 'స్ప్రింగ్ ఫెస్ట్'కు ఐఐటీ ఖరగ్‌పూర్ సిద్ధమవుతోంది. సుమారు 20 లక్షల మందికిపైగా ఆన్‌లైన్ రీచ్‌తో భారీ సాంస్కృతిక ఫెస్ట్‌గా నిలవనుంది. 65వ ఎడిషన్‌ను 2024, జనవరి 26 నుంచి 28 తేదీ వరకు నిర్వహించనుంది. దేశ వ్యాప్తంగా 800 కంటే ఎక్కువ ప్రధాన కళాశాలల నుంచి విద్యార్థులు హాజరుకానున్నారు. విద్యార్థుల్లోని కళా ప్రతిభను వెలికితీయడానికి స్ప్రింగ్‌ఫెస్ట్ 13 విభిన్న శైలుల్లో సుమారు 130కిపైగా పోటీలను నిర్వహించనుంది. విజేతలకు సుమారు రూ.35లక్షల నగదు బహుమతులు ఇవ్వనుంది. 2023లో 64వ ఎడిషన్ స్ప్రింగ్ ఫెస్ట్‌ను జనవరి 26–29 తేదీల్లో జరుపుకుంది.

బోట్ల వెలికితీత ప్రారంభం

- నవంబర్ 19న విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో దగ్ధమైన 29 బోట్లు



మహారాణిపేట (విశాఖ దక్షిణ): విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో నవంబర్ 19న సంభవించిన అగ్ని ప్రమాదంలో మునిగిపోయిన బోట్లను, వాటి శకలాలను వెలికి తీసే ప్రక్రియ ప్రారంభమయ్యింది. రాష్ట్ర మత్స్యశాఖ ఆధ్వర్యంలో పోర్టు అధికారులు క్రేన్, ట్రాలర్లు సహాయంతో సోమవారం మూడు బోట్లు వెలికి తీశారు. మొత్తం 29 బోట్లు పూర్తిగానూ, 19 బోట్లు పాక్షికంగానూ దగ్ధమైన సంగతి విదితమే. మొత్తం ఐదు రోజుల్లో బోట్లు వెలికితీయడానికి పోర్టు ట్రస్టు ఒక ప్రైవేటు సంస్థకు కాంట్రాక్టు ఇచ్చింది. విశాఖ పోర్టు, మత్స్యశాఖ, మెరైన్ పోలీసు, ఫైర్ డిపార్టుమెంట్, ఏపీ మెకనైజ్డ్ ఫిషింగ్ బోటు ఆపరేటర్స్ అసోసియేషన్ సమన్వయంతో వెలికి తీసే ప్రక్రియ జరుగుతున్నదని మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ షేక్ లాల్ మహ్మద్ తెలిపారు. ఏపీ మరపడవల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాసుపల్లి జానకీరామ్, ఇతర బోట్ల ఆపరేటర్లు పాల్గొన్నారు.

16 మంది 'ఎర్ర' స్మగ్లర్ల అరెస్ట్

- 3 టన్నులకుపైగా ఎర్రచందనం, లారీ స్వాధీనం



సత్యవేడు(తిరుపతి జిల్లా): ఎర్రచందనం నిల్వ చేసిన గోడౌన్ వద్ద కాపలా ఉన్న వ్యక్తులను తాళ్లతో కట్టివేసి 3టన్నులకు పైబడి ఎర్రచందనాన్ని తరలించుకుపోతున్న 16 మంది ఎర్ర స్మగ్లర్లను ఆదివారం అర్ధరాత్రి టాస్క్‌ఫోర్సు సిబ్బంది అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళితే.. సత్యవేడు మండలం కొత్తమారికుప్పం పంచాయతీ పరిధిలోని ఇంద్రాపురం సమీపంలోని ఓ ప్రైవేటు గోడౌన్‌పై దాడి చేసి తమిళనాడుకు చెందిన దొంగలు ఎర్రచందనం దుంగలను తరలిస్తున్నారని టాస్క్‌ఫోర్స్ అధికారులకు సమాచారం అందింది. అయితే అంతకుముందే అక్కడకు వచ్చిన దొంగలు గోడౌన్ వద్ద కాపలా ఉన్న వ్యక్తులను బెదిరించి, తాళ్లతో కట్టివేసి, గోడౌన్ తాళాలు తీసి నిల్వ ఉన్న ఎర్రచందనం దుంగల్ని లారీలో తరలించారు. విషయం తెలుసుకున్న టాస్క్‌ఫోర్సు సిబ్బంది లారీని వెంబడించి తమిళనాడు సమీప ప్రాంతంలో లారీని అడ్డగించారు. లారీతో సహా 3టన్నుల పైబడిన ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని 16 మందిని అదుపులోకి తీసుకుని సత్యవేడు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ప్రభుత్వ బడికి.. ఫ్యూచర్ స్కిల్స్

హైస్కూళ్లలో బీటెక్, ఎంటెక్, ఎంసీఏ, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్

- వచ్చే దరఖాస్తులను బట్టి రాత పరీక్ష ద్వారా ఎంపిక
- నెలకు రూ.12 వేల స్టైఫండ్ ఇచ్చేందుకు ప్రతిపాదన
- పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులకు ఆధునిక సాంకేతికత వినియోగంపై శిక్షణ
- జనవరి నుంచి అమలు చేసేలా కసరత్తు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఉన్నత విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల్లో ఓవైపు నైపుణ్యాభివృద్ధిని పెంపొందిస్తూనే.. మరోవైపు వారిని 'ఫ్యూచర్ స్కిల్ ఎక్స్‌పర్ట్స్'గా వినియోగించుకునేందుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందిస్తోంది. ఈ మేరకు బీటెక్, ఎంటెక్, ఎంసీఏ, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు అవకాశం ఇవ్వనున్నారు. వీరికి ప్రభుత్వ పాఠశాలల్లో ఇంటర్న్‌షిప్‌కు అవకాశం కల్పిస్తూ నెలకు రూ.12 వేల స్టైఫండ్ ఇవ్వాలని అధికారులు తాత్కాలికంగా ప్రతిపాదించారు. ఆయా కోర్సులు అభ్యసిస్తున్నవారితో హైస్కూళ్ల విద్యార్థులు, ఉపాధ్యాయులకు ఆధునిక సాంకేతిక వినియోగంపై శిక్షణ అందించనున్నారు. ఈ మేరకు ఏడాది పొడవునా ప్రభుత్వ పాఠశాలల్లో 'ఫ్యూచర్ స్కిల్ ఎక్స్‌పర్ట్స్' సేవలు అందేలా పాఠశాల విద్యాశాఖతో కలిసి ఉన్నత విద్యా మండలి సంయుక్త కార్యాచరణ సిద్ధం చేస్తోంది. ముఖ్యంగా కంప్యూటర్ సైన్స్ విద్యార్థులకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఆ తర్వాత అవసరాన్ని బట్టి ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ (ఈసీఈ), మెకానికల్ బ్రాంచ్ విద్యార్థులను పరిశీలిస్తారు. ఇంటర్న్‌షిప్‌కు వచ్చే దరఖాస్తులను బట్టి రాత పరీక్ష నిర్వహించి ఎంపిక చేయాలని ఉన్నత విద్యా మండలి భావిస్తోంది. ఈ ప్రోగ్రామ్‌ను జనవరి నుంచి అమలు చేసేలా కసరత్తు చేస్తోంది.

వర్చువల్ విధానంలో మరో ఇంటర్న్‌షిప్..

రాష్ట్రంలో ప్రతి ప్రభుత్వ హైస్కూల్‌ను సమీపంలోని ఇంజనీరింగ్ కళాశాలతో జత చేయనున్నారు. ఇప్పటికే కళాశాలల మ్యాపింగ్ ప్రక్రియ కొనసాగుతోంది. హైస్కూల్‌లో ఇంటర్న్‌గా చేస్తూనే వర్చువల్ విధానంలో కూడా మరో ఇంటర్న్‌షిప్ చేసుకునే వెసులుబాటు కూడా కల్పిస్తున్నారు. భవిష్యత్తులో బోధన రంగంలో రాణించాలనుకునే వారికి, జాబ్ మార్కెట్ ఓరియెంటెడ్ కోర్సులు నేర్చుకోవాలనుకునే వారికి రెండు విధాల ఇంటర్న్‌షిప్ ఉపయోగపడనుంది. వాస్తవానికి విద్యార్థి దశలోనే ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాన్ని సాధించడానికి ప్రభుత్వం ఉన్నత విద్యలో ఆరు నెలల ఇంటర్న్‌షిప్‌ను తప్పనిసరి చేసిన సంగతి తెలిసిందే. ప్రతి విద్యార్థి తమ కోర్సు చివరి ఏడాదిలో ఇంటర్న్‌షిప్‌ను పూర్తి చేయాల్సి ఉంటుంది.

ఇప్పటికే ఏటీఎల్ మెంటార్‌షిప్..

'ఉన్నత విద్యలో కమ్యూనిటీ సర్వీస్' ప్రాజెక్టు కింద ఇంజనీరింగ్ విద్యార్థులు ఇప్పటికే హైస్కూల్ బాటపడుతున్నారు. రెండు నెలల ఈ ప్రాజెక్టులో భాగంగా హైస్కూళ్లలో 'అటల్ టింకరింగ్ ల్యాబ్స్ (ఏటీఎల్)'కు మెంటార్‌షిప్ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం గతంలోనే 577 హైస్కూళ్లలో ఏటీఎల్స్‌ను ఏర్పాటు చేసింది. కానీ, గత టీడీపీ ప్రభుత్వం వాటిని నిరుపయోగంగా వదిలేసింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 'ఏటీఎల్' అవసరాన్ని గుర్తించి వినియోగంలోకి తెచ్చింది. ఇందులో భాగంగానే ఆయా హైస్కూళ్లను ఇంజనీరింగ్ కాలేజీలతో మ్యాపింగ్ చేస్తోంది. వివిధ బ్రాంచ్‌ల విద్యార్థుల సహాయంతో 'ఏటీఎల్'కు జీవం పోస్తోంది. ఐక్యరాజ్యసమితికి చెందిన యునిసెఫ్‌తో కలిసి పనిచేస్తున్న పూణే సంస్థ.. విజ్ఞాన్ ఆశ్రమ్‌కు చెందిన సోర్స్ పర్సన్స్‌తో ఎంపిక చేసిన ఇంజనీరింగ్ విద్యార్థులకు శిక్షణ ఇచ్చి మరీ ఏటీఎల్ ద్వారా పాఠశాల విద్యార్థులను నూతన ఆవిష్కరణల వైపు నడిపిస్తోంది.

ఈ కోర్సుల్లోనే శిక్షణ..

ఫ్యూచర్ స్కిల్ ప్రోగ్రామ్‌లో భాగంగా విద్యార్థులకు ఇంటర్నెట్ ఆఫ్ థింకింగ్స్ (ఐవోటీ), ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మెషీన్ లెర్నింగ్ (ఎంఎల్), బ్లాక్‌చైన్ టెక్నాలజీ, వర్చువల్ రియాలిటీ (వీఆర్), ఆగ్మెంటెడ్ రియాలిటీ (ఏఆర్), మెటావర్స్/వెబ్ 3.0, 3డీ మోడలింగ్ అండ్ ప్రింటింగ్, క్లౌడ్ కంప్యూటింగ్, సైబర్ సెక్యూరిటీ, బిగ్ డేటా/డేటా ఎనలిస్ట్, రోబోటిక్స్‌లో బేసిక్స్ బోధించనున్నారు. ఇందులో భాగంగానే ప్రత్యేక పాఠ్య ప్రణాళిక (కరిక్యులమ్)ను సైతం రూపొందిస్తున్నారు. దీని ద్వారా ఇంజనీరింగ్ విద్యార్థుల సహాయంతో బేసిక్స్ నేర్పిస్తూనే.. పాఠశాల ఉపాధ్యాయులకు డిజిటల్ పరికరాలపై విద్యా బోధన, హైస్కూల్ విద్యార్థులకు ట్యాబ్స్ వినియోగంపై శిక్షణ ఇవ్వనున్నారు. అలాగే కొత్త కంటెంట్ ఇన్‌స్టాల్ చేసి అందించనున్నారు.

చదువుతో పాటే సంపాదన



దేశంలోనే తొలిసారిగా రాష్ట్ర విద్యార్థులు చదువుతో పాటే సంపాదించనున్నారు. ప్రభుత్వ హైస్కూళ్లలో స్టైఫండ్‌తో కూడిన ఇంటర్న్‌షిప్ ఓ గొప్ప మార్పునకు నాంది. అందుబాటులోని మానవ వనరుల సమర్థవంత వినియోగానికి ఇదొక ప్రత్యక్ష ఉదాహరణ. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యావ్యవస్థలో చేపట్టిన విప్లవాత్మక మార్పులతోనే ప్రభుత్వ బడుల్లో డిజిటల్ లిటరసీ పెరుగుతోంది. పేదింటి విద్యార్థులు స్మార్ట్ ప్యానల్స్‌పై పాఠాలు వింటున్నారు. ట్యాబ్‌ల్లో పాఠాలు చదువుతున్నారు. వీటి ద్వారా మరింత నాణ్యమైన సాంకేతిక పాఠాలను నేర్పించేందుకు ఇంజనీరింగ్ విద్యార్థులను హైస్కూళ్లలో ఇంటర్న్‌షిప్‌నకు ఆహ్వానిస్తున్నాం. తద్వారా పాఠశాలల్లోని కంప్యూటర్ ల్యాబ్స్, ఏటీఎల్స్ పూర్తిస్థాయిలో పనిచేస్తాయి.

– ఆచార్య హేమచంద్రారెడ్డి, చైర్మన్, ఉన్నత విద్యా మండలి

మహా శక్తివంత దేశంగా భారత్

- వికసిత్ భారత్ సంకల్ప యాత్ర సభలో గవర్నర్ అబ్దుల్ నజీర్


మాట్లాడుతున్న గవర్నర్ అబ్దుల్ నజీర్


తిరుపతి సిటీ/తిరుమల: ప్రపంచంలో భారత్ మహా శక్తివంతమైన దేశంగా నిలవనుందని రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ అన్నారు. సోమవారం తిరుపతి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలు అవగాహనతో వినియోగించుకోవాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో పారిశుద్ధ్య, ఆర్థిక సేవలు, పేదలకు పక్కా గృహాలు, ఆహార భద్రత వంటి ప్రాథమిక సౌకర్యాలను అందించడానికి ప్రధాని మోదీ సర్కార్ చర్యలు చేపట్టిందన్నారు. కేంద్ర సంక్షేమ పథకాలతో పౌరులకు లభించే ప్రయోజనాలు, వివిధ సౌకర్యాలను మారుమూల గ్రామీణ లబ్ధిదారులకు చేరవేసేందుకు వికసిత్ భారత్ సంకల్పయాత్ర ఉపయోగపడుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రజల కోసం ఉచిత ఆరోగ్య సంరక్షణ కోసం ఏడాదికి రూ.5 లక్షలు అందించేందుకు ఆయుష్మాన్ భారత్ యోజన, పేదల పక్కా గృహాల నిర్మాణానికి ప్రధానమంత్రి ఆవాస్ యోజన, మంచినీటి కోసం జల్ జీవన్ మిషన్, రైతుల కోసం పీఎం కిసాన్, పీఎం కిసాన్ సమ్మాన్, పిల్లల పౌష్టికాహారం కోసం పోషణ్ అభియాన్, పేదరిక నిర్మూలన కోసం దీన్‌దయాల్ అంత్యోదయ యోజన, ఉజ్వల యోజన, పీఎం గరీబ్ కళ్యాణ్ అన్న యోజన, పీఎం జన్‌ధన్, పీఎం జన్‌ఔషధి యోజన, పీఎం స్వామిత్ర, పెన్షన్ యోజన, ముద్ర యోజన, డిజిటల్ ఇండియా, పీఎం ఫజల్ యోజన, విశ్వకర్మ యోజన, ఉపాధి కల్పన కోసం స్టార్టప్ ఇండియా, అంకుర భారత్, స్వదేశీ దర్శన్, ఉడాన్ పథకం వంటి పథకాలను అందిస్తోందన్నారు. ప్రతి పథకాన్ని అర్హులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దేశ పౌరుల ప్రయోజనమే వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ప్రథమ ఉద్దేశమన్నారు. అనంతరం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర వాహనాన్ని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, నగరపాలక సంస్థ మేయర్ శిరీష, కమిషనర్ హరిత పాల్గొన్నారు.

తిరుమల చేరుకున్న గవర్నర్

రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ సోమవారం సాయంత్రం తిరుమల చేరుకున్నారు. తిరుమలలోని రచన అతిథి గృహం వద్ద గవర్నర్‌కు టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, ఈవో ధర్మారెడ్డి ఘన స్వాగతం పలికారు. గవర్నర్ మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శనం చేసుకోనున్నారు.

కర్నూలు జిల్లా 'ఆస్పరి'లోనూ బంగారు నిక్షేపాలు!

- సర్వేలో ప్రాథమికంగా నిర్ధారణ
- పక్కాగా గుర్తించేందుకు మరోసారి సమగ్ర సర్వే చేపట్టనున్న జీఎస్ఐ



ఆలూరు(కర్నూలు): కర్నూలు జిల్లాలోని భూముల్లో 'పసిడి' పండుతోంది. ఇప్పటికే తుగ్గలి మండలం జొన్నగిరి, పగిడిరాయి ప్రాంతాల్లో వజ్రాలు, బంగారు నిక్షేపాలున్నట్లు జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా(జీఎస్ఐ) గుర్తించిన సంగతి తెలిసిందే. తాజాగా ఆస్పరి మండలంలోని శంకర బండ, చిరుమానుదొడ్డి, కైరుప్పల, యాటకల్లు, తొగలగల్లు, కల్లపరి తదితర గ్రామాల్లో బంగారు నిక్షేపాలను గుర్తించేందుకు జీఎస్ఐ సర్వే చేసింది. ఈ సందర్భంగా పలుచోట్ల బంగారు నిక్షేపాలున్నాయని జీఎస్ఐ ప్రాథమిక నిర్ధారణకు వచ్చినట్లు తెలిసింది. అయితే మరోసారి సమగ్ర సర్వే చేయాల్సి ఉందని జీఎస్ఐ బృందం సభ్యులు తెలిపారు. ఈ బృందంలో జిల్లా భూగర్భ గనుల శాఖ డీడీ రాజశేఖర్, నంద్యాల జిల్లా ఏడీ రామచంద్రుడు, ఆస్పరి తహసీల్దార్ కుమార్‌స్వామి తదితరులు కూడా ఉన్నారు. ఆస్పరి తహసీల్దార్ కుమార్‌స్వామి మాట్లాడుతూ.. జీఎస్ఐ బృందం మండలంలో సర్వే నిర్వహిస్తున్న మాట వాస్తవమేనని చెప్పారు. బంగారు నిక్షేపాలున్న గ్రామాలను పక్కాగా నిర్ధారించేందుకు త్వరలో మరోసారి సర్వే చేయనున్నట్లు చెప్పారు. ఆ ప్రక్రియ పూర్తయితే ఏఏ ప్రాంతాల్లో బంగారు నిక్షేపాలు ఉన్నాయనే విషయంపై స్పష్టత వస్తుందని చెప్పారు.

కృష్ణానదిపై మరో రోరో సర్వీసు

- ఇబ్రహీంపట్నం–లింగాయపాలెం మధ్య నిర్వహణకు ప్రణాళిక

సాక్షి, అమరావతి: కృష్ణా నదిపై రోల్ ఆన్.. రోల్ ఆఫ్(రోరో) పడవల సేవలను మరింతగా విస్తరించేందుకు ఏపీ ఇన్‌లాండ్ వాటర్‌వేస్ అథారిటీ(ఏపీఐడబ్ల్యూఏ) చర్యలు చేపట్టింది. విజయవాడకు సమీపంలో కృష్ణా నదికి ఎడమగట్టున ఉన్న ఇబ్రహీంపట్నం నుంచి కుడిగట్టున ఉన్న లింగాయపాలెం/హరిశ్చంద్రాపురం మధ్య రోరో సర్వీసులను ఏర్పాటు చేసేందుకు కసరత్తు చేస్తోంది. తద్వారా 70 కి.మీ రోడ్డు ప్రయాణం కలిసి వస్తుందని ఏపీఐడబ్ల్యూఏ సీఈవో ఎస్వీకే రెడ్డి 'సాక్షి'కి తెలిపారు. ఏటా 3.2 మిలియన్ లీటర్ల ఇంధనం ఆదా అవుతుందని అంచనా వేశామన్నారు. అలాగే టన్నుకు సరుకు రవాణా వ్యయం రూ.2.50 వరకు తగ్గుతుందని వివరించారు. ఈ రెండు ప్రాంతాల మధ్య రోరో సర్వీసులను ప్రారంభించడానికి అవసరమైన సాధ్యాసాధ్యాల నివేదిక(పీఎఫ్ఆర్)ను తయారు చేసేందుకు కన్సల్టెన్సీ కోసం ఆసక్తి గల సంస్థల నుంచి బిడ్లను ఆహ్వానించినట్లు వెల్లడించారు. ఇప్పటికే ఎన్టీఆర్ జిల్లాలోని ముక్త్యాల(కృష్ణా ఎడమ గట్టు) నుంచి పల్నాడు జిల్లాలోని మాదిపాడు(కృష్ణా కుడి గట్టు) మధ్య రోరో సర్వీసులను ప్రారంభించడానికి టెండర్లను ఆహ్వానించామన్నారు.

రోరో అంటే..

రోరో అంటే రోల్ ఆన్.. రోల్ ఆఫ్ పడవలు (ఫెర్రీ). ఇవి పెద్దగా ఉండటం వల్ల వీటి లోపలికి వాహనాలను నేరుగా డ్రైవ్ చేసుకుంటూ వెళ్లిపోవచ్చు. అలాగే దిగవచ్చు. తక్కువ దూరంలోని రెండు తీరాల మధ్య నదిలో నడపడానికి ఇవి వీలుగా ఉంటాయి. తీరంలో వీటి కోసం ప్రత్యేకంగా ర్యాంపులు నిర్మిస్తారు. సరుకు రవాణా వాహనాలతో పాటు సాధారణ కార్లు, ప్రజలు కూడా వీటిలో ప్రయాణించేందుకు వీలుంటుంది.

శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనానికి విస్తృత ఏర్పాట్లు

- 23 నుంచి జనవరి 1 వరకు భక్తులకు వైకుంఠ ద్వారం ద్వారా దర్శన భాగ్యం
- టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి వెల్లడి



తిరుమల: తిరుమలలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 23 నుంచి జనవరి 1వ తేదీ వరకు వైకుంఠ ద్వారం తెరచి ఉంచి భక్తులకు దర్శనభాగ్యం కల్పిస్తామని టీటీడీ ఈవో ఏవీ ధర్మారెడ్డి తెలిపారు. ఇందుకోసం విస్తృత ఏర్పాట్లు చేపడుతున్నామని చెప్పారు. తిరుమల అన్నమయ్య భవనంలో సోమవారం ఆయన వివిధ విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ఈవో ధర్మారెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. ఈనెల 23వ తేదీ అర్ధరాత్రి 1.45 గంటలకు వైకుంఠ ద్వార దర్శనం ప్రారంభించి.. జనవరి 1వ తేదీ రాత్రి 12 గంటలకు మూసివేస్తామన్నారు. ఈ నెల 22వ తేదీ మధ్యాహ్నం 2 గంటల నుంచి తిరుపతిలోని 9 కేంద్రాల్లో 90 కౌంటర్ల ద్వారా కోటా పూర్తయ్యే వరకు మొత్తం 4,23,500 సర్వదర్శనం టోకెన్లు మంజూరు చేస్తామని చెప్పారు. ప్రొటోకాల్ వీఐపీలకు, వారి కుటుంబసభ్యులకు పరిమిత సంఖ్యలో మాత్రమే బ్రేక్ దర్శనం కల్పిస్తామన్నారు. ఈ పది రోజుల పాటు సిఫారసు లేఖలను స్వీకరించబోమన్నారు. భక్తులు తమ దర్శన టోకెన్లపై సూచించిన తేదీ, సమయానికే శ్రీవారి దర్శనానికి రావాలని విజ్ఞప్తి చేశారు. దర్శన టోకెన్లు, టికెట్లు పొందిన భక్తులను 24 గంటల ముందు మాత్రమే తిరుమలకు అనుమతించనున్నట్లు పేర్కొన్నారు. టీటీడీ వెబ్‌సైట్, ఎస్వీబీసీ, ఇతర మాధ్యమాల ద్వారా టోకెన్ల లభ్యత గురించి తెలుసుకున్న తర్వాతే తిరుమల ప్రయాణం ఖరారు చేసుకోవాలని సూచించారు.

నేడు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుమల శ్రీవారి ఆలయంలో ఈనెల 23న వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని.. మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. ఉదయం 6 నుంచి 10 గంటల వరకు ఆలయ శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఈ సమయంలో స్వామివారి మూలవిరాట్టును వస్త్రంతో పూర్తిగా కప్పివేస్తారు. శుద్ధి పూర్తయిన తర్వాత పవిత్ర పరిమళ జలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేస్తారు. అనంతరం ప్రత్యేక పూజ, నైవేద్యం కార్యక్రమాలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. ఉదయం 10.30 గంటల నుంచి భక్తులను సర్వదర్శనానికి అనుమతిస్తారు. ఈ కారణంగా అష్టదళ పాదపద్మారాధన సేవను టీటీడీ రద్దు చేసింది.

రాష్ట్ర హక్కుల పరిరక్షణే ముఖ్యం

గోదావరి–కావేరి అనుసంధానంపై కేంద్రానికి ఏపీ స్పష్టీకరణ

- అనుసంధానంపై రాష్ట్ర అధికారులతో ఎన్‌డబ్ల్యూడీఏ డీజీ సమావేశం
- గోదావరిలో నీటి లభ్యతను శాస్త్రీయంగా తేల్చాలన్న రాష్ట్రం
- పోలవరం నుంచి అనుసంధానం చేపట్టాలని ప్రతిపాదన
- సానుకూలంగా స్పందించిన ఎన్‌డబ్ల్యూడీఏ డైరెక్టర్ జనరల్



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ హక్కులు, ప్రయోజనాలను పరిరక్షిస్తేనే గోదావరి – కావేరి అనుసంధానానికి అంగీకరిస్తామని కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం తేల్చిచెప్పింది. గోదావరిలో నీటి లభ్యతను శాస్త్రీయంగా తేల్చి, బేసిన్‌లో దిగువన ఉన్న ఆంధ్రప్రదేశ్ హక్కులను పరిరక్షిస్తూ నికర జలాల్లో మిగులును తరలించేలా గోదావరి – కావేరి అనుసంధానం చేపట్టాలని, రాష్ట్రంలోని దుర్భిక్ష ప్రాంతాలకు ప్రయోజనం కలగాలని, అప్పుడే అనుసంధానాన్ని స్వాగతిస్తామని జాతీయ జలవనరుల అభివృద్ధి సంస్థ (ఎన్‌డబ్ల్యూడీ) డైరెక్టర్ జనరల్ (డీజీ) భోపాల్ సింగ్‌కు జలవనరుల శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్, ఈఎన్‌సీ సి.నారాయణరెడ్డి తేల్చి చెప్పారు. తెలంగాణలోని ఇచ్చంపల్లి నుంచి కాకుండా పోలవరం ప్రాజెక్టు జల విస్తరణ ప్రాంతం నుంచి అనుసంధానం చేపట్టాలని ప్రతిపాదించారు. ఇందులో భాగంగా చింతలపూడి ఎత్తిపోతల, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, గుండ్రేవుల రిజర్వాయర్, వైఎస్సార్ పల్నాడు ఎత్తిపోతల పథకాలను చేపట్టాలని కోరారు. ఇందుకు ఎన్‌డబ్ల్యూడీఏ డీజీ భోపాల్ సింగ్ సానుకూలంగా స్పందించారు. వాటి సమగ్ర ప్రాజెక్టు నివేదికల (డీపీఆర్)ను నెల రోజుల్లోగా పంపాలని సూచించారు. గోదావరి–కావేరి అనుసంధానంపై వెలగపూడిలోని తాత్కాలిక సచివాలయంలో సోమవారం రాష్ట్ర జలవనరుల శాఖ ఉన్నతాధికారులతో భోపాల్ సింగ్ ఉన్నత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు.

మిగులు తేల్చాకే అనుసంధానం

గోదావరిలో 75% లభ్యత (నికర జలాలు) ఆధారంగా మిగులు జలాలు లేవని ఎన్‌డబ్ల్యూడీఏ డీజీకి రాష్ట్ర అధికారులు మరోసారి స్పష్టంచేశారు. గోదావరి–కావేరి అనుసంధానం తొలి దశలో ఛత్తీస్‌గఢ్ కోటాలో వాడుకోని 141.3 టీఎంసీల గోదావరి జలాలను ఇచ్చంపల్లి నుంచి తరలించడానికి ఇప్పటికీ ఆ రాష్ట్రం అంగీకరించలేదని తెలిపారు. ఛత్తీస్‌గఢ్ కోటా వాడుకునేలా ప్రాజెక్టులను నిర్మిస్తే అనుసంధానంపై వెచ్చించిన వ్యయం వృథా అవుతుందన్నారు. గోదావరిలో నీటి లభ్యతను శాస్త్రీయంగా అధ్యయనం చేసి, నికర జలాల్లో మిగులును తేల్చి, ఆంధ్రప్రదేశ్ హక్కులను పరిరక్షిస్తూ అనుసంధానం చేపట్టాలని తేల్చిచెప్పారు. అనుసంధానంలో నాగార్జునసాగర్, సోమశిల జలాశయాలను ట్రాన్సిట్ రిజర్వాయర్లగా వాడుకుంటామని చూపారని, దీనివల్ల ఆ జలాశయాల కింద ఆయకట్టుకు నీళ్లందించడం కష్టమవుతుందని తెలిపారు. అనుసంధానంలో తరలించే నీటి నిల్వకు కొత్త రిజర్వాయర్లు నిర్మించాలని ప్రతిపాదించారు. ఇచ్చంపల్లి నుంచి కాకుండా పోలవరం ప్రాజెక్టు జలవిస్తరణ ప్రాంతం నుంచి కృష్ణా నదిలోకి నీటిని తరలించి, అక్కడి నుంచి నదీ ప్రవాహానికి వ్యతిరేక దిశలో నాగార్జున సాగర్, శ్రీశైలం జలాశయాలకు తరలించి, పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా సోమశిలకు, అక్కడి నుంచి కావేరికి తరలించేలా అనుసంధానం చేపడితే వ్యయం కూడా తగ్గుతుందని సూచించారు. లేదంటే.. పోలవరం నుంచి ప్రకాశం బ్యారేజ్‌కు గోదావరి జలాలను తరలించి, అక్కడి నుంచి కొత్తగా నిర్మించే బొల్లాపల్లి రిజర్వాయర్‌లోకి నీటిని ఎత్తిపోసి.. అక్కడి నుంచి కాలువల ద్వారా సోమశిలకు, కావేరికి తరలించేలా అనుసంధానం చేపట్టాలని సూచించారు. వీటిపై అధ్యయనం చేస్తామని భోపాల్ సింగ్ చెప్పారు.

'ఈఎస్ఐ' కార్మికుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

- 40 ఏళ్లు పైబడిన వారందరికీ హెల్త్ స్క్రీనింగ్
- రిజిస్టర్డ్ కంపెనీలు, సంస్థల్లో క్యాంప్‌లు


రాజమహేంద్రవరంలో ఈఎస్ఐ వైద్య శిబిరం


సాక్షి, అమరావతి: కార్మికుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించిన ప్రభుత్వం కార్మిక రాజ్యబీమా సంస్థ(ఈఎస్ఐసీ)లో రిజిస్టర్ అయిన 40 ఏళ్లు పైబడిన కార్మికులకు హెల్త్ స్క్రీనింగ్ చేపడుతున్నది. గత నెలలో ప్రారంభమైన స్క్రీనింగ్ కార్యక్రమాల్లో ఈఎస్ఐ పరిధిలోకి వచ్చే రాష్ట్రంలోని 22 వేలకు పైగా ఫ్యాక్టరీలు, పరిశ్రమలు, ఇతర సంస్థల్లో పనిచేసే 11.93 లక్షల మంది ఈఎస్ఐ కార్డుదారుల కుటుంబాలు సేవలందుకున్నాయి. దాదాపు 45.33 లక్షల మంది కుటుంబ సభ్యుల్లో 40 ఏళ్లపైబడిన వారందరికీ చికిత్స అందించేలా చర్యలు తీసుకుంటున్నారు. క్యాంప్‌లలో జనరల్ మెడిసిన్, సర్జరీ, పల్మనాలజిస్ట్, ఓబీజీ, ఆర్థోపెడిక్స్, స్కిన్, కంటి, డెంటల్ వైద్యులను అందుబాటులో ఉంచుతున్నారు. జనరల్ ఓపీతో పాటు, క్లినికల్ ఎగ్జామినేషన్, రక్తపోటు, బ్లడ్ షుగర్, హీమోగ్లోబిన్ పర్సెంటేజ్, ఈసీజీ, ఎకో సేవలు అందుబాటులో ఉంటున్నాయి. మెరుగైన వైద్యం అవసరం ఉన్న కార్మికులను స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులకు తరలించి వైద్య సేవలందిస్తున్నారు. మిగిలిన వారికి క్యాంప్‌ల వద్దే మందులను అందించి, తదుపరి స్థానిక డిస్పెన్సరీలకు అనుసంధానం చేస్తున్నారు. తద్వారా భవిష్యత్‌లో అవసరమైన మందులను అందించనున్నారు.


నిరంతరాయంగా క్యాంప్‌లు



40 ఏళ్లు పైబడిన కార్మికులందరినీ స్క్రీనింగ్ చేయాలని కేంద్ర కార్మిక శాఖ ఆదేశించింది. ఈ క్రమంలో 40 ఏళ్లు పైబడిన వారితో పాటు సాధారణ పౌరులను కూడా స్క్రీనింగ్ చేస్తున్నాం. ఈ క్యాంప్‌లు నిరంతరాయంగా కొనసాగిస్తాం. కార్మికులందరికీ ఈఎస్ఐ ఆస్పత్రుల్లో అందే వైద్య సేవలపై అవగాహన కల్పిస్తున్నాం.

– వి. ఆంజనేయులు, డైరెక్టర్, ఇన్సూరెన్స్ సర్వీసెస్, ఏపీ


పూర్తిగా నీట మునిగిన తిరునల్వేలి పట్టణం


బాధితులకు సాయం అందజేస్తున్న మంత్రి ఉదయనిధి స్టాలిన్

జలదిగ్బంధంలో దక్షిణ తమిళనాడు

సాక్షి, చెన్నై: దక్షిణ తమిళనాడులోని తిరునల్వేలి, తూత్తుకుడి, తెన్‌కాశి, కన్యాకుమారి జిల్లాలను సోమవారం అతి భారీ వర్షాలు ముంచెత్తాయి. 24 గంటల వ్యవధిలో తూత్తుకుడి జిల్లా కాయల్‌పట్నంలో 95 సెంటీమీటర్ల వర్షం, తిరుచెందూరులో 68 సెం.మీ, శ్రీవైకుంఠంలో 62 సెం.మీ. తిరునల్వేలి జిల్లాలో 39.12 సెం.మీ, తూత్తుకుడి జిల్లాలో 37.96 సెం.మీ వర్షం పడింది. ఇక్కడి మణిముత్తారు, సేర్వలారు, నంబి, కొడుముడి నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. కన్యాకుమారి–మదురై జాతీయ రహదారి అనేక చోట్ల ధ్వంసమైంది. దీంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. రైల్వే ట్రాక్‌లు దెబ్బతినడంతో చెన్నై నుంచి దక్షిణ తమిళనాడు వైపుగా వెళ్లే పలు రైళ్లను రద్దు చేశారు. తిరునల్వేలి, తూత్తుకుడి కార్పొరేషన్లు పూర్తిగా జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. అనేక చోట్ల ఇళ్లు నేలమట్టమయ్యాయి. వివిధ ఘటనల్లో ముగ్గురు చనిపోయారు. మరో ముగ్గురు గల్లంతయ్యారు. రైల్వే జంక్షన్లు, ప్రధాన బస్టేషన్లు, కలెక్టరేట్లను సైతం వరద చుట్టుముట్టడంతో సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడింది. అనేక గ్రామాలు నీట మునగడంతో ఆర్మీ, నేవీ, నావికాదళం రంగంలోకి దిగింది. బాధితులను హెలికాప్టర్లు, పడవల ద్వారా సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. రాష్ట్రంలో ఇంతటి భారీ వర్షాలు కురవడం 200 ఏళ్లలో ఇదే మొదటిసారని అంటున్నారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943

క్లుప్తంగా

సంచార జాతుల జిల్లా కార్యవర్గం ఎంపిక

బళ్లారిఅర్బన్: అలెమారి, అరె అలెమారి అభివృద్ధి నిగమ రాష్ట్ర మాజీ అధ్యక్షులు కే.రాఘవేంద్ర శెట్టి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు లాయర్ వెంకటేష్ యాదవ్, రాష్ట్ర ప్రధాన సంచాలకుడు ఎం.ప్రకాష్, సంయుక్త కార్యదర్శి రాజేశ్వరి బైలుపత్తార్ సమక్షంలో జిల్లా గౌరవ అధ్యక్షులుగా బీ.తిమ్మప్పయాదవ్, జిల్లా అధ్యక్షులుగా బీ.బసిరెడ్డి, ఉపాధ్యక్షులుగా ఎర్రిస్వామి జోగి, హనుమంతప్ప, రేణుకమ్మ, జిల్లా సంయుక్త కార్యదర్శులుగా ఆనంద్, పరశురాం, సమన్వయ కార్యదర్శిగా లక్ష్మీనారాయణ యాదవ్, జిల్లా ఈసీ మెంబర్లుగా గంగాధర్, పంపన్న, బీ.నీలకంఠప్ప, రామాంజిని తదితరులను ఎంపిక చేశారు.

ఆహార ఉత్పత్తుల విక్రయ మేళా


ఉత్పత్తులను పరిశీలిస్తున్న దృశ్యం

కంప్లి: చిన్న పరిశ్రమదారులు తయారు చేసిన ఉత్పత్తులకు మార్కెట్‌లో విక్రయ సౌకర్యం కల్పించాలని సంజీవిని కార్యక్రమ వ్యవస్థాపకులు సోమశేఖర్ తెలిపారు. వద్దు గ్రామంలో కుటీర పరిశ్రమ అభివృద్ధి ఉద్యమశీలత, జీవనోపాయ జీవిని సమాఖ్య పరంగా ఏర్పాటు చేసిన ఆహార ఉత్పత్తుల ప్రదర్శన విక్రయ మేళాలో స్వసహాయ సంఘాలను ప్రోత్సహించి వారు తయారు చేసిన ఉత్పత్తులు మార్కెట్‌లో విక్రయించుకునే ఏర్పాటు చేయాలన్నారు.

తుంగభద్రలో మొసలి కళేబరం

కంప్లి: కంప్లి కోట ప్రాంతాన తుంగభద్ర నదిలో మొసలి కళేబరం లభించింది. పట్టణానికి నీటి సరఫరా చేసే సిబ్బంది నీరగంటి సిద్దప్ప నదిలోని జాక్‌వెల్ వద్దకు నీరు వచ్చేందుకు ఇసుక బస్తాలను పరిశీలించేందుకు వెళ్లగా నదిలో కళేబరం కంటపడడంతో మున్సిపల్ ముఖ్యాధికారి దురుగణ్ణ దృష్టికి తీసుకెళ్లగా వారు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు.

కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఇవ్వాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే నేమిరాజ్ నాయక్

కంప్లి: ప్రభుత్వ పథకాలను సక్రమంగా ప్రజల దరిచేర్చాలని, రాజకీయాలు చేస్తే పీడీఓలపై చర్యలు తప్పవని ఎమ్మెల్యే నేమిరాజ్ నాయక్ హెచ్చరించారు. హగరిబొమ్మనహళ్లి టీపీ ఆవరణలో జరిగిన సామాన్య సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ పరికరాలు కాలిపోతే రైతులు ఫిర్యాదు చేసిన వెంటనే జెస్కాం అధికారులు కొత్త పరివర్తకం(ట్రాన్స్‌ఫార్మర్) అందించాలన్నారు. తన క్షేత్రంలో ఎలాంటి సమస్య ఉన్నా పంచాయతీ అధికారులు బాధ్యతగా పరిష్కరించాలని ఆయన సూచించారు.

పౌష్టికాహార కిట్ల పంపిణీ


పౌష్టికాహార కిట్లను అందిస్తున్న దృశ్యం

కంప్లి: కుష్టు రోగులను దత్తత తీసుకుని వారి బాగోగులు చూస్తూ అందరితో కలిసిమెలిసి తిరిగేలా చేసిన జేఎస్‌డబ్ల్యూ ఫౌండేషన్ సేవలు శ్లాఘనీయమని ఆరోగ్య శాఖ ఉప నిర్దేశకులు డాక్టర్ అనిల్ అన్నారు. ఆయన సండూరు పట్టణంలోని గురుభవనంలో సంస్థ తరఫున ఏర్పాటు చేసిన క్షయమిత్ర పథకం ద్వారా పౌష్టికాహార పంపిణీ కార్యక్రమంలో మాట్లాడారు. పౌష్టికాహారం తీసుకోవడం వల్ల రోగాలు దరిచేరకుండా ఆరోగ్యవంతులు అవుతారన్నారు.

విజ్ఞానంపై మక్కువ చూపాలి


మాట్లాడుతున్న రత్న

రాయచూరు రూరల్: నేటి యుగంలో విద్యార్థులు విజ్ఞానంపై మక్కువ చూపాలని ప్రాథమిక పాఠశాలల సంఘం అధ్యక్షురాలు రత్న అభిప్రాయపడ్డారు. సోమవారం ఆశ్రయ కాలనీలోని ఇండో ఆంగ్ల భాష పాఠశాలలో విజ్ఞాన వస్తు ప్రదర్శనను ఆమె ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులో దాగి ఉన్న ప్రతిభను ఉపాధ్యాయులు ప్రోత్సహించాలన్నారు. సోలార్, విండ్ పవర్, పచ్చని చెట్లు, పరిసరాల పరిశుభ్రత ఇతర అంశాలపై విద్యార్థులు రూపొందించిన వివిధ రకాలైన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆనంద్, సురేష్, ఈరణ్ణ, యల్లప్ప, శరణమ్మ పాల్గొన్నారు.

గురుకుల హాస్టళ్లలో సమస్యల తిష్ట

- ఇన్‌చార్జ్ వార్డెన్ల ఆధిపత్యం
- పట్టించుకోని అధికారులు


మొరార్జీ దేశాయి గురుకుల పాఠశాల వసతిగృహం


ఇరుకైన బాలుర హాస్టల్ వరండా

రాయచూరు రూరల్: మేడి పండు చూడు మేలిమియై ఉండు, పొట్ట విప్పి చూడు పురుగులుండు అనే సామెత చందంగా జిల్లాలోని గురుకుల హాస్టల్, పాఠశాలల్లో సమస్యలు తిష్ట వేశాయి. మాన్వి, సింధనూరు, రాయచూరు, దేవదుర్గ బాలికల హాస్టల్‌లో తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యాలు కల్పించకుండా మౌనంగా ఉన్నారు. రాయచూరు బాలికల గురుకుల పాఠశాలల్లో తాగునీటిని అడిగిన విద్యార్థులకు వార్డెన్ భోజనం పెట్టకుండా ఉపవాస దీక్షకు పూనుకుంది. ఇన్‌చార్జ్ వార్డెన్లు దౌర్జన్యంతో వారు ఆడిందే ఆట, పాడిందే పాటగా మారింది. వంట చేసే వారు తమకు ఇష్టమొచ్చినట్లు వ్యవహరిస్తున్నారు.

ఆహార నాణ్యత అంతంత మాత్రమే

ఆహార పదార్థాలు అంతంత మాత్రమే. అన్నంలో రాళ్లు, నూకలు, చారులో కాయగూరలు వేయకుండా విద్యార్థులకు వడ్డిస్తున్నారు. వారానికి ఒకసారి పాలు, గుడ్లు, స్వీట్లు, పండ్లు ఇవ్వకున్నా ఇచ్చినట్లు రికార్డుల్లో రాసుకుంటారు. తాగునీరు ఇతర మౌలిక సౌకర్యాలు కల్పించాలని వారం రోజుల క్రితం విద్యార్థులు ఆందోళనకు దిగారు. నగరానికి దూరంగా ఉండడంతో విద్యార్థుల బాగోగులు పట్టించుకునే, అధికారుల ఆగడాల గురించి ప్రశ్నించేవారు లేరు. సింధనూరు పీడబ్ల్యూడీ క్యాంప్‌లో మొరార్జీ దేశాయి పాఠశాలలో కూడా ఇదే తంతు కొనసాగుతోంది. 13 ఏళ్ల నుంచి స్వంత భవనం లేక నెలకు రూ.3.47 లక్షలు అద్దె చెల్లిస్తున్నారు.

250 మందికి ఐదు గదులే

ఆరు నుంచి 10వ తరగతి వరకు 250 మంది విద్యార్థులున్నారు. 20 మందికి ఒక తరగతి గది కావాలి, కానీ 50 మందిని ఒకే గదిలో విద్యను బోధిస్తున్నారు. వరండా గదుల్లోనే పెట్టె, పరుపు, పాఠ్య పుస్తకాలను అక్కడే ఉంచుకోవాలి. పడుకోడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఐదు గదులకు గాను మూడింటిలో 115 మంది, రెండు గదుల్లో 122 మంది విద్యార్థుల బసకు అవకాశం కల్పించారు. జిల్లాలో అంబేడ్కర్, దేవరాజ్ అరసు, కిత్తూరు రాణి చెన్నమ్మ, మొరార్జీ దేశాయి గురుకుల పాఠశాలలున్నా వాటి బాగోగుల గురించి ఇన్‌చార్జ్ మంత్రి శరణ ప్రకాష్ పాటిల్, ఎంపీ రాజా అమరేశ్వర నాయక్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నిర్లక్ష్యం వహించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

వ్యవసాయ పరిశోధనలకు పిలుపు



కార్యక్రమంలో పాల్గొన్న ప్రతినిధులు

రాయచూరు రూరల్: విద్యార్థులు ఉద్యోగాల కోసం కాకుండా ఇతర దేశాలతో పోటీ పడేలా వ్యవసాయ పరిశోధనలు చేయాలని శివమొగ్గ ఉద్యానవన విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ జగదీష్ పిలుపు ఇచ్చారు. సోమవారం రాయచూరు వ్యవసాయ విశ్వ విద్యాలయంలో 8వ అంతర్జాతీయ వ్యవసాయ ఉత్సవాలు గ్రిసాస్–2023ను ప్రారంభించి మాట్లాడారు. 25 ఏళ్ల నాటికి అమెరికాను మించి భారత్ ఆహార పదార్థాల ఉత్పత్తిలో ముందంజలో ఉండాలన్నారు. వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా నూతన సాంకేతిక రంగాలను అభివృద్ధి పరచుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వ్యవసాయ పథకాలపై రైతులకు వివరించాలన్నారు. తక్కువ సమయంలో ఎక్కువ పంట దిగుబడికి అవకాశం కల్పించాలన్నారు. సమావేశంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ హనుమంతప్ప, చంద్రన్న, దిలీప్ కుమార్, మహేంద్ర సింగ్, గురురాజ్, వీరనగౌడలున్నారు.

ట్రాక్టర్ బోల్తా పడి పత్తి చిందరవందర


రోడ్డులో చిందరవందరైన పత్తి బేళ్లు

రాయచూరు రూరల్: ట్రాక్టర్ తాడు లారీ కొక్కానికి చిక్కి తెగిపోవడంతో రోడ్డులో పత్తి చిందరవందరగా పడిన ఘటన సోమవారం నగరంలోని జెస్కాం కార్యాలయం ముందు జరిగింది. ట్రాక్టర్‌లో పత్తిని నింపుకొని మార్కెట్‌కు తరలిస్తుండగా ఎదురుగా వస్తున్న లారీ కొక్కానికి ట్రాక్టర్‌కు కట్టిన తాడు చిక్కుకోవడంతో ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. ట్రాక్టర్‌లోని పత్తి అంతా చిందరవందరగా రోడ్డుపై పడింది. దీంతో వాహన రాకపోకలకు కొంతసేపు అంతరాయం ఏర్పడింది.

భక్తిశ్రద్ధలతో సుబ్రహ్మణ్య షష్టి పూజలు


సుబ్రమణ్యస్వామికి పూజలు నిర్వహిస్తున్న ప్రముఖులు

బళ్లారిఅర్బన్: నగరంలోని ఫైర్ ఆఫీస్ సమీపంలోగల కుమారస్వామి దేవస్థానంలో ధనుర్మాసం సందర్భంగా సోమవారం సుబ్రమణ్య స్వామి షష్టి పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించినట్లు దేవస్థాన అధ్యక్షులు విజయ్‌కుమార్ తెలిపారు. సుబ్రమణ్య స్వామికి పంచామృతాభిషేకం, బంగారు ఆభరణాల అలంకరణ, మహామంగళారతి, భక్తులకు దర్శనం, అన్నదాన కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు. జిల్లాధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా, హిందూ ధార్మిక దత్తి శాఖ కమిషనర్ గంగాధరప్ప, ఈఓ హనుమంతప్ప భక్తులకు అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. సాయంత్రం పల్లకీ మహోత్సవం, భజన, భక్తి గీతాలను ఆలపించారు. కనకదుర్గమ్మ దేవస్థానం మాజీ ధర్మకర్త పూజారి గాదెప్ప, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, స్థానిక భక్తులు పాల్గొన్నారు.

చదువుల తల్లికి ఆర్థిక ఇబ్బందులు

- దాతల సాయం కోసం పేద విద్యార్థిని ఉషా ఎదురు చూపులు


తండ్రి ఖలీల్ పాషాతో ఉషా మెహక్

రాయచూరు రూరల్: నేటి ఆధునిక యుగంలో ఆర్థిక సంక్లిష్టతలో పేదింటి విద్యార్థులు ఎంబీబీఎస్ వంటి ఉన్నత చదువులు చదవడం కష్టసాధ్యంగా మారింది. రాయచూరు ప్రభుత్వ వైద్య విజ్ఞాన సంస్థ(రిమ్స్) కళాశాలలో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ఉషా మెహక్ పరిస్థితి ప్రస్తుతం అగమ్యగోచరంగా ఉంది. జిల్లాలోని సింధనూరులో నివాసముంటున్న ఖలీల్ పాషాకు నలుగురు కుమార్తెలు. మొదటి కూతురుకు పెళ్లి చేశారు. రెండో కూతురు బీకాం, మూడో కూతురు ఉషా మెహక్ రాయచూరులో ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం, నాలుగో కూతురు 8వ తరగతి చదువుతున్నారు. ఉషా 1 నుంచి పీయూసీ(12వ తరగతి) వరకు సింధనూరులోని రుద్రగౌడ స్మారక విద్యా సంస్థలో చదివింది. టెన్త్, ఇంటర్‌లో 97 శాతం చొప్పున మార్కులు సాధించింది. సీఈటీలో 3030 ర్యాంక్, నీట్‌లో 47,936వ ర్యాంక్‌తో రిమ్స్ కళాశాలలో సీటు సంపాదించింది. పాఠశాల ఉపాధ్యాయులు కలిసి మొదటి ఏడాది ఫీజులను భరించారు. రెండో, మూడో ఏడాది ఫీజులు చెల్లించడానికి ఆర్థికంగా ఇబ్బందులు ఎదురయ్యాయి. తండ్రి ఖలీల్ పాషా సాదాసీదా వస్తువులు విక్రయించే వ్యాపారి కావడంతో పాటు అనారోగ్యంతో చిక్కుల్లో పడ్డారు. తనకు న్యూరో సర్జన్‌ను కావాలనే తపన ఉన్నా ఆర్థిక ఇబ్బందులు వెన్నంటుతున్నాయని తెలిపింది. ఈ నెల 21న రెండో ఏడాది ఫీజుల చెల్లింపునకు చివరి తేదీ అని, తనకు ఆర్థికంగా చేదోడు అందించాలని ఆమె దాతలకు విన్నవించింది. తన విద్యాభ్యాసానికి ఆర్థికంగా చేయూతనిస్తే భవిష్యత్తులో పేదలకు ఉచితంగా వైద్యసేవలు అందిస్తానని తెలిపింది.

గెస్ట్ లెక్చరర్ల డిమాండ్లపై ధర్నా



హొసపేటె: ఆందోళనలో పాల్గొన్న విద్యార్థులు

హొసపేటె: అతిథి ఉపన్యాసకుల డిమాండ్లను తక్షణమే పరిష్కరించి తరగతులు కొనసాగించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. ఏబీవీపీ నేత భరత్ మాట్లాడుతూ ప్రభుత్వం కాలేజీల్లో పని చేస్తున్న గెస్ట్ లెక్చరర్లకు యూజీసీ నిబంధనల ప్రకారం వేతనాలివ్వాలని, ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే ప్రతి నెలా జీతం ఇవ్వాలన్నారు. సమస్యకు శాశ్వత పరిష్కారంగా రాష్ట్ర కళాశాలల్లో ఖాళీగా ఉన్న లెక్చరర్ల పోస్టులను ప్రభుత్వం వెంటనే భర్తీ చేయాలన్నారు. గెస్ట్ లెక్చరర్లకు న్యాయం జరిపించి తరగతుల్లో పాఠాలను ప్రారంభించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అతిథి అధ్యాపకులతో చర్చలు జరిపి, డిమాండ్లను నిర్దిష్ట మార్గంలో పరిష్కరించి వెంటనే ధర్నా విరమించేలా చేయాలన్నారు. అనంతరం తహసీల్దార్ విశ్వజిత్ మెహతాకు వినతిపత్రాన్ని అందజేశారు. విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కంప్లిలో..

కంప్లి: తమ డిమాండ్లు తీర్చాలని ఒత్తిడి చేస్తూ గెస్ట్ లెక్చరర్లు సోమవారం సరళాదేవి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ముందు వినూత్న రీతిలో ధర్నా చేశారు. గెస్ట్ లెక్చరర్ల సంఘం జిల్లా అధ్యక్షులు దురుగప్ప మాట్లాడుతూ గెస్ట్ లెక్చరర్ల ధర్నాతో విద్యార్థుల భవిష్యత్ దెబ్బ తింటుందని, అందువల్ల ప్రభుత్వం వెంటనే వారి డిమాండ్లను తీర్చాలన్నారు.

ఈవీగో పేరిట రూ.లక్షల వంచన

హుబ్లీ: గొలుసు కట్టు(చైన్ సిస్టమ్) మాదిరిగా తమ కంపెనీలో డబ్బులు పెట్టుబడి పెడితే అధిక లాభాలు గడించవచ్చని నమ్మించి ఓ మహిళకు సుమారు రూ.2.05 లక్షలను వంచించిన ఘటన నగరంలోని నవనగరలో చోటు చేసుకుంది. ఎం.ప్రీతి మోసానికి గురైన బాధితురాలు. గుర్తు తెలియని ఓ వ్యక్తి అమెరికాకు చెందిన ఈవీగో ఫస్ట్ చార్జింగ్ కంపెనీ నుంచి మాట్లాడుతున్నానని, తమ కంపెనీ చూబ్లిసెట్ శాఖలో పేయింగ్ సిస్టమ్‌లో వివిధ ప్లాన్లలో డబ్బులు పెట్టుబడి పెడితే రెట్టింపు ఆదాయం గడించవచ్చని నమ్మించాడు. ఈ క్రమంలో వెబ్‌సైట్ లింక్ పంపి ప్రీతి, పలువురి పేరున అకౌంట్లు తెరిపించి ప్రారంభంలో లాభాలు ఇచ్చినట్లుగా నమ్మకం పుట్టించారు. అనంతరం బాధితురాలి ఓ బ్యాంక్ ఖాతా నుంచి రూ.74,380, మరో బ్యాంక్ ఖాతా నుంచి రూ.1,31,210లను బదిలీ చేయించుకొని వంచించినట్లు బాధితురాలు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

డబ్బులు ఇవ్వనందుకు తండ్రికి కొడుకు కత్తిపోటు

హుబ్లీ: తన అప్పు తీర్చడానికి డబ్బులు ఇవ్వని తండ్రిని సొంత కొడుకే కత్తితో పొడిచిన ఘటన గోపనకొప్ప హరిజన వీధిలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఆనంద హొసమని కత్తిపోటుకు గురైన తండ్రి. ఇతడిని కిమ్స్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. ఆ రాత్రి ఇంటికి వచ్చిన నిందితుడు ఉమేష్ తల్లి రేణుకాను అప్పు తీర్చడానికి రూ.3 లక్షలను తండ్రి నుంచి ఇప్పించాలని ఒత్తిడి చేశాడు. డబ్బులు లేవన్నందుకు కోపంతో ముందుగా ఇంటి తలుపు ధ్వంసం చేశాడు. నోటికొచ్చినట్లుగా దూషిస్తూ తల్లిదండ్రులతో ఘర్షణ పడ్డాడు. ఈ క్రమంలో మరొక కుమారుడిని పిలవడానికి తండ్రి ప్రయత్నిస్తుండగా కత్తితో భుజంపై పొడిచి పరారయ్యాడు. ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు అశోక్ నగర్ పోలీసులు తెలిపారు.

సదాశివ నివేదిక అమలుకు కంకణం


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు

రాయచూరు రూరల్: మాదిగలకు ఏబీసీడీ వర్గీకరణ, రిజర్వేషన విషయంలో ఎన్నికల ప్రణాళికలో పేర్కొన్నట్లుగా జస్టిస్ ఏ.జే. సదాశివ కమిషన్ అమలుకు కట్టుబడి ఉన్నామని రాష్ట్ర ఆహార పౌర సరఫరాల శాఖ మంత్రి మునియప్ప స్పష్టం చేశారు. ఆదివారం వాల్కట్ మైదానంలో కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసిన అభినందన సమావేశంలో ఆయన మాట్లాడారు. అప్పటి సీఎం ఎస్ఎం కృష్ణ ఎస్సీ, ఎస్టీలకు 24.1 శాతం నిధులు కేటాయించారన్నారు. బీజేపీ సర్కార్ నిధులను ఇతరత్ర వాటికి ఉపయోగించారన్నారు. సీఎం సిద్ధరామయ్య ఎస్సీ, ఎస్టీలకు రూ.35 వేల కోట్ల నిధులు కేటాయించారన్నారు. గతంలో కేంద్ర మంత్రి నారాయణస్వామి జస్టిస్ సదాశివ కమిషన్ జారీ చేయడం అసాధ్యమన్నారని, నేడు మళ్లీ అమలుకు సిద్ధమని పేర్కొనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సమావేశంలో మంత్రులు బోసురాజు, ఆర్.బి.తిమ్మాపూర్, ఆంజినేయ, చెన్నారెడ్డి, హంపయ్య నాయక్‌లను సన్మానించారు.

అక్రమంగా బియ్యం విక్రయిస్తే కఠిన చర్యలు

రాష్ట్రంలో పేదలకు పంచాల్సిన చౌక బియ్యాన్ని అక్రమంగా నిల్వ చేసి నల్ల బజారులో విక్రయిస్తే కఠిన చర్యలు చేపడతామని రాష్ట్ర ఆహార పౌర సరఫరాల శాఖ మంత్రి మునియప్ప హెచ్చరించారు. ఆదివారం యరమరస్ ప్రభుత్వ అతిథి భవనంలో ఆ శాఖ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యాదగిరిలో జరిగిన బియ్యం కుంభకోణంలో బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

వైభవంగా సూగూరేశ్వర జాతర


రథోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే బసనగౌడ

రాయచూరు రూరల్: తాలూకాలోని దేవసూగూరులో సూగూరేశ్వర జాతర ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. దేవసూగూరు ఆలయం నుంచి నాగర యల్లమ్మ ఆలయం వరకు మహిళలు కుంభ కలశాలతో ఊరేగించారు. వీరగాసె నృత్యం చేస్తూ ఒడుపులు చెబుతూ ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. తెల్లవారు జామున కృష్ణా నది నుంచి నీటిని తెచ్చి జలాభిషేకం చేశారు. సూగూరేశ్వరుడికి, భద్రకాళికి వివాహం జరిపారు. సాయంత్రం సూగూరేశ్వర జోడు రథోత్సవాలను వందలాది మంది భక్తుల సమక్షంలో వైభవంగా నిర్వహించారు. గ్రామీణ ఎమ్మెల్యే బసనగౌడ దద్దల్ రథోత్సవంలో పాల్గొని తన మొక్కు తీర్చుకున్నారు.

గనుల తవ్వకాల్లో పారదర్శకతకు సూచన


కంపెనీ అధినేత మేడా వెంకటయ్య దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

హొసపేటె: గనుల తవ్వకాలను పారదర్శకంగా నిర్వహించాలని ఎంఎస్‌పీఎల్ సంస్థ అధ్యక్షుడు మేడా వెంకటయ్య తెలిపారు. సోమవారం తోరణగల్ గనుల సురక్షత సప్తాహలో పాల్గొని ఆయన మాట్లాడారు. గనుల ప్రదేశాల్లో తవ్వకాలు చేయడంతో పాటు వాటిని అన్ని విధాలుగాలా సంరక్షించాలన్నారు. ప్రభుత్వ నియమాల ప్రకారమే తవ్వకాలు నిర్వహించాలన్నారు. అనంతరం కంపెనీ అధినేత మేడా వెంకటయ్య దంపతులను సన్మానించారు. ఈ సందర్భంగా మురళీధర్ బిదిరి, ప్రభాత్ కుమార్, సునీల్ కుమార్‌సింగ్, మురుగన్, మధుసూధన్ పాల్గొన్నారు.

బురదలో చిక్కుకున్న లారీ


చిక్కుకున్న లారీలో నుంచి బస్తాలను తొలగిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: లారీ బురదలో చిక్కుకుపోవడంతో రాకపోకలకు ఇబ్బందికరంగా మారిన ఘటన నగరంలో చోటు చేసుకుంది. సోమవారం నగరంలోని బసవన బావి సర్కిల్ నుంచి బియ్యం మిల్లుల వరకు రోడ్డు నిర్మాణం కొనసాగుతున్న నేపథ్యంలో రహదారి గుంతలమయంగా మారింది. ఆరు నెలలుగా పనులు చేపట్టకుండా వదిలేయడంతో నేడు రహదారి బురదమయంగా మారింది. భారీ వాహనాలు వెళ్లాలంటే ఎగుడు దిగుడు గుంతల్లో చిక్కుకొని రాకపోకలకు ఇబ్బందిగా మారింది. వరి బియ్యం మిల్లులు రహదారిలో ఉన్న నేపథ్యంలో ఆదివారం రాత్రి తాగునీటి పైపులు పగిలిపోవడంతో నీరంతా రహదారిలోని గుంతల్లోకి చేరాయి. దీంతో ఆ మార్గంలో వచ్చిన బియ్యం లోడ్ లారీ బురద గుంతలో చిక్కుకుంది.

మళ్లీ మేయర్ ఎంపిక వాయిదా

సాక్షి,బళ్లారి: జిల్లా కాంగ్రెస్‌లో వర్గ విభేదాలు పతాకస్థాయి చేరాయి. కార్పొరేటర్ల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో అధికారులపై ఒత్తిడి తెచ్చి మేయర్ పదవికి అభ్యర్థి ఎంపికను మళ్లీ వాయిదా వేయించారు. పైకి కలిసిమెలసి పలు కార్యక్రమాల్లో కనిపిస్తున్నా, లోపల మాత్రం విభేదాలు పెరుగుతున్నాయని, జిల్లా మంత్రి నాగేంద్ర, సిట్టింగ్ ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డిల మధ్య నివురుగప్పిన నిప్పులా ఉన్న అభిప్రాయ భేదాలు నగర మేయర్ ఎంపిక విషయంలో తేటతెల్లమైంది. మంగళవారం జరగాల్సిన మేయర్ ఎంపిక కూడా మళ్లీ వాయిదా వేస్తున్నట్లు ఎన్నికల అధికారి ఒక ప్రకటనలో సోమవారం వెల్లడించారు. మేయర్ పదవికి అభ్యర్థి ఎంపిక ఇంకా కొలిక్కి రాకపోవడంతో అధికారులపై మళ్లీ ఒత్తిడి తెచ్చి వాయిదా వేయించారనే ప్రచారం సాగుతోంది. శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందని, ఈ నేపథ్యంలో ముందస్తుగా ఎన్నిక వాయిదా వేస్తున్నట్లు అధికారులు పేర్కొనడంతో పలువురు కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్పొరేటర్లు, బీజేపీ కార్పొరేటర్లు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మళ్లీ ఎన్నిక ఎప్పుడు నిర్వహిస్తామో త్వరలో తెలియజేస్తామని అధికారులు తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని బైకిస్టు మృతి

బళ్లారి రూరల్: తాలూకాలోని వణ్రాణి క్యాంపు వద్ద ఆర్టీసీ బస్సు బైక్‌ను ఢీకొనడంతో బైకిస్టు మృతి చెందిన సంఘటన సోమవారం జరిగింది. వివరాలు.. కోళూరుకు చెందిన తిప్పేష్(40) వ్యవసాయం చేసుకొంటూ జీవిస్తుండేవాడు. ఉదయం తన బైక్‌పై బళ్లారికి వస్తుండగా వణ్రాణి క్యాంపు వద్ద ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో తిప్పేష్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతనిని విమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ ఘటనపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొన్నారు.

డివైడర్‌కు బైక్ ఢీ.. యువకుడు మృతి

బళ్లారిఅర్బన్: బళ్లారి రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో సోమవారం బైక్ డివైడర్‌ను ఢీకొని ఓ యువకుడు మృతి చెందినట్లు ఎస్ఐ నరసింహలు తెలిపారు. పొరుగున ఉన్న అనంతపురం జిల్లా డీ.హిరేహాళ్ మండలం గవిసిద్దాపురం గ్రామానికి చెందిన బోయ సిద్దేశ్(23) అనే యువకుడు తాలూకాలోని ఎత్తినబూదిహాళ్ నుంచి బైక్‌లో స్వగ్రామానికి వెళుతుండగా మించేరి గ్రామ సమీపంలో బైక్ డివైడర్‌ను ఢీకొనడంతో కిందపడి తీవ్ర గాయంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

23, 24 తేదీల్లో మాలదీక్ష విరమణకు ఏర్పాట్లు


మాట్లాడుతున్న మంత్రి శివరాజ్ తంగడిగి

గంగావతి: అంజనాద్రి బెట్ట వద్ద ఈనెల 23,24 తేదీల్లో జరిగే హనుమ మాల దీక్ష విరమణ కార్యక్రమాలకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు కొప్పళ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి శివరాజ్ తంగడిగి తెలిపారు. ఆయన ఆదివారం టీపీ సభాభవనంలో మాల దీక్ష విరమణదారుల కార్యక్రమ ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. ఇప్పటికే ఈ కార్యక్రమ నిర్వహణకు ఏర్పాటు చేసిన సమితులు మాలధారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కట్టుదిట్టమైన చర్యలను తీసుకోవాలన్నారు. ప్రధానంగా స్నానాలకు, తాగునీటికి కొరత లేకుండా చూడాలన్నారు. అక్కడక్కడ పలు కూడళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు చోటు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కొండ వద్ద పలు ప్రాంతాల్లో పార్కింగ్ వ్యవస్థ, కొండపైకి విద్యుత్ దీపాల అలంకరణ చేపట్టాలని, అగ్నిప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులు, సిబ్బందికి సూచనలు ఇచ్చారు. కొప్పళ జిల్లా అధికారి నలిన్ అతుల్, ఏసీ మహేష్, తహసీల్దార్, టీపీ ఈఓలు, అన్ని సమితుల పదాధికారులు పాల్గొన్నారు.

ఏర్పాట్లలో మంత్రి, ఎమ్మెల్యే తలో దారి

అంజనాద్రి బెట్టపై ఈనెల 23, 24 తేదీల్లో జరిగే మాల దీక్ష విమరణ నిర్వహణలో మంత్రి, స్థానిక ఎమ్మెల్యే చెరో దారిలో వెళుతుండటంతో ఏర్పాట్లు చురుకుగా సాగడం లేదని మాజీ ఎమ్మెల్యే పరణ్ణ మునవళ్లి ఆరోపించారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి శివరాజ్ తంగడిగి ఓ దారి ఎంచుకొని సభా సమావేశాల నిర్వహణకు సూచనలు ఇస్తున్నారన్నారు. ఎమ్మెల్యే మరో దారిలో వెళ్లడం వల్ల పనులు వేగవంతంగా జరగడానికి అటంకాలు ఏర్పడుతున్నాయని విమర్శించారు. ఇప్పటికైనా ఇరువురు కలిసి ఇతర పార్టీల వారిని కలుపుకొని కార్యక్రమాల నిర్వహణ ఐక్యంగా చేపట్టాలన్నారు. ఇప్పటికైనా మాలధారుల కార్యక్రమాలు సజావుగా, ఎలాంటి లోపాలు, ఇబ్బందులు లేకుండా నిర్వహించాలని తాము కోరుతున్నామన్నారు.

సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు అదుర్స్


భరత నాట్యం చేస్తున్న చిన్నారులు


కోలాటం ఆడుతున్న మహిళలు

కంప్లి: కురుగోడులో ఆదివారం సాయంత్రం రుద్రాభిషేకం, విశేష పూజలు జరిపారు. దేవస్థానం నుంచి గంగాస్నానం ఊరేగింపు జరిగింది. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని తమ కానుకలు సమర్పించి నీలకంఠేశ్వరుడిని దర్శించుకున్నారు. ఊరేగింపు సందర్భంగా మహిళలు పూర్ణకుంభాలతో పాల్గొన్నారు. అనంతరం మహిళల కోలాటం, చిన్నారుల భరత నాట్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.